43761

# శ్రీ శఠకోపస్తోత్రమాలికా



ఈ. ఎస్. శింగరాచార్యులు

43161

# శ్రీశఠకోపస్తోత్రమాలికా

ఈ.ఎస్. శింగరాచార్యులు

**శ్రీ శఠకోపస్తోత్రమాలికా**

వ్యాఖ్యాత :
శ్రీ ఈ. ఎస్. శింగరాచార్యులు

© సర్వహక్కులు గ్రంథకర్తవే.

ప్రథమముద్రణ : మే, 2000
ప్రతులు : 1000
మూల్యము : రూ. 100 00



ఆధ్యాత్మిక గ్రంథ ప్రచురణకు సహాయం అను పథకం క్రింద
తిరుమల తిరుపతి దేవస్థానము వారి ఆర్థిక సహాయంతో ముద్రణ

ప్రచురణ : భారద్వాజ ప్రచురణలు

SRI VENKATESWARA
CENTRAL LIBRARY &
RESEARCH CENTRE
Acc. No. 43761
Date.........................
TIRUPATI

ప్రతులకు :

1. శ్రీమతి ॥ఈ. కనకవల్లి
బాలాజీ నగర్
నెల్లూరు

2. శ్రీమతి ॥ఈ. జయలక్ష్మి
18-3-58/7, శాంతి నగర్
కె.టి. రోడ్, తిరుపతి - 517 507 ✆ : (08574) 32091

ముద్రణ :
అన్నపూర్ణ గ్రాఫిక్స్
53, (మిద్దెపైన) ఆర్.ఎస్. గార్డెన్స్
తిరుపతి - 517 507 ✆ : (08574) 30184



శ్రీమతే శఠకోపాయ నమః
శ్రీమతే రామానుజాయ నమః

# శ్రీశఠకోపస్తోత్రమాలికా

## పరాంకుశాష్టకము

కూరేశులు, భట్టర్ మొదలగు పూర్వాచార్యులు అనుగ్రహించిన, నమ్మాళ్వార్‌స్తుతి పరములగు ఎనిమిది ముక్తక శ్లోకములను కల్గియున్న స్తోత్రమగుటచే ఈస్తోత్రమునకు ఈ పేరు వచ్చినది. ప్రతిదినము భగవదారాధనలోని ఉత్తరశాంతిలో ఈ స్తోత్రము అనుసంధింపబడుట దీనికిగల ప్రాచుర్యము, గౌరవమును వ్యక్తమగుచున్నవి. ఇందు ''త్రైవిద్యవృద్ధ'', ''భక్తి ప్రభావ'' అనుశ్లోకములు రెండు కూరేశకృతమగు శ్రీవైకుంఠస్తవములోనివి. ''**ఋషిం జుషామహే**'' అనుశ్లోకము భట్టరు అనుగ్రహించిన శ్రీరంగరాజస్తవము పూర్వశతకములోనిది. చివరిదగు ''**నమజ్జనస్య**'' అనుశ్లోకము, పూర్వాశ్రమమున శ్రీమణవాళమహామునుల పౌత్రులగు జీయర్ నాయనార్ అనుగ్రహించిన నక్షత్రమాలికలోనిది. మిగిలిన నాలుగు శ్లోకములు పూర్వులు సాయించిన ముక్తకములు. ''**వకుళాలంకృతం**'' అనుశ్లోకమును ఈ స్తోత్రమున కొందఱిచే అనుసంధింపబడుచున్నది. ఈ శ్లోకము లన్నియు శబ్దమాధుర్యమును, అర్థగాంభీర్యమును కల్గియున్నవి.

1) త్రైవిద్యవృద్ధజనమూర్ధవిభూషణం యత్
సంపచ్చ సాత్త్వికజనస్య యదేవ నిత్యమ్ ।

యద్వా శరణ్య మశరణ్యజనస్య పుణ్యమ్
తత్ సంశ్రయేమ వకుళాభరణాంఘ్రియుగ్మమ్ ॥

ప్ర.అ - యత్ = ఏ ఆళ్వార్లపాదము, త్రైవిద్యవృద్ధజన = వైదికోత్తములయొక్క, మూర్ధ = శిరస్సులకు, విభూషణం = అలంకారమో, యత్ = ఏ ఆళ్వార్లపాదము, సాత్వికజనస్య = సజ్జనులకు, నిత్యం = శాశ్వతముగా, సంపత్+చ ఏవ = సంపదయో, యత్ = ఏ ఆళ్వార్లపాదము, అశరణ్యజనస్య = గతిలేనివారికి, శరణ్యం వా = గొప్ప రక్షకమో, తత్ = అట్టి, పుణ్యం = పవిత్రమైన, వకుళ+ ఆభరణ+ అంఘ్రియుగ్మం = నమ్మాళ్వార్ల పాదములజంటను, సంశ్రయేమ = ఆశ్రయించుచున్నాము.

భావము :- వేదార్థములను తెలిసిన పెద్దల శిరస్సునకు ఆభరణము, సజ్జనులకు శాశ్వతమగు సంపదయు, గతిలేనివారికి గొప్పరక్షకమును అగు పవిత్రమైన నమ్మాళ్వార్ల శ్రీపాదముల జంటను ఆశ్రయించుచున్నాను.

(**త్రైవిద్య .... విభూషణం**) - ''**త్రిస్రాణాం విద్యానాం సమాహారః త్రివిద్యం, త్రివిద్య మధీతే, వేద వా త్రైవిద్యం**'' - ఋగ్యజుస్సామములను వేదముల సారమును తెలిసినవారు త్రైవిద్యులు. వారియందు నేర్పరులు త్రైవిద్యవృద్ధులు. వృద్ధశబ్దము శ్రేష్ఠవాచకము. మధురకవులు, యామునులు, భగవద్రామానుజులు అట్టివారు. వీరి శిరస్సునకు ఆళ్వార్ల పాదములు గొప్ప అలంకారము. మధురకవులు కణ్ణినుణ్ శిఱుత్తాంబు ప్రబంధమున '**మేవినేన్ అవన్ పొన్నడి మెయ్మ్మైయే**'' (ఆళ్వార్ల అందమైన పాదములను సత్యముగా ఆశ్రయించితిని) ''**కురుకూర్నమ్బి మునియల్క్కినేన్ ఉన్తన్ మొయ్ కళల్ అన్బైయే**'' (కురుకాపురీశా! తమ శ్లాఘ్యమగు శ్రీపాదములయందు ప్రేమనే కోరుచున్నాను) అని పల్కుట ఇచట స్మరణీయము. ''**కోలమామేన్ శెన్నిక్కు ఉన్కమలమన్న కుఱైకళలే**'' అనినమ్మాళ్వార్లు, ''**అరశమర్న్దా నడిశూడు మర్శైయల్లాల్ అరశాక వెణ్ణేన్ మర్ఱు అరశుదానే**'' అనికులశేఖరులు పల్కిన విధముగా భగవానుని పాదములను తమ శిరస్సులకు ఆభరణముగా కల్గిన వారికంటె ఆ భగవానుని పాదారవిందరూపులగు ఆళ్వార్ల శ్రీపాదములను తమ శిరోభూష ణముగా కల్గినవారు మిక్కిలి గొప్పవారు కదా!

త్రైవిద్య వృద్ధ శబ్దము భగవద్రామానుజులనే తెలుపునని కొందఱి ఆచార్యుల నిర్వాహము. ''**మాఱ నడిపడిన్దుయ్న్దవన్**'' అని శ్రీరామానుజులు ప్రస్తుతింపబడిరి కదా! అంతియే కాక, ''**శొల్లార్ తమిళ్ ఒరుమూన్ఱుమ్ శురుదికళ్ నాన్గుమ్ ఎల్లైయిల్లా వఱనెఱి యావుమ్ తెరిన్దవన్**'' (శబ్దములు నిండిన, అద్వితీయమైన ఇయల్, ఇశై, నాడకమ్ అను మూడు విధములైన ప్రకారములను కలిగిన ద్రావిడ వేదములను, నాలుగు విధములగు సంస్కృత వేదములను, అనంతములగు ధర్మమార్గములను అన్నింటిని చక్కగా తెలిసిన వారు.) అని భగవద్రామానుజులు త్రైవిద్యశ్రేష్ఠులుగా కీర్తింపబడిరి. వేదాంత దేశికులును యతిరాజసప్తతిలో ''**త్రివిద్యశిఖామణిః**''

(49) అనిపల్కిరి. శ్రీభాష్యమున అత్రధికరణమున ''త్రయ్యంత నిష్ణాతా స్తు''... అని ప్రారంభించి పల్కిన సూక్తు లిచట అనుసంధేయములు

(సంపచ్చ . . . . యదేవ నిత్యమ్) - తిరువాయ్‌మొழி ప్రబంధమునకు శొట్టైనమ్బి అనుగ్రహించిన తనియన్ పాశురములోని'' **తనత్తాలుమ్ ఏదుమ్ కుఱైవిలేన్ ఎన్దై శడకోపన్ పాదఙ్గళ్ యాముడైయ పற்று.** '' (నేను ధనముచే ఏకొరతయు లేనివాడను. స్వామియగు శఠకోపుల పాదములే మాకు ఆశ్రయము.) అను సూక్తినిబట్టి ఈపాదము రచింపబడినది. లోకమున జనులు సంపదగా తలచునది ఆపదలకు కారణమగును. ''**ఆపదర్థం ధనం రక్షేత్**'' అనుఒక విధముగా ఈ అర్థమును బలపఱచుచున్నది. (ఆపదర్థం అనుటకు ఆపదలనివారణార్థమనియే కాక, ఆపదలు సంభవించుటకొఱకనియు అర్థము చెప్పవీలున్నందున.) కాని ఆழ்வార్ల పాదములందు భక్తిని కల్గినవారికి ఉభయవిభూతులును స్వాధీనములో నుండును అనిభావము'' **పొయ్యిల్ పాడ లాయిరత్తుళ్ ఇవైయుమ్ పత్తుమ్ వల్లార్‌కళ్ వైయమ్ మన్ని వీ ற்றிరున్దు విణ్ణు మాళ్వర్ మణ్ణోడే**'' (అసత్యము లేని వేయి పాశురములలో ఈ దశకమును అనుసధింప కలిగినవారు భూమియందు శ్రీవైష్ణవశ్రీతో చిరకాలము నిలచి పరమపదమును భూలోకముతో పాటు ఏలుదురు) అను ఆழ்వార్ల శ్రీసూక్తి ఇచట స్మరణీయము. సాత్త్వికజనులనగా'' **మాతా పితా యువతయ స్తనయా విభూతి స్సర్వం యదేవ నియమేన**'' అనుచు సమస్తము ఆழ்వార్లే అని తలచు శ్రీయామునుల వంటివారు. ''**నిత్యం**'' అనుటకు ''**అత్ర పరత్ర చాపి నిత్యం యదీయచరణౌ శరణం మదీయమ్**'' అను శ్రీయామునుల సూక్తి స్మరణీయము. అనగా ఈలీలావిభూతిలోనే కాక, పరమపదమునందును తమకు ఆழ்వార్ల పాదములే గొప్ప సంపదగా తలచువారని తాత్పర్యము.

(యద్వా . ......... పుణ్యమ్) - ''**అశరణ్యజనస్య శరణ్యం పుణ్యం యద్వా**'' అనుయోజన ద్వారా అశరణ్యులగు ప్రపన్నులకు శరణ్యమైన, పుణ్యరూపమైన భగవానుడే ఆழ்వార్లుగా అవతరించెనని ఏర్పడును. ఇందులకు అనుగుణముగా'' **అన్దన్‌మేల్ పుణ్ణియఙ్గళ్ పలిత్తవరో**'' అను ఆచార్యహృదయచూర్ణికను వ్యాఖ్యానించుచు శ్రీమణవాళ మహాముసులు ''**అన్తిక్కే. . . అన్దన్‌మేల్ కిడన్ద వెమ్‌పుణ్ణియా ఎన్ఱు నిర్హేతుకటాక్షవిశేషత్తాలే నిత్యసంసారియై నిత్యసూరికల్ల మాక్కవల్ల అనంతశాయియాన సనాతాన పుణ్యమ్ ముழுనోక్కాక పలిత్తు ఇప్పడి తిరున్దినా రొరువరో! ఎన్ఱు శంకిప్పర్ కళ్**'' అనిపల్కుట స్మరింప నగును. ''**మున్నమ్ నోற்ற విదికొలో**'' అను తిరువాయిమొழி సూక్తి, ''**భూలోకపూర్వతన పుణ్య చయైః మహాత్మా యః కారినామక మహాపురుషాత్మజోఽభూత్**'' అనుశఠకోప ప్రపత్తి సూక్తి మొదలగునవి ఆళ్వార్లు ప్రపన్నజనకుల పుణ్యమని తెలుపుచున్నవి. ''**యద్వా**'' అనునపుడు 'వా' అను అవ్యయము (''అశరీరం వా వసంతం'', ''కదాచిత్ కేశవే భక్తిః తద్భక్తై ర్వా సమాగమః''

అనుప్రయోగములలోవలె) నిర్ధారణార్థకము. సర్వలోకశరణ్యుడగు భగవానుడు ఉపేక్షించిన వారినికూడ రక్షింపగల్గినవి ఆళ్వార్ల పాదములని తాత్పర్యము ''శొన్నాల్ విరోద మిదు ఆకిలుమ్ శొల్లువన్ కేణ్మిన్'' (దీనిని చెప్పినచో విరోధము కలుగును. అయినను పలికెదను వినుడు.) అనుచు ఆళ్వార్లు లోకులను తమ ఉపదేశములతో ప్రబోధించి, రక్షించిరి కదా! ''పుణ్యమ్'' అను పదమునకు ''పుణ్యం సుందరం'' అను నిఘంటువచనము ప్రకారము అందమైనదను అర్థమున్నను, ''పునాతి ఇతి పుణ్యం'' అను పావనార్థమే ఇచట స్వరసము. ''పొయ్ నిన్ఱ ఞానముమ్, పొల్లా ఒళుక్కుమ్ అళుక్కుడమ్బుమ్'' (దేహాత్మభ్రాంతి, సంసారబంధము, మలినమైన శరీరము) అని చెప్పబడు సకలదోషములను పరిహరింప కల్గినవి ఆళ్వార్ల పాదములు. లేక, రెండర్థములను గ్రహించుట వలన ఆళ్వార్ల పాదముల ప్రాప్యప్రాపకత్వము తెలుపబడినది.

(''వకుళాభరణాంఘ్రియుగ్మమ్'') - ''నాళ్మల్ మకిళ్ మాలై మార్బినన్'' (నిత్యము పరిమళించు పొగడపూల మాలను వక్షఃస్థలమున కలవారు) అని ఆళ్వార్లు పల్కిన విధముగా నమ్మాళ్వార్లు వకుళమాలను (పొగడపూలమాల) ఆభరణముగా కల్గిన వారు. ఈ మాల ఆళ్వార్లకు భగవానునిచే అనుగ్రహింపబడినది.

ఇందు ఆళ్వార్ల పాదయుగము శిరోభూషణముగా, సంపదగా రూపింపబడుటచే రూపకము కలదు. మొదటి మూడు పాదములలో ఆళ్వార్ల పాదములయొక్క ఆచార్యరుచి పరిగ్రహీతత్వము తెలుపబడుటచే, అట్టి పాదములనే ఆశ్రయించుట సముచితమను భావము ఈశ్లోకమున ధ్వనించుచున్నది. ఇది శ్రీవైకుంఠస్తవములోని రెండవ శ్లోకము.

2) **భక్తిప్రభావభవదద్భుతభావబంధ -**
**సంధుక్షితప్రణయసారరసౌఘపూర్ణః ।**
**వేదార్థరత్ననిధి రచ్యుతదివ్యధామ**
**జీయాత్ పరాంకుశపయోధి రసీమభూమా ॥**

**ప్ర. అ.** - భక్తి = భగవద్భక్తియొక్క, ప్రభావ = మహిమవలన, భవత్ = కల్గిన, అద్భుత = ఆశ్చర్యకరమైన, భావ = భావముయొక్క, బంధ = (ప్రకృష్టమైన) బంధముచే, సంధుక్షిత = వర్ధిల్లచేయబడిన, ప్రణయ = అనురాగముయొక్క, సార = సారము అను, రస+ ఓఘ = నీటి సమూహముచే, పూర్ణః = నిండినది, వేద+ అర్థ = వేదార్థములను, రత్న = మణులకు, నిధిః = ఆకరము, అచ్యుతః = భగవానునకు, దివ్యధామ = గొప్పదైన నివాసము, అసీమ = అవధిలేని, భూమా = గొప్పతనమును కల్గినది అగు, పర+ అంకుశపయోధిః = నమ్మాళ్వార్లు అను సముద్రము, జీయాత్ = సర్వోత్కర్షతో వెలుగొందు గాక!

**భావము** - భగవద్భక్తియొక్క ప్రభావముచే జనించిన భావబంధము వే వృద్ధి చెందినదగు ప్రణయ భావము అను నీటి ప్రవాహముచే నిండినది, వేదార్థములను రత్నములకు నిధి, అచ్యుతుడగు భగవానునకు నివాసస్థానము, అంతులేని మహిమను కల్గినది అగు పరాంకుశసముద్రము చిరకాలము వర్ధిల్లుగాక!

పూర్వశ్లోకమున ఆళ్వార్ల పాదములను ఆశ్రయించిన కవి ఇందు వారికి స్వరూపానుగుణమైన కైంకర్యమును చేయుచున్నారు ''**సద్విప్రాసో విపన్యవో జాగృవాంసః సమింధతే**'' అనివేదము, ''**పల్లాణ్డు పల్లాణ్డు**'' అని ఆళ్వార్లను మంగళాశాసనమే జీవుని స్వరూపానుగుణమైన కైంకర్యమని తెల్పిరికదా! ఇట్లు కూరేశులు ఈ రెండు శ్లోకములలో ద్వయార్థమును ఆళ్వార్ల విషయమున అనుసంధించిరని చెప్పనగును.

ఈశ్లోకమున ఆళ్వార్లను సముద్రముతో రూపించినకవి, సముద్రమునకు ఆళ్వార్లకు కల సామ్యమును నాల్గు విశేషణములతో తెలుపుచున్నారు. శ్లోకములోని పూర్వార్థమంతయు ఒకే సమస్తవిశేషణము.

(**భక్తి ప్రభావ ......పూర్ణః**) - సముద్రము రసౌఘ మనబడు నీటి ప్రవాహముచే నిండి యుండునట్లే ఆళ్వార్లు శృంగారాదినవరసములతో పూర్ణులై యుందురు. ఇట్లు ఆళ్వార్ల సాహిత్యమున పలు విధములైన రసములచే కూడియుండుటకు భగవద్భక్తి వలన కల్గిన ప్రణయభావమే మూలము. ''**భక్తిః శృంగారవృత్త్యా పరిణమతి భావబంధప్రథిమ్నా**'' అని దేశికులు వచించిరికదా! ఆళ్వార్ల భగవద్భక్తి అపరిమితమైనది. తిరువాయ్మొళిలోని ''**శూళ్ందు**'' అను పాశురమున ''**అదనిల్ పెరియ ఎన్నవా**'' (దానికంటే పెద్దదగు నా అభినివేశము) అనుచు ఆళ్వార్లు తమ భక్తి మాహాత్మ్యమును గూర్చి పల్కుచు తత్త్వత్రయమును కూడా తమ భక్తి కబళీకరించు చున్నదనిరి కదా! ''**కాదల్ కడల్ పురైయ విళైవిత్త**'', (సముద్రమును మించునట్లు ప్రేమను వృద్ధి పొందించిన) ''**కొణ్డవెన్ కాదలురైక్కిల్ తోళీ, మణ్డిణి ఞాలముమ్ ఏళు కడలుమ్ నీళ్ విశుమ్బుమ్ కళియ ప్పెరిదాల్**'' (సఖీ! నా ప్రేమను గూర్చి పల్కినచో అది భూలోకమును, ఏడు సముద్రములను , విశాలమైన ఆకాశమును దాటునంతటి పెద్దది.) అను సూక్తులు స్మరణీయములు. ఇట్టి ఆళ్వార్ల భక్తిభావము మరింత వృద్ధిచెంది, శృంగారరసముగా పరిణమించినది. అట్టిదశలో ఆళ్వార్లు తమకృతులలో నాయికగా, తల్లిగా, చెలికత్తెగా మూడు రీతులలో పల్కిరి. (సముద్రమున ''ఆఱ్ఱునీర్, ఊఱ్ఱునీర్, మళైనీర్'' - నదీజలము, ఊటనీరు, వర్షపునీరు అను మూడు విధములైన నీరు ఉండును. ఈ విధముగా కూడ ఆళ్వార్లకు సముద్రముతో సామ్యము కలదు.) ఇట్లు పలురీతులలో పల్కుట లోకమునకు, సర్వేశ్వరునకును అద్భుతావహమైయుండును. ఆళ్వార్ల ప్రణయరస మిట్టి పలు భావములతో పోషింపబడినది. తత్ఫలితముగా పలు విధములైన రసములుగా రూపుదిద్దుకొన్నది. ఈ సందర్భమున

భగవద్రామానుజులు శ్రీ యామునులను ''**యామునార్య సుధాంబోధిమ్**'' అనుచు సముద్రముగా రూపించుట స్మరణీయము.

తిరువాయ్‌మొழி ప్రబంధమున శృంగారాది వివిధ రసములు ప్రకాశించిన విధమును మహావిద్వాన్ ప్ర. భ. అణ్ణాస్వామి తమ వ్యాఖ్యలో ఇట్లు వివరించిరి - తిరువాయ్‌మొழி లోని''**ఉయర్‌వఱ వుయర్ నలమ్**'', ''**వీడుమిన్ ముற్றవుమ్**'', ''**వత్తుడై యడి యవర్ క్కెళియవన్**'', ''**పిఱవి త్తుయరఱ**'', ''**పెరుమానీళ్‌పడై**'' వంటి దశకములలో సాధారణభక్తిరసమేతప్ప ప్రణయరసము భాసింపదు. ''**అజ్ఞైరెయమడనారాయ్**'', ''**మిన్నిడై మడైవార్‌కళ్**'', '**వేయ్‌మరు తోళిణై**'' మొదలగు దశకములలో అద్భుతభావబంధసంధుక్షిత ప్రణయరసము పరిపుష్టమై యున్నది. అట్టి ప్రణయరసము ముదిరినపుడు వెలువడు సూక్తులలో నవరసములు నిండియున్నవి. నవరసములలో శృంగారము, వీరము, కరుణము, అద్భుతము, భయానకము, శాంతము ( భక్తి) అను రసములు ఒక్కొక్క దశకములో కనుపించును. మిగిలిన హాస్య, బీభత్స, రౌద్రరసములు ఒక్కొక్క పాశురమున గుప్తముగా కొంచెము కొంచెముగా భాసించును. ''**వీడుమిన్ ముற்றవుమ్**, ''**శార్వే తవనెఱికుక్క**'', ''**కణ్ణన్ కழలిణై**'' మొదలగు దశకములలో భక్తిరసము ప్రకాశించుచున్నది.. ''**మిన్నిడైమడైవార్ కళ్**'', ''**నజ్గళ్‌వరివళై**'', '**వేయ్‌మరుతోళిణై** ''మొదలగు దశకములలో శృంగారరసము, ''**మాయా వామననే**'', ''**పుకழుం నల్లొరువన్**', ''**నల్‌కురవుమ్ శెల్వముమ్**'' మొదలగు దశకములలో అద్భుతరసము, ''**ఉణ్ణిలావియ వైవరాల్** ''మొదలగు దశకములలో భయానకరసము, ''**ఊరెల్లామ్ తుఞ్జి**'', ''**వాయుమ్ తిరైయుకళుమ్**'', ''**ఆడియాడి యుకజ్కరైన్దు**'' ఇత్యాదులలో కరుణరసము, ''**కుర్వైయాయ్చ్చియరోడు కోత్తదుమ్**'', ''**వీற்றிరున్దేழుం- లకుమ్**'' ఇత్యాదులలో వీరరసము - ఇట్లు నానారసములు నిండిన శ్రీసూక్తులను అనుగ్రహించుట ద్వారా ఆழ்వార్లు రసౌఘపరిపూర్ణులుగా వెలుగొందిరి.

- ఈ విశేషణమున ''**భక్తి ప్రభావ**'' అనుటచే పరభక్తి, ''**భావబంధ**'' అనుటచే పరజ్ఞానము, ''**ప్రణయరస**'' అనుటచే పరమభక్తియు తెలుపబడినవని కొందఱు వ్యాఖ్యానించిరి. ''**ఉత్తరోత్తరసాక్షాత్కారేచ్ఛాత్మికా ధీః పరభక్తిః**'', (ఉత్తరోత్తరము భగవానుని సాక్షాత్కరింప చేసికొనవలెను అను కోరిక పరభక్తి) ''**ఉత్తరోత్తరసాక్షాత్కారః పరజ్ఞానమ్**'', (ఉత్తరోత్తరము భగవద్రూపముయొక్క సాక్షాత్కారము పరజ్ఞానము ) ''**సాక్షాత్కృతే నిరంతరానుబుభూషా పరమభక్తిః**'' (సాక్షాత్కరింప చేసికొనిన భగవానుని రూపమును నిత్యము సేవింపవలెను అను కోరిక పరమభక్తి) అని దేశికులు వీనిని నిర్వచించిరి. కావున పరభక్తివలన పరజ్ఞానము, పరజ్ఞానమువలన పరమభక్తియు జనించుననుట స్పష్టము. ఈ విశేషమిచట తెలుపబడినది. ''**నదీనాం సాగరో గతిః**'' అనునట్లు పలురసములను (జలములను, రుచులను కల) నదుల

కన్నిటికిని చేరిక సముద్రములోనే. కావున సముద్రములోని నీరు అనేకవిధములైన రసములతో కూడియుండును. అట్లే, ఆళ్వార్లు భక్త్యతిశయమువలన కల్గిన పలుభావములతో పల్కుటచే, వారి సాహిత్యమును పలు రసములతో నిండి యుండును. అట్టి సాహిత్యమును కలవారు ఆళ్వార్లు అనియు ప్రస్తుతవిశేషణమును వివరింపవచ్చును. ఇందుల కనుగుణముగా ''**భక్తామృతం ... న మామ్యహం ద్రావిడవేదసాగరమ్**'' అనుశ్లోకరత్నము అనుసంధేయము.

(**వేదార్థరత్ననిధిః**) - సాగరము పలువిధములైన రత్నములకునిధి. కావున రత్నాకరమనిపేరు. ''**కడల్పోల్ కిళర్ వేదమ్**'' అనియు, ''**శ్రుతిసాగరం**'' అనియు వేదశాస్త్రములు సాగరములుగా చెప్పబడుచున్నవి. సాగరమున పలువిధములైన, విలువైన వస్తువులున్నను వానిలో రత్నములే శ్రేష్ఠములు. వేదశాస్త్రసాగరమున గల అసారములు, అల్పసారములు, సారములు, సారతరములగు విషయములన్నిటిని కంటె, సారతమములగు అర్థములు గొప్పవగుటచే అవి రత్నములవంటివి. ''**త్రైగుణ్యవిషయా వేదాః**'' అనునట్లు వేదము పలు మనస్తత్త్వములనుకల్గిన జనుల శ్రేయస్సును దృష్టిలో నుంచుకొన్నదగుటచే పలువిషయములను తెలుపుచున్నది. కాని ''**మాఱ్ఱు జ్ఞళాయ్ న్దు కొణ్డు మదుశూదపిరానడిమేల్ కురుకూర్ శడకోపన్ శొన్న**'' (చక్కని పదముల నెఱిగి మధుసూదనుని పాదములపై శఠకోపులు పల్కిన) అనునట్లు నమ్మాళ్వార్లు పల్కిన సూక్తులలో సారతమమైన అర్థములు నిండియుండును. కావున అవి అన్నియు రత్నములే. అట్టి రత్నములకు నిధి ఆళ్వార్లు. '**వేదమ్ తమిళ్ శెయ్ద మాఱన్ శడగోపన్**'' (వేదమును తమిళమున చేసిన, మాఱన్ అను పేరుకల శఠకోపులు) అని ఆళ్వార్ల ప్రబంధములు వేదార్థములకు ప్రతిరూపములేకదా!

(**అచ్యుతదివ్యధామ**) - సాగరమున భగవానుడు శయనించియుండును. అట్టి స్థితికి వ్యూహమనిపేరు. ''**మాలుమ్ కరుఙ్కడలే ఎన్నోఱ్ఱాయ్? వైయకముణ్డు ఆలిలై త్తుయిన్ఱ వాళియాన్, కోలక్కురుమేని శెఙ్కణ్మాల్ కణ్పడైయుళ్, ఎన్ఱుమ్ తిరుమేని నీ తీణ్డప్పెఱ్ఱు**'' (సుఖపరవశమైయున్న నల్లని సముద్రమా! నీవు ఏమినోము నోచితివి? ప్రళయకాలమున లోకములను బొజ్జలో నుంచుకొని వటపత్రమున పరుండియున్న చక్రధారి, చక్కని నల్లని వర్ణమును కలవాడు, ఎఱ్ఱని కన్నులను కల్గిన ప్రేమ మూర్తి యోగనిద్రలో నుండగ ఆస్వామి దివ్య దేహమున ఎల్లప్పుడు తాకునట్టి ధన్యతను పొందితివి) అను పాశురమున పాయ్కై ఆళ్వార్లు భగవానుడు సముద్రమున పవళించియుండు సన్నివేశమును గూర్చి ప్రస్తుతించిరి. ఈ విధముగానే నమ్మాళ్వార్లు భగవానునకు నివాసస్థానము. ''**కొణ్డల్ వణ్ణన్ శుడర్ ముడియన్ నాన్గుతోళన్ కుని శార్ఙ్గన్ ఒణ్శఙ్గదై వాళాళి యాన్ ఒరువన్ అడియేనుళ్ళానే**'', (మేఘవర్ణుడు, ప్రకాశించు కిరీటమును గలవాడు, చతుర్భుజుడు, వంగిన వింటిని కలవాడు, చక్కని శంఖము, గద, చక్రములను కల్గిన అద్వితీయుడైన స్వామి ఒకడు దాసుని మనస్సున ఉన్నాడు) '**వెళ్లనెడియాన్**

నిఅబ్బ్ఱియాన్ ఉళ్ పుకున్దునీజ్ఞాన్ అడియేనదుళ్లత్తకమ్'' (సర్వాధికుడు, నల్లని వర్ణమును కలవాడు నామనస్సులోనికి ప్రవేశించి, విడచుట లేదు.) అను ఆళ్వార్ల శ్రీసూక్తులు ఈ విషయమును తెలుపుచున్నవి. తిరువాయ్మొళ్ళిలోని ''ఇవైయు మవైయు మువైయుమ్'' అనుదశకమున (1-9) ప్రస్తుత విషయమును ఆళ్వార్లు విశదీకరించుట ఇచట స్మరణీయము. ''శఠకోప వాక్ వపుషి'' అనుచు దీనిని భట్టరు సంస్కృతీకరించిరి. ''శుద్ధాంత శయ్యా హరేః'' అనిదేశికులు సంకల్పసూర్యోదయమున (7-21) ఈ అర్థమును అనుసంధించిరి. పరమపదమునందు ఉండుటకంటె ఆళ్వార్ల వంటి మహనీయుల శరీరమును నివాసముగా గొనుట భగవానునకు పరమప్రీతికరము అని అభిజ్ఞుల వచనము. ఈ సందర్భమువలన **''సంధాగ్ం సందధే బ్రహ్మణైషః తస్మిన్.... ఉత జీర్ణే శయానే''** అను శ్రుత్యర్థ మిచట స్మరణీయము. **(అసీమభూమా)** - **''బహోః భావః భూమా''** - అనగా పెద్దది అని భావము. **''బృహత్త్వం చ స్వరూపేణ గుణైశ్చ యత్రా నవధికాశయం''** అని భగ్రదామానుజులచే శ్రీభాష్యమున వివరింపబడినట్లు, ఈ గొప్పతనము ఆకారము వలన, గుణమువలన కలుగవచ్చును. కొండలు, భవనములవంటి విషయములలోని బృహత్త్వము ఆకారమువలన ఏర్పడినది. మహనీయులుగా చెప్పబడు వ్యక్తులలోని బృహత్త్వము గుణములవలన కల్గినది. సముద్రములోని బృహత్వము ఆకారము వలన, ఆళ్వార్లయందలి గొప్పతనము గుణములవలన ఏర్పడినది **''అరుళ్కొణ్డు ఆయిరమ్ ఇన్దమిళ్ పాడినాన్ అరుళ్కణ్డీర్ ఇవ్వులకినిల్ మిక్కదే''** (ఆళ్వార్లు దయతోవేయి తీయని తమిళపాశురములను పాడిరి. ఆదయను చూడుడు. అది ఈలోకమున మిక్కిలి గొప్పదికదా) అనుచు మధురకవియాళ్వార్లు నమ్మాళ్వార్ల దయాగుణమహిమనుగూర్చి ప్రస్తుతించిరి. ఇట్టివైభవము వాత్సల్య, సౌశీల్య, సౌలభ్యాది గుణములయందును కలదు. సముద్రమునకు ఇరువైపుల కల తీర ప్రదేశములకు పారము, అవారము అని పేర్లు. కావున సముద్రమునకు ఒక విధముగా అవధియున్నది. కాని ఆళ్వార్ల గుణవైభవమునకు మాత్రము ఎల్లలు లేవు. ఇందువలన ఆళ్వార్లకు సముద్రసామ్యముతో పాటు ఆధిక్యమును ధ్వనించుచున్నది. అందుచే ఇందు వ్యతిరేకాలంకార ధ్వని కలదు. ఇట్లు సాగరసదృశులగు ఆళ్వార్లు నిత్యమంగళముగా వర్ధిల్లవలెనని శ్లోక తాత్పర్యము. మొదటి శ్లోకము, ఈశ్లోకమును వసంతతిలక వృత్తమున రచింపబడినవి.

**3) ఋషిం జుషామహే కృష్ణతృష్ణాతత్త్వ మివోదితమ్ ।**
**సహస్రశాఖాం యోஉద్రాక్షీత్ ద్రావిడీం బ్రహ్మసంహితామ్॥**

**ప్ర. అ.** - యః = ఏ నమ్మాళ్వార్లు, సహస్రశాఖాం = వేయి శాఖలను కల్గిన, ద్రావిడీం = ద్రావిడ భాషారూపములోనున్న, బ్రహ్మసంహితాం = వేదమును, అద్రాక్షీత్ = దర్శించిరో, అట్టి, ఉదితం = ఆవిర్భవించిన; కృష్ణతృష్ణాతత్త్వం = కృష్ణతృష్ణయొక్క తత్త్వము, ఇవ = వలెనున్న, ఋషిం = మహర్షియగు నమ్మాళ్వార్లను, జుషామహే = ప్రీతితో సేవింతుము.

భావము :- నమ్మాళ్వార్లు ఋషి అని, వారు అనుగ్రహించిన తిరువాయ్మొళ్ళి వేదమని పల్కుట ద్వారా ఆళ్వార్ల వైభవమును స్తుతించుట ఈ శ్లోకములోని సారాంశము. ఈ శ్లోకము శ్రీ పరాశరభట్టర్ కృతమగు శ్రీ రంగరాజస్తవ పూర్వశతకములోని ఆఱవశ్లోకము.

అవతరించిన శ్రీకృష్ణభక్తితత్త్వమువంటివారును (శ్రీకృష్ణుని లోకరక్షణతృష్ణయే మూర్తీభవించినట్లున్నవారును), వేయి శాఖలనుకల్గిన ద్రావిడబ్రహ్మసంహితను దర్శించినవారును, మహర్షి అగు నమ్మాళ్వార్లను ప్రీతితో సేవింతుము అని భావము.

సామవేదము వేయిశాఖలను కల్గినదిగా ప్రసిద్ధి చెందినది. ఆళ్వార్లు అనుగ్రహించిన దివ్య ప్రబంధములు నాల్గింటిలో వేయి పాశురములను కల్గిన తిరువాయ్ మొళ్ళి సామవేద సారమని పెద్దల అభిప్రాయము. గరుడవాహనపండితులు. దివ్యసూరిచరితమున ''ప్రబంధ శ్చరమ శ్శ్రీ స్వాంగానరసాత్మకః, పరబ్రహ్మపరత్వాదిపంచావస్థా ప్రకాశకః, గానకర్మోచిత శ్రావ్యోరసపోషనిరంతరః, ముక్తబంధముముక్షూణాం చిత్తానందవివర్ధనః, కాండానువాకపంచాశత్స్థానేషు కలితా క్రమాత్, సంఖ్యా శత దశైకానాం గాథానాం కలుషచ్ఛిదామ్, ఏవం ద్రావిడగాథానాం సహస్రేణ వినిర్మితమ్, ప్రబంధం కురుతే సాక్షాత్ పరతత్త్వప్రకాశనమ్'' అని ఈ విషయమును స్పష్టము చేసిరి.

(కృష్ణతృష్ణాతత్త్వ మివోదితమ్) - ఈ సమాసమునకు రెండు విధములైన వివరణములను పెద్దలు చెప్పిరి. శ్రీ కృష్ణావతారమున నమ్మాళ్వార్లకు అభినివేశము మెండు. కృష్ణావతారము ముగిసిన కొద్దికాలము పిమ్మట ఆళ్వార్ల అవతారము జరుగుట ఇందులకు కారణమని అభియుక్తులగు ఆచార్యులు వ్యాఖ్యానించిరి. యశోద శ్రీకృష్ణుని రోలునకు కట్టువృత్తాంతమును అనుసంధించిన నమ్మాళ్వార్లు భగవానుని సౌలభ్యగుణవైభవమునకు పరవశులై ఆరునెలల కాలము ''ఎత్తిఱమ్'' (ఏమి ఆ సౌలభ్య గుణప్రకారము) అనుచు మూర్ఛిల్లిరను ఐతిహ్యము ఒక్కటియే ఈ విషయమును నిరూపించుటకు చాలును. ''గోపాలనాది యదిదం భవదీయకర్మ త్యార్ద్రీకరోతి విదుషాం హృదయం తదేతత్'' అని (అతిమానుషస్తవమున) కూరేశులు ''విదుషాం'' అను పదముద్వారా నమ్మాళ్వార్ల కృష్ణతృష్ణాతత్త్వమును కీర్తించిరి. కావున ఆళ్వార్లు కృష్ణభక్తికి మారు రూపము అనదగినవారు. ఈ భావము ''కృష్ణే తృష్ణా-కృష్ణతృష్ణా, తస్యాః తత్త్వ మివోదితమ్'' అను వివరణమువలన ఏర్పడును.

ఆళ్వార్లవంటి మహాత్ములను భగవానుడు లోకరక్షణకై సృజించును. ''యదా యదా హి ధర్మస్య గ్లాని ర్భవతి ... తదాత్మానం సృజామ్యహం'' అని భగవానుని సూక్తి. శ్రీకృష్ణావతారమున భగవానుడు లోకులను దిద్దుబాటు చేయుటకై ఎన్నో విధముల

ప్రయత్నించెను. అమూల్యమైన గీతాశాస్త్రమును ప్రదానము చేసెను. అయినను అందఱు రక్షింపబడలేదు. దుర్యోధనాదులు కొందఱు స్వామిని ద్వేషించిరి కూడ. ''**న మాం దుష్కృతినో మూఢాః ప్రపద్యంతే నరాధమాః**'' అనుచు భగవానుడు ఈ విషయమును తెలిపెనుకదా! ఇట్లు తనప్రయత్నము పూర్ణముగా సఫలము కాకపోవుటచే స్వామి ''**శఠారిం సైన్యపం**'' అనునట్లు విష్వక్సేనులను ఆళ్వార్లుగా అవతరింపచేసెను. కావున ఆళ్వార్లు శ్రీకృష్ణుని లోకరక్షణతృష్ణకు రూపాంతరము అగుటచే ''**కృష్ణతృష్ణాతత్త్వ మివోదితమ్**'' అను సూక్తి అర్థవంతము. ఈ భావము ''**కృష్ణస్య తృష్ణా – లోకసంరక్షణచింతా – తస్యాః తత్త్వమ్**'' - అనుఅన్వయమువలన ఏర్పడును. ఈ రెండుయోజనలు తిరువాయ్మొழிలో ఆళ్వార్లు పల్కిన ''**మెయ్మ్మాలాయొழிన్దేన్, ఎమ్బిరానుమెన్మేలానే**'' అను సూక్తినిబట్టి ఏర్పడినవని చెప్పనగును.

(అద్రాక్షీత్) - ఋషు లందఱు మంత్రద్రష్టలుగా ప్రసిద్ధి చెందినవారు. అట్లే ఆళ్వార్లును ద్రావిడ బ్రహ్మసంహితను దర్శించిన ఋషి అగుటచే ''అద్రాక్షీత్'' అను ప్రయోగము సముచితమైనది. ఈ సందర్భమున ఆచార్యహృదయమను రహస్యగ్రంథములోని ''**నాల్వేదమ్ కణ్ణ పురాణ ఋషి మంత్ర దర్శికళై ప్పోలే ఇవరైయుమ్ ఋషిముని కవి ఎన్నుమ్**'' అను సూత్రము అనుసంధేయము. మిగిలిన ఋషులందరు ''**కాయోడు నీడు కని యుణ్డు**'' అనునట్లు కందమూలాదులను జీవనాధారముగా కల్గినవారు కాగా, శఠకోపులు మాత్రము ''**ఎల్లామ్ కణ్ణన్**'' అనునట్లు, ''**వాసుదేవః సర్వం**'' అనునట్లు శ్రీకృష్ణునే సర్వస్వముగా కలిగినవారగుట విశేషము.

(**సహస్రశాఖాం**) - సామవేదమున వేయిశాఖలు కలవు. కావున సామవేద పక్షమున సహస్ర శబ్దమునకు వేయి అని అర్థము. కాని, తిరువాయ్మొழி ప్రబంధమున *1102* పాశురములు కలవు. కావున సహస్రశబ్దము ఎట్లుఅన్వయింపనగును? అనినచో, శత, సహస్రశబ్దములు అనేకసంఖ్యాబోధకములు. సహస్రముకంటె కొంచెము ఎక్కువ తక్కువగా శ్లోకములున్నను సహస్రశబ్దముతో నిర్దేశించుట లోకమునసునే కాక, కావ్యసంప్రదాయమునను పరిపాటియే. కావున సహస్రశబ్ద మిచట ఆవిధముగా అన్వయింపనగును.

(ద్రావిడీం బ్రహ్మసంహితామ్) - ఋషులు దర్శించిన బ్రహ్మసంహిత సంస్కృత భాషలోనున్నది. ఆసంహిత స్త్రీశూద్రాదులకు అధ్యేతవ్యము కాదు. కాని, ఆళ్వార్లు దర్శించిన బ్రహ్మసంహిత సర్వజనసేవ్యము. అందఱును అధ్యయనముచేయ వీలున్నది. కావున సంస్కృతబ్రహ్మసంహితకంటె విశిష్టమైనది

(**ఋషిం**) - ''**ఋషయః సత్యవచసః**'' అని అమరనిఘంటువు ఋషిపదమును నిర్వచించుచున్నది. ఆళ్వార్లను''**పొయ్యిల్ పాడలాయిరత్తుళ్**'' అని పొగడబడు తిరువాయ్మొழிని దర్శించుటచే ఋషులే కదా. ''**నానృషిః కురుతే కావ్యం**'' అను సూక్తిని బట్టి ఋషి యగు ఆళ్వార్లు అనుగ్రహించిన ప్రబంధములకు కావ్యత్వము సిద్ధించినది. అట్లే

వాల్మీకి వ్యాసాదిమునులచే ప్రోక్తములగు శ్రీరామాయణాది ఇతిహాస పురాణములతో సామ్యమును ధ్వనించుచున్నది. ఇట్లు ఆళ్వార్ల ప్రబంధములు ప్రభుసంమితములు, మిత్ర సంమితములు, కాంతాసంమితములును.

(జుషామహే) - "జుషీ - ప్రీతిసేవనయోః" అనుధాతువునుండి పుట్టిన ఈ క్రియ ప్రీతితో సేవించుటను తెలుపును. సేవించుట విధి అను నిర్బంధమువలన కాక ప్రీతిపూర్వకముగా నని తాత్పర్యము. "కృష్ణతృష్ణాతత్త్వ మివ" అనుటచే ఇచట అలంకారము ఉత్ప్రేక్ష.

**4) యద్గోసహస్ర మపహంతి తమాంసి పుంసామ్**
**నారాయణో వసతి యత్ర సశంఖచక్రః ।**
**యన్మండలం శ్రుతిగతం ప్రణమంతి విప్రాః**
**తస్మై నమో వకుళభూషణభాస్కరాయ ॥**

ప్ర. అ- యత్ = ఏ ఆళ్వార్లయొక్క, గోసహస్రం = వాక్కులనెడి కిరణములయొక్క వేయి, పుంసాం = జనులయొక్క, తమాంసి = (అజ్ఞానమను) చీకట్లను, అపహంతి = తొలగించుచున్నవో, యత్ర = ఎచట, నారాయణః = శ్రీమన్నారాయణుడు, సశంఖచక్రః = శంఖచక్రములతో కూడినవాడై, వసతి = నివసించుచున్నాడో, శ్రుతిగతం = వేదప్రతిపాద్యమైన (చెవులకు వినపడిన), యత్ = ఏ ఆళ్వార్లయొక్క, మండలం = సూర్యమండలమును, (మండలప్రబంధమును) విప్రాః = విద్వాంసులు, ప్రణమంతి = నమస్కరించుచున్నారో, తస్మై= అట్టి, వకుళభూషణభాస్కరాయ = ఆళ్వార్లు అను సూర్యునకు, నమః = నమస్కారము.

**భావము :-** సూర్యుని వేయికిరణములు లోకములోని జనుల చీకటిని పోగొట్టి, వెలుగునిచ్చి, సహాయపడునట్లే, నమ్మాళ్వార్ల తిరువాయ్మొళిలోని వేయి పాశురములు అజ్ఞానమను చీకటిని పోగొట్టి జ్ఞానమును కల్గించును. సూర్యమండలమున భగవానుడు "**ధ్యేయః సదా సవితృమండలమధ్యవర్తీ నారాయణః సరసిజాసనసన్నివిష్టః, కేయూరవాన్ మకరకుండలవాన్ కిరీటీ హారీ హిరణ్మయవపుః ధృతశంఖచక్రః**" అనునట్లు శంఖచక్రధారియై నివసించి యుండును. అట్లే నమ్మాళ్వార్ల దివ్యదేహమున భగవానుడు "**కణ్గళ్ శివన్దు పెరియవాయ్ వాయుమ్ శివన్దు కనిన్దు**" అని, "**కొణ్డల్వణ్ణన్ శుడర్ముడియన్ నాన్గుతోళన్ కునిశార్జ్గన్, ఒణ్శఙ్గదైవాళాళియాన్ ఒరువనడియేనుళ్లానే**" అని ఆళ్వార్లు పల్కిన విధముగా సశంఖచక్రుడై, పరమానందముతో నివసించును. వేదప్రతి పాద్యమైన సూర్యమండలమును బ్రాహ్మణులు నిత్యము త్రిసంధ్యము నమస్కరింతురు. అట్లే ఆళ్వార్లు అనుగ్రహించిన మండల అన్దాదిరూపమైన ప్రబంధము చెవులకు వినపడినవెంటనే విద్వాంసు లందఱు చేతులెత్తి మొక్కుదురు. తిరువాయ్మొళి ప్రబంధములోని ఫలశ్రుతి పాశురములలో శఠకోపుల దేశప్రస్తావన కల పదములను అనుసంధించునపుడు పెద్దలు

అంజలిని ఇచట చేయుట స్మరింపనగును. ఈ విధముగా సూర్యునితో పలువిధముల పోలికలను కల్గిన వకుళభూషణులకు నమస్కారము.

ఈ శ్లోకమున నమ్మాళ్వార్లు సూర్యునిగా రూపింపబడిరనుట స్పష్టము. ఈ సందర్భమున ''ఆదిత్యరామదివాకర అచ్యుతభానుక్కళుక్కు పోకాద పుళ్ళిరుళ్ నీఙ్గి శోషియాద **పిఱవిక్కడల్ వఱ్ఱి**, వికసియాద పోదిల్ కమల మలర్న్దదు వకుళభూషణ భాస్కరోదయత్తిలే' (సూర్యుడు, రామదివాకరుడు, అచ్యుతభానుల వలన పోని ఆంతర తమస్సు నశించి, ఎండని సంసారసముద్రము ఎండి, వికసింపని హృదయకమలము వికసించినది వకుళభూషణ భాస్కరుని ఉదయము వలన) అను ఆచార్యహృదయచూర్ణికయు, అచటి శ్రీమణవాళమహాముునుల వ్యాఖ్యానమును అనుసంధింపతగినవి. సూర్యుడనిమాత్రమే అర్థమిచ్చు ఆదిత్య-దివాకర-భానుశబ్దములకంటె, తేజస్సును కల్గించునను భాస్కరశబ్దముయొక్క ప్రయోగములోని స్వారస్యమును శ్రీమణవాళమహామునులు వివరించుచు ''**ఆదిత్యదివాకరభానుశబ్దఙ్గళాలన్ఱిక్కే భాస్కరశబ్దత్తాలే ఇవరై చ్చొల్లుకైయాలే**'' **ఊరుమ్ నాడుమ్**'' **ఇత్యాదిప్పడియే స్వసమ్బన్ధముడైయా రెల్లార్ క్కుమ్ ప్రకాశత్తైప్పణ్ణుమవర్ త్తోఱ్ఱు కిఱదు**'' అని పల్కిరి. ప్రకాశమును కల్గించువాడను అర్థమును భాస్కరసబ్దము మాత్రమే సాక్షాత్తుగా బోధించును. మిగిలినవి పరోక్షముగామాత్రమే అట్టి అర్థమును ఇవ్వగలవు. కావున సూర్యునికంటె, రామదివాకరునికంటె, అచ్యుతభానునికంటె వకుళభూషణభాస్కరునకుగల వైశిష్ట్యము తెలియుచున్నది. అందుచే ఇచట వ్యతిరేకాలంకార ధ్వని కలదు.

మూడవపాదములోని '**శ్రుతిగత, విప్ర, మండల**' శబ్దములు శ్లిష్టములు. సూర్యుని పక్షమున శ్రుతి అనుటకు వేదమని, విప్రశబ్దమునకు వేదవిదులని, మండలశబ్దమునకు సూర్యమండలమని భావము. ''**దృశే విశ్వాయ సూర్యమ్**'' అనుమొదలగు శ్రుతివాక్యములందు వర్ణింపబడిన సూర్యమండలమును బ్రాహ్మణులు నమస్కరింతురు అని తాత్పర్యము. ఆళ్వార్ల పక్షమున శ్రుతిశబ్దమునకు చెవి అని, మండలశబ్దమునకు వారు జన్మించిన దేశము, లేదా, ఆళ్వార్లు రచించిన ''**మణ్డలఅన్దాది**'' రూపమైన తిరువాయ్ మొళ్ళి ప్రబంధము అని, విప్ర శబ్దమునకు భాగవతులు అని అర్థము. ''**విప్రా భాగవతాః స్మృతాః**'' అని చెప్పబడుచున్నది కదా! ''**యద్గోసహస్రం**'' అను సూక్తి వలన తిరువాయ్ మొళ్ళి లోని వేయి పాశురములు వకుళభూషణ భాస్కరుల వేయి కిరణములు అని ధ్వనించుచున్నది. గోశబ్దమునకు కిరణమని, వాక్కు అని అర్థములు కలవు కదా! ఈ సందర్భమున ఆచార్యహృదయ వ్యాఖ్యానములోని ''**తిరువాయ్ మొళ్ళి ఆయిరము మాకిఱ కిరణఙ్గళై యుడైయరాయ్**'' అను శ్రీమణవాళమహామునుల సూక్తి స్మరణీయము.

అన్దాదిప్రబంధము తమిళసాహిత్యములో కనుపించు ప్రాచీనమైన, ఒక విశిష్టమైన కావ్య ప్రక్రియ. ఈ ప్రక్రియను అనుసరించి రచింపబడిన ప్రబంధములో మొదటి పాశురములోని

చివరిపదముగాని, పదాంశముగాని, అక్షరముగాని రెండవపాశురమునకు ప్రారంభమున నుండును. ఇట్టి క్రమము చివరిపాశురమువఱకు కొనసాగును. చివరిపాశురము లోని చివరిపదము మరల మొదటిపాశురములోని మొదటి పదము అగును. కావున ఇట్టి ప్రబంధము మండలాత్మకమైన అన్దాదిగా చెప్పబడినది. 'అన్తాది' అను సంస్కృతశబ్దము తమిళమున '**అన్దాది**'గా మారినది. అనగా అంతమును ఆదిగా కల్గినదని అర్థము. నాలాయిరదివ్య ప్రబంధములోని **ముదల్‌తిరువన్దాది, ఇరణ్డామ్ తిరువన్దాది** వంటి పలు ప్రబంధములు ఈ ప్రక్రియను అనుసరించి రచింపబడినవి. నమ్మాళ్వార్ల ప్రబంధములలో **తిరువిరుత్తము, పెరియతిరువన్దాది, తిరువాయ్‌మొళ్ళి** యు ఈక్రమమున అనుగ్రహింపబడినవే. నమ్మాళ్వార్లను స్తుతించుచు మధురకవులు రచించిన ''**కణ్ణినుణ్‌శిఱుత్తామ్బు**'' అను ప్రబంధము, శ్రీమణవాళమహామునులు అనుగ్రహించిన నమ్మాళ్వార్ల స్తుతి రూపమైన **తిరువాయ్‌మొళ్ళి నూత్తన్దాది**యు, వారి పౌత్రులగు జీయర్‌నాయనార్ అనుగ్రహించిన ''**నక్షత్రమాలికా**'' అను సంస్కృత శఠకోప స్తోత్రమును ఈ ప్రక్రియలో రచింపబడుట గమనింపతగినవి. ప్రస్తుతశ్లోకమునకు సంవాదమగు శ్రీపరాంకుశ సుప్రభాతములోని ఈక్రింది శ్లోకము స్మరణార్హము ''**గాథాసహస్రకిరణక్షపితాత్మ గూఢ గాఢాంధకార మరవిందవిలోచనాంగమ్। శ్రీవైష్ణవద్విజనిషేవితమండలేశం, ప్రాప్యం భజామి వకుళాభరణాబ్జబంధుమ్**''.

**5)** **పత్యుః శ్రియః ప్రసాదేన ప్రాప్తసార్వజ్ఞ్యసంపదమ్।**
**ప్రపన్నజనకూటస్థం ప్రపద్యే శ్రీపరాంకుశమ్ ॥**

**ప్ర. అ.** - పత్యుః శ్రియః = శ్రియఃపతియొక్క, ప్రసాదేన = అనుగ్రహముచే, ప్రాప్త = పొందబడిన, సార్వజ్ఞ్యసంపదమ్ = సర్వజ్ఞత్వసంపదనుకలవారు, ప్రపన్నజనకూటస్థం = ప్రపన్నజనులకు మూలపురుషులు, అగు, శ్రీపరాంకుశం = పరాంకుశులను, ప్రపద్యే = శరణుపొందుచున్నాను.

**భావము :-** భగవానుని అనుగ్రహమువలన సర్వజ్ఞత్వమును సంపదను పొందినవారు, ప్రపన్నకులమునకు మూలపురుషులు అగు శ్రీపరాంకుశులను శరణు పొందుచున్నాను.

ఇచట ''**పత్యుః శ్రియః**'' అనుప్రయోగము భావస్ఫోరకము. సలక్ష్మీకుడైన భగవానుడే ఆశ్రయణీయుడు అను అర్థ మిచట ధ్వనించుచున్నది. ''**మయర్వఱ మదినల మరుళినన్**'' అని ఆళ్వార్లు పల్కినట్లు భగవదనుగ్రహమువలన భక్తిరూపాపన్నమైన జ్ఞానమును పొందినవారు ఆళ్వార్లు. ''**యః సర్వజ్ఞః సర్వవిత్**'' అని వేదమున భగవానుడు ఒక్కడే సర్వజ్ఞుడుగా కీర్తింప బడుచున్నాడు. అట్టి భగవానుడు ''**తమ్మైయే నాళుమ్ వణఙ్గి త్తొళువార్‌క్కు తమ్మైయేయొక్క అరుళ్‌శెయ్‌వర్**'' (తమను ఎల్లప్పుడు కొలుచువారికి తమతో సామ్యమును కృపచేయుదురు) అనునట్లు తనను నిత్యము భజించు భక్తులకు తనతో పరమసామ్యమును కల్గించును. కావున ఆళ్వార్లకు సర్వజ్ఞత్వసంపద కల్గుటలో ఆశ్చర్యము లేదు కదా! లేక ''**సర్వజ్ఞస్యేయం సార్వజ్ఞ్యా,**

సార్వజ్ఞ్యసంపత్ సార్వజ్ఞ్యసంపత్, ప్రాప్తా సార్వజ్ఞ్యసంపత్ యేన తమ్'' అనియు ఈపదమును వివరింపవచ్చును. అనగా భగవానుని సమస్తమైన ఐశ్వర్యమును పొందినవారు ఆళ్వార్లు అని భావము. ''పొన్నులకాళీరో పువన ముళ్లుం దాళీరో'' అని ఉభయవిభూతులును తమ అధీనములో నున్నట్లు వారే పల్కిరికదా! ఈ సూక్తిని వ్యాఖ్యానించుచు నమ్బిళ్లై ఈడులో **''కలన్దపోదు తన్నైయుమ్, తన్నుడైమైయైయుమ్ ఇవళుక్కాక్కి, పిరిన్దపోదు మాఋవానొరు పుల్లియనోడన్దో యివళ్ కలన్దదు. తన్నసన్నిధియిలుమ్ ఇవళ్‌తానిప్పడి యుభయ విభూతియైయుమ్ ఇష్టవినియోగార్హ మాక్కు మ్బడియితే యవన్ తన్నైయుమ్ , తన్నుడైమైయైయుమ్ ఇవళుక్కాక్కి వైత్తపడి''** అని సాయించుట గమనింప తగును.

ఆళ్వార్లు ప్రపన్నజనకూటస్థు లనుటకు ''విప్రర్‌క్కు గోత్రచరణసూత్రకూటస్థర్ పరాశరపారాశర్యబోధాయనాదికళ్, ప్రపన్నజనకూటస్థర్ పరాంకుశపరకాలయతివరాదికళ్'' *(36)* అను ఆచార్యహృదయసూక్తి స్మరణీయము. ఉపదేశానుష్ఠానములతో ప్రపత్తిమార్గమును నిలిపి, వర్ధిల్లజేసినవారగుటచే ఆళ్వార్లకు ఆపేరు వచ్చినది అని శ్రీమణవాళమహామునుల సూక్తి. పరాంకుశశబ్దమునకు అరిషడ్వర్గమునకు అంకుశమువంటివారని, నాస్తిక మాయావాదులను నిరసించు అంకుశము వంటి వాక్కును కల్గినవారని, మదగజమువంటి భగవానుని సైతము వశీకరింపచేసికొనగల్గిన అంకుశము వంటి సూక్తులను ప్రసాదించినవారనియు అర్థము చెప్పనగును.

**6) శఠకోపమునిం వందే శఠానాం బుద్ధిదూషకమ్ ।**
**అజ్ఞానాం జ్ఞానజనకం తింత్రిణీమూలసంశ్రయమ్ ॥**

**ప్ర.అ.** - శఠానాం = శఠులయొక్క, బుద్ధి = దుర్బుద్ధిని, దూషకమ్ = పోగొట్టువారు, అజ్ఞానాం= జ్ఞానములేనివారికి, జ్ఞానజనకం = జ్ఞానమును కల్గించువారు, తింత్రిణీమూల = తింత్రిణీ (చింతచెట్టు) వృక్షముయొక్క మూలమును, సంశ్రయమ్ = నివాసముగా కలవారు అగు, శఠకోపమునిం = నమ్మాళ్వార్లను, వందే = నమస్కరించుచున్నాను.

**భావము :-** కుటిలబుద్ధిని కల్గినవారి దుర్బుద్ధిని పోగొట్టువారు, జ్ఞానహీనులకు జ్ఞానమును కల్గించువారు, చింతచెట్టు మూలమున నివసించు వారును అగు నమ్మాళ్వార్లను త్రికరణశుద్ధిగా ఆశ్రయించుచున్నాను.

**''ముడిమకిழ్ శేర్ ఞానముని''** *(99)* అనుతిరువాయ్ మొழிనూత్తన్దాది సూక్తి ఇచట స్మరణీయము. ''గూఢవిప్రియకృత్ శఠః'' అను ఆలంకారిక నిర్వచనమునుబట్టి, శఠులనగా రహస్యముగా అప్రియమొనర్చువారు. భగవానుని అస్తిత్వమును సహింపని నాస్తికులు, సమస్తకళ్యాణ గుణాకరుడగు ఆ స్వామి నిర్గుణుడని పల్కు మాయావాదులును శఠులేకదా! నాస్తికవాదమును, మాయావాదమును చేయువారి దుర్బుద్ధిని తమసూక్తులతో ఆళ్వార్లు పోగొట్టుదురని భావము.

ఇట్లు శ్లోకములోని ప్రథమార్ధము శఠకోప శబ్దమును నిర్వచించుచున్నది. పిళ్లైలోకమ్‌జీయర్ ఇరామానుశనూఱ్ఱన్దాది లోని "ఎయ్‌దఱ్కు" అను (19) పాశురమును వ్యాఖ్యానించుచు అందలి "శడగోప" శబ్దమును "శఠరావార్ స్వరూపజ్ఞానమిల్లాద సంసారికళ్. అవర్‌క్కై కుఱిత్తు ఒరునాయకత్తిలుమ్, నణ్ణాదార్ ముఱువలిలుమ్ పరుషమ్ పణ్ణినవరై" అని వ్యాఖ్యానించుటచే ఇట్టి వేరొక నిర్వచనము శఠకోపశబ్దమునకు కలదని చెప్పనగును. అజ్ఞానమును కల్గించు శఠవాయువుపై కోపించినవారగుటచే శఠకోపులను పేరు వచ్చెనను వివరణము ప్రసిద్ధమే కదా. **"శఠానాం బుద్ధిదూషకం"** అనుటచే అనిష్టనివృత్తి, **"అజ్ఞానాం జ్ఞానజనకం"** అనుటచే ఇష్టప్రాప్తియు ఇచట తెలుపబడుటచే ఆళ్వార్ల రక్షకత్వపూర్తి సూచింపబడినది. అట్టి ఆళ్వార్లకే తింత్రిణీవృక్షము ఆశ్రయమైనదనుటచే, ఆవృక్షముయొక్క మహిమ చాలగొప్పదని ధ్వనించుచున్నది. భగవంతుని సేవించువారికంటె భాగవతసేవను చేయువారే కదా గొప్పవారు. ఆళ్వార్లు అవతరించినపుడు వారికి నివాస మగుటకై భగవానుని ఆజ్ఞవలన సాక్షాత్తు ఆదిశేషులు చింతచెట్టుగా ఆవిర్భవించిరని పెద్దలు చెప్పుదురు. దీనికి సంస్కృతమున **"నిద్రి తింత్రిణి"** అని, ద్రావిడమున **"ఉఱఙ్గాప్పుళి మరమ్"** అని పేరు.

**7)** **వకుళాభరణం వందే జగదాభరణం మునిమ్।**
**యశ్శ్రుతే రుత్తరం భాగం చక్రే ద్రావిడభాషయా ॥**

**ప్ర. అ.** - యః = ఏ నమ్మాళ్వార్లు, శ్రుతేః = వేదముయొక్క, ఉత్తరం భాగం = ఉత్తరభాగమును (ఉపనిషత్తులను), ద్రావిడభాషయా = తమిళభాషతో, చక్రే = చేసిరో (అనువదించిరో), అట్టి, జగత్+ ఆభరణం = లోకమునకు అలంకారమైనవారు అగు, వకుళ+ ఆభరణం మునిం = వకుళాభరణులను మునిని, వందే = నమస్కరించుచున్నాను.

**భావము :-** 'వేదమ్ తమిழ్ శెయ్‌ద మాఱన్' అనునట్లు వేదశిరస్సుగా చెప్పబడు ఉపనిషత్తుల అర్థమును ద్రావిడభాషలోనికి అనువదించినవారు, లోకమునకు ఆభరణమువంటివారగు వకుళాభరణులను మునికి నమస్కరించుచున్నాను.

ముని అనగా మననశీలుడు అనిఅర్థము. భగవానుని స్వరూపరూపగుణవిభూతులను ఎల్లప్పుడు స్మరించుటచే, లోకోజ్జీవనమునుగూర్చి ఎల్లప్పుడు ఆలోచించుటచే, **"ఆళుమాళార్"** (రక్షించువారెవ్వరు) అని, **"వాళుమ్ విల్లుమ్ కొణ్డు పిన్ శెల్వార్ మఱ్ఱిల్లై"** (కత్తిని, విల్లును తీసికొని వెంటపోవు వారు మరి లేరే!) అనియు చెప్పబడినట్లు భగవానుని క్షేమమునుగూర్చి ఎల్లప్పుడు మననము చేయుటచే 'ముని' అనువిశేషణము ఆళ్వార్లవిషయమున మిగుల సార్థకము. ఆళ్వార్లకు వకుళమాలిక ఆభరణము కాగా, ఆ ఆళ్వార్లు జగత్తునకే ఆభరణము అను స్వారస్యము ఈ శ్లోకమున ధ్వనించుచున్నది.

8) వకుళాలంకృతం శ్రీమచ్ఛఠకోపపదద్వయమ్।
అస్మత్కులధనం భోగ్య మస్తు మే మూర్ధ్ని భూషణమ్ ॥

ప్ర.అ. - వకుళ+ అలంకృతం = వకుళపుష్పములచే అలంకరింపబడినది, అస్మత్+ కులధనం = ప్రపన్నులమగు మాయొక్క కులమునకు ధనము, భోగ్యం = అనుభవింపతగినది అగు, శ్రీమత్ = శోభను కల, శఠకోప = శఠకోపులయొక్క, పదద్వయం = పదముల జంట, మే = నాయొక్క, మూర్ధ్ని = తలయందు, భూషణమ్ = అలం కారముగా, అస్తు = అగుగాక!

**భావము** :- వకుళపుష్పములచే అలంకరింపబడినది, మాకు కులధనమును, పరమభోగ్యమును అగు శ్రీశఠకోపపదద్వయము నాతలకు అలంకారము అగుగాక.

''కోలమా మెన్ శెన్నిక్కు ఉన్కమలమన్నకురైకళ్లలే'' (నీ కమలములవంటి, కడియములను కల పాదములు నా తలకు అలంకారము) అని ఆళ్వార్లు భగవానుని విషయమున అనుసంధించిన భావమును కవి ఆళ్వార్లవిషయమున ప్రకటించిరి. శ్రీయామునులు భగవానుని పాదారవిందములను ''కులధనం'' అని ప్రస్తుతింపగా, ఇచట కవినమ్మాళ్వార్ల పాదములను కులధన మనుచున్నారు. శ్రీమచ్ఛబ్దమును వ్యస్తవిశేషణముగా కాని, సమస్త విశేషణముగా కాని గ్రహించి శఠకోప అను పదమునకు కాని, పదద్వయమను పదమునకు కాని విశేషణముగా చేయవచ్చును. సందర్భమునుబట్టి రెండవ అన్వయము మిక్కిలి అర్థవంతము. శఠకోపులకు అన్వయించిన జ్ఞానసంపద, వైరాగ్యసంపద, భగవత్కైంకర్య సంపద, అనితరసాధారణమైన వాగ్వైశద్య సంపద మొదలగు పలుసంపదలను కలవారిని ధ్వనించును. అపుడు ''**శ్రీమచ్ఛఠకోప పదద్వయమ్**'' అనునది సమస్త పదముగా గ్రహింపనగును. ''**ఉలకుయ్య**'' *(60)* అనుతిరువాయ్ మొళి నూఱ్ఱన్దాది పాశురములోని ''**మకిళ్మాఱన్ తాళిణైయే**'' అనుసూక్తిని వ్యాఖ్యానించుచు పిళ్లైలోకమ్ జీయర్ ''**శరణ్యన్ తన్ఱు ళాయ్ విరైనాఱు కణ్ణియ నానా ప్పోలే, శరణాగతరాన వివరుమ్ మకిళ్మాఱనానార్. అదుశేషిత్వద్యోతకమ్, ఇదు శేషత్వద్యోతకమ్**'' అని, ''**నెఞ్జే ! వకుళాభిరామమాన తిరువడికళై యునక్కుపాయమాక వధ్యవసిత్తుప్పోరు**'' అని పల్కుట గమనింపతగినది. అట్లే ''**వాళ్ముదలామ్ మాఱన్ మలర్ తాళి ణై శూడి**'' *(19)* అని, ''**నీడుపుకళ్మాఱన్‌తాళ్ మున్‌శెలుత్తువో మెమ్ముడి**'' *(20)* అని ఇత్యాదిగా పలుమార్లు ఆప్రబంధములో మణవాళమహామునులు పల్కుటయు స్మరణీయము. ''**మూర్ధ్ని సంతతమ్**' అను పాఠాంతరమును కలదు.

ఈ శ్లోకము కొందఱిచే అనుసంధింపబడుచున్నది. మఱి కొందఱు ఈక్రింద వ్యాఖ్యానింపబడు ''**నమజ్జనస్య**'' అనుశ్లోకమును అనుసంధించుచున్నారు. అందువలన ఈస్తోత్రమునకు పరాంకుశాష్టకము అనుపేరు అర్థవంతము.

9) నమజ్జనస్య చిత్తభిత్తిభక్తిచిత్రతూలికా
భవాహివీర్యభంజనే నరేంద్రమంత్రయంత్రణా ।
ప్రపన్నలోకకైరవప్రసన్నచారుచంద్రికా
శఠారిహస్తముద్రికా హఠా ద్ధునోతు మే తమః ॥

ప్ర. అ. - నమత్+జనస్య = నమస్కరించు వారియొక్క, చిత్త = మనస్సు అను, భిత్తి = గోడపై, భక్తి చిత్ర = భక్తి అను చిత్రమును రచించు, తూలికా = చిత్రలేఖినియు, భవ = సంసారమను, అహి = సర్పముయొక్క, వీర్య = గొప్పతనమును, భంజనే = నశింపచేయుటయందు, నరేంద్ర = విషవైద్యునియొక్క, మంత్ర = మంత్రప్రయోగముయొక్క, యంత్రణా = నియమము, ప్రపన్నలోక= ప్రపన్నజనులు అను, కైరవ = కలువలకు ఆనందమును కలిగించు, ప్రసన్న = నిర్మలమైన, చారు = మనోహరమైన, చంద్రికా = వెన్నెలయు అగు, శఠ+అరి = నమ్మాళ్వార్ల యొక్క, హస్తముద్రికా = చేతిలోని జ్ఞానముద్ర, మే = నాయొక్క, తమః = చీకటిని, హఠాత్ = వేగముగా, ధునోతు = పోగొట్టును గాక!

**భావము** :- ఈశ్లోకము నక్షత్రమాలిక అను స్తోత్రములోని తొమ్మిదవశ్లోకము. ఇందు ఆళ్వార్ల హస్తముద్ర వర్ణింపబడుచున్నది.

తమకు నమస్కరించు భక్తుల మనస్సులు అను గోడలపై భక్తి అను చిత్తరువును లిఖించు లేఖినివలె, సంసారమను సర్పముయొక్క విష ప్రభావమును పోగొట్టు విషవైద్యుని మంత్ర ప్రయోగ విధానమువలె, ప్రపన్నజనులను కలువలకు ఆనందమును కల్గించు నిర్మలమైన, అందమైన వెన్నెలవలె నున్న నమ్మాళ్వార్ల హస్తముద్రిక నామనస్సులోని చీకటిని వేగముగా పోగొట్టును గాక!

భక్తజనుల హృదయమున భక్తిని కల్గించునది, సంసారస్పృహను పోగొట్టునది, ప్రపన్నజనులకు ఆనందమును కల్గించునది అగు ఆళ్వార్లహస్తముద్రికనామనస్సులోని చీకటిని పోగొట్టవలయునని తాత్పర్యము. 'హఠాత్' అను పదముచే సంసారుల ఆంతరతమస్సు తొలగుట మిక్కిలి కష్టమను భావము సూచితము. సర్పము కేవలము స్వరూపమును మాత్రమే నశింపచేయును. కాని, సంసారసర్పము స్వభావమును కూడ నశింపచేయును. **''హంతీతి అహిః''** అను వ్యుత్పత్తిని కల **''అహి''** శబ్దమిచట ప్రయోగింపబడుట మిక్కిలి తగినది. ప్రస్తుతశ్లోక భావమునకు, వేదాంతదేశిక ప్రణీతమగు యతిరాజసప్తతిలోని **''సన్మంత్రవిత్ క్షిపతి సంయమినాం నరేంద్రః, సంసారజిహ్మగముఖైః సముపస్థితం నః, విష్వక్తతం విషయలోభవిషం నిజాభిః గాఢానుభావి గరుడ ధ్వజ భావనాభిః''** *(23)*, **''నాథః స ఏష యమినాం నఖరశ్మిజాలైః, అంతర్నిలీన మపనీయ తమో మదీయమ్, విజ్ఞానచిత్ర మనఘం లిఖతీవ చిత్తే, వ్యాఖ్యాన కేలి రసికేన కరాంబుజే''** *(24)* అనుశ్లోకముల భావమునకు కల సామ్యము

గమనింపతగినది. ఇచటి "**నరేంద్ర మంత్రయంత్రణా**" ఏమనగా పరాశరభట్టర్ పల్కిన "**హరేః భక్తియంత్రణ**"మే కదా ! ప్రపన్నలోకమును కైరవములతో (కలువలతో) పోల్చుటయు స్వరసమైనదే. కేరవమనగా హంస, అదిమిక్కిలి ఇష్టపడునది కావున కలువకు కైరవమని పేరువచ్చెనని కైరవశబ్ద వ్యుత్పత్తి తెలుపుచున్నది. అట్లే హంసగా చెప్పబడు విష్ణువునకు ప్రపన్నులు "స చ మమ ప్రియః" అని మిక్కిలి ప్రియులు కావున ప్రపన్నులు కైరవ సదృశులు. "హఠాత్కారోతు" అను పాఠమును కలదు. అర్థమున మార్పులేదు. "**చిత్తభిత్తి**" అనుటకు దేశికుల సంకల్ప సూర్యోదయములోని "**విదుషః చింతనాం శక్త్యా చిత్రభిత్తిం వితన్వతా**" అను ప్రయోగము స్మరణీయము. "**భవాహి . . . మంత్రయంత్రణా**" అను సూక్తికి అనుగుణముగా దేశికుల "**మదన మత్సరమానమయః పుమాన్ బహుపిశాచ గృహీత ఇవార్భకః, నిగమసిద్ధ నరేంద్ర నిరీక్షణాత్ నిపుణ పద్ధతి మభ్యవపద్యతే**" అను ప్రయోగము అనుసంధేయము.

శ్రీమతే శఠకోపాయ నమః

## ఉపోద్ఘాతము

నమ్మాళ్వార్లను స్తుతించు పలు సంస్కృతస్తోత్రములలో నక్షత్రమాలిక అను ఈ స్తోత్రము అన్నివిధముల సాటిలేనిది. ఈ స్తోత్రము శ్రీమణవాళమహామునులకు పూర్వాశ్రమమున పౌత్రులును, అభిరామవరులను పేరును కల్గినవారగు జీయర్ నాయనార్‌చే రచింపబడినది. శబ్దమాధుర్యమందు, అర్థపుష్టియందు ఈ స్తోత్రమునకు ఈ స్తోత్రమే సాటి అని చెప్పనగును. ముద్రాలంకారపద్ధతిలో అన్నిశ్లోకములలో వరుసగా 27 నక్షత్రముల పేర్లు సూచింపబడుటచే దీనికి నక్షత్రమాలిక అను పేరుకల్గినది.

ఈ స్తోత్రమున గమనింపతగిన ప్రత్యేకమైన అంశ మొకటి కలదు. తమిళసాహిత్య సంప్రదాయమునగల 'అన్దాది' ప్రక్రియలో ఈస్తోత్రము రచింపబడినది. మొదటిశ్లోకములోని చివరి అక్షరము రెండవశ్లోకములోని మొదటి అక్షరముగా, రెండవ శ్లోకములోని చివరి అక్షరము తరువాతి శ్లోకమునకు మొదటి అక్షరముగా నగును. చివరిశ్లోకములోని చివరి అక్షరము మొదటి శ్లోకములలోని మొదటి అక్షరమగును. కావున ఇది అక్షర అన్తాది ప్రక్రియలో రచింపబడినది. "**అన్దాది**" పద్ధతిలో భగవానుని స్తుతించిన ఆళ్వార్లను అదే ప్రక్రియలో కవి స్తుతించుట గమనింపదగినది. ఇంత కంటె విచిత్రమైన అంశము వేరొకటి కలదు. మాలను కట్టువారు ప్రారంభమున చిన్నదిగా ప్రారంభించి, క్రమముగా పెద్దదిగా కూర్చుదురు. మొదటిసగము కాగానే

మరల క్రమముగా తగ్గించుచు పూర్తిచేయుదురు. అట్లే ఈస్తుతి యందు కవి 8 అక్షరములను పాదమున కల్గిన అనుష్టుప్ ఛందస్సుతో ప్రారంభించి, క్రమముగా ఒక్కొక్క శ్లోకములో ఒక్కొక్క అక్షరమును పెంచుచు 13వ శ్లోకమును 20 అక్షరములను కల్గిన వృత్తమున కూర్చిరి. నాయకరత్నముగా భాసించు 14వశ్లోకమును 21 అక్షరములను కల్గినది, పేరున మిక్కిలి ఔచిత్యమును కల్గినదగు స్రగ్ధరావృత్తమున రచించిరి. 15వశ్లోకమునుండి 27 వ శ్లోకమువరకుగల 13శ్లోకములను ఒక్కొక్క శ్లోకములో ఒక్కొక్క అక్షరమును తగ్గించుచు భిన్న భిన్నవృత్తములలో రచించి పూర్తిచేసిరి. ఈవిధముగా ఛందోవిషయకమైన వైశిష్ట్యమును ఈస్తోత్రమున కానవచ్చుచున్నది. ఇక అలంకారవైవిధ్యవిషయమున చెప్పవలసిన పనియేలేదు.

ఈ స్తోత్రమున ప్రయోగింపబడిన వృత్తముల వివరములు, వాని క్రమమును ఈక్రింది విధముగా చూపవచ్చును.

1వశ్లోకము- 27వశ్లోకము - అనుష్టుప్
2వశ్లోకము- 26వశ్లోకము - భుజగశిశుభృత (న న మ అనుగణములు)
3వశ్లోకము- 25 వశ్లోకము - మత్త (మ భ స గ అనుగణములు)
4వశ్లోకము- 24వశ్లోకము - ఇంద్రవజ్ర (త త జ గ గ అనుగణములు)
5వశ్లోకము- 23వశ్లోకము - ద్రుతవిలంబితము ( న భ భ ర అనుగణములు)
6వశ్లోకము- 22వశ్లోకము - ప్రహర్షిణి (మ న జ ర గ అనుగణములు)
7వశ్లోకము- 21 వశ్లోకము - వసంతతిలక (త భ జ జ గ గ అనుగణములు)
8వశ్లోకము- 20వశ్లోకము - మాలిని (న న మ య య అనుగణములు)
9వశ్లోకము- 19వశ్లోకము - పంచచామరము (జ ర జ ర జ గ అనుగణములు)
10వశ్లోకము- 18 వశ్లోకము - పృథ్వీ (జ స జ స య ల గ అనుగణములు)
11వశ్లోకము- 17వశ్లోకము - సింహవిక్రీడితము (న న ర ర ర ర అనుగణములు)
12వశ్లోకము- 16వశ్లోకము - శార్దూలవిక్రీడితము ( మ స జ స త-త గ అనుగణములు)
13వశ్లోకము- 15వశ్లోకము - వృత్తము (ర జ ర జ ర జ ల గ అనుగణములు)
14వశ్లోకము - స్రగ్ధర (మ ర భ న య య య అనుగణములు)

వీనిలో భుజగశిశుభృత, మత్త, సింహవిక్రీడితము, వృత్తమువంటి అపూర్వములైన వృత్తములు ఉపయోగింపబడుట గమనింపతగిన అంశము. 27 ముత్యములతో కూర్చబడిన మౌక్తికమాలకు నక్షత్రమాల అని పేరు. "**ఏకావళ్యేకయష్టికా, సైవ నక్షత్రమాలా స్యాత్ సప్తవింశతిమౌక్తికైః**" అను అమరకోశవచనము ఇచట స్మరణీయము. ఈ స్తోత్రములోని శ్లోకములు అన్నియు ముక్తకశ్లోకములు. కావున ముత్యములతో వీనికి రూపసామ్యము లేకున్నను, నామసాదృశ్యమున్నది కదా! కావున ప్రస్తుతస్తోత్రమునకు నక్షత్రమాలికా అనునామము మిగుల అన్వర్థము.

గజకంఠమునకు అలంకరింపబడు ఆభరణమునకును నక్షత్రమాల అనిపేరు ''**అనంగవారణశిరోనక్షత్రమాలాయమానేన మేఖలాదామ్నా**'' అను కాదంబరీ ప్రయోగము ఇందులకు ఉదాహరణము. భగవానునివలెనే ఆళ్వార్లను, ఆచార్యులను ఏనుగు అను అర్థమిచ్చు (శ్లేష్ఠతావాచకములగుటచే) కుంజరగజాదిపదములతో రూపించుట కాననగును. ''**రామానుజమునివేళమ్**'' వంటి ప్రయోగము లిచట స్మరణీయములు. కంబుని శఠకోపర్ అంధాదిలోని ''**వెళ్ళిన్నైయై తొళైత్త శినమ్ వారణత్తై**'', ''**మాఅప్పెయర్ కొళైయానై**'' అను ప్రయోగములు ఇచట స్మరింప తగినవి. కావున నక్షత్రమాలికా అనుపేరు వలన గజమువంటి నమ్మాళ్వార్ల కంఠమునకు అలంకారము అనుభావము ధ్వనించుచున్నది. అలంకారశాస్త్రమున 27 శ్లోక ములనుకల్గిన ప్రబంధమునకు '**తారావలి**' అనిపేరు ''**తారాణాం సంఖ్యయా పద్యై ర్యుక్తా తారావలీ మతా**'' అని ప్రతాపరుద్రీయనిర్వచనము. కావున ఈ స్తుతిప్రబంధము తారావలీవర్గమునకు చెందినదని చెప్పవచ్చును. ఇందు తారలపేర్లు అన్నియు చమత్కార పూర్వకముగా సూచింపబడుట విశేషము. నమ్మాళ్వార్ల అవతారసంవత్సరశుభోత్సవస్మారకముగా ఈ స్తోత్రము వ్యాఖ్యానముతో శ్రీవైష్ణవలోకమునకు కైంకర్యరూపమున సమర్పింపబడుచున్నది. ''అణ్ణావప్పజ్గార్'' అనుపేరుతో ప్రసిద్ధులగు శ్రీవాధూల వీరరాఘవాచార్యుల వారు, ఇంకను పలువురు ఈస్తోత్రమును వ్యాఖ్యానించిరి. ప్రస్తుతవ్యాఖ్య ప్రధానముగా మహామహోపాధ్యాయ, పద్మవిభూషణ, కాంచీ ప్ర. భ అణ్ణంగరాచార్యస్వామిపాదుల ద్రావిడ వ్యాఖ్యానమును అనుసరించి వ్రాయబడుచున్నది. అచట అచట నా అల్పబుద్ధికి తోచినకొన్ని అంశములను చేర్చితిని. అందలి గుణదోషములను విజ్ఞులగు పాఠకులే నిర్ణయింతురు.

## గ్రంథకర్తృప్రార్థనాశ్లోకము
## (తనియన్)

**అస్మాసు వత్సలతయా కృపయా చ భూయః**
**స్వేచ్ఛావతీర్ణ మివ సౌమ్యవరం మునీంద్రమ్ ।**
**ఆచార్యపౌత్ర మభిరామవరాభిధానం**
**అస్మద్గురుం పరమకారుణికం నమామి ॥**

**ప్ర.అ.** - అస్మాసు = మాయందు, వత్సలతయా - వాత్సల్యగుణముచే, భూయః కృపయా చ = మిక్కిలి కృపచే, స్వేచ్ఛా+ అవతీర్ణం = (కర్మఫలితమువలనకాక) స్వచ్ఛందముగా అవతరించిన, సౌమ్యవరం మునీంద్రం ఇవ (స్థితం) = శ్రీమణవాళమహామునులవలె ఉన్నవారును, అభిరామవర+ అభిధానం = అభిరామవరులను పేరును కల్గినవారు, పరమకారుణికం = గొప్పకరుణను కల్గి, వారును అగు, అస్మత్+గురుం = మా గురువర్యులను, నమామి = నమస్కరించుచున్నాను.

437.61



**భావము :-** నక్షత్రమాలికా అను ఈ ఆళ్వార్లస్తోత్రమును అనుగ్రహించిన జీయర్‌నాయనార్‌ను వారి శిష్యులలో ఒకరు స్తుతించుచు రచించిన శ్లోకమిది.

మాయందు వాత్సల్యముతో, కృపతో మరల శ్రీమణవాళమహామునులే అవతరించిరా? అనునట్లున్నవారు, ఆ మణవాళమహామునుల పౌత్రులు, పరమకారుణికులు, అభిరామవరులను పేరును కల్గిన వారగు మా ఆచార్యులను నమస్కరించుచున్నాను.

ఈ స్తుతి మణవాళమహామునుల శిష్యులలో ఒకరిచే రచింపబడినదని యతీంద్రప్రవణ ప్రభావము అను సంప్రదాయ చరిత్రగ్రంథమున కలదు. ''స్వేచ్ఛావతీర్ణం'' అనుటచే స్తోత్రకర్తయొక్క దివ్యత్వము వ్యక్తమగుచున్నది. ''సౌమ్యవరం మునీంద్రం ఇవ'' అనుసాదృశ్యమువలన శ్రీమణ వాళ మహామునులతో సమానమైన జ్ఞానానుష్ఠానవైభవమును కల్గినవారని తెలియుచున్నది. రెండవపాదమున ''**భూయోఽవతీర్ణ**'' అని, చివరిపాదమున **''గుణనిధిం సతతం శ్రయామః''** అనియు పాఠాంతరములు కలవు. ఈ ఆచార్యులు తమ పితామహులగు మణవాళమహామునులు సాయించిన **''ఉపదేశరత్తినమాలై''** ప్రబంధమును సంస్కృతీకరించిరి. మఱియు వీరు తమ పితామహుల విశేషణ కటాక్షవీక్షణమునకు పాత్రమయ్యిరి. '' **ఇవరుమ్ శ్రీమన్నాథమునికళుక్కు ఆళవన్దారైప్పోలే తముక్కు పౌత్రరాన ఇతరుమ్ దీపాదుత్పన్న ప్రదీపమ్బోలే మికవుమ్ ప్రకాశకమానరాయిరున్దార్**'' అను యతీంద్రప్రవణ ప్రభావ సూక్తి ఇచట స్మరణీయము.

## నక్షత్రమాలికా

1) శ్రీమాన్ పరాంకుశముని ర్జీయాత్ యత్‌జ్ఞానముద్రయా।
నేంద్రియాశ్వయుజో నౄణాం నిత్యం విషయవీథయః ॥

**ప్ర. అ.** - యత్= ఏ నమ్మాళ్వార్లయొక్క, జ్ఞానముద్రయా = జ్ఞాన( ఉపదేశ) ముద్రచే, నౄణాం= జనులయొక్క, ఇంద్రియ+ అశ్వయుజః = ఇంద్రియములనెడి గుఱ్ఱముల సమూహమును, విషయవీథయః = శబ్దాది విషయములను వీధులను, నిత్యం న ( భవంతి) = ఎప్పుడును పొందవో, అట్టి, శ్రీమాన్= మహిమను కల్గిన, పర+ అంకుశమునిః = నమ్మాళ్వార్లు, జీయాత్= చిరకాలము వర్ధిల్లుదురుగాక!

**భావము :-** నమ్మాళ్వార్ల జ్ఞానముద్రవలన జనులకు నిజమైన స్వరూప జ్ఞానము కలిగెను. అందువలనవారి ఇంద్రియములు అను అశ్వములు ఎన్నటికిని లౌకిక విషయములు అను వీధులలో సంచరింపవు. అట్టి జ్ఞానవైభవమును కల్గిన నమ్మాళ్వార్లు నిత్యము సర్వోత్కర్షతో వెలుగొందుదురుగాక!

ఇంద్రియములను అశ్వములతో రూపించుట కవిసమయము. ''ఇంద్రియాణి హయానాహుః'' అని ఉపనిషత్సూక్తిని, ''క్వచ దుష్టేంద్రియవాజివశ్యతా'' అను భారవిసూక్తినిస్మరింపనగును. ఇందుల కనుగుణముగా శబ్దాదివిషయములు ఆ అశ్వములు సంచరించు వీధులతో రూపింపబడినవి. ''శ్రీమాన్'' అనువిశేషణమునకు సందర్భానుగుణముగా జ్ఞానవైభవమును కల్గిన వారని అర్థము. ఆళ్వార్లజ్ఞానము ''మయర్వర మదినలమ్'' అనునట్లు దోషరహితమైనజ్ఞానము. శ్లోకప్రారంభమున శ్రీశబ్దప్రయోగమును చేయుట ద్వారా మంగళము ఆచరింపబడినది. ''తదశ్వినా వశ్వయుజోపయాతామ్'' అని వేదమున చెప్పబడినందుల కనుగుణముగా శ్లోకములోని మూడవపాదమున'' అశ్వయుక్'' పదము ద్వారా అశ్వినీ నక్షత్రము సూచింపబడినది. 'సూచ్యార్థసూచనం ముద్రా ప్రకృతార్థ పరైః పదైః'' అను లక్షణము ప్రకారము ప్రకృతార్థమును తెలుపు పదములద్వారా కవి తాను సూచింపదలచిన అర్థమును సూచించుట ముద్రాలంకారము. ఈ ప్రక్రియను మిగిలిన శ్లోకములన్నిటి యందును కానగును. శ్లోకములోని మొదటిది అగు 'శ్రీ' యే చివరశ్లోకములోని చివరి పదముగా కూర్చ బడినది అట్లే ప్రకృతశ్లోకములోని చివరి అక్షరము అను ''య'' కారము రెండవ శ్లోక ప్రారంభమున కూర్చబడినది. ఇట్టి అన్తాది ప్రక్రియ స్తోత్రమునందు అంతట కలదు.

**2)** **యదురసి భరణీయా స్రక్ వికసితవకుళానద్ధా ।**
**స జయతి మహిమా నాథో మురరిపుపదసక్తో నః ॥**

ప్ర.అ - యత్+ ఉరసి = ఏ నమ్మాళ్వార్ల హృదయమునందు, భరణీయా = ధరింపతగిన, స్రక్ = పూమాల, వికసితవకుళ = బాగుగాపూచినపొగడ పూలతో, ఆనద్ధా = కూర్చబడినదో, సః = ఆ, మురరిపు పదసక్తః = మురహరుడగు భగవానుని పాదముల యందు మిక్కిలి ఆసక్తిని (భక్తిని) కల, మహిమా = మహిమ యొక్క స్వరూపమనతగిన, నః = మా, నాథః = నాథుడగు నమ్మాళ్వార్లు, జయతి = సర్వోత్కర్షతో ప్రకాశించుచున్నారు.

**భావము :-** నమ్మాళ్వార్లహృదయమున అలంకరింప బడిన మాల వికసించిన వకుళపుష్పములతో కూర్చబడినది. ఎల్లప్పుడును భగవానుని పాదారవిందములను ధ్యానించువారు, మహిమకల్గినవారు, మాకు నాథులగు నమ్మాళ్వార్లు సర్వోత్కర్షతో ప్రకాశించుచున్నారు.

**''మహిమవాన్''** - మహిమను కల్గినవారని ధర్మివాచకముతో వర్ణింప వలసియుండగా, **'మహిమా'** అను ధర్మవాచకముతో ఆళ్వార్లను నిర్దేశించుట **''తద్గుణ సారత్వాత్తు తద్వ్యపదేశః, ప్రాజ్ఞవత్''** అను పద్ధతిలో నని చెప్పనగును. మహిమయే ఆళ్వార్ల రూపమును పొందినదని అర్థము. ఈసందర్భమున **''మాలే''** వంటి ప్రయోగములు, **''ఆనందో బ్రహ్మ''** వంటి వైదికసూక్తులు స్మరణీయములు. మొదటి పాదమున భరణీ నక్షత్రము సూచితము. వృత్తము భుజగశిశుభృత అను పేరు కలిగినది.

3) నంతానంతాంఘ్రి నలిన యుగ్మే కర్తాలో కార్తికబలనానామ్।
భద్రాయ ద్రావిడనిగమానాం ద్రష్టా పుష్టాయ వకుళ భృత్ స్యాత్॥

*ప్ర. అ - అనంత+ అంఘ్రినళిన యుగ్మే = అనంతుడను పేరుకల భగవానుని పాదపద్మయుగమునందు, నంతా = నమస్కరించువారు, లోక+ ఆర్తికబలనానామ్ = లోకములోని జనుల దుఃఖమును కబళించుటను, కర్తా = చేయువారును, ద్రావిడనిగమానాం = ద్రావిడవేదమును, ద్రష్టా = దర్శించిన వారును అగు, వకుళభృత్ = నమ్మాళ్వార్లు, భద్రాయ = మన క్షేమమునకు, పుష్టాయ = యోగమునకును, స్యాత్ = అగుదురు గాక!*

**భావము :-** *భగవానుని పాదారవింద యుగమును ఎల్లప్పుడు నమస్కరించు వారును, లోకములోని జనుల ఆర్తిని హరించు వారును, ద్రావిడాగమద్రష్టలును అగునమ్మాళ్వార్లు మనయోగక్షేమములను రక్షింతురుగాక!*

**"తుయఅరు శుడరడి తొழுదు ఎన్మననే"** అనుచు భగవానుని పాదములనే ఎల్లప్పుడు స్మరించువారగుటచే శ్లోకములోని **"అనంతాంఘ్రినళినయుగ్మే నంతా"** అను విశేషణము సార్థకము. నమ్మాళ్వార్లు తిరువిరుత్తము, తిరువాశిరియము, పెరియతిరువన్దాది, తిరువాయ్‌మొழி అను నాల్గుదివ్యప్రబంధములను మాత్రమే అను గ్రహించినను, **"ద్రావిడనిగమానాం ద్రష్టా"** అనుటలో తాత్పర్యమేమనగా, నాథమునికి యోగమున ఆళ్వార్లు సాక్షాత్కరించి, నాలాయిరదివ్యప్రబంధమును అనుగ్రహించుటచేనని చెప్పనగును. **"నాదనుక్కు నాలాయిర ముదైత్తాన్ వాழி యే"** అను మంగళాశాసనసూక్తి ఇచట స్మరణీయము. ఆళ్వార్ల ప్రబంధములలోని సూక్తులు ఆత్మప్రబోధరూపమున, పరోపదేశరూపమున కన్పించును. కావున శ్లోకమున మొదటి సగములోని విశేషణములు రెండును మిక్కిలి అర్థవంతములు. **"పుష్టాయ భద్రాయ"** అనునపుడు గొప్ప మంగళము కొఱకు అనియు అర్థమును చెప్పవచ్చును. భగవానుడు **"యోగక్షేమం వహామ్యహం"** అని భక్తుల యోగక్షేమములను రక్షించునట్లే, ఆళ్వార్లు తమభక్తుల యోగక్షేమములను **"భద్రాయ పుష్టాయ"** అనునట్లు కాపాడుదురనుటచే భగవత్సామ్యమును సూచితము. రెండవపాదమున కృత్తికానక్షత్రము సూచింపబడినది. వృత్తము మత్త.

4) స్యా దేవ సా మే ఫణితి శ్శఠారేః
యయోదితోచ్చై స్సరణి ర్జనానామ్ ।
ఆరోహిణీ నాప్యవరోహిణీ హి
వేదోదితా తు ద్వయ మభ్యుపైతి ॥

*ప్ర. అ - యయా = ఏ నమ్మాళ్వార్ల యొక్క శ్రీసూక్తిచే, ఉదితా = తెలుపబడిన, ఉచ్చైఃసరణిః=*

ఉన్నతమైన మార్గము, జనానాం = సంసార జనులకు, ఆరోహిణీ = ఉన్నత పదమును చేర్చునిచ్చెన వంటిదో, అవరోహిణీ అపి న = క్రిందకుదిగవిడుచునది కానేకాదో, వేద+ ఉదితా తు = వేదము నందు తెలుపబడిన మార్గము మాత్రము, ద్వయం = రెండిటిని (ఉన్నతపదమును, అధోగతియును) అభ్యుపైతి = పొందింప చేయుచున్నది, శఠారేః = నమ్మాళ్వార్లయొక్క, సా = అట్టి మహనీయమైన, ఫణితిః+ ఏవ = మార్గమే, మే = నాకు, స్యాత్ = అగునుగాక!

**భావము :**- పూర్వశ్లోకమున ఆళ్వార్లు ద్రావిడవేదమును దర్శించిన వారు అనితెలుప బడినది. ఇందు సంస్కృత వేదముకన్న ద్రావిడ వేదముయొక్క వైశిష్ట్యమును పరోక్షముగా సూచించుచు, కవి ఆళ్వార్లను స్తుతించుచున్నారు.

తమ ప్రబంధములలో ఆళ్వార్లు ప్రపత్తిమార్గము జనులు అందఱికిని ఆచరణ యోగ్యమని ప్రబోధించిరి. ఆమార్గమున భగవానుని ఆశ్రయించిన వారికి భగవత్ప్రాప్తి సిద్ధము. ఆపిమ్మట వారు తిరిగి ఈ లోకమున జన్మింప వలసిన పనిలేదు. సంస్కృతవేదము "**త్రైగుణ్య విషయా వేదాః**" అనునట్లు సత్త్వరజస్తమోగుణములను కల్గిన జనులందఱిని దృష్టిలో నుంచుకొనిన వగుటచే అధికారానుగుణముగా ముముక్షువులను గూర్చి, బుభుక్షువులను గూర్చి, వారు ఆచరింపవలసిన విధానములను గూర్చి పల్కినది. ద్రావిడవేదము మాత్రము ముముక్షువులగు ఉత్తమాధికారులను గూర్చి పల్కుటచే సారతరము. అట్టి ఆళ్వార్ల ప్రపత్తిమార్గము నాకగును గాక!

"**సా ఫణితిః మే స్యాత్**" అనుటకు ఆళ్వార్లు అనుగ్రహించిన ప్రబంధములు నాకు వాచోవిధేయములు అగును గాక అనియుచెప్పవచ్చును. ఆరోహిణి అనగా నిచ్చెన. "**ఆరోహిణీ నాప్యవరోహిణీ హి**" అనుటకు "**పుణ్ణైకొడుక్కిలుమ్ పోకవొట్టారే**" అనుపెరియాళ్వార్ల సూక్తి స్మరణీయము. "**నిరపాయదేశికనిదర్శితా మిమాం కమలాసహాయ కరుణాధిరోహిణీమ్, క్రమశో౽ధిరుహ్య కృతినః సమింధతే పరిశుద్ధసత్త్వ పరికర్మితే పదే**" అను సంకల్పసూర్యోదయ సూక్తి ఈ సందర్భమున స్మరింపతగినది. మూడవపాదమున రోహిణీ నక్షత్రము సూచింపబడినది.

**5)** **తిలక మాహ న కాచిదపి శ్రుతౌ**
**త్రిజగతాం మృగశీర్షసముత్థితా ।**
**స్ఫుటతరం వకుళాభరణీయవాక్**
**పురుష మాది మశేషపదై రపి ॥**

ప్ర.అ - శ్రుతౌ = వేదమున, అశీర్షసముత్థితా = ఉపనిషత్తులు కంటె వేరగు కర్మ కాండమున నుడవ బడిన, ఋక్ కాచిత్+ అపి = ఏ ఒక్క ఋక్ రూపమైన సూక్తియు, త్రిజగతాం = ముల్లోకములకు, తిలకం = ఆభరణము (ప్రభువు) అగుభగవానుని గూర్చి, న ఆహ = పలుకలేదు; వకుళ+

ఆభరణీయ = నమ్మాళ్వార్లచే అనుగ్రహింపబడిన, వాక్ = మాట, ఆదిం పురుషం = ఆదిపురుషుని, అశేషపదైః = అన్నిపదములతో, స్ఫుటతరం ఆహ = మిక్కిలి స్పష్టముగా పల్కినది.

**భావము :-** ఈ శ్లోకము కూడ ద్రావిడవేదవైలక్షణ్యమును తెలుపుచున్నది.

వేదములోని కర్మకాండమున సర్వేశ్వరుని గూర్చిన ప్రసక్తియేలేదు. కాని, నమ్మాళ్వార్ల శ్రీసూక్తి ఆదిపురుషుడగు భగవానునిగూర్చి మిక్కిలి విస్తృతముగా పలు పదములతో వర్ణించుచున్నది.

ఆళ్వార్లు తమ మొదటి ప్రబంధమగు తిరువిరుత్తమున ''**తిరుమాలవన్ కవి యాదు కఱ్ఱేన్**'' అని ప్రతిజ్ఞచేసి, తదనుగుణముగా తిరువాయ్మొళిలో ''**మాఱ్ఱ్రుళ్ళఆయ్న్దుకొణ్డు మదుశూదపిరానడిమేల్**'' అనియు, ''**ఉరియ శొల్లాలిశైమాల్ కళేఱ్ఱ్రియుళ్ళపెఱ్ఱేన్**'' అనియు భగవానుని వర్ణ్యముగా గ్రహించి తమ ప్రబంధములను సాయించిరి. కావున తమిళవేదమునకు కల గొప్పతనము సంస్కృతవేదమునకు లేదనియే కదా చెప్పవలెను. ఎందులకనగా కర్మకాండ-బ్రహ్మకాండములుగా విభజింపబడిన వేదమున బ్రహ్మకాండమున మాత్రమే భగవానుని స్వరూప రూపగుణవిభూతులనుగూర్చిన ప్రసక్తి కలదు. ద్రావిడవేదము సర్వము బ్రహ్మస్వరూప ప్రతిపాదకము కదా! మఱియు, సంస్కృత వేదమున కంటె ద్రావిడ వేదమున భగవానుని గూర్చి మిక్కిలి స్పష్టముగా తెలుపబడియుండుట కూడ విశేషము.

తిరువాయ్ మొళిలోని ''**తిలదములకుక్కాయ్ నిన్ఱ తిరువేఙ్గడ త్తెమ్బెరుమానే**'' అను సూక్తిని బట్టి ''**త్రిజగతాం తిలకం**'' అని ప్రయోగింప బడినది. దీనివలన శ్రీవేంకటేశ్వరుడే వేద ప్రతిపాద్యుడనియు ధ్వనించుచున్నది. శ్లోకమున ''**స్ఫుటతరం**'' అను క్రియా విశేషణము '**వేదైశ్చ సర్వై రహ మేవ వేద్యః**'' అనుగీతా సూక్తికి, '**వేద్యో వేదైశ్చ సర్వై రహ మితి భగవాన్ స్వేన చ వ్యాచకర్ద**'' అనుభట్టరు సూక్తికి విరోధము కలుగకుండుటకని గ్రహింపనగునని శ్రీ. ప్ర. భ అణ్ణాస్వామి వివరించిరి. శ్లోకములోని రెండవపాదమున మృగశీర్షా నక్షత్రము సూచితము. రెండవ పాదమున ''అశీర్షసముద్భవా'' అను పాఠాంతరము కలదు. అర్థమున భేదము లేదు. శీర్షమనగా తల. శ్రుతిశీర్షమనగా వేదాంతము అని అర్థము.

**6)** **పిత్రాది స్సకలవిధోఽపి బంధువర్గో**
**యస్యాసీత్ సరసిజవాసినీసహాయః ।**
**ఆవిః స్యు ర్ఘనకరుణారసావసేకై -**
**రార్ద్రా మే వకుళభృతః కటాక్షపాతాః ॥**

ప్ర.అ - యస్య = ఏ నమ్మాళ్వార్లకు, పితృ + ఆది = తండ్రి మొదలగు, సకలవిధః = సమస్త విధములగు, బంధువర్గః అపి = బంధువులును, సరసిజవాసినీసహాయః = లక్ష్మీసహాయుడగు

భగవానుడు, అసీత్ = అయ్యెనో, అట్టి, వకుళభృతః = నమ్మాళ్వార్ల యొక్క, ఘన = గొప్పదైన, కరుణారస దయారసముయొక్క, అవసేకైః = సేచనములతో, ఆర్ద్రాః = చల్లనివి అగు, కటాక్షపాతాః = చూపులు, మే = నాకు, ఆవిః స్యుః = అగునుగాక! (ఆళ్వార్లు నన్ను చల్లని చూపులతో అనుగ్రహింతురుగాక!)

**భావము :-** తనకు తండ్రి, తల్లి మొదలగు బంధువర్గమంతయు శ్రియఃపతిఅగు భగవానుడేనని తలచిన నమ్మాళ్వార్లు కరుణారసముతో చల్లనివగు తమ చూపులతో నన్ను అనుగ్రహింతురుగాక!

నమ్మాళ్వార్లు తిరువాయ్మొళ్ళిలో '**శేలేయ్ కణ్ణియరుమ్ . . . . నన్ మక్కళు మ్ మేలా త్తాయ్ తన్దైయుమ్ అవరే యినియావారే**'' అని, ''**తాయాయ్ తన్దైయాయ్ మక్కళాయ్ మత్తుమాయ్ ముత్తుమాయ్**'' అనియు పల్కుట ఇచట స్మరణీయము. నాల్గవపాదమున ఆర్ద్రానక్షత్రము సూచితము. ''**సకలవిధోஉపి బంధువర్గః**'' అనునపుడు అష్టాక్షరీ మహామంత్రముచే ప్రతిపాదింపబడిన ''**పితా చ రక్షకః శేషీ భర్తా జ్ఞేయో రమాపతిః, స్వామ్యాధారో మామాత్మా చ భోక్తా చాద్యమనూదితః**'' అను నవ విధ బంధువులు అను అర్థమును చెప్పనగును. అపుడు ఆళ్వార్లు అష్టాక్షరీమంత్రార్థనిష్ఠులు అనుభావము ధ్వనించును. ఈసందర్భమున తిరువాయ్ మొళ్ళి లోని''**నీరాయ్ నిలనాయ్**'' అనుదశకములోని ''**ఞాలత్తూడే**'' (3) అను పాశురమున అష్టాక్షరీమంత్రార్థము అనుసంధింపబడుట వంటి విశేషములు స్మరణీయములు.

7) **తా మాశ్రయామి కరుణాం వకుళాభిరామాం**
**యాஉసౌ పునర్వసుమతీ వలయేஉవతీర్ణా ।**
**ప్రజ్ఞాదృశోన్మిషితయా ప్రథితానుభావా**
**జ్యోతిః పరం యదనిదం తదిదం చకార ॥**

**ప్ర.అ.** - యా అసౌ = ఏ (నమ్మాళ్వార్లు అనెడి) ఈ కరుణామూర్తి, పునః వసుమతీవలయే = భూమండలమున, అవతీర్ణా = అవతరించినదై, ప్రథితానుభావా = గొప్ప ప్రసిద్ధిని పొందిన మహిమను కలిగినదై, ఉన్మిషితయా = బాగుగావికసించియున్న, ప్రజ్ఞాదృశా = జ్ఞాననేత్రముచే కూడ, యత్ = పరంజ్యోతిః = ఏ పరంజ్యోతి, అనిదం = ఇది అని చూచుటకు సాధ్యముకానిదై యున్నదో, దానిని, తత్+ ఇదం = అది ఇది అని దర్శించుటకు సాధ్యమగునట్లు, చకార = చేసెనో, తాం = ఆ, వకుళాభిరామాం = నమ్మాళ్వార్లు అనుపేరును కల్గిన, కరుణాం = కరుణను, ఆశ్రయామి = ఆశ్రయించుచున్నాను.

**భావము :-** నమ్మాళ్వార్లను కరుణామూర్తిగా రూపించుట ఈశ్లోకములోని సారాంశము. నమ్మాళ్వార్లు అను రూపమున లోకమున అవతరించిన కరుణాదేవి గొప్ప ప్రసిద్ధినిపొందినదై, జ్ఞాననేత్రముద్వారా ఇదమిత్థమని దర్శించుటకు సాధ్యము కాని పరంజ్యోతిస్స్వరూపమును ఇట్టిదని అందఱును చూచుటకు వీలగునట్లు చేసెను. అట్టి కరుణామూర్తిని నేను ఆశ్రయింతును.

"కుర్వంతి అధీన మనయా ఇతి కరుణా" అను వ్యుత్పత్తిని గల కరుణాశబ్దమిచట ప్రయోగింపబడుట మిక్కిలి తగినది. ఆళ్వార్ల కరుణ మిక్కిలి గొప్పది. మధురకవులు "అరుళ్ కొణ్డాడుమ్ అడియ వరిన్బుఱ, అరుళినాన్ అవ్వరు మఱైయిన్ పొరుళ్, అరుళ్కొణ్డు ఆయిరమ్ ఇన్దమిళ్ పాడినాన్ అరుళ్కణ్డీ రివ్వులకినిల్ మిక్కదే" అనుచు నమ్మాళ్వార్ల కరుణావైభవమును కీర్తించిరి. ఇచట కవి సాక్షాత్తు కరుణగానే రూపించిరి. ఇందుచే ఆళ్వార్ల కరుణ అప్రమేయమని తాత్పర్యము. పెరియతిరువన్దాది దివ్యప్రబంధమున "ఎన్దైనుమ్ కట్కణ్ణాల్ కాణాద వవ్వురువై నెఞ్జెన్ను ముట్కణ్ణేల్ కాణు ముణర్న్దు" అని పల్కుటనుబట్టి "ప్రజ్ఞాదృశోన్మిషితయా దృశా" అని తెలుపబడినది. "న చక్షుషా పశ్యతి కశ్చనైనమ్" అనుచువేదములు భగవత్స్వరూపము బాహ్యచక్షువులకు గోచరము కాదని పల్కినది కదా! "ఇదమః ప్రత్యక్షగతం సమీపతరవర్తి చైతదోరూపమ్, అదసస్తు విప్రకృష్టం, తదితి పరోక్షే విజానీయాత్" అను ప్రమాణవచనమును బట్టి "ఇదం" అనుప్రయోగము ప్రత్యక్షవిషయమును చెప్పునది అగుటచే, "అనిదం" అనుట పరోక్షవిషయమును సూచించును. కనులకు కనపడునట్లు తానున్నచో జీవులు తనకు విముఖులగు దురేమో? అని తలచిన పరంజ్యోతి అగు భగవానుడు జీవునిలో కంటికి కనపడకుండ అంతరాత్మయై దాగియుండును. అట్టి పరమాత్మ యొక్క జ్యోతిస్స్వరూపమును కన్నులార ఆనందముగా దర్శించిన వారు కదా ఆళ్వార్లు. రెండవ పాదమున పునర్వసు అను నక్షత్రము సూచితము.

**8 )** **రచితవతి రమాయా నాయకస్యాంఘ్రి పుష్యత్ -**
**ప్రణయరససుధాబ్ధిస్రోతసి స్వైరగాహమ్ ।**
**ప్రభవతి కలిఘర్మప్రావృషేణ్యాంబువాహే**
**వకుళధరమునీంద్రే తాపవార్తా కథం నః ॥**

ప్ర.అ - రమాయాః నాయకస్య = శ్రియః పతియొక్క, అంఘ్రి = పాదములయందు, పుష్యత్ = అభివృద్ధిచెందుచున్న, ప్రణయరస = భక్తి రసము అను, సుధ+ అబ్ధి = అమృత సముద్రముయొక్క, స్రోతసి = ప్రవాహమునందు, స్వైరగాహమ్ = యథేచ్ఛముగా స్నానమును, రచితవతి = చేసియున్న, కలిఘర్మ = కలిపురుషునివలన కల్గు సంతాపమును పోగొట్టు కల్గిన, ప్రావృషేణ్య = వర్షకాలమునందలి, అంబువాహే = మేఘమువలెనున్న, వకుళధరముని+ ఇంద్రే = నమ్మాళ్వార్లు, ప్రభవతి (సతి) = అవతరించియుండగా, నః = మనకు, తాపవార్తా = తాపముయొక్క మాట, కథం = ఎట్లు ఉండును?

**భావము :-** ఈ శ్లోకమున కవి నమ్మాళ్వార్లను వర్షకాలమేఘముతో పోల్చుచు, 'ఆళ్వార్" అనుపదముయొక్క నిర్వచనము పరోక్షముగా తెలుపుచున్నారు.

శ్రియఃపతియొక్క పాదములయందు దినదినాభివృద్ధిని చెందు భక్తిరసము అను అమృతసముద్రమున యథేచ్ఛగా అవగాహనమును చేసినవారు, వర్షకాలమేఘమువలెచల్లగా (శయను) వర్షించువారగు నమ్మాళ్వార్లు అవతరించిన పిదప మనకు తాపము కల్గుటకు అవకాశము లేదు.

"ఆళ్వార్" అను తమిళపదమునకు మునుగువారు అని అర్థము. ఇందు శఠకోపులను భగవద్భక్తి అను అమృత సముద్రముప్రవాహమున అవగాహించిన వారని వర్ణించుటద్వారా వారికి 'ఆళ్వార్లు' అనుసంజ్ఞను కల్గినందులకు తగిన హేతువును కవి తెలియజేసిరి. "కణ్ణ వాఱ్ఱాల్ తనదే ఉలకెన నిన్ఱాన్ తన్నై, వణ్ణమిళ్గ్ మాఱ్ఱానేన్ అడియార్కళ్ మారియే" అని తాము భగవానుని పట్ల అనుసంధించె నట్లు నమ్మాళ్వార్లు వర్షకాలమేఘము వంటివారు. మేఘము సముద్రమున దిగి, అందలి నీటిని గ్రహించును. "ఆళియుళ్ పుక్కు ముకన్దు కొడు ఆర్త్తేఱి" అని గోదాదేవి తిరుప్పావైలో పల్కిరికదా! అట్లే ఆళ్వార్లు అను వార్షుకమేఘము అను అమృత సముద్రమున అవగాహించును. ఇచట భగవద్భక్తిని (అమృత) సముద్రముతో పోల్చుటకనుగుణముగా "కాదల్ కడల్ పురైయ విళైవిత్త", "కాదల్ కడలిల్ మికప్పెరిదాల్" వంటి సూక్తులు స్మరణీయములు. "ఆళ్వార్" అనుపదము వర్తమానార్థకమును సూచించునది అగుటచే అందులకు అనుగుణముగ "పుష్యత్" అను శతృప్రత్యయాంతము శ్లోకమున ప్రయయోగింప బడినది. లోకములోని మేఘములు లవణరసముతోనిండిన సముద్రమున అవగాహింపగా, నమ్మాళ్వార్లు అను మేఘము (భక్తి అను) అమృత సముద్రప్రవాహమున అవగాహించెను. ఇచట "ప్రణయరస" శబ్దముచే భక్తి ఉపలక్షింప బడినది. పరాంకుశనాయికా సమాధితో భగవానుని ఆళ్వార్లు స్తుతించిరి. భక్తిః శృంగారవృత్యా పరిణమతి" అని దేశికులు వచించిరి కదా ! లోకములోని కాలమేఘము శరీరతాపమును మాత్రము తీర్చగల్గును. కాని ఆళ్వార్లు అను వార్షుకమేఘము కలిప్రభావము వలన కల్గిన తాపమును కూడపోగొట్టగలదు. ఇట్లు లౌకికమేఘముకంటె ఆళ్వార్లు అను మేఘముయొక్క ఆధిక్యము ఇచట సూచితము. అందువలన ఇచట వ్యతిరేకాలంకారధ్వని కలదు. 'పుష్యత్' అనుపదముచే ఈ శ్లోకమున పుష్యమీ నక్షత్రము సూచింపబడినది. ఈశ్లోకభావమునకు, "లక్ష్మీనాథాఖ్యసింధౌ శఠరిపుజలదః ప్రాప్య కారుణ్యనీరం" అను ప్రసిద్ధశ్లోకభావమునకు కల సామ్యము గమనింపతగినది.

9) నమజ్జనస్య చిత్తభిత్తిభక్తిచిత్రతూలికా
భవాహివీర్యభంజనే నరేంద్రమంత్రయంత్రణా ।
ప్రపన్నలోకకైరవప్రసన్నచారుచంద్రికా
శఠారిహస్తముద్రికా హఠా ద్ధునోతు మే తమః ॥

ఈ శ్లోకము పరాంకుశాష్టకమున (9) వ్యాఖ్యానింపబడినది.

రెండవ పాదమున 'అహి' శబ్దము ద్వారా ఆశ్లేషానక్షత్రము అర్థాత్ సూచింపబడినది. "ఆశ్రేషా నక్షత్రం సర్పాదేవతా" అనువేద వాక్యము వలన ఆశ్రేషా నక్షత్రము సర్పదేవతాక మని తెలియుచున్నది. అధిదైవతమును నిర్దేశించుట ద్వారా ఆ నక్షత్రమును సూచించు పద్ధతి ఇచట పాటింపబడినది. ఇట్లే 17 వ శ్లోకమున అనూరాధా నక్షత్రము సూచింపబడినది. వృత్తము

పంచచామరము. గురులఘువులు ఒకదాని పిమ్మటవేరొకటి ఉపయోగింపబడిన ఈవృత్తము నడక అతివిలక్షణమైనది, శ్రుతిసుభగమైనది. తమిళభాషలో కల ఇట్టి వృత్తముల ప్రయోగము తిరుమళిశైయాళ్వార్లచే రచింపబడిన "తిరుచ్చంద విరుత్తం" మను ప్రబంధమున కానవచ్చును.

**10)** **మనఃస్ఫటికదర్పణప్రతిఫలత్పరబ్రహ్మణః**
**ప్రదర్శన మివా చరన్ ప్రథితబోధముద్రాంకితః ।**
**సదా మభయశంసితా భవభయాభితప్తాత్మనా-**
**మఘాని శమయేత నః శఠరిపో రవామః కరః ॥**

ప్ర. అ - మనః = మనస్సు అనెడి, స్ఫటికదర్పణ = స్ఫటికమయదర్పణమునందు, ప్రతిఫలత్ = ప్రతిబింబించుచున్న, పరబ్రహ్మణః = పరమాత్మయొక్క, ప్రదర్శనం = ప్రదర్శనమును, ఆచరన్ ఇవ = చూపించునదివలె నున్నది, ప్రథిత = ప్రసిద్ధమైన, బోధముద్రా = జ్ఞానముద్రచే, అభితప్త = మిక్కిలి తపింపచేయబడిన, ఆత్మనాం = మనస్సును కల్గినవారికి, సదా = ఎల్లప్పుడు, అభయశంసితా= అభయమునిచ్చునది అగు, శఠరిపోః = నమ్మాళ్వార్లయొక్క, అవామః కరః = కుడిచేయి, నః = మనయొక్క, అఘాని = పాపములను, శమయేత = పోగొట్టును గాక!

**భావము** :- పూర్వశ్లోకమున ఆళ్వార్ల హస్తముద్ర వర్ణింపబడగా, ఇందు అట్టి ముద్రచే శోభిల్లు దక్షిణహస్తము కీర్తింపబడుచున్నది. పరమాచార్యులగు నమ్మాళ్వార్లు అన్నిచోట్ల జ్ఞానముద్రతో వెలసియుండుటను దర్శింపవచ్చును. ఆ చేయి హృదయమును స్పృశించుచున్నట్లుండుటకు ఒక హేతువును కవి ఉత్ప్రేక్షించుట ఇందలి విశేషము.

స్ఫటికదర్పణమువలె స్వచ్ఛమైన తమ మనస్సులో ప్రతిఫలించు భగవానుని దివ్య మంగళరూపమును భక్తులకు చూపించు చున్నట్లు, జ్ఞానముద్రతో కూడుకొని, హృదయమును తాకుచున్న ఆళ్వార్ల హస్తము ప్రకాశించుచున్నది. సంసారభయముచే మిక్కిలి పరితపించు భక్తులకు అభయ ప్రదానమును చేయగల్గిన ఆ హస్తము మన పాపములను పోగొట్టును గాక!

ఆళ్వార్లహస్తమునయున్నది జ్ఞానముద్రయే కాని, అభయముద్రచకాదుకదా! అట్లయిన "ప్రథితబోధముద్రా" అనుట ఎట్లు పొసగును? అనినచో జ్ఞానముద్ర అభయముద్రను చేయుపనిని అనగా అభయమిచ్చుటను చేయును కావున అట్లు పల్కుటలో విప్రతిపత్తి లేదు. అనగా భక్తులకు స్వరూపజ్ఞానమును కల్గించుటద్వారా సంసారభయమును పోగొట్టునని తాత్పర్యము. తిరువాయ్ మొళిలోని "**వెళ్లైచ్చురిశఙ్గొడాழி యేన్ది తామరైక్కణ్ణ నెన్నెఞ్జినోడే, పుళ్లైక్కడాకిన్ఱ వాఱై క్కాణీర్**" అనుచు తమహృదమునగల భగవానుని స్వరూపమును గూర్చి భక్తులకు తెలుపుట ఇచట స్మరణీయము.

నాల్గవ పాదమున మఘానక్షత్రము సూచింపబడినది. "**మఘా**" అని కొందఱు ఈ

శబ్దమును తలచినను అదిసరికాదు. వేదమున పలుచోట్ల ''మఘా'' అనియే యుండుటచే ఆ రూపమే సాధువు అని శ్రీ. ప్ర. భ అణ్ణాస్వామి వివరించిరి. వృత్తము పృథ్వీ.

11) రమయతు శఠశత్రు రత్యున్నతాచారయుక్తై ర్జనై-
రవనతపదపద్మయుగ్మోఽనుకంపామృతాంభోనిధిః ।
బహువిధకృతపూర్వఫల్గున్యగాచారచింతాకులం
హృదయ మసదృశాత్మపాదారవిందానుషంగా న్మమ ॥

ప్ర.అ - అతి+ ఉన్నత = మిక్కిలి గొప్పదైన, ఆచార = ప్రవర్తనతో, యుక్తైః = కూడుకొనియున్న, జనైః = జనులచే, అవనత = నమస్కరింపబడిన, పదపద్మయుగ్మః = పాదములను పద్మముల జంటను కల్గిన వారు, అనుకంపా = దయ అను, అమృత+ అంభోనిధిః = అమృతరసమునకు సముద్రమువంటి వారు అగు, శఠశత్రుః = నమ్మాళ్వార్లు, బహువిధ = పలువిధములుగా, కృత పూర్వ = పూర్వజన్మలయందు చేయబడిన, ఫల్గున్యక్+ ఆచార = అసారములైన, అతినీచములైన వ్యాపారములచే కల్గిన, చింతా = బాధతో, ఆకులం = కలతను చెందియున్న, మమ = నాయొక్క, హృదయం = మనస్సును, అసదృశ = అసమానమైన, ఆత్మ = తమయొక్క, పాద+ అరవిన్ద = పాదపద్మములయొక్క, అనుషంగాత్ = సంబంధముచే, రమయతు = సంతోషింపచేయునుగాక!

**భావము** :- గొప్ప అనుష్ఠానమును కల్గిన మహనీయులచే నమస్కరింపబడు పాదపద్మములను కల్గినవారు, దయాసముద్రులు అగు నమ్మాళ్వార్లు పూర్వజన్మలో చేసిన పలు విధములైన పాపముల వలన మిక్కిలి కలతచెందిన నా మనస్సును సాటి లేని తన పాదములు అను అరవిందములతో సంబంధమును కల్గించుట ద్వారా రంజిల్లచేయుదురు గాక!

''**అత్యున్నతాచారయుక్తైః జనైః అవనతపదపద్మయుగ్మః**'' అనునపుడు ''**అత్యున్నతాచార, అవనతపద**'' అను పదములచే తాత్కాలికమైన విరోధస్ఫూర్తి కల్గుటచే విరోధాలంకారము ధ్వనించుచున్నది. భాగవత ప్రావణ్యము అను అత్యున్నతమైన ఆచారమును కల్గిన మహనీయులచే నమస్కరింప బడిన పాదపద్మములను కలవారు అనుటచే ఆ విరోధము పరిహృతము. సరస్సులోని నీటికి తామరలవలన అందము, ప్రసన్నత కల్గునట్లే, తమ మనస్సునకు ఆళ్వార్ల పాదారవిందసంబంధమువలన సంతోషము కల్గునుగాక అనుటచే కవిహృదయమునకు సరస్సుతో సామ్యము అర్థవశమున ధ్వనించుచున్నదని చెప్పవచ్చును. ''**అసదృశాత్మపాదారవింద**'' అను నపుడు '**అసదృశ**' అనువిశేషణమును పాదారవిందములకు అన్వయించుట వలన ''**కట్టురైక్కిల్ తామరైనిన్ కణ్పాదమ్ కై యొవ్వా**'' అను ఆళ్వార్లసూక్తిని వారివిషయమున అనుసంధించినట్లు భాసించును. ''**అనుషంగ**'' పదమునకు అన్వయించుటవలన ఆళ్వార్ల పాదసంబంధముయొక్క వైభవము తెలియుచున్నది.

శ్లోకమున అత్యున్నతాచార మనగా భాగవత ప్రావణ్యమని చెప్పనగును. భగవచ్ఛేషత్వము కన్న భాగవతశేషత్వమునకు మన పూర్వాచార్యు లందఱును ప్రాధాన్యము నిచ్చిరి. ఆళ్వార్ల పాదములకు నమస్కరించినవారు కావుననే వారు అత్యున్నతమైన ఆచారమును కలవారని చెప్పవచ్చును. మధురకవులవంటివారు అట్టివారు. 'మేవినేన్ అవన్ పొన్నడి మెయ్మ్మైయే'' అని వారే స్వయముగా పల్కిరి. ''అఱుతొ ఝ్రిల్ అన్దణర్ వణఙ్గుమ్ తన్మైయన్'' అనుచు ఆళ్వార్లు గొప్ప అనుష్ఠానమును కల్గిన విప్రులు నమస్కరించు పాద పద్మములను కల్గిన వానినిగా భగవానుని కీర్తించిరి. ఆ భావము ఇచట కవిచే నమ్మాళ్వార్ల విషయమున అన్వయింపబడినది. ''అనుకంపామృతాంభోనిధిః'' అనుటకు ''అరుళ్కణ్డీర్ ఇవ్వులకినిల్ మిక్కదే'' వంటి సూక్తులు స్మరణీయములు. మూడవ పాదమున ''పూర్వఫల్గున్యగాచార'' అనునపుడు పూర్వఫల్గునీ నక్షత్రము సూచితము. ''మమ హృదయం రమయతు'' అనునపుడు ''రము- క్రీడాయాం'' అను ధాత్వర్థమునుబట్టి నాహృదయమున క్రీడించును గాక, తద్ద్వారా సంతోషింప చేయునుగాక అను భావము ధ్వనించుచున్నది.

**12)** మగ్నం మానస మా స్మ భూ శ్శఠరిపో రవ్యాజసిద్ధా కృపా
నౌకా కాచన నావికోఽపి స పున స్సంతారక గ్రామణీః ।
ఏతేనోత్తరఫల్గునీరసపరిక్లిష్టోపభోగోర్మికం
దుఃఖావర్తదురంతపారగమనం సంసారవారాకరమ్ ॥

**ప్ర.అ.** - మానస = ఓ మనస్సా!, మగ్నం మా స్మ భూః = సంసారమున మునిగిన దానివి కాకుము, శఠరిపోః = నమ్మాళ్వార్ల యొక్క, అవ్యాజసిద్ధా = సహజమైన, దయా = దయ అను, కాచన = అద్వితీయమైన, నౌకా = నావ, సంతారకగ్రామణీః = ఆ ఓడను నడపు నావికశ్రేష్ఠుడు, అపి= కూడ, స ( ఏవ) = అతడే, ఫల్గునీరస = అల్పరసములచే, పరిక్లిష్ట = దుఃఖములతోనిండినవి అగు, ఉపభోగ = విషయభోగములు అను, ఊర్మికమ్ = కెరటములను కల్గినది, దుఃఖ+ ఆవర్త = దుఃఖములను సుడులచే, దురంతపారగమనం = ఒడ్డును చేరుటకు సాధ్యము కానిది అగు సంసారవారాకరమ్ = సంసారసముద్రమును, ఏతేన = నమ్మాళ్వార్ల సహాయముచే, ఉత్తర= దాటుము.

**భావము** :- ఆళ్వార్ల అవ్యాజమైన కృపను నావగా, వారిని గొప్ప నావికునిగా రూపించుచు, కవి తమ మనస్సును సంబోధించుచు పల్కుట ఈశ్లోకములోని విశేషము.

ఓ మనసా! నీవు సంసారసముద్రమున మునిగి నశింపవలసిన పనిలేదు. నమ్మాళ్వార్ల సహజమైన కృప ఒకగొప్ప నావ. ఆ నావను నడపు నావిక శ్రేష్ఠుడు ఆళ్వార్లే. అత్యల్పసుఖమును ఇచ్చు లౌకికభోగములు అను కెరటములతో కూడినది, దుఃఖములు అను సుడులతో కూడినది, అంతము లేనిదగు సంసారసముద్రమును నీవు ఆళ్వార్లు అను నావికుని సహాయముచే దాటగలవు. చింతింపకుము.

ముకుందమాలలో కులశేఖరులు ''**తృష్ణాతోయే . . . సంసారాఖ్యే మహతి జలధౌ మజ్జతాం నః . . . పాదాంభోజే వరద భవతో భక్తినావం ప్రయచ్ఛ**''*(14)* అనుచు సంసారమును సముద్రముగా, విష్ణుభక్తిని నావగా రూపించిరి. దయాశతకమున ''**భవజలధిగతానాం పోతపాత్రీ భవిత్రీ**'' *(38)* అనుచు భగవానుని దయను పోతముగా దేశికులు వర్ణించిరి. ఇట్టి భావమే కవిచే ప్రస్తుతశ్లోకమున అనుసంధింపబడినది. సముద్రమున కెరటములు ప్రతిక్షణము పుట్టుచునే ఉండును. అట్లే మనస్సున విషయవాంఛలు ఎప్పటికప్పుడు కల్గుచునే ఉండును. కావున వానిని కెరటములతో రూపించుట తగినది.

''**భవజలధి మగాధం . . నిస్తరేయం కథ మితి చేతో మా స్మ గాః కాతరత్వమ్**'' అను *(13)* ముకుంధమాలశ్లోకమునకు, ప్రస్తుత శ్లోకమునకు గల అర్థసామ్యము గమనింప తగినది. మొదటి పాదమున చివర ''దయా'' అనుటకు ''కృపా'' అని, నాల్గవ పాదమున ''అనంతపారగమనం'' అనియు పాఠాంతరములు కలవు. మూడవపాదమున ఉత్తరఫల్గుని సూచితము.

**13)** **రత్నదీపికాయమానహస్తముద్రికాకృతత్రయీగిరీంద్ర -**
**కందరాంతరాళగాఢరూఢరూఢిమన్నిధానసూచనేన ।**
**ద్రావిడాగమోపగీతిమూలసేకశతవీతనిద్రపత్ర -**
**దివ్యతింత్రిణీసమీపగేన నాథవా నహం పరాంకుశేన ॥**

**ప్ర.అ.** - రత్నదీపికాయమాన = రత్నదీపికవలెనున్న, హస్తముద్రికా = హస్తముద్రచే, కృత = చేయబడిన, త్రయీ = వేదమనెడి, గిరి+ ఇంద్ర = గొప్ప పర్వతముయొక్క, కందర = గుహలో, అంతర్భాగమున, గాఢ = బాగాలోపల, రూఢరూఢిమత్ = మఱుగుపఱుపబడిన, నిధాన = నిధి యగు భగవానుని, సూచనేన = సూచించువారు, ద్రావిడ+ ఆగమ+ ఉపగీతి = ద్రావిడ వేదములు అగు దివ్య ప్రబంధములయొక్క గానముచే, మూల = మూల దేశమున, సేక = తడపుటచే, శీత = చల్లనిది, వీతనిద్ర = తొలగిన నిద్రను కల్గిన, పత్ర = ఆకులను కల్గినదగు, దివ్య = గొప్పదైన, తింత్రిణీ = చింత చెట్టుయొక్క, సమీపగేన = సమీపముననున్నవారును అగు, పరాంకుశేన = నమ్మాళ్వార్లచే, అహం = నేను, నాథవాన్ = దిక్కును కల్గిన వాడనైతిని.

**భావము :-** శ్రీదేశికులు యతిరాజసప్తతి ప్రారంభమున ''**నాథేన మునినా తేన భవేయం నాథవా నహమ్**'' అని పల్కినట్లే ఇచటకవి ''పరాంకుశేన నాథవా నహం'' అనిరి. ఇచటి తృతీయావిభక్తికి అభేదమును అర్థముగా గ్రహించిన (''**ధాన్యేన ధనవాన్**'' అనునపుడువలె) పరాంకుశ రూపములోనున్న నాథుని కల్గినవాడనైతిని అను అర్థమును చెప్పనగును. పూర్వార్థ మంతయు కలిపి ఒకే సమాసము. ఆళ్వార్లకు విశేషణము.

రత్నదీపికవలె తోచు తమహస్తముద్రతో నమ్మాళ్వార్లు వేదములు అను గొప్ప పర్వతము యొక్క గుహలో లోలోపల గుప్తముగా, సామాన్యులకు కనుపింపకుండనున్న నిధి అగు సర్వేశ్వరుని అందఱకు కన్పించునట్లు చేయుచున్నారు. వారిదివ్య ప్రబంధముల గానమను తీర్థసేచనము వలన వారు నివసించు తింత్రిణీవృక్షము చల్లనిది, నిదురింపని ఆకులను కల్గినది అయినది. ఇట్టి ఆళ్వార్లను నేను ఆశ్రయించి, దిక్కును కల్గిన వాడనైతిని

భట్టరు శ్రీరంగరాజస్తవ పూర్వశతకమున చంద్రపుష్కరిణీ తీరమునగల పున్నాగ వృక్షమును ప్రస్తుతించుచు ''పున్నాగతల్లజ మజస్రసహస్రగీతిసేకోత్థదివ్యనిజసౌరభం'' అని పల్కుట ఇచట స్మరణీయము. ఆళ్వార్ల ప్రబంధగానములు తీర్థసేచనములు వంటివనుటకు ''తీర్థజ్ఞళాయిరత్తుళ్'' అను తిరువాయ్ మొళ్ళి శ్రీసూక్తి ఉదాహార్యము నమ్మాళ్వార్లు తాము అవతరించినపిమ్మట లోకరీతిని వీడి, ఊరికి బయటనున్న చింతచెట్టు క్రింద యోగసమాధిలో కాలము గడపిరి. పిమ్మట తమశిష్యులగు మధురకవులకు దివ్య ప్రబంధములను అనుగ్రహించిరను చరిత్ర ఇచట అనుసంధేయము. ఆ చింతచెట్టు ఆకులు సహజముగా ముడుచు కొనవు. ''ఉఱజ్గాప్పుళి'' ... ప్రసిద్ధి దానికికలదు. అందులకు కారణమును కవి ఉత్ప్రేక్షించుట ఇచటి విశేషము. వేదములను గొప్పపర్వతములుగా వర్ణించుట కవి సమయము. 'వేదోత్తంసగుహావిహార'' ఇత్యాది ప్రయోగములు ఇచట స్మరణీయములు. పర్వతగుహలలో పగలు కూడ గాఢాంధకారము వ్యాపించియుండుటచే అచట గల నిధిని చూచుటకు ఎవరికిని సాధ్యపడదు. అందులకొక దీపము అవసరము కదా! 'వేదైశ్చ సర్వై రహ మేవవేద్యః'', ''సర్వేవేదా యత్పద మామనంతి'', ఇత్యాదిగా సకలవేదప్రతిపాద్యుడు భగవానుడే. ఆ భగవానుని ఆళ్వార్లు పలువురు 'వైత్తమానిది'', ''నిదియినై'' అనుమొదలుగా గలసూక్తులతో గుప్త నిధిగా పల్కిరి. కావున కవి ఇచట భగవానుని వేదపర్వతగుహాంతరాళములోనున్న నిధిగా పేర్కొనెను. ఆ నిధిని ఆళ్వార్లు తమ జ్ఞానముద్ర అను రత్నదీపముతో అందఱకు కన్పించునట్లు చేయుచున్నారు. అనగా తమదివ్య ప్రబంధములద్వారా వేద ప్రతిపాద్యమగు పరమాత్మతత్త్వమును అందఱకు సుస్పష్టముగా తెలియునట్లు చేసిరని తాత్పర్యము. జ్ఞానముద్రకు, దీపకళికకును ఆకారమున కూడ సామ్యముండుట గమనింపతగినది. మొదటి పాదమున'హస్త' అను నక్షత్రము సూచింపబడినది.

14) సత్యా న త్యాగకారీ క్షణ మపి చిదచిత్త్రాయకా మేయకామే
ఛందశ్ఛందస్స్వరూపే మహసి కమలయా భాసమానేఽసమానే ।
శ్రేయ శ్శ్రేయస్స్వసంస్థైః పరిచయసురభిః కైసరాణాం సరాణాం
పాతాత్ పాతా దివాబ్ధౌ శఠరిపు రిహ నో వీక్షణేన క్షణేన ॥

ప్ర.అ - చిత్+అచిత్+త్రాయక = చిదచిత్తులను (చేతనాచేతనములను) రక్షించు, అమేయకామే = అపరిమితమైన ఆశను కల్గినదై, ఛందః+ఛందస్స్వరూపే = వేదముల ఆశయరూపమై, కమలయా=

లక్ష్మీదేవితో, భాసమానే = ప్రకాశించునదియై, అసమానే = సరిలేని, మహసి = దివ్యజ్యోతి అగు భగవానుని యందు, క్షణం+ అపి = ఒక్క క్షణకాలము కూడ, నత్యాః = నమస్కారమును, న త్యాగకారీ = విడువని వారు (ఎల్లప్పుడు నమస్కరించు వారు), శ్రేయస్విసంఘైః = శ్రేయస్సును పొందిన భక్తజనులసమూహముచే, శ్రేయః = ఆ శ్రయింపతగినవారై, కైసరాణాం = కేసరపుష్పములకు సంబంధించిన, సరాణాం = మాలికలయొక్క, పరిచయ = సంబంధముచే, సురభిః = సుగంధమును కల్గినవారైన, శఠరిపుః = నమ్మాళ్వార్లు, క్షణేన వీక్షణేన = ఒక క్షణకాలము వీక్షించుటచే, నః = మనలను, భవ+ అబ్ధౌ = సంసార సముద్రమున, పాతాత్ = పడుటనుండి, పాతాత్ = రక్షింతురుగాక!

**భావము :-** చేతనాచేతన రూపమైన జగత్తును రక్షించుటయందు అనిర్వచనీయమైన అభినివేశమును కలవారును, వేదములచే ప్రతిపాద్యులును, ఎల్లప్పుడు లక్ష్మీదేవితో ప్రకాశించు వారును, అసమాన జ్యోతిః స్వరూపుడగు భగవానునకు నిరతము నమస్కరించువారు, భగవానుని నిత్యకైంకర్యమను సంపదను కల్గియున్న భక్తులకు ప్రాప్యులును, వకుళమాలికలచే అలంకరింపబడుటచే అపూర్వసువాసనను కల్గినవారును అగు నమ్మాళ్వార్లు మనలను క్షణకాలము వీక్షించుట ద్వారా సంసారసము ద్రమున పడకుండ రక్షింతురుగాక!

''అనిర్విణ్ణః'' అనుసహస్ర నామములోని ఒక నామమును వ్యాఖ్యానించుచు భట్టరు **''ఏవం సృష్ట్యాదేః తత్తదిష్టదానస్య చ అసకృత్ ప్రయుక్తస్యాపి సంసారిషు విషయోన్మాదాత్ అసంముఖీనేషు వైఫల్యేఽపి, పునః తత్తదావర్జన దురాశయా అనిర్విణ్ణః – అనలసః. అత ఏవహి అస్య అనాద్యంతో జగద్వ్యాపారః''**. అని పల్కిరి. అనగా, భగవానుడు సృష్ట్యాదినుండి జీవులకు వారు కోరిన ఆయాకోరికలను పలుమార్లు అనుగ్రహించినను, సంసారులు లౌకిక విషయములందలి మోహమువలన, భగవానుని పట్ల విముఖులై యుండుటచే, ఆ అనుగ్రహము విఫలమగును. అయినను, భగవానుడు నిరాశచెందక మరల వారిని రక్షింపవలెనను ఆశతో అనిర్విణ్ణుడై-అనగానిరాశచెందనివాడై మరల మరల ప్రయత్నించును. కావుననే భగవానుని జగద్వ్యాపారము (సృష్టిమొదలగు కార్యములు) ఆదియు, అంతమును లేనివి. ఇట్టి నిరుపమానమైన అభినివేశము జగద్రక్షణయందు భగవానునకు కలదు. కావున **''అమేయకామే''** అని పలుకబడినది. ఈ తృష్ణయే ఆళ్వార్లుగా రూపుదిద్దుకొన్నదనుచు భట్టరు **''కృష్ణతృష్ణా తత్త్వమివోదితం''** అనిపల్కిరి కదా! **''ఛందః ఛందస్స్వరూపే''** అనునపుడు మొదటగల **''ఛందస్''** అను సకారాంతశబ్దమునకు వేదమని అర్థము. రెండవది అగు అకారాంత శబ్దమునకు అభిప్రాయమని అర్థము. **వేదైశ్చ సర్వై రహ మేవ వేద్యః''** అని గీతాచార్యుడు స్వయముగా పల్కెను. **''కమలయా భాసమానే''** అనునపుడు **''శ్రద్ధయా దేవో దేవత్వ మశ్నుతే''**, **''అప్రమేయం హి తత్తేజః యస్య సా జనకాత్మజా''** వంటి ప్రమాణములు అనుసంధింపనగును. భగవానునిరూపము **''కుళ్లుమిత్తేవర్ కుళ్లా జ్గళ్ కైతొళ్లు చ్చోతి వెళ్లత్తిన్ళ్లే ఎళ్లుం వదోరురువు''** అనునట్లు అనిర్వచనీయమైన తేజోరూపము కావున **''అసమానే భాసమానే''**

అని వర్ణింపబడినది. ''శ్రేయస్వి'' అనగా శ్రేయస్సును కలవాడు అని అర్థము. భక్తులకు శ్రేయస్సు ఏమన భగవద్భాగవతభక్తియు, తత్ప్రయుక్తకైంకర్యాభినివేశమును. కావున శ్రేయస్వీశబ్దముచే భగవానుని పట్ల, ఆళ్వార్లపట్ల భక్తిని, సేవాభిలాషను కల్గిన మధురకవులు, శ్రీమన్నాథమునులు, యామునులవంటి వారు తెలుపబడుచున్నారు. ''శ్రయితుం యోగ్యాః - శ్రేయః'' - అనగా ఆశ్రయింపతగినవారు - ప్రాప్యులని తాత్పర్యము.

''క్షణేన వీక్షణేన'' అనుటచే ఆళ్వార్ల కటాక్షవైభవము (క్షణకాలము చూచుట ద్వారా అనుటచే) సూచింపబడినది. ఈసందర్భమున **''యం యం పశ్యతి చక్షుషా. . .స వై మోక్షార్థ చింతకః''** అను భగవానుని కటాక్షవీక్షణ ప్రభావమును తెలుపు ప్రమాణముయొక్క అర్థము ఆళ్వార్లపట్ల అనుసంధింపబడినది. ''పాతా త్పాతాత్'' అనునపుడుమొదటి **''పాతాత్''** రూపముఅను సుబంతము. క్రిందపడుట నుండి అని అర్థము. రెండవ రూపము ''పా- రక్షణే'' అనుధాతువునుండి లోట్ లకారమున పుట్టిన తిజంత రూపము. ''నత్యాగకారీ'' అనునపుడు నశబ్దముచే సమాసముచే యబడినది.

ఈశ్లోకము అష్టప్రాసమను శబ్దాలంకారమును కల్గియున్నది. ప్రతిపాదములో భిన్నభిన్నప్రాసలతో రమణీయమై ఒప్పుచున్నది. **''కైసరాణాం సురభి''** యగు ఆళ్వార్లను స్రగ్ధరావృత్తమున వర్ణించుట మిక్కిలి సముచితమైనది. మొదటిపాదమున**''చిత్రా''** నక్షత్రము సూచితము. నక్షత్రమాలిక అను ఈ స్తుతిలో నాయకమణిగా భాసించు ఈశ్లోకము స్రగ్ధర అగుటచేనామౌచిత్యమును కూడ కల్గియున్నది. ఇట్టినడకతో కొన్ని శ్లోకములు సుదర్శనశతకమున (27) కనుపించుచున్నవి.

ఆళ్వార్ల అవతారమును గూర్చి నిత్యులా, ముక్తులా? లేక ముముక్షువులా''. అను పలువిధములైన సంభావనలను పూర్వాచార్యులు (ఆచార్యహృదయము, పరాంకుశపంచవింశతి) చేసిరి. శ్వేతద్వీపనివాసులగు ముక్తుల లక్షణము ''**ముక్తానాం లక్షణంహ్యేతత్ శ్వేతద్వీపనివాసినామ్, బద్ధాంజలిపుటా హృష్టా నమ ఇత్యేవ వాదినః**'' అనుచుతెలుపబడుటచే, నిత్యము భగవానుని స్తుతిని విడువక చేయువారు ఆళ్వార్లు అను ప్రస్తుతశ్లోకములోని వర్ణన ఆళ్వార్లు ముక్తులలో ఒకరైయుందురను ఉత్ప్రేక్షను బలపఱచు చున్నట్లు తోచుచున్నది.

**15)** న ప్రపత్తివర్త్మనః ప్రవర్తనాపదానవాసనానుసారి
నవ్యపేతజలాశయాన్వయం కథం సమం సరోజమ్ ।
స్వాతికామియోగిబృందచిత్తపద్మబద్ధ సౌహృదానురక్త -
రూపయోః శఠారి పాదయో ర్యుగేన సన్నతార్తిభంజనేన ॥

**ప్ర.అ.** - సన్నత+ ఆర్తి = నమస్కరించిన వారియొక్క దుఃఖమును, భంజనేన = నశింపచేయునది, స్వ = తన యందు, అతికామి = మిక్కిలి భక్తిని కల్గిన, యోగిబృంద = యోగుల సమూహము

యొక్క, చిత్తపద్మ = (కావుననే) పద్మముల వంటి మనస్సులయందు, బద్ధసౌహృద = స్నేహమును కల్గినది, అనురక్త = అనురక్తమైన (మిక్కిలి ఎఱ్ఱనైన), రూపయోః = ఆకారమును కల్గినవి అగు శఠారిపాదయోః యుగేన = నమ్మాళ్వార్ల పాదముల జంటతో, న ప్రపత్తివర్త్మనః = ప్రపత్తిమార్గముయొక్క, ప్రవర్తన = ప్రవర్తించుట అను, అపదాన = చరిత్రముయొక్క, వాసనా = సంస్కారమును, (న) అనుసారి = అనుసరింపనిదై (లేనిదై), నవ్యపేత = తొలగని, సర్వదా = ఎల్లప్పుడు, జల(డ)+ ఆశయ = సరస్సుతో, అన్వయం = సంబంధమును కల్గియున్న, సరోజం= పద్మము, కథం = ఎట్లు, సమం = సరి అగును? (కాదని భావము)

**భావము :-** పద్మముల కంటె నమ్మాళ్వార్ల శ్రీపాదములకు కల ఆధిక్యమును విశిష్టమైన రీతిలో వర్ణించుట ఈ శ్లోకములోని సారాంశము.

ఆశ్రితుల దుఃఖమును పోగొట్టునవి, తనపట్ల గొప్ప భక్తిని కల యోగుల హృదయ పద్మములతో స్నేహమును కల్గినవి, అట్లు ఆస్నేహమును కల్గియుండుటను సూచించు ఎఱ్ఱని రంగును కల్గియున్నవి అగు నమ్మాళ్వార్ల శ్రీపాదములతో, ప్రపత్తిమార్గమును అనుసరించుట అను విషయసంస్కారమును లేశమైనను లేనివి, ఎల్లప్పుడు జడాశయములో (సరస్సుతో) సంబంధమును కల్గిన వగు పద్మములు ఎట్లు సమానములగును? కానేఱవు కదా!

ఈ శ్లోకము మొదలు *26*వ శ్లోకము వఱకు అనగా *13* శ్లోకములలో ఆళ్వార్ల దివ్యావయవ వర్ణనచేయబడుచున్నది. ఈ వర్ణన పాదాదిశిరః పర్యంతము చేయబడుచున్నది. దివ్యులవర్ణన పాదాదిగా చేయవలెనని ఆలంకారిక సమయము. ఇట్టి పద్ధతిని ముని వాహన సూరి అమలనాదిపిరాన్ ప్రబంధమున అనుసరించిరి. పూర్వార్ధమునగలరెండు విశేషణములు పద్మమున కు సంబంధించినవి. ఇవి రెండును ఆళ్వార్ల పాదములకు పద్మములతోగల సామ్యము అసంభావిత మనుటను తెలుపుచున్నవి. ఆళ్వార్ల పాదములు ప్రపత్తిమార్గ ప్రవర్తనమున సాటిలేనివి. అట్టివాసనయే లేనిది పద్మము. కావున సామ్యము పొసగదు. అట్లే, జడాశయాన్వయమును ఏ మాత్రము లేని నమ్మాళ్వార్ల పాదములతో నిత్యము జలా (డా) శయాన్వయమును కల్గిన పద్మము లెట్లు తులతూగును? రెండవ విశేషణమున అర్థచమత్కారము శ్లేషపై ఆధారపడినది. ఈ అర్థశ్లేషకు ''**లడయో రభేదః**'' అనుసంస్కృతన్యాయము మూలము. అనగా లకార డకారములకు అభేదము ఇచట వివక్షితము. అది ఎట్లనగా - జడాశయ పదమును లకారడకారముల అభేదమునుబట్టి జడాశయమని, జలాశయమని గ్రహింపనగును. మొదటిరూపమునకు జడమైన అనగా మందమైన బుద్ధినికల్గిన వారని బహువ్రీహిసమాసముచేసి, అర్థముచెప్పనగును. ఈ అర్థము ఆళ్వార్ల పక్షమున పాదమున అన్వయింపనగును. అనగా ఆళ్వార్లపాదములకు మందబుద్ధులతో అన్వయము లేదు అనగా సంబంధములేదని భావము. జలాశయమను రెండవ రూపమునకు జలమునకు ఆశయము, అనగా స్థానము అని అర్థము.

చెఱువు అని తాత్పర్యము. ఈ అర్థము పద్మము పక్షమున స్వీకరింపనగును. ఇందువలన పద్మము ఎల్లప్పుడు జలాశయమనబడు చెఱువులోనే ఉండునని భావము కల్గుచున్నది. ఇట్లు ఇచట అర్థచమత్కారమ్ముశ్లేషాలంకారమూలకము.

శ్లోకములోని ఉత్తరార్థములోని రెండు విశేషణములు ఆణ్డాళ్ల పాదములకు చెందినవి వీనిని ఆణ్డాళ్లపాదముల విషయమున యథాతథముగాను, పద్మము పక్షమున 'న' కారము యొక్క అర్థమును చేర్చియు అర్థానుసారముగా అన్వయింపవలెను ఆణ్డాళ్లపాదములు తమను కొలుచు యోగులయొక్క అనురాగభరితమైన హృదయములయందు ప్రేమతో నిలచి యుండుటచే, ఆ అనురాగప్రభావమువలన ఎఱ్ఱబడినవి. తామరకు ఎఱ్ఱదనము ఉన్నను అది ఈ కారణము వలన కల్గినది కాదు. ఆణ్డాళ్లపాదములు తమను భజించువారి ఆర్తిని తీర్పగలవు. ఇట్టి స్వభావము పద్మమునకు లేదు. కావున ఏ విధముగా చూచినను పద్మము ఆణ్డాళ్ల పాదములతో సరితూగలేదని తాత్పర్యము.

''స్వాతికామి ....'' అను విశేషణము యొక్క అర్థమునకు తగినట్లు భట్టరు శ్రీరంగ రాజస్తవ పూర్వశతకములోని ''**వందారుబృందారక మౌళిబృంద యుంజాన చేతః కమలాకరేభ్యః**'' అనుశ్లోకార్థము అనుసంధింపతగినది. కూరేశుల సుందరబాహుస్తవములోని ''**అదీర్ఘ మప్రేమదుఘం క్షణోజ్జ్వలం న చోర మంతఃకరణస్య పశ్యతామ్, అనుజ్జ మజ్జం ను కథం నిదర్శనం వనాద్రినాథస్య విశాలయోః దృశోః**'' అను శ్లోకము ఇచట స్మరణీయము. ఈ శ్లోకమున మూడవ పాదమున 'స్వాతి' అను నక్షత్రముయొక్క నామము సూచింపబడినది.

**16)** **నత్వా యాం కుసుమాయుధేషుధిరుచివ్యాఘాత మాతన్వతీం**
**శేముష్యా మహతా మహాయి తరుణీజంఘాసు జంఘాలతా ।**
**విస్తీర్ణచ్ఛవిశాఖయా శఠజితో వృత్తానుపూర్వీజుషా**
**జంఘాకల్పతరుశ్రియా సురభితం చింతావనం మామకమ్॥**

ప్ర.అ. - కుసుమ+ ఆయుధ = మన్మథునియొక్క, ఇషుధి = అంబులపొదియొక్క, రుచి = శోభకు, వ్యాఘాతం = భంగమును, ఆతన్వతీం = కల్గించుచున్నది అగు, యాం = (ఆణ్డాళ్లయొక్క) ఏ జంఘను, నత్వా = నమస్కరించి, మహతాం = గొప్పవారియొక్క, శేముష్యా= బుద్ధిచే, తరుణీజంఘాసు = స్త్రీల పిక్కల యందు, జంఘాలతా = పరుగుతీయుట, అహాయి = విడువ బడినదో, అట్టి, విస్తీర్ణ = విస్తరించియున్న, ఛవి = కాంతులు అను, శాఖయా= కొమ్మలను కల్గినది, వృత్త + అనుపూర్వీజుషా = వర్తులముగా (గుండ్రముగా) నున్న, శఠజితః = నమ్మాళ్వార్లయొక్క, జంఘా = పిక్కలనెడి, కల్పతరు = కల్పవృక్షముయొక్క, శ్రియా = శోభచే, మామకం = నా యొక్క, చింతా = చింత అను, వనం = వనము, సురభితం = పరిమళితము అయినది.

**భావము .** - ఈ శ్లోకమున ఆళ్వార్ల జంఘా సౌందర్యము వర్ణింపబడుచున్నది.

మన్మథుని అంబుల పొది కాంతికి భంగమును కల్గించునట్టి ఆళ్వార్ల జంఘలయొక్క సౌందర్యమును దర్శించిన మహనీయులకు లౌకికమైన, అల్పమైన తరుణుల జంఘాసౌందర్యము పట్ల ఆసక్తి కలుగదు. ఆజంఘలు గుండ్రనివై, విస్తరించిన కాంతులనెడి శాఖలను కల్గినవైన కల్ప తరువులవలె శోభిల్లుచున్నవి. ఆ జంఘాకల్పతరువులు నా ఆలోచనలు అను వనమును సురభితమును చేయుగాక! అనగా, సకలార్థములను అనుగ్రహించును గాక! అని తాత్పర్యము.

శ్లోకమున జంఘలను కల్పతరువులతో రూపణము చేసినందుల కనుగుణముగా, కాంతులను శాఖలతో కవి రూపించెను. శాఖాశబ్దమునకు పరంపర అనియు అర్థము చెప్పవచ్చును. వృక్షము వృత్తాకారమున నుండును. జంఘయు వృత్తానుపూర్వియై యున్నది **''వృత్తానుపూర్వే చ న చాతిదీర్ఘే''** అను కాళిదాససూక్తి ఇచట స్మరణీయము. కావున సామ్యము సిద్ధము. జంఘలను మన్మథుని అక్షయతూణీరములతో పోల్చుట కవి సమయము. ఎమ్బార్ జీయర్ ప్రణీతమైన ఉడైయవర్ తిరుమజ్జన కట్టియమ్ లోని **''మాఱనుక్కు దేవరీరుడైయ పదసరసిజవ్యాజేన కుసుమశరసహితమాక వమ్మైత్తువైత్త అమ్బురాత్తూణి కళ్‌పోల్ ఇణైత్తువైత్త కణైక్కాల్ కళుమ్''** అను సూక్త్యర్థ మిచట స్మరణీయము. **''అక ఇప్పడిప్పట్ట జంఘాకల్పక తరుశ్రీయాలే ఎన్నుళ్లమ్ ''నాఱునఱుమ్ పొళిల్'' ఆయి ప్రు ఎన్ను కూఱి నారాయి ప్రు''** అను శ్రీ ప్ర. భ. అణ్ణాస్వామి వ్యాఖ్యాన సూక్తి ఇచట ఉదాహార్యము. శ్లోకమున మూడవపాదమున విశాఖా నక్షత్రము సూచితము. **''అహోయి''** అను రూపము కర్మణి లుఙ్ ప్రయోగము.

**17)** **కనదవయవలోలశోభావదాతాపగాస్రోతస -**
**స్సముదితగురుబుద్బుదాకారసందేహసందాయినోః ।**
**కకుదధిగతమిత్రభావం స్వభావా ద్యుగం జానునోః**
**మమ హృది శఠవైరినామ్నో మునీశస్య సందీవ్యతు ॥**

**ప్ర. అ.** - కనత్ = మిక్కిలి అందమైన, అవయవ = దివ్యావయవములయందు, లోల = తళతళమని ప్రకాశించు, శోభా = (లావణ్య) శోభ అను, అవదాత = తెల్లని, ఆపగా = నదియొక్క, స్రోతసః = ప్రవాహమునుండి, సముదిత = పుట్టిన, గురు = పెద్దవైన, బుద్బుద + ఆకార = నీటి బుడగల రూపములా ఇవి అను, సందేహ = సందేహమును, సందాయినోః = కల్గించునట్టి, శఠవైరినామ్నః = శఠవైరి, అను పేరును కల్గిన, ముని + ఈశస్య = గొప్పముని అగు నమ్మాళ్వార్ల యొక్క, స్వభావాత్ = సహజగుణముచే, కకుద్ = ఎద్దుమూపురములతో, అధిగత = పొందిన, మిత్రభావం = స్నేహమును కల్గినవగు, జానునోః = మోకాళ్లయొక్క, యుగం = జంట, మమ హృది = నా హృదయమునందు, సందీవ్యతు = మిక్కిలి ప్రకాశించుగాక!

భావము :- ఇందు ఆళ్వార్ల మోకాలి సౌందర్యము వర్ణింపబడుచున్నది.

మిక్కిలి సుందరములగు ఆళ్వార్ల దివ్యావయవములలో తళతళమనిమెఱయు లావణ్యము లెల్లని నదీ ప్రవాహమువలె ఉన్నది. ఆ ప్రవాహములో పుట్టిన రెండు పెద్ద నీటి బుడగలా ఇవి ! అను సందేహమును మోకాళ్లు కల్గించుచున్నవి. సహజముగా ఎద్దుమూపురములవలెనున్న ఆమోకాళ్ల జంట నాహృదయమున ప్రకాశించును గాక!

శ్లోకమున ''**జానునోః యుగం**'' అని షష్ఠీవిభక్త్యంతముగా ఒకపదము, ప్రథమాంతముగా ఒకపదము ఉన్నందుల కనుగుణముగా ఒకవిశేషణము ''**సందేహసందాయినోః**'' అని షష్ఠ్యంతముగా, ''**మిత్రభావం**'' అని ప్రథమాంతముగా వేరొకవిశేషణమును ప్రయోగింపబడినవి. ''**కనదవయవ...**'' అనువిశేషణము ''**జానునోః**'' అనుపదముతో, ''**కకుదధిగత ...**'' అను విశేషణము ''**యుగం**'' అనుపదముతో అన్వయించును. ''**దివు**'' ధాతువు క్రీడాద్యనే కార్థకము. కావున ''**సందీవ్యతు**'' అనుటకు ''స్వైర విహారము చేయుగాక'' అను అర్థమును చెప్పవచ్చును. మొదటి పాదమున''**లోలదాభా**'' - అను పాఠాంతరము కలదు. అర్థభేదములేదు. కూరేశులు ''**లోలద్భిః ఇంద్రియ పశైః**'' అని శ్రీవైకుంఠస్తవమున ప్రయోగించుటచే''**లోలత్**'' అను శత్రంతరూపము కలదని తెలియనగును. మూడవ పాదమున ''మిత్ర'' శబ్దముచే అనూరాధా నక్షత్రము సూచింపబడినది. వేదమున''**అనూరాధా నక్షత్రం మిత్రో దేవతా**'' అని యుండుటచే ఆ నక్షత్రమునకు అధిదేవత సూర్యుడు. ఇట్లు అధిదేవతను తెలుపు పదముతో నక్షత్రమును సూచించు ప్రక్రియ 9వ శ్లోకమున (ఆ శ్లేషానక్షత్రమును సూచించునపుడు) పాటింపబడినది. జానువులను కకుదములతో పోల్చుటకు అనుగుణముగా కూరేశుల సుందరబాహుస్తవములోని ''**యౌవనవృషకకుదోద్భేదనిభం నితరాం భాతి విభో రుభయం జాను శుభాకృతికమ్**'' అను *(60)* శ్లోకమును, ''**జానునీ తే స్యా దు క్ష్ణో ర్వా కకుదయుగళం యౌవనైశ్వర్యనామ్నోః**'' *(57)* అను శ్లోకమును స్మరింపనగును.

**18)** **తులాసరణిసీమని ప్రథితరూపయా హస్తినాం**
**కరేణ కరభేణ వా కదలికాప్రకాండేన వా ।**
**తథోపరి చ పశ్యతాం నయనబంధనజ్యేష్ఠయా**
**చమత్కృతిమతీ మతిః శఠరిపూరులక్ష్మ్యా మమ ॥**

**ప్ర. అ.** - హస్తినాం = ఏనుగులయొక్క, కరేణ = తొండముతో, వా = లేక, కరభేణ = కరభమన బడు ముంజేతితో, వా = లేక, కదలికాప్రకాండేన = అందమైన అరటిబోదెతో, తులాసరణిసీమని= ఉపమించుపద్ధతిలో, ప్రథిత- రూపయా = ప్రసిద్ధిని పొందిన రూపమును కల్గినది, తథా = అట్లు, ఉపరి చ పశ్యతాం = పైన చూచువారి, నయన = చూపులను, బంధన = ఆకట్టుకొనుటలో,

జ్యేష్ఠయా = మొదటిదియు అగు, శఠరిపు = నమ్మాళ్వార్ల, ఊరు = తొడలయొక్క, లక్ష్మ = కాంతిచే, మమ = నాయొక్క, మతిః = బుద్ధి, చమత్కృతిమతీ = చమత్కారమును పొందినదైనది.

**భావము :-** ఆళ్వార్ల ఊరువుల సౌందర్యము ఈశ్లోకమున వర్ణ్యవిషయము. ఏనుగుల తొండముతో, కరభముతో, అరటిబోదెలతో ఉపమించుట యందు తగిన ప్రసిద్ధిని పొందినది, చూపరుల చూపులను ఆకట్టుకొనుటలో మొదటిది అగు నమ్మాళ్వార్ల ఊరుయుగము నామనస్సునకు అనిర్వచనీయమైన చమత్కారమును కల్గించినది.

ఊరువులను కరికరముతో, కరభముతో, కదళీకాండముతో ఉపమించుట కవిసమయము. ''ఊరు స్తు కరిహస్తేన కదల్యా కరభేణ చ'' అని అలంకారశేఖరకారుడు పల్కెను. ''నాగేంద్రహస్తాత్ త్వచి కర్కశత్వాత్ ఏకాంతశైత్యాత్ కదలీవిశేషాః'' అను కాళిదాససూక్తి ఇచట స్మరణీయము. ''మణిబంధా దాకనిష్ఠం కరస్య కరభో బహిః'' అను నిఘంటువచనమును బట్టి మణికట్టునుండి చిటికెన వేలువరకు చేతికి బయటగల భాగమునకు కరభమని పేరు. ''కందళితకదలీకాండ కరికరభఙ్గళై వెన్ఱు అగిపరుత్తు, నుణిశిఱుత్తు, మదుమదెన్ఱు మాంసలఙ్గళాయ్ విళఙ్గుకిన్ఱ'' అను ఉడైయవర్ అభిషేకగద్యలోని సూక్తి ఇచట అనుసంధేయము.

శ్లోకములోని పూర్వార్ధమున ఆళ్వార్ల ఊరువులకు కరికర, కరభ, కదలీకాండములతో సామ్యమును పల్కిన కవి, ఉత్తరార్ధమున ఆధిక్యము తెలుపుచున్నారు. ఆళ్వార్లు పద్మాసనోపవిష్టులైయున్నందున వారి ఊరువుల పైభాగమును మాత్రమే దర్శింప వీలగును. కాని, అంతమాత్రము కన్పించినను చూచువారి దృష్టిని ఆకర్షించుటలో అగ్రేసరములు ఆళ్వార్ల ఊరువులు అనుటద్వారా కవి వాని ఆధిక్యమును సూచించెను. శ్లోకములోని **''వా''** అనుపదమునకు ''లేక'' అని అర్థమునేకాక, ''మఱియు'' అను అర్థమును (సముచ్చయము) చెప్పవచ్చును. దీనివలన కరికర, కరభ, కదలీకాండముల అందమంతయు కలిపినచో ఆళ్వార్ల ఊరుసౌందర్యమునకు సమమగునేమో ! అను భావము ఆర్థికముగా ధ్వనించుచున్నది. మూడవ పాదము చివర జ్యేష్ఠానక్షత్రము సూచింపబడినది.

**19)** **మహః ప్రరోహమంజరీ మనోజ్ఞరత్నమేఖలా**
**కలాపపుష్పితాకటీతటీపటీ శఠద్విషః ।**
**ఉరః స్రవత్ప్రభాఝరీనిపాతనిమ్ననాభికా ఽ**
**వటోత్థఫేనమండలీవితర్క్యమూల మేవ నః ॥**

ప్ర.అ. - శఠద్విషః = నమ్మాళ్వార్లయొక్క, మహః = తేజస్సునుండి, ప్రరోహ = పుట్టిన, మంజరీ = మంజరిచే (గుత్తులచే), మనోజ్ఞ = అందమైన, రత్నమేఖలా = మణిమేఖలయొక్క, కలాప = కలాపముచే, పుష్పితా = పూచిన, కటీ = కట్టి ప్రదేశముయొక్క, తటీ = తట

ప్రదేశమునందలి, పటా = తెల్లని వస్త్రము, నః = మనకు, ఉరః = వక్షఃస్థలమునుండి, స్రవత్ = స్రవించుచున్న, ప్రభాఝురీ = కాంతి ప్రవాహముయొక్క, నిపాత = పతనముచే, నిమ్న = పల్లమైన, నాభికా+అవట+ ఉత్థ = బొడ్డు అనురంధ్రము నుండి పుట్టిన, ఫేనమండలీ = నురుగు సమూహముయొక్క, వితర్క = ఉత్ప్రేక్షకు, మూలం ఏవ = మూలకారణమే

**భావము** - నమ్మాళ్వార్ల కటిప్రదేశమున అలంకరింపబడిన వస్త్రమును అద్భుతముగా కవి సంభావించుచుట ఇందలి విశేషము.

నమ్మాళ్వార్ల తేజః పుంజములతో ఇనుమడించిన అందమును కల్గిన మణిమేఖలా కలాపముచే పూచినట్లున్న కటిప్రదేశమున అలంకరింపబడిన శ్వేతవస్త్రము, ఆళ్వార్ల వక్షఃస్థలము నుండి ప్రవహించిన కాంతిప్రవాహము వేగముగా క్రిందకు పడుటచే ఏర్పడిన నాభి అను పల్లపు ప్రదేశమునుండి ఉద్భవించిన నురుగు సమూహమా! అనునట్లు శోభిల్లుచున్నది

భట్టరు శ్రీరంగరాజస్తవమున ''**అన్యోన్యరంజకరుచో ఉనుపమానశోభాః దివ్యస్రగమ్బరపరిష్కరణాంగరాగాః . . . సంస్పర్శతః పులకితా ఇవ**'' *(85)* అనుచు పూమాలెలు, పీతాంబరము, అలంకరణములు, అంగరాగములును భగవానుని దివ్యదేహస్పర్శచే పులకించిన్నవై అధికాధికశోభను పొందినవనిరి. ప్రతివాదిభయంకరం అణ్ణన్ శ్రీవేంకటేశ్వర మంగళాశాసనమున ''**స్రగ్భూషాంబరహేతీనాం సుషమావహమూర్తయే**'' అనుచు ఇట్టి భావమునే ప్రకటించిరి. ఈ క్రమములోనే ప్రస్తుతము కవి ''**శఠద్విషః మహః ప్రరోహమంజరీమనోజ్ఞరత్నమేఖలా**'' అని నుడివిరి. ''**మేఖలాకలాపపుష్పితాకటీతటీపటీ**'' అనునపుడు ''**ఉడైయార్న్ద వాడైయన్**'' *(3-734)* అను తిరువాయ్‌మొళ్ళి సూక్తి, అచటినమ్బిళ్లై ఈడులోని ''**తిరువరై పూత్తాప్పోలేయిరుక్కై - కాశేయపుష్పితతటీ కటుమ్**'' అను వ్యాఖ్యాన సూక్తియు స్మరణీయములు. మఱియు శ్రీరంగరాజస్తవములోని ''**అంచితతటీసంవాదికాశేయకం**'', ''**కటీకాంతిసంవాది చాతుర్యనీవీలసత్‌రత్నకాంచీ కలాపానులేపమ్, .... పీతాంబరం రంగబంధోః**'' అను శ్లోకములును ఉదాహార్యములు. పైశ్లోకములు భగవానుని విషయమునకు సంబంధించినవి. అట్టి భావమునే కవి ఆళ్వార్ల విషయమున అనుసంధించెను.

కటీతటమున నిజమునకు తెల్లని వస్త్రము లేదు, ఉరఃస్థలమునుండి క్రిందకు ప్రవహించు కాంతి ప్రవాహమువలన నాభి అను నిమ్నప్రదేశమేర్పడగా, ఆ నిమ్న ప్రదేశమున గల తెల్లని నురుగు తెల్లని వస్త్రముగా కన్పించుచున్నది అను శ్లోకములోని ఉత్ప్రేక్ష ''**పడిచ్చోది యాడైయొడుమ్ పల్ కలనాయ్ నిన్ పైమ్బొన్ కడిచ్చోది కలన్దదువో**'' అను తిరువాయ్ మొళ్ళి సూక్తిని తలపింప చేయుచున్నది. శ్లోకములోని '**వితర్క**' శబ్దము ఉత్ప్రేక్షాసూచకము. ఆళ్వార్లు ధరించిన వస్త్రము తెల్లనిదై, అత్యంతసుకుమారమై యుండుటచే దానిని తెల్లని, మృదువైన నురుగుతో ఉత్ప్రేక్షించుట తగినది శ్లోకములోని నాల్గవ పాదమున '**మూల**' అను నక్షత్రము సూచితము

20) నయనసుభగనాభీ ముద్దిశంతీ శఠారేః
సర ఇతి పరిభాషా ఢౌకతే సార్థకత్వమ్ ।
సతత మితరథా నః సంహతా నేత్రమీనాః
కథ మిహ విహరేయుః కౌతుకోద్రేకయుక్తాః ॥

ప్ర.అ. - శఠారేః = నమ్మాళ్వార్లయొక్క, నయనసుభగ = నేత్రమునకు అందమైన, నాభీం = నాభిని, ఉద్దిశంతీ = ఉద్దేశించి, సరః ఇతి = సరస్సు అను, పరిభాషా = ప్రవాదము, సార్థకత్వం = అర్థవంతమగుటను, ఢౌకతే = పొందుచున్నది; ఇతరథా = లేనిచో, నః = మనయొక్క, నేత్రమీనాః = మీనములవంటి నేత్రములు, సంహతాః = గుంపులుగా అయినవై, ఇహ = ఆళ్వార్ల ఈ నాభియను సరస్సు యందు, కౌతుక + ఉద్రేక యుక్తాః = మిక్కిలి ఆసక్తితో కూడినవై, కథం - ఎట్లు, సతతం = ఎల్లప్పుడు, విహరేయుః = విహరించును?

**భావము :-** ''నాభీ రసాతలావర్త హ్రదకూపనదాదిభిః'' అను కవిసమయమును బట్టి నిమ్నమైన నాభిని సుడితో, హ్రదముతో, కూపముతో, నదాదులతో పోల్చుట తగినది. ఇచట కవిఆళ్వార్ల నాభి సరస్సుతో సామ్యమును కల్గియున్నదనుటను ఒక చక్కని హేతువుతో సమర్థించుచున్నారు.

నేత్రసుభగమైన ఆళ్వార్ల నాభిని సరస్సు అని వర్ణించుట సముచితము. అర్థవంతము. అట్లు నాభి సరస్సుకానిచో మన కన్నులను చేపలు ఆనాభియందు మిక్కిలి ఆసక్తితో ఎల్లప్పుడు ఎట్లు విహరించును? కావున ఆళ్వార్ల నాభి సరస్సు. శ్లోకములోని రెండవ పాదమున పూర్వాషాఢా నక్షత్రము సూచింపబడినది.

21) తాం మధ్యదేశసుషమా మవలోకయామి
రోమావలీత్రివలికారుచిరాం శఠారేః ।
రేఖోత్తరా యదుపమా మధికాభిలాషా
ఢౌకేత వా యది న వా వటపత్రశోభా ॥

ప్ర.అ. - రేఖ + ఉత్తరా = రేఖలచేగొప్పదైన, వటపత్రశోభా = మఱ్ఱి ఆకుయొక్క కాంతి, అధిక+ అభిలాషా (సతీ) = గొప్ప ఆశను కల్గినదై, యత్ = ఏ ఆళ్వార్లనడుము యొక్క కాంతితో, ఉపమాం = సామ్యమును, ఢౌకేత వా = పొందునో, యది న వా = లేక పొందదో, తాం = అట్టి, శఠారేః = నమ్మాళ్వార్లయొక్క, రోమావళీ = రోమముల వరుసలతో, త్రివలికా = త్రివళులతో, రుచిరాం = మనోహరమైన, మధ్యదేశ = మధ్య ప్రదేశముయొక్క, సుషమాం = గొప్పకాంతిని, అవలోకయామి = (నిత్యము) సేవించుచున్నాను.

**భావము :-** రోమావళితో, త్రివళితో, శోభిల్లు ఉత్తమజనుల నడుమును రేఖలతోకూడిన మఱ్ఱి

ఆకుతో పోల్చుట కవిసమయము. ఇచట కవి ఉపమేయాధిక్యమును సూచించుచు, ఆ మఱ్ఱిఆకు కూడ, రోమరాజితో, త్రివళులతో ప్రకాశించు ఆళ్వార్ల నడుముతో తులతూగదనుచున్నారు.

రేఖలచే గొప్పదగు మఱ్ఱి ఆకు త్రివళులతో, రోమ రాజితో శోభిల్లు ఆళ్వార్ల నడుముతో తులతూగవలెనను ఆశకల్గినదైనను, ఆ ఆశ నెఱవేఱలేదు. అట్టి అసదృశమైన నడుముయొక్క కాంతిని నేను కన్నులార దర్శించి, ధన్యుడనైతిని.

**''ఢౌకేత వా యది న వా''** అనుసందేహము, తులతూగదను నిశ్చయాంతముగా అర్థమున పరిణమించుటచే, ఉపమేయాధిక్యము ధ్వనించును. కావున వ్యతిరేకాలంకార ధ్వని కలదని చెప్పనగును. మూడవ, నాల్గవపాదములలోని అంతాదులలో ఆషాఢానక్షత్రము (ఉత్తరాషాఢ) సూచితము. 'రేఖోత్తరా' అను సమాసములోని **'ఉత్తర'** పదము పూర్వమున ఉండుటచే **''ఉత్తరాషాఢ''** అను పేరు స్ఫురించుచున్నది. నిజమునకు ఇట్లు పూర్వ, ఉత్తర శబ్దములను ప్రయోగింపవలసిన ఆవశ్యకత లేదని, ఆషాఢమని ప్రయోగించిన చాలునని, వేదమున కూడ **'అషాఢా'** అనియే ఉన్నదని శ్రీ. ప్ర. భ. అణ్ణాస్వామి వివరించిరి.

**22)** **భాసా న వ్యతిభిదురీ భవంతి భృంగా**
**హారస్థా దురసి హరిన్మణేః శఠారేః।**
**ఆరూఢా వకుళమయీం స్రజం సుగంధిం**
**శబ్దేన శ్రవణసుఖేన యాంతి భేదమ్ ॥**

**ప్ర. అ.** - శఠారేః = నమ్మాళ్వార్ల యొక్క, వకుళమయీం = వకులపుష్పములతో నిర్మింపబడిన, సుగధిం = సువాసనను కల్గిన, స్రజం = మాలను, ఆరుఢాః = చేరియున్న, భృంగాః = తుమ్మెదలు, భాసా = తమ శోభతో, హారస్థాత్ = ముత్యాలహారమునందున్న, హరిన్మణేః (హరిత్+ మణేః) = మరతకమణికంటె, న వ్యతిభిదురీ భవంతి = వేరుగా తోచుటలేదు. కాని, శ్రవణసుఖేన = చెవులకింపగు, శబ్దేన = ఝుంకార శబ్దముచే, భేదం = భేదమును, యాంతి = పొందుచున్నవి.

**భావము :-** నమ్మాళ్వార్ల వక్షఃస్థలమున అలంకరింపబడియున్న మరతకమణిని కవి వర్ణించుచున్నారనవలెనా? లేక, వక్షఃస్థలమున అలంకరింపబడిన వకుళమాలికలో చేరియున్న తుమ్మెదల గుంపుయొక్క శోభను పొగడు చున్నారనవలెనా? అనుటను నిశ్చయింపలేము. రెండును ఇచట వర్ణ్యములనవలెను - అనుచు శ్రీ ప్ర. భ. అణ్ణాస్వామి ఈశ్లోక వ్యాఖ్యలో పల్కిన సూక్తి ముందుగా స్మరణీయము.

ఆళ్వార్ల హృదయప్రదేశమున అలంకరింపబడినది, సుగంధమును కల్గినదగు వకుళమాలికయందు చేరియున్న తుమ్మెదల సమూహము వక్షఃస్థలమున అలంకరింపబడిన ముత్యాలహారములోని మరకతమణివలె శోభిల్లుచున్నది. రెండిటికి మధ్య గల భేదమేమన - మరతకమణి మధురముగా ధ్వనింపలేదు. కాని తుమ్మెదలు శ్రవణసుభగముగా ధ్వనించుచున్నవి.

''మకిళ్ మాలై మార్బన్'' అని ప్రస్తుతింపబడు ఆళ్వార్ల వక్షఃస్థలమున అలంకరింప బడిన వకుళమాలికలో చేరియున్న తుమ్మెదలను చూడగా వక్షఃస్థలమునగల మరతకమణియా అనునట్లు ఉన్నవి. అట్లే, ఆ ముత్యాలహారములో పొదగ బడిన మరతకకమణి, వకుళమాలికను చేరియున్న తుమ్మెదల సమూహమా అనునట్లు ఉన్నది. ఈ రెండిటి మధ్య భేదమును గ్రహించుట చాల అరుదు అని తాత్పర్యము. ముత్యాలహారము, వకుళమాలికయు తెల్లగా నుండుటచే, మరతకమణి వర్ణమునకు, తుమ్మెదల వర్ణమునకు సామ్యముండుటచే ఈ సందేహము తగినదే. ఉత్తరార్ధములోని రెండవపాదమున (అనగాశ్లోకములోని చివరి పాదమున) భేదప్రతిపత్తిని కల్గించు విషయము తెలుపబడినది.

వక్షఃస్థలములో అలంకరింపబడిన మరతకమణియొక్క కాంతివైశిష్ట్యము, వకుళమాలికయొక్క మధుసమృద్ధియు ఈ శ్లోకమున ధ్వనించుచున్నవి. కావున రెండును వర్ణ్యములని చెప్పనగును, శ్లోకములోని నాల్గవ పాదమున శ్రవణానక్షత్రము సూచితము. **''సుగంధిం''** అనుటకు బదులు**''సుగంధాం''** అనుపాఠభేదము కలదు. కాని ఆపాఠము సరి అయినది కాదు.

**23)** **దమవతః కురుతే మదనోద్ధతాన్**
**సుఘటయ త్యబుధాన్ బుధనిష్ఠయా ।**
**ప్రథితముద్ర మనిద్రసరోరుహ -**
**ప్రణయి పాణితలం శఠజిన్మునేః ॥**

**ప్ర. అ.** - శఠజిత్+ మునేః = నమ్మాళ్వార్ల యొక్క, ప్రథిత ముద్రం = ప్రసిద్ధమైన ముద్రను కల్గినది, అనిద్రసరోరుహ - వికసించిన తామరతో, ప్రణయి = స్నేహమునుకల్గినది అగు, పాణితలం = చేయి, మదన+ ఉద్ధతాన్ = మన్మథోద్రేకమునుకల్గినవారిని, దమవతః = ఇంద్రియనిగ్రహమును కల్గినవారిగా, కురుతే = చేయుచున్నది, అబుధాన్ = మూర్ఖులను, బుధనిష్ఠయా = పండితులయొక్క నియమముతో, సుఘటయతి = చక్కగా చేర్చుచున్నది.

**భావము :-** ఇందు ఆళ్వార్ల శ్రీహస్తము వర్ణింపబడుచున్నది. ప్రసిద్ధమైన జ్ఞానముద్రను కల్గినది, వికసించిన తామరలతో స్నేహమును కల్గినదగు నమ్మాళ్వార్ల శ్రీహస్తము మదనతాపమును పొందినవారికి ఆతాపమును తీర్చి, వారిని నిగ్రహము కల్గినవారినిగా చేయును. వివేకము లేనివారికి వివేకమును కల్గించును. జ్ఞానముద్రను కల్గిన ఆళ్వార్ల శ్రీహస్తమును దర్శించినవారికి శమదమాదిగుణసంపద, జ్ఞానసంపదయు సిద్ధించును.

''**అనిద్రసరోరుహప్రణయి**'' అనునపుడు ''**ఉన్నిద్ర పద్మసుభగాముపదేశముద్రాం**'' (25) అను యతిరాజసప్తతిలోని దేశికసూక్తి స్మరణీయము. శ్లోకమున రెండవ పాదము చివర ధనిష్ఠానక్షత్రము సూచితము.

24) నేహ సంసరణరోగసంప్లుతిః
జాయతే శతభిషక్చికిత్సయా ।
అంతరేణ శఠవైరికంధరా -
లంబమానవకుళస్రజాం రజః ॥

ప్ర.అ. - ఇహ = ఈలోకమున, శఠవైరి = నమ్మాళ్వార్లయొక్క, కంధరా = కంఠమునందు, లంబమాన = వ్రేలాడుచున్న, వకుళస్రజాం = వకుళమాలికలయొక్క, రజః అంతరేణ = పుప్పొడితో తప్ప, శతభిషక్ = నూఱుమంది వైద్యుల, చికిత్సయా (అపి) = వైద్యముచే కూడ, సంసరణ = సంసారము అను, రోగ = వ్యాధియొక్క, సంప్లుతిః = నాశనము, న జాయతే = కలుగదు.

**భావము :-** ఆళ్వార్ల కంఠదేశమున అలంకరింపబడిన వకుళమాలికల రజోవైభవము ఇందు కొనియాడబడుచున్నది.

నమ్మాళ్వార్ల కంఠమున వ్రేలాడుచున్న వకుళమాలికలోని పూల పుప్పొడితో తప్ప, నూఱుమంది వైద్యులు చికిత్సచేసినను ఈ లోకమున సంసారమను వ్యాధి నయము కాదు.

''**మరుత్తువనాయ్నిన్ఱ మామణివణ్ణా**'' అని, '**వైద్యో నారాయణో హరిః**'' అని, '**వేద్యోవైద్యః**'' అని చెప్పబడు శ్రీమన్నారాయణుడు మొదలగు వైద్యు లెంతమంది చికిత్సచేసినను ఈ సంసారమును రోగము నశింపలేదు. '**పున రపి జననం పున రపి మరణం పున రపి జననీ జఠరే శయనం**'' జీవులకు తప్పలేదు. కాని, ఆళ్వార్లు ధరించిన వకుళమాలికలోని ఏకదేశమగు రజస్సు అనాదియైన సంసార రోగమును తీర్చు అరుదైన మందు.

తిరువాయ్మొళిలోని ''**తీర్ ప్పారైయామిని**'' అనుదశకమున పరాంకుశనాయకి విరహతాపమును తీర్చుటకై తగినమందును గూర్చి తల్లితో ఆమె సఖి''**కువళ్కొడాక్కొళిఅట్ట పిరాన్ తిరునామత్తాల్ తువళప్పొడి క్కొణ్ణు నీరిట్టుయ్మిన్ తణియుమే**'' అని పల్కి, వెంటనే ''**మాయన్ తమరడినీఱుకొణ్ణు అణియ ముయలిల్ మ త్రిత్రి లైకణ్డీర్ ఇవ్వణజ్ఞక్కే**'' అని భాగవత శ్రీపాదరేణువే నిరుపమానమైన మందు అనితెలిపెను. ఈ సూక్తిని అనుసరించి కవి ప్రస్తుతశ్లోకమును రచించినట్లు తోచును. ''**మాఱన్ మకి ళ్ఞ్ అలఙ్గ ళ్ నాఱప్పడ నిన్ఱపోదు అముదు ఆకుమ్**'', ''**కురుకూర్ త్తకై వకుళ వడమ్ పణ్ణైకొణ్డైయిల్ వైక్కిన్ఱలర్**'' అను శఠకోపర్ అన్దాది ప్రయోగములు ఇచట ఉదాహార్యములు.

సృష్టికి మూలమైన రజస్సు సంసారబంధమును పోగొట్టుననుటచే విరోధము భాసించినను, వకుళమాలిక యొక్క పుప్పొడి సంసారరోగమును పోగొట్టుననుటచే ఆవిరోధము తొలగుటచే, విరోధాభాసాలంకారము ప్రస్తుతశ్లోకమున కలదని చెప్పనగును. ఇది రజశ్శబ్దము

శ్లిష్టమగుటచే ఏర్పడినది. ''ఉచ్యతే రోగమత్తీతి వకుళః'' రోగమును పోగొట్టునది కావున వకుళము (లింగయ సూరి పదవృత్తిని చూడుము) అను వ్యుత్పత్తిని కల్గిన వకుళపదప్రయోగము ప్రస్తుత సందర్భమున మిక్కిలి తగినది. శ్లోకమున రెండవపాదమున శతభిషక్ నక్షత్రము సూచితము.

**25)** **జన్మధ్వంసం దిశతి జనానాం**
**వక్త్రం దీప్రోష్ఠపదమనోజ్ఞమ్ ।**
**మందస్మేరం మధురకటాక్షం**
**సుభ్రూరేఖం సుభగకపోలమ్ ॥**

**ప్ర.అ.** - దీప్ర = మిక్కిలి ప్రకాశించు, ఓష్ఠపద = అధరప్రదేశముచే, మనోజ్ఞమ్= మనోహరమైనది, మందస్మేరం = మందహాసమును కల్గినది, మధుర = తీయని, కటాక్షం = చూపులను కల్గినది, సుభ్రూరేఖం = చక్కని కనుబొమల రేఖలను కల్గినది, సుభగ = అందమైన, కపోలం = చెక్కిళ్లను కల్గినదిఅగు, వక్త్రం = నమ్మాళ్వార్ల ముఖమండలము, జనానాం = సంసారజనులయొక్క, జన్మధ్వంసం = జన్మనాశనమును గూర్చి, దిశతి = ఉపదేశించుచున్నది.

**భావము :-** ఆళ్వార్ల ముఖమండలములలోని అధరము, కనుబొమ్మలు, చెక్కిళ్లు, మందహాసము, కటాక్షములను వర్ణించుట ద్వారా, అందలి సౌందర్యమును కవి అనుభవించుచున్నారు.

ఎఱ్ఱగా ప్రకాశించు అధరమును కల్గియుండుటచే మనస్సును ఆకట్టుకొనునది, మందహాసముతో, తీయని చూపులతో కూడినది, చక్కని కనుబొమ్మలను, అందమైన చెక్కిళ్లను కల్గినదగు ఆళ్వార్ల ముఖము జనులకు సంసారనాశనమును గూర్చి తెలుపుచున్నది. అనగా ముక్తి సామ్రాజ్యమును ప్రసాదించుచున్నది.

''**ఉచ్యతే అనేన ఇతి వక్త్రం**'' - దీనిచే పలుకబడునది కావున వక్త్రము అను అర్థము నిచ్చు వక్త్రపదప్రయోగ మిచట సందర్భోచితమైనది. శ్లోకములోని రెండవపాదమున ''ప్రోష్ఠపద'' ప్రయోగముచే పూర్వాభాద్రా నక్షత్రము సూచితము. ఆళ్వార్లు తిరువాయ్మొళిలో భగవానుని దివ్యావయవ సౌందర్యమును వర్ణించుచు ''ఎళ్గనేయో'' (5-5) దశకమున పల్కిన ''**తొక్క శోదిత్తొణ్డవాయుమ్ నీణ్డపురువభ్గళుమ్, తక్కతామరైక్కణ్ణుమ్ పావియే నావియన్ మేలనవే**'' వంటి సూక్తులకు, ప్రస్తుత శ్లోక విశేషణములకు గల సామ్యము మిక్కిలి గమనింపతగినది.

**26)** **లసతి హి భజతాం భద్రోత్తరపదకరణారూఢమ్ ।**
**శఠరిపుమకుటం భాసా పరిహృతదురితధ్వాంతమ్ ॥**

**ప్ర.అ.** - భజతాం = భక్తులకు, భద్ర+ ఉత్తర = గొప్పక్షేమమును కల్గించు, పద = స్థానమును, కరణ = అనుగ్రహించుటకై, ఆరూఢం = తలపై అధిరోహించినది, భాసా = కాంతితో, పరిహృత= పోగొట్టిన, దురిత = పాపములు అను, ధ్వాంతం = చీకటిని కల్గినది అగు, శఠరిపుమకుటం = నమ్మాళ్వార్ల కిరీటము, లసతి హి = (మిక్కిలి) ప్రకాశించుచున్నదికదా!

**భావము** :- నమ్మాళ్వార్ల కిరీటశోభ ఇందు వర్ణింపబడుచున్నది.

భక్తులకు ఉన్నతపదమును అనుగ్రహించుటకై తలపై నున్నది, తనకాంతితో పాపములను చీకటిని పోగొట్టునది అగు ఆళ్వార్ల కిరీటము మిక్కిలి ప్రకాశించుచున్నది కదా!

''కరుణారూఢమ్'' అను పాఠాంతరము సరి అయినది కాదు. '' **ఆరూఢం**'' ''**పరిహృతదురితధ్వాంతం**'' అను విశేషణముల అర్థబలమువలన ఆళ్వార్లకిరీటమునకు సూర్యునితో సాదృశ్యము ధ్వనించుచున్నది. **''ఒరుణాయిఱు ఆయిరమ్ మలర్న్దన్న....ముడి''**, వంటి ఆళ్వార్ల సూక్తులు, ఈ భావమును అనగా కిరీటమునకు సూర్యుని తోగల సాదృశ్యమును తెలుపుచున్నవి. దేశికులు దేవనాయకపంచాశత్ స్తోత్రమున **''దేవేశ్వరత్వ మిహ దర్శయితుం క్షమ స్తే నాథ త్వయాపి శిరసా విధృతః కిరీటః, ఏకీకృతద్యుమణిబింబసహస్రతుల్యః నిర్మూలయన్మనసి మే నిబిడం తమిస్రమ్''** అని పల్కుటకు ప్రస్తుతశ్లోకమునకు మధ్య గల భావసామ్యము మిగుల గమనింపతగినది. పై ఉదాహరణములు భగవానునకు సంబంధించినవి కాగా, అట్టిభావమును కవి ఆళ్వార్ల విషయమున అనుసంధించిరి. భద్రోత్తరపదమనగా పరమపదము. రెండవపాదమున 'భద్రోత్తర' పదముచే ఉత్తరాభాద్రా నక్షత్రము సూచితము. ఉన్నత పదమును ఇతరులకు అనుగ్రహింప తలచినవాడు తాను ఉన్నతస్థితిలో ఉండవలెను కదా! అట్టి యోగ్యతను కిరీటము కల్గియుండుటను మొదటి విశేషణము తెలుపుచున్నది.

**27)** **అంతరేణ శఠారాతిం క స్సంసారేఽవతీహ నః ।**
**తదహం హృదయే నిత్యం నిదధే తద్వపుః శ్రియమ్ ॥**

**ప్ర.అ** - ఇహ సంసారే = ఈ లోకమున, శఠ+ అరాతిం అంతరేణ = నమ్మాళ్వార్లు తప్ప, కః = ఎవరు, నః = మనలను, అవతి = రక్షింమను?, తత్ = కావున, అహం = నేను, నిత్యం = ఎల్లప్పుడు, తత్+ వపుః శ్రియం = ఆ నమ్మాళ్వార్ల దివ్యమంగళ విగ్రహసౌందర్యలక్ష్మిని, హృదయే = హృదయము నందు, నిదధే = ధరింతును (ధ్యానింతును).

**భావము** :- నమ్మాళ్వార్ల దివ్యమంగళవిగ్రహధ్యానము సంసారతారకము అనుట ప్రస్తుత శ్లోక సారాంశము.

ఈ సంసారము నుండి మనలను రక్షింపగల్గిన వారు నమ్మాళ్వార్లు తప్ప వేరెవ్వరు ఉన్నారు? కావున ఆ ఆళ్వార్ల దివ్యదేహ సౌందర్యమును నేను నిత్యము మనస్సున ధ్యానింతును.

ఈశ్లోకముతో నక్షత్రమాలికా అను నమ్మాళ్వార్ల స్తుతి పూర్తి అగుచున్నది. ముందుశ్లోకము వరకు ప్రత్యవయవవర్ణన చేసిన కవి ఇందు దివ్యరూపమును గూర్చి పల్కుచున్నారు. శిష్యుని ఆత్మక్షేమమునుగూర్చి చింతించు ఆచార్యుల రూపమును ఆ శిష్యుడు అభిమానించి, సేవింపవలెనని ఆచార్యుల సిద్ధాంతము. ఈ విషయమును ప్రస్తుతశ్లోకము తెలియజేయుచున్నది. ఆచార్యులలో ప్రథములగు నాథమునులకును నమ్మాళ్వార్లు ఆచార్యులగుటచే లోకమునకు

పరమాచార్యులు కదా! అట్టి ఆళ్వార్ల దివ్యరూపమును కృతజ్ఞతాపూర్వకముగా ధ్యానించుట ప్రపన్ను లందఱికీ కర్తవ్యము.

లోకమున తాము అవతరించి, భక్తులకు పరమపదమును కల్గించుట ద్వారా వారిని పాలించి, రక్షించినవారు అట్లే, భగవానుని భక్తరక్షణ తృష్ణను సఫలముచేయుట ద్వారా ఆ భగవానుని అసంతృప్తిని తీర్చి, రక్షించినవారు. ఇట్లు రెండు విధముల ఆళ్వార్లు రక్షకులు. కావున "**అంతరేణ శఠారాతిం..... నః**" అను పూర్వార్ధము ఆళ్వార్ల విషయమున మిగుల సంగతము.

ఆళ్వార్లు అందరిలోను నమ్మాళ్వార్లు అంగి; మిగిలిన ఆళ్వార్లు వారికి అంగభూతులు. కావున కవి నమ్మాళ్వార్ల దివ్యావయవర్ణనను చేయుట ద్వారా పరోక్షముగా ఆయా ఆళ్వార్ల వర్ణనను చేసినట్లయినది. చివరిదగు ఈ శ్లోకము అంగియగు నమ్మాళ్వార్లను స్తుతించుచున్నది. శ్లోకములోని పూర్వార్ధమున రేవతీ నక్షత్రము సూచితము.

**28)** **వాచికీ వరివస్యా మే తారకామాలికాత్మికా ।**
**పరాంకుశపదాబ్జేషు పరిష్కారవతీ భవేత్ ॥**

*ప్ర.అ - తారకామాలికా+ ఆత్మికా = నక్షత్రమాలికారూపమైన, మే = నాయొక్క వాచికీ = వాగ్రూపమైన, వరివస్యా = సేవ, పర+ అంకుశపద + అబ్జేషు = నమ్మాళ్వార్ల పాదారవిందముల యందు, పరిష్కారవతీ = పరిష్కరింపబడినది, భవేత్ = కాగలదు.*

**భావము :-** స్తోత్రము చివర గ్రంథకర్త ముగింపు మాటగా పల్కుశ్లోకమిది. ఈ శ్లోకమున కవి ఆళ్వార్లు తనస్తోత్రమును అనుగ్రహించి, స్వీకరింతురుగాక! అను చున్నారు

ఈ స్తోత్రము నక్షత్రమాలిక సమర్పింపబడిన చోటు ఆళ్వార్ల పాదపద్మములు. పూవు పూవుతో చేరినపుడే పరస్పరము శోభిల్లును. అట్లే మాలికారూపమైన ఈస్తుతి భగవానుని పాదములయందు సమర్పించుటచే ఆళ్వార్ల పాదములకు కైంకర్యము చేసినట్లేకాక, తమ స్తుతికిని సార్థకత కల్గినట్లయినదని కవి పల్కుచున్నారు. ఆళ్వార్ల పాదపద్మముల సంబంధముచే తమస్తుతి పరిష్కృతమైనది కాగలదు అనుటచే "**సంబంధాత్ స్వాత్మలాభః**", "**ఓదువార్ ఓత్తెల్లామ్ ఎవ్వులకత్తెవ్వైయుమ్ శాదువాయ్ నిన్ పుకళ్ళిన్ తకైయల్లాల్ పిఱిదిల్లై**" వంటిసూక్తుల అర్థము అనుసంధింపబడినదని చెప్పనగును. "**తొణ్డర్క్కముదన్న చ్చొల్‌మాలైకళ్‌శొన్నేన్**" అని, "**భక్తామృతం**" అని స్తుతింపబడినట్లు భక్తులకు అమృతమువంటి సూక్తిమాలికలను అనుగ్రహించిన ఆళ్వార్ల పాదపద్మముల యందు ఆవిధముగానే పరమభోగ్యములైన శ్లోకములతో కూడిన మాలికతో కవి సేవచేయుట మిక్కిలి స్వరూపానుగుణమైనది! పాదములయందు సేవచేయుట భక్తుల స్వరూపమునకు తగినది కదా!

"**న క్షరతి ఇతి నక్షత్రం**" - నశింపనిది కావున నక్షత్రము. ఆళ్వార్లపాదములయందు సమర్పింపబడిన దగుటచే ఈ శ్లోకమాలిక సార్థకము అగుటయేకాక, నిత్యత్వమును పొందినది. కావున ఈ స్తోత్రమునకు "**నక్షత్రమాలికా**" అను పేరు మిక్కిలి తగినది.

శ్రీమతే రామానుజాయ నమః
శ్రీవాధూల వరదాచార్య విరచితమైన

# పరాంకుశపంచవింశతి

**శఠకోప వైభవము** :- ప్రపన్నజన కూటస్థులుగా, పరమాచార్యులుగా, 'వేదమ్ తమిళ్ శెయ్ద మాఱన్'గా ప్రసిద్ధిచెందిన నమ్మాళ్వార్లు పదిమంది ఆళ్వార్లలో ముఖ్యులు. భగవానునకు పాద స్థానీయులు. వీరు పాండ్యదేశములోని ఆళ్వార్ తిరునగరిలో కలియుగాదిలో ప్రమాథినామ సంవత్సరము వైశాఖమాసమున విశాఖానక్షత్రమున సేనేశుల అంశగా భగవదాజ్ఞచే అవతరించిరి. వీరు ద్రావిడభాషలో నాల్గువేదములనదగిన **తిరువిరుత్తమ్, తిరువాశిరియమ్, పెరియ తిరువన్దాది, తిరువాయ్మొళి** అను నాల్గు ప్రబంధములను సాయించిరి. ఇవి వరుసగా ఋగ్యజు- అధర్వణ సామవేదముల సారమని ఆచార్యుల నిర్వాహము. (అభిప్రాయము). ఆళ్వార్లు అందరిలోను నమ్మాళ్వార్లు ముఖ్యులైనట్లే, వారి ప్రబంధములన్నిటిలో తిరువాయ్ మొళి ప్రధానమైనది. నమ్మాళ్వార్లు యోగ విద్యాప్రవర్తకులు కూడ. వీరి తల్లి **ఉడైయనఙ్గై**, తండ్రి **కారిమార్లు**. పుట్టిన పిమ్మట 16 సం. వఱకు అన్నపానాదులను విడచి, యోగ సమాధిలో నున్న నమ్మాళ్వార్లు, పిమ్మట 16 సం॥లు ఈలోకమున నిలచి, లోకోజ్జీవనార్థము తమ అనుభవ పరీవాహరూపములగు ప్రబంధములను తమశిష్యులగు మధురకవులకు ఉపదేశించిరి.

**ఆళ్వార్లస్తోత్రములు** :- నమ్మాళ్వార్లను స్తుతించు స్తోత్రములు అనేకములు పలు భాషలలో కలవు. వారి శిష్యులగు మధురకవులు 10 పాశురములను కల్గిన **''కణ్ణినుణ్ శిఱుత్తామ్బు''** అను సుమధుర ప్రబంధమును ఆళ్వార్లవిషయమున రచించిరి. తమిళ భాషలో రామాయణమును రచించిన కంబుడు నమ్మాళ్వార్ భక్తుడు. అన్దాది క్రియలో వారిని స్తుతించుచు ''శఠకోపర్ అన్దాది'' అను నూరు పాశురములను కల్గిన అన్దాది ప్రబంధమును రచించెను. సంస్కృతభాషలో కూడ **పరాంకుశాష్టకము, నక్షత్రమాలిక, శఠకోపప్రపత్తి, శఠకోపశతకము, శఠకోపసహస్రము, పరాంకుశ సుప్రభాతము, శఠకోపమంగళాశాసనము, శఠారి తిలకము** వంటి పలుస్తోత్రములు కన్పించుచున్నవి. అట్టిస్తోత్రములలో 'పరాంకుశపంచవింశతి' అను ప్రస్తుతస్తోత్రముఒకటి.

**స్తుతికర్తవివరములు** :- 'పరాంకుశ పంచవింశతి' అను ఈస్తోత్రమును వాధూల గోత్రమునకు చెందిన వరదాచార్యులచే రచింపబడినట్లు స్తుతికర్తయే స్వయముగాపేర్కొనిరి. తండ్రిపేరు వేంకట పతి అని, తాతపేరు వరదాచార్యులనియు ఈ స్తోత్రము చివరి శ్లోకమున పేర్కొనబడినది. శ్రీ. ప్ర. భ. అణ్ణాస్వామి ప్రచురించిన స్తోత్రజాల గ్రంథమున ఈస్తోత్రము **''పెరియవణ్ణన్'', ''కన్దాడై అణ్ణన్''** అని ప్రసిద్ధిచెందిన వాధూల వరదాచార్యులచే రచింపబడినట్లు చూపబడినది. ఈవరదాచార్యులు మణవాళమహాముునుల ప్రధానశిష్యులుగా పేరుపొందిన

అష్టదిగ్గజములలో ఒకరు. వీరి మహిమను సమకాలీనులగు ప్రతివాదిభయంకరం అణ్ణన్, ఎఱుమ్బియప్పా తాము రచించిన వరవరముని శతకములలో ప్రశంసించిరి. ఎఱుమ్బియప్పా **''వరవరమునివర్య పాదురత్నం వరదగురుం గురు మాశ్రయే గురూణామ్, ఉపనిషదుపగీత మర్థతత్త్వం తదిహ యదీయవశంవదం సమింధే''** అనుచు ఈ ఆచార్యులు మణవాళమహామునులకు పాదుకాస్థానీయులని పల్కిరి. యతీంద్రప్రవణ ప్రభావమునను **''రామానుజమునీంద్రస్య శ్రీమాన్ దాశరథి ర్యథా ఎన్నుమ్బడి ఉడైవర్క్కు ముదలియణ్ణానై ప్పోలే''** అనుచు ఈ అంశము ప్రస్తావింపబడినది. వీరు మణవాళమహామునుల ఆజ్ఞచే వారి పౌత్రులగు జీయర్ నాయనార్క్కు తిరువాయ్మొழி ఈడువ్యాఖ్యానమును ప్రసాదించినట్లు సంప్రదాయము. పిళ్లైలోకం జీయర్ భగవద్విషయ తనియన్లవ్యాఖ్యలో **''రుచిరజామాతృ యోగీంద్రపాదాశ్రయంరామ్, వాధూలవంశ్యరాన వరదరాన పెరియవణ్ణనుమ్ ఆచార్యనియమనత్తిన్పడియే ఆచార్యపౌత్రరాన నాయనారై అనువర్తిత్తు తిరువాయ్మొழி యినీడు ప్రసాదిత్తరుళినార్.''** అని ఈవిషయమును తెలిపిరి. ఆழ்వార్లపట్ల, వారి ప్రబంధములపట్ల తమకు గల ప్రావణ్యాతిశయమును ప్రకటించుచు వీరు ఈస్తోత్రమును రచించిరని చెప్పనగును. వీరి ఆచార్యులగు మణవాళమహామునులు **''యతిరాజవింశతి''** అను భగవద్రామానుజుల స్తుతిని రచింపగ, వీరు ఆழ்వార్లవిషయమున ఈస్తుతిని రచించుట విశేషము. కాని ఇందు ఎచటను తమ ఆచార్యులగు మణవాళమహామునుల ప్రసక్తి లేకుండుట గమనింప తగినది. మఱియు స్తుతికర్త శ్రీరంగనివాసి అనియు తెలియుచున్నది. ప్రస్తుతస్తోత్రము ఆழ்వార్ తిరునగరిలోని నమ్మాழ்వార్ల అర్చామూర్తి విషయముగా రచింపబడినదని చెప్పనగును.

ఈ స్తుతి ఆழ்వార్ల జన్మస్థలమగు ఆழ்వార్ తిరునగరిలో, శ్రీరంగమున అధ్యయనోత్సవములలో అనుసంధింపబడుచున్నది. **''కాసారసంయమిముఖాః''** అను రెండవశ్లోకము భగవద్విషయము - అడైయవళైన్దాన్ అరుమ్బదములో (2-9-4) ఉదాహరింపబడినది. ''ఇరామానుశ నూ **ற்று** న్దాది'' కి పిళ్లైలోకమ్ జీయర్ అనుగ్రహించిన వ్యాఖ్యలో పలుచోట్ల ఈస్తోత్రములోని శ్లోకములు ప్రమాణములుగా గ్రహింపబడినవి. 23,26,34,47,50,55వ పాశురముల వ్యాఖ్యలో **''యావచ్చ''** అను శ్లోకము, 96వ పాశురవ్యాఖ్యలో **''కర్మేతి''** అనుశ్లోకము, 92వ పాశురవ్యాఖ్యానమున **''నిద్రాప్రమాద''** అను శ్లోకమును ఉట్టంకింపబడినవి. ఇట్లు ఈ స్తోత్రమునకు శిష్టపరిగ్రహత్వము కలదని తెలియుచున్నది. కొన్ని స్తోత్ర గ్రంథములలో ఈ స్తుతి ప్రచురింపబడుటయు ఈ విషయమును బలపఱుచుచున్నది.

**స్తోత్రప్రమేయము** :- నమ్మాழ்వార్లను స్తుతించు ఈ స్తోత్రమున భాగవతపారమ్యమే ప్రధానప్రమేయము. పూర్వాచార్యులు రచించిన స్తోత్రములన్నియు అష్టాక్షరీ, ద్వయమంత్రముల వివరణాత్మకములయినట్లే, ప్రస్తుతస్తోత్రముకూడ అష్టాక్షరీమంత్రసారమును ప్రతిపాదించుచున్నది. తిరుమంత్రమున గల మూడు పదములు జీవుని అనన్యార్హశేషత్వ,

అనన్యశరణత్వ, అనన్య భోగ్యత్వములను మూడు లక్షణములను తెలుపుచున్నవి. వీనిని భాగవతపర్యంతము అనుసంధించిన కాని స్వరూపము పూర్ణముగా సిద్ధింపదు. కావుననే ముముక్షుప్పడిలో పిళ్లైలోకాచార్యులవారు నమశ్శబ్దార్థమును వివరించుచు **''ఉఱ్ఱదు మున్నడియార్క్కడిమై'' ఎన్గైయాలే ఇదిలే భాగవతశేషత్వ మనుసంధేయమ్'', ''ఇదు అకారత్తిలే ఎన్ఱుమ్ శొల్లువర్ కళ్, ఉకారత్తిలే ఎన్ఱుమ్ శొల్లువర్ కళ్''** అని సూత్రీకరించుట ఇచట స్మరింపతగినది. ఈ భాగవత పారతంత్ర్యము అష్టాక్షరిలోని నమశ్శబ్దము యొక్క అర్థబలముచే ప్రతీతమగుచున్నది. నమ్మాళ్వార్లు తిరువాయ్మొళిలో ''కణ్గళ్ శివన్దు'', ''కరుమాణిక్కమలై'' అను రెండు దశకములలో నమఃశబ్దార్థమగు ఆత్మయొక్క అనన్యార్హశేషత్వము అనుసంధించిన పిదప, ఆశేషత్వమునకు పరాకాష్ఠ అగు భాగవతశేషత్వమును **''నెడుమాఱ్కడిమై''** అను తరువాతి దశకమున వివరించిరి. ఒక వ్యక్తికి శేషమగువాడు, అతనికి సంబంధించినవారికిని శేషమై యుందుట లోకమున అనుభవములో నున్నదే. ''ఎన్నమ్మైవిఱ్కవుమ్ పెఱువార్కళ్'', ''తద్భక్తినిఘ్నమనసాం క్రయవిక్రయార్హః'', ''హరిభక్తిదాస్యరసికాః పరస్పరం, క్రయవిక్రయార్హదశయా సమింధతే'' అను ప్రమాణములు ఈ అంశమును ద్రఢీకరించు చున్నవి. కావున ప్రస్తుతస్తోత్రము భాగవతశేషత్వమును, తదనుబంధములగు భాగవతశరణత్వము, భాగవతభోగ్యత్వమును ప్రతిపాదించుటచే అష్టాక్షరీమంత్ర సార ప్రతిపాదకమనుటలో సందేహము లేదు. జీవులందరు భగవానునకు శేషమైయుండగా, వేరొకరి శేషమనుటలో అర్థమేమి? అనగా నమ్మాళ్వార్లు భగవానునకు పాదస్థానీయులు కావున, ఆళ్వార్లకు శేషమనుట వలన భగవానునకును శేషమని చెప్పినట్లగును. అందుచే ఇచట జీవుని భగవదనన్యార్హ శేషత్వమునకు కొఱతలేదు.

పరాంకుశపంచవింశతిలోని శ్లోకములు ఆచార్య హృదయము, ముముక్షుప్పడి వంటి రహస్యగ్రంథములలోని భావములను, స్తోత్రరత్నము, యతిరాజవింశతిలవంటి ఆచార్యుల స్తోత్రములలోని శ్లోకముల భావములను అనుకరించుచున్నవి. ఈ విషయము ఆయా శ్లోకవ్యాఖ్యలలో ప్రస్తావింపబడినది.

ప్రస్తుతస్తోత్రములోని శ్లోక సంఖ్య పంచవింశతి - (25) అగుటకు, స్తోత్రములోని ప్రమేయము కారణమని చెప్పనగును. ఈ స్తోత్రమున నిష్కృష్టమైన జీవుని లక్షణము ప్రతిపాదింపబడినదని ఇంతకు ముందే తెలుపబడినది. సంఖ్యా నిర్దేశమును బట్టి, ధాత్వర్థమును బట్టియు 'మ' కారము జీవుని నిర్దేశించునని ఆచార్యులు నిర్ణయించిరి. మకారము హల్లులలో 25 వ అక్షరము. అట్లే ' ఆత్మ' ఇరువది అయిదవ తత్త్వముగా చెప్పబడు చున్నది. ''**భూతాని చ కవర్గేణ, చవర్గేణేంద్రియాణిచ, టవర్గేణ తవర్గేణ జ్ఞాన గంధాదయ స్తథా మనః పకారేణోక్తం, ఫకారేణ త్వహంకృతిః, బకారేణ మహాన్ ప్రకృతిరుచ్యతే, ఆత్మా తు సమకారేణ పంచవింశః ప్రకీర్తితః**'' అను ప్రమాణ మిచట స్మరణీయము. అట్లే 'మన – జ్ఞానే', ''మను– అవబోధనే'' అను ధాతువులనుండి నిష్పన్నమగు మకారము జ్ఞానవాచి యగుటచే జ్ఞానస్వభావమునుకల, జ్ఞానగుణకమైన ఆత్మను తెలుపును. అట్టి జీవాత్మయొక్క స్వరూపశోధనము ఈ స్తోత్రమున

చేయబడుటను బట్టి శ్లోక సంఖ్య 25గా నిర్ణయింప బడినదని చెప్పనగును. ద్వయ మంత్రమున 25 అక్షరములున్నవి. అట్లే పరాంకుశద్వయమనదగిన ఈ స్తోత్రమున 25 శ్లోకము లుండుట గమనింపతగినది. ద్వయ మంత్రమునకు, ప్రస్తుత స్తోత్రమునకు కలసామ్యములు వ్యాఖ్యలో వివరింపబడినది. ఈ స్తోత్రమున ''**నాథం కులస్య**'' ఇత్యాదిగా ఆళ్వార్ల శేషిత్వము తెలుప బడుటచే, తత్ప్రతిసంబంధియగు ప్రపన్నుల శేషత్వము, ''**త్వామేవ యాంతి శరణం**''(6) అనుటచే అనన్య శరణత్వము, ''**త్వత్కింకరం సతతం కురుష్వ**'' (25) అనుటచే అనన్యభోగ్యత్వము సూచింపబడుటచే ఇందు జీవుని భాగవతశేషత్వ, శరణత్వ, భోగ్యత్వములు తెలుపబడినవి. ఇంత వరకును వ్యాఖ్యానింపబడని ఈ స్తోత్రముయొక్క తాళపత్రప్రతులు మద్రాస్ ప్రాచ్యలిఖిత గ్రంథాలయములో, అడైయార్ హస్తలిఖిత గ్రంథాలయములో కలవు. అట్లే, కొన్ని ముద్రిత స్తోత్రపాఠ కోశములలో కూడ ఈ స్తోత్రము కనుపించుచున్నది. కొన్నిశ్లోకములలో పాఠభేదములు చూపట్టుచున్నవి. ఈ సంవత్సరము నమ్మాళ్వార్ల అవతారసంవత్సర మగుటచే, ప్రపన్నజన కూటస్థులగు వారి విషయమున యథాశక్తి కృతజ్ఞతను ప్రకటించుటకై, వాగ్రూపమైన సేవను చేయగోరి దాసుడీ సాహస ప్రయత్నమును చేసెను. విజ్ఞులగు పెద్దలు ఇందలిదోషములను మన్నింతురని, గుణముల నన్నిటిని ఆచార్యానుగ్రహ ఫలితములుగా గ్రహింతురని భావించుచున్నాను.

## శ్లోక సూచి

| | శ్లోకము | సంఖ్య | | శ్లోకము | సంఖ్య |
|---|---|---|---|---|---|
| 1) | అత్రాప్యముత్ర | 24 | | | |
| 2) | అవ్యాజబంధు - | 16 | 14) | నిత్యోఽథ - | 5 |
| 3) | ఉక్త్యా స్వదోష - | 19 | 15) | పద్భ్యాం శపే - | 12 |
| 4) | ఏవం కదాచిత్ - | 15 | 16) | పాపక్రియాసు - | 4 |
| 5) | కర్మేతి కేచిత్ - | 6 | 17) | పూర్వైః స్వనైచ్య - | 18 |
| 6) | కామప్రమోహ - | 21 | 18) | ప్రచ్ఛన్నపాతక - | 11 |
| 7) | కార్యా కృపా - | 22 | 19) | భక్త్యాద్యుపాయ - | 7 |
| 8) | కాసార - | 2 | 20) | యావచ్చ - | 17 |
| 9) | కింతు క్రియా - | 20 | 21) | వాధూల - | 25 |
| 10) | త్వత్కింకరత్వ - | 13 | 22) | విశ్వోపకారకం - | 23 |
| 11) | త్వద్విగ్రహేక్షణ - | 14 | 23) | శాస్త్రేణ - | 10 |
| 12) | త్వద్దివ్యసూక్తి - | 8 | 24) | శ్రీమన్ - | 1 |
| 13) | త్వన్నామ - | 9 | 25) | శ్రీరంగ - | 3 |

# పరాంకుశపంచవింశతి

## ప్రార్థనాశ్లోకములు

యః పరాంకుశమునిం ప్రసాదయన్
పంచవింశతిమయీం స్తుతిం వ్యధాత్ ।
తం వధూలకులభూషణం దయా-
వారిధిం వరదదేశికం శ్రయే ॥

ప్ర.అ - యః = ఏ వరదాచార్యులు, పరాంకుశమునిం = నమ్మాళ్వార్లను, ప్రసాదయన్ = సంతోషింపచేయుచు, పంచవింశతిమయీం = ఇరువది అయిదు శ్లోకములతోకూడిన, స్తుతిం = స్తోత్రమును, వ్యధాత్ = చేసెనో, వధూలకులభూషణం = వాధూలగోత్రమునకు అలంకారము, దయావారిధిం = దయకు సముద్రమువంటివారును అగు, తం = ఆ, వరదదేశికం = వరదాచార్యులను ఆచార్యశ్రేష్ఠులను, శ్రయే = ఆశ్రయించుచున్నాను.

**వ్యాఖ్య :-** ఇరువదిఅయిదు ముక్తకశ్లోకములతో కూడిన ''పరాంకుశపంచవింశతి'' అను నమ్మాళ్వార్లస్తుతిని రచించి, వారి మనస్సునకు సంతోషమును కల్గించినవారు, వాధూల వంశమునకు అలంకారము, దయకు సముద్రులును అగు వరదాచార్యులను గురూత్తమును ఆశ్రయించుచున్నాను అని భావము.

నమ్మాళ్వార్లకు పరాంకుశులని, శఠకోపులని, శఠారి అని, మాఱన్ అని, కారిసూనులని ఇట్లు పలు నామములు కలవు. వీనిలో పరాంకుశనామము మిక్కిలి విశిష్టమైనది. ఈనామము ఆళ్వార్ల భక్తి వైశిష్ట్యమును, ప్రబంధ వైలక్షణ్యమును, పరానర్థమును చూచి సహింపలేని వారి కరుణా స్వభావమును తెలుపు చున్నది.

''**పరేషాం అంకుశః పరాంకుశః**'' అను వ్యుత్పత్తిని బట్టి శత్రువులకు అంకుశము వంటి వారను భావము పరాంకుశ నామము వలన కల్గును. శత్రువు లెవ్వరనగా కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములను అంతః శత్రువులు. ఇట్టి శత్రువులకు ఆళ్వార్లు అంకుశమువంటి వారని భావము. అజ్ఞానమునకు హేతువగు శఠమను వాయువును నిరోధించిన ఆళ్వార్లు అరిషడ్వర్గమును జయించుటలో ఆశ్చర్యమేమున్నది? లేక, పరశబ్దముచే బోధింపబడు శత్రువులు ''**విద్యామదో ధనమద స్తృతీయోఽభిజనమదః**'' అని, ''**వఞ్జముక్కుఱుమ్బామ్**'' అనియు చెప్పబడునట్లు విద్యవలన, సంపదవలన, ఆభిజాత్యము వలన కల్గు మూడు విధములైన మదములు మానవునకు శత్రువులు. వీనిని అణచిన వారు ఆళ్వార్లు. కావున పరాంకుశులు. ఇచట ఆళ్వార్ల

అంకుశసామ్యముచే శత్రువుల గజ సామ్యము ప్రతీతము. అట్టి, గజమువలె, నివారింప సాధ్యముకాని అరిషడ్వర్గములను, మూడు విధములైన మదములను ఆళ్వార్లు అణచినవారని చెప్పుటచే వారి మహిమ తెలుపబడినది. విద్యా, ధన, అభిజనమదములను ఆళ్వార్లు నిరసించిన విధమును వారి ప్రబంధమగు తిరువాయ్మొళిలోని సూక్తులను బట్టియే గ్రహింపవచ్చును. ''**ఓది యుణర్న్దవర్ మున్నా వెన్ శవిప్పార్ మని శరే**'' (వేదములలో జగత్కారణమని చెప్పబడునట్టి భగవానుని నోరారా కీర్తించి, వీధులలో ఆనంద సంభ్రమనర్తనముచే యనివారు, శాస్త్రములను చదివి, చక్కని జ్ఞానమును కల్గిన వారినుండి గొప్ప విద్వాంసుల వరకు గలవారిలో ఎవ్వరైనను, వారు చేయు జపము ఎందులకు? వారు మనుజులా? కారుకదా!) (తి.వా.3-5-5) అని విద్యామదమును నిరసించి, ఆ మదము లేనివారిని ''**ముళుదు నీర్మైయినారే**'' (తి.వా-3-5-6) (భగవానుని పట్ల అనూయలేక మిక్కిలి ఆసక్తితో స్తుతించి, నర్తనముచేయువారు సర్వజ్ఞులని కొనియాడ తగినవారు) అని పొగడిరి. ''**కొళ్లెన్ఱుకిళర్న్దెళున్ద పెరుఞ్జెల్వమ్ నెరుప్పాక, కొళ్లెన్ఱు తమ మూడుమ్**'' (తి.వా-4-9-4) ''(నన్ను గ్రహింపుము, నన్ను గ్రహింపుము అని మిక్కిలి ప్రేరేపించు సంపద నిప్పువలె సమూలనాశనముచేయు చున్నను, ఆ సంపదనే పొందవలయునను తమోగుణమును కల్గియున్న) అని ధనమదమును అదిలేనివారిని ''**పెరుమ్ శెల్వముమ్ అవరే**'' అని శ్లాఘించిరి. అట్లే, అభిజనమదమును నిరసించి, ''**పరమ నైప్పయిలుమ్ తిరువుడైయార్ యవరేలుమ్ .... ఎమ్మైయాళుమ్ పరమరే**'' ఇత్యాదిగా ఆ మదము లేనివారిని కీర్తించిరి.

ఇట్లు పరాంకుశులను పేరు నమ్మాళ్వార్ల జ్ఞానభక్తివైరాగ్యములను నిరూపించుచున్నది.

పరులనగా విష్ణుపారమ్యమును అంగీకరింపని వారను అర్థమును చెప్పవచ్చును. అపుడు విష్ణుపరత్వమును అంగీకరింపని వారికి అంకుశము వంటివారని పరాంకుశనామము తెలుపును. నాస్తికవాదులను, మాయావాదులను ఇచట పరశబ్దముచే గ్రహింపనగును. ''**జైనేభ**'' అనునట్లు అట్టి నిరీశ్వర, మాయావాదులు అను గజములకు అంకుశము వంటి వారు ఆళ్వార్లు అనుటలో అర్థమేమనగా- వారి వాదములను అన్నిటిని తమ ప్రబంధముల ద్వారా ఖండించి, విష్ణుపారమ్యమును స్థాపించిన వారని భావము. ఈ సందర్భమున ఆచార్యహృదయములోని ''**ఇదుక్కుమూలమ్**'' (94) అనుచూర్ణికలోని ''**శత్రైయొట్టి, మదావలిప్తర్క్కు అంకుశమిట్టు**'' అను సూక్తి, అచటి వ్యాఖ్యానము స్మరణీయము. అంకుశము వంటిదనుటకు ''**ఈశ్వరన్ ఇవరై యిట్టు కుమతికళుడైయ దుర్మదత్తై పోక్కి, అవర్కళై స్వవశమాక్కి కొళ్లువైక్కు సాధన మాయిరుక్కై**'' అను పిళ్లైలోకమ్ జీయర్సూక్తి స్మరణీయము. పరశబ్దమునకు నిరంకుశస్వతంత్రుడగు భగవానుడను అర్థమును గ్రహించినచో, అట్టి సర్వేశ్వరునకు అంకుశము వంటివారు ''**పరస్య అంకుశః**'' అనగా నియమించువారను భావము పరాంకుశనామమువలన కల్గును. ఆళ్వార్లు తమ మధుర ప్రబంధములతో లోకులనే కాక, భగవానుని కూడ ఆకట్టుకొనిన విషయమును వారే ''**మాల్వణ్ణనై**

**మలక్కు నావుడై యేఱ్కు**'' (భగవానుని వశీకరింప చేసి కొనగల్గిన వాక్సామర్థ్యమును కల్గినవారు) అనుచు తెలిపిరి. భగవానుడు పలు సందర్భములలో ఆళ్వార్లచే మదగజముగా రూపింపబడెను. అట్టి మదగజమువంటి భగవానుని కూడ నియంత్రింప గల్గిన వాక్పటిమ ఆళ్వార్లు కలదని ఇచటి తాత్పర్యము. ఈ సందర్భమున ''**చక్రహస్తేభచక్రం**'' (చక్రధారి అను గజమును బంధించు చక్రబంధము వంటివారు) అను అభియుక్తుల సూక్తులు స్మరింప తగినవి. ఈ విధముగా పరాంకుశ నామము ఆళ్వార్ల ప్రబంధవైశిష్ట్యమును సూచించుచున్నది.

''**ముని**'' శబ్ద ప్రయోగ మిచట మిక్కిలి అర్థవంతము. ''**మననాత్ మునిః**'' అను ప్రమాణమును బట్టి మననశీలుడగువాడు ముని అనబడును. ఆళ్వార్లు ఎల్లప్పుడును భగవానుని స్వరూప రూపగుణవిభూతులను గూర్చి మననము చేయుచు, సంతోషించువారు. పరాశరభట్టర్ శ్రీరంగరాజస్తవ ప్రారంభమున ఆళ్వార్లను గూర్చి ''**కృష్ణతృష్ణాతత్త్వం ఉదితం**'' అనిరి. అనగా కృష్ణుని యందు లోకులందరకు కల భక్తి ఆళ్వార్ల రూపమును పొందినదని భావము. భక్తి అనగా తైలధారవలె నిరంతర మననమే కదా! కావున ఆళ్వార్లకు ముని అను పేరు మిక్కిలి తగినది. ఇట్లు ముని శబ్దము ఆళ్వార్ల భక్తి వైలక్షణ్యమును తెలుపు చున్నది.

ముని శబ్దమునకు ఎల్లప్పుడును సర్వేశ్వరునియొక్క, లోకముయొక్క రక్షణను గూర్చి మననము చేయువారనియు అర్థము చెప్పవచ్చును. సర్వరక్షకుడగు సర్వేశ్వరుని రక్షణను గూర్చి భక్తుడు చింతించుట ప్రేమ కార్యమని ఆచార్యులు నిష్కర్షించిరి. ఆళ్వార్లు తమ ప్రబంధములలో ''**ఆఱు మాళార్**'' (రక్షించు వారెవ్వరు?) అని, ''**వాళుమ్ విల్లుమ్ కొణ్డు పిన్ శెల్ వార్ మఱ్ఱిల్లై**'' (కత్తిని, విల్లును గైకొని నీ వెంట వచ్చువారు మరి లేరు కదా!'') అని, ''**తనిమైయుమ్ పెరిదునక్కు**'' అని ఇట్లు పలుచోట్ల భగవదవతారములలో స్వామి రక్షణను గూర్చిన చింతను ప్రకటించిరి. అట్లే, ఆళ్వార్లు తమ కృతులలో పలుసందర్భములలో ''**ఓ ఓవులకినతియల్వే**'' (అయ్యో! ఈలోకము యొక్క ప్రకృతి) అని, ''**ఇవై యెన్న వులకి యఱ్ఱై**'' (ఇవి ఏమి లోక రీతి) అని పల్కుచు లోకరక్షణపట్లగ తమకుగల చింతను తెలియజేసిరి. వీరు తమ ప్రబంధములలో పలు దశకములలో పరోపదేశము చేయబడుటయు గమనింపతగినది. ఈ విధముగా ముని శబ్దము ఆళ్వార్ల భగవద్భక్తి పరాకాష్ఠను, పరానర్థమును చూచి సహింపలేకుండుట అను ఉత్తమ శ్రీవైష్ణవ లక్షణమును తెలియజేయుచున్నది.

భగవానుడు గీతలో ''**సిద్ధానాం కపిలో మునిః**'' అనుచు యోగసిద్ధులలో తాను కపిలముని అని పల్కెను. కావున ముని శబ్దము యోగులను తెలియజేయునని చెప్పవచ్చును. నమ్మాళ్వార్లు యోగ సమాధిలోనుండి భగవానుని దర్శించి, తదనుగ్రహమువలన వేదసారములగు సుమధుర ప్రబంధములను రచించిరి. యోగవిద్యను, ప్రబంధములను తమశిష్యులగు మధురకవులకు ఉపదేశించిరి. నాథమునులును నమ్మాళ్వార్ల అనుగ్రహము

వలన దివ్యప్రబంధములనే కాక, యోగవిద్యను కూడ గ్రహించిరి. ఇట్లు ఆళ్వార్లు యోగ శాస్త్ర ప్రవర్తకులని చెప్పనగును. అట్టి ఆళ్వార్లు యోగ సిద్ధుడను అర్థమిచ్చు ముని శబ్దముచే నిర్దేశింప బడుట మిక్కిలి సముచితమైనది.

ఈ విధమైన గొప్పతనమును కల్గిన ఆళ్వార్లయొక్క మహిమను లోకు లందఱు గ్రహింపవలెను ఉదారమైన భావముతో ప్రస్తుతస్తుతికర్త ఈ కృతిని రచించిరి. కావున వారిని "**దయావారిధి**" అని కీర్తించుట తగినది. స్తుతికర్త చేసిన ప్రయత్నము లోక శ్రేయస్సుకొఱకు కావున వారి ప్రయత్నము ఆళ్వార్లకు సంతోషమును కల్గించినది. ఈ భావము "**పరాంకుశమునిం ప్రసాదయన్**" అనుటచే కల్గుచున్నది. ఇట్లు ఆచార్యులకు ముఖోల్లాసమును కల్గించుటయే కదా శిష్యకృత్యము.

ఇచట "**దయావారిధిం**" అనుటచే రూపకము కలదు. వృత్తము రథోద్ధత. పూర్వార్ధమున "**శ్రీపరాంకుశనుతిం య ఆతనోత్ తత్పదాబ్జపరభక్తిచోదితః**" అనుపాఠాంతరము కలదు. పరాంకుశుల పాదాబ్జముల పట్లగల పరభక్తిచే ప్రేరేపింపబడినవారై ఏ ఆచార్యులు పరాంకుశస్తవమును రచించిరో - అని భావము.

**2) శ్రీనివాసార్యతనయం శ్రీరంగేశపదాశ్రయమ్ ।**
**వరదార్య మహం వందే వాధూలకులభూషణమ్॥**

**ప్ర. అ** - శ్రీనివాసార్యతనయం = శ్రీనివాసాచార్యుల కుమారులు, శ్రీరంగేశపదాశ్రయం = శ్రీరంగ నాథుని పాదములను ఆశ్రయముగా కలవారు, వాధూలకులభూషణం = వాధూల గోత్రమునకు అలంకారమును అగు, వరదార్యం = వరదాచార్యులను, అహం = నేను, వందే = నమస్కరించుచున్నాను.

**వ్యాఖ్య :-** శ్రీనివాసాచార్యుల కుమారులు, శ్రీరంగనాథుని ఆశ్రయముగా కలవారు. వాధూల వంశమునకు నగవంటి వారగు వరదాచార్యులను నమస్కరించుచున్నాను అనిభావము.

ముందు శ్లోకమువలె ఈ శ్లోకము కూడ స్తుతికర్తను కీర్తించు శ్లోకము. ఈ రెండును ఈ స్తోత్రమునకు "**తనియన్**" (ముక్తక ప్రార్థనాశ్లోకములు) వంటివి. శ్రీరంగేశపదాశ్రయమనుటచే వరదాచార్యులు శ్రీరంగమున నివసించిరని ఏర్పడుచున్నది. చిట్టచివరి శ్లోకములో కూడ "వరదో **గురుః నః రంగేశ దీవ్యతు సమాః శత మున్నతశ్రీః**" అనియు కలదు. "వది- **అభివాదన స్తుత్యోః**" అను ధాతువునుండి నిష్పన్నమైన 'వందే' అనుక్రియవలన "**శిన్దైయాలుమ్ శొల్లాలుమ్ శెయ్‌కైనాలుమ్**" అనునట్లు మానసికవాచిక కాయిక రూప సమాశ్రయణము తెలుప బడినది.

ఈ స్తోత్రము చివర స్తుతికర్త స్వయముగా "**వాధూలవేంకటపతిం వరదార్యసూనుం అస్మద్గురుం**" అని పల్కుటయు, ఆపిమ్మట గల శ్లోకమున "**వాధూలవేంకటపతేస్తనయో గురు

ర్ణః'' అని ఉండుటచే స్తుతికర్త తండ్రిపేరు వేంకటపతి అని తెలియుచున్నది. కాని, ఈ శ్లోకమున ''శ్రీనివాసార్యతనయం'' అని ఉండుటచే స్తుతికర్త శ్రీనివాసాచార్యుల కుమారులని ఏర్పడుచున్నది. ఈ వ్యత్యాసమునకు గల కారణము స్పష్టముగా తెలియుటలేదు. ప్రాయశః శ్రీనివాసాచార్య అనునామము వేంకటపతి శబ్దమునకు అనువాదమేమోనని తోచుచున్నది. ఇట్లు నామమును రూపాంతరమున అనుసంధించుట అచట అచట కన్పించుచున్నది. మణవాళమహాముసులు గీతార్థ సంగ్రహవ్యాఖ్యాన- ప్రారంభమున ''**తిరునావీఱు డైయపిరాన్**'' అను తమ పితృపాదుల పేరును ''గోవిందార్య'' రూపమున అనుసంధించిరి కదా!

## పరాంకుశ పంచవింశతి

(శ్రీవాధూల వరదాచార్య కృతము)

**1) శ్రీమన్ పరాంకుశ నిరంకుశ తత్త్వబోధ**
**వాత్సల్యపూర్ణ కరుణాపరిణాహరూప ।**
**సౌశీల్యసాగర మనంతగుణాకరం త్వాం**
**సంసారతాపహరణం శరణం వృణేఽహమ్॥**

ప్ర.అ - శ్రీమన్ = భగవత్కైంకర్యలక్ష్మిని కల్గిన, పరాంకుశ = ఓ పరాంకుశమునీ! నిరంకుశ = సర్వస్వతంత్రుడగు భగవానునియొక్క, తత్త్వ బోధ = స్వరూపరూపాది తత్త్వముల జ్ఞానమును కలవాడా!, వాత్సల్యపూర్ణ = వాత్సల్యముతో పరిపూర్ణుడా!, కరుణాపరిణాహరూప = కరుణ యొక్క వైశాల్యమనదగు రూపమును కలవాడా! సౌశీల్యసాగరం = సౌశీల్య గుణమునకు సముద్రుడవు, అనంతగుణ + ఆకారం = అవధిలేని కల్యాణగుణములకు నిలయము, సంసారతాపహరణం = సంసారతాపమును తీర్చునట్టి, త్వాం = నిన్ను, అహం = నేను, శరణం = రక్షకునిగా, వృణే = వరించుచున్నాను.

**వ్యాఖ్య :-** ''**పరాంకుశపంచవింశతి**'' అను ఈ స్తోత్రమును రచింపనెంచిన కవి మొట్టమొదటగా ప్రస్తుతశ్లోకమున ఆళ్వార్ల శరణాగతిని చేయుచున్నారు.

కైంకర్యలక్ష్మిని కల్గిన పరాంకుశమునీంద్రా! నిరంకుశుడగు భగవానుని స్వరూప రూప గుణ విభూతుల జ్ఞానమును కల్గిన స్వామీ! వాత్సల్యముతో నిండిన వాడా! కరుణ రూపుదిద్దు కొనునట్లున్నవాడా! సౌశీల్యగుణమునకు సముద్రము వంటి, అంతులేని గుణములకు స్థానమైన నిన్ను సంసార తాపమును తీర్చు శరణముగా నేను ఆశ్రయించుచున్నాను అని భావము.

''**మంగళాదీని మంగళమధ్యాని మంగళాంతాని చ శాస్త్రాణి ప్రథంతే**'' అను మహా భాష్యవచనమును అనుసరించి, గ్రంథకర్తస్తోత్ర ప్రారంభమున మంగళకరమగు శ్రీశబ్ద ప్రయోగమును చేసెను. మఱియు ''**ఆశీః నమస్క్రియా వస్తునిర్దేశో వాఽపి తన్ముఖమ్**'' అని

కావ్యప్రారంభమును ఆశీస్సుతో కాని, నమస్కారముతో కాని, కథావస్తు నిర్దేశముతో కాని చేయవలెనను నియమమును బట్టి ఈ స్తోత్రమును శరణాగతిరూపమైన నమస్కారముతో ప్రారంభించిరి.

(శ్రీమాన్) - శ్రీ - అనగా సంపద. నిజమైన సంపద ఏమనగా భగవత్కైంకర్యమే. ''పరమనై **ప్పయిలుమ్ తిరువుడైయార్**'' అని ఆళ్వార్లు స్వయముగా పల్కిరి కదా! ఆళ్వార్లు ''**ఒழிవిల్ కాలమెల్లామ్.... ఒழுవిలా వడిమై శెయ్యవేణ్డుమ్ నామ్**'' అనుచు సర్వదేశసర్వకాల సర్వావస్థలలో భగవత్కైంకర్యమును చేయవలెనని ఆశపడిరి. మఱియు, ఈకైంకర్యము భాగవతపర్యంతము అయినపుడే పరిపూర్ణమగు ననియు పల్కిరి. ఇట్టి కైంకర్యలక్ష్మిని కల్గిన వారు ఆళ్వార్లు. ''**తొణ్డర్క్కముదెన్న చ్చొల్మాలైకళ్ శొన్నేన్**'' (భగవద్భక్తులకు అమృతమన దగిన పాశురమాలలను పల్కితిని) అని ఆకైంకర్యమును అనుష్ఠించిరి కూడ- కావున ''శ్రీమన్'' అని ఆళ్వార్లను సంబోధించుట అర్థవంతము.

'శ్రీమన్' అనుటకు ''**స తు నాగవరః శ్రీమాన్**'' అనునట్లు భక్తిసంపదను కల్గిన వారనియు చెప్పవచ్చును. లేక, భక్తులగు మాసంపదకు మూలమైన సంపదను కలవారనియు చెప్పవచ్చును. ఇట్టి వివరణమును ''**మాతాపితా..**'' అను తనియన్ శ్లోకములోని ''**శ్రీమత్తదంఘ్రియుగళమ్**'' అను పదమును పిళ్లై లోకమ్‌జీయర్ అను ఆచార్యులు వ్యాఖ్యానించుచు తెలిపిరి. ''**ఎనృడైయ సమ్పత్తుక్కు ఊర్రాన ఐశ్వరత్తై యుడైయవరెన్నవుమామ్**'' అను అచటి సూక్తులు స్మరణీయములు. అనగా నమ్మాళ్వార్ల భక్తుల సంపదకు మూలము సంపద వారి పాదములే. అట్టి పాదద్వంద్వమును కలవారని తాత్పర్యము. లేక, ''**విణ్ణులకాళీరో పువనముழு దాళీరో?**'' (పరమ పదమును ఏలెదరా? సమస్త భువనమును ఏలెదరా) అనునట్లు భగవదనుగ్రహము వలన ఉభయవిభూతులు ఆళ్వార్ల అధీనములు కావున 'శ్రీమన్' అనుసంబోధన సార్థకము. లేక, ''**కః శ్రీః శ్రియః**'' అనునట్లు సర్వ సంపదకుమూలమైన భగవానుని కలవారని అర్థము. భగవానుని పలువురు ఆళ్వార్లు, ఆచార్యులును, '**వైత్తమానిది**'' అని, ''**నిధియునై**'' అని, ''**అస్మద్ధనం**'' అని ప్రస్తుతించిరి కదా! అట్టి భగవానుని తనవశమున కలవారగుటచే ఆళ్వార్లను 'శ్రీమన్' అని సంబోధింపబడుట తగినది. (పరాంకుశ నామస్వారస్యమును గూర్చి ప్రార్థనా శ్లోకమున తెలుపబడినది.)--

(**నిరంకుశ తత్త్వబోధ**) - నిరంకుశుడగు భగవానుని గూర్చిన తత్త్వజ్ఞానమును కలవారని భావము. ''**నతత్సమశ్చాభ్యధికశ్చ దృశ్యతే**'' అనిసంస్కృత వేదము, ''**ఒత్తారుమ్ మిక్కారిళుమ్**'' అని ద్రవిడవేదమును భగవానునకు సమానులు కాని, అధికులు కాని ఎవ్వరు లేరని పల్కెను. కావున భగవానుని నియంత్రించు వారెవ్వరును లేకుండుటచే భగవానుడు నిరంకుశుడు. అట్టి భగవానుని స్వరూప రూప గుణవిభూతులను యథాతథముగా ఆభగవానుని

న్నిర్హేతుక కృపవలన దర్శించిన వారగుటచే ఆళ్వార్లు నిరంకుశుడగు భగవానుని తత్త్వముయొక్క జ్ఞానమును కల్గినవారు. లేక, భగవానుని తత్త్వబోధ ఎవరివలన కల్గునో అట్టి ఆళ్వార్లు అనియు అర్థమును చెప్పవచ్చును. ఆళ్వార్ల ప్రబంధములన్నియు భగవత్స్వరూపమును నిష్కర్షించి తెలుపునవి కదా! లేక నిరంకుశ శబ్దమును తత్త్వబోధకు విశేషణముగా అన్వయించి నిరవధికమైన తత్త్వజ్ఞానమును కల్గినవారనియు చెప్పవచ్చును. ''మయర్వార మదినలమ్'' అనునట్లు భ్రమ, ప్రమ విప్రలంభాది దోషములతో కూడియుండుట కాని, దేశకాలాదిపరిచ్ఛిన్నమై యుండుటకాని జ్ఞానమునకు తక్కువతనము. అట్టిపరిమితులు లేని నిరవధికమైన జ్ఞానమును కల్గినవారు ఆళ్వార్లు అని భావము. ఆళ్వార్ల జ్ఞానము స్వప్రయత్నముచే సాధించినది కాదు. భగవదను గ్రహమువలన వచ్చినది. కావున అట్లు నిరంకుశమగుటలో ఆశ్చర్యములేదు.

''నిరంకుశ'' అనివ్యక్తనముగా సంబోధనాంతముగా కూడ అన్వయింపవచ్చును. ఇంతకుముందుగల సంబోధన ''**పరాంకుశ**'' అని యుండుటచే, భగవానుని వశము చేసి కొనగల్గిన ఆళ్వార్లను నియమించువారు వేరొకరు కలరా? అనుసందేహము కల్గుటకు అవకాశము కలదు. ఈ సందేహమును ''నిరంకుశ'' అను ప్రస్తుత విశేషణము తీర్చు చున్నది. ఆళ్వార్లను నియమించు వారెవ్వరును లేరని భావము. ఈ అన్వయమున '**తత్త్వబోధ**' అనునది వేరొక సంబోధన. (**వాత్సల్యపూర్ణ**) - వాత్సల్యగుణముచే పూర్ణుడు. వాత్సల్యమను గుణమును ధేనువు తన బిడ్డ విషయమున ప్రదర్శించును. తన గర్భమునుండి పుట్టిన లేగ దూడ శరీరమంతయు మలినము ఉన్నను, ఆమలినమును చూచి అసహ్యించుకొనక తల్లి ఆవు తన నాలుకతో ఆమలినమును అంతటిని తొలగించి, శుభ్రము చేయును. ఈగుణమే వాత్సల్యము. వత్సమనగా లేదూడ. వత్సమగు లేదూడ పట్ల ప్రదర్శింపబడు గుణమగుటచే వాత్సల్యమను పేరు వచ్చినది. ఆళ్వార్ల విషయమున వాత్సల్యమేమనగా - ఆళ్వార్లు ఆశ్రితుల యందలి దోషములను గణింపక, వానిని భోగ్యములు గానే తలచి, ఉపదేశములతో కరుణింతురని తాత్పర్యము.

(**కరుణాపరిణాహరూప**) - కరుణయొక్క విస్తృతియే రూపు దాల్చినట్లున్నవాడా! అని భావము. '**పరిణాహో విశాలతా**' అని అమరము. కరుణ అనగా తనకు సంబంధములేని వారి యందును వారి కష్టమును చూచి ఓర్వలేక అయ్యో! అని జాలిపడుట. ''**వాత్సల్యపూర్ణ కరుణాపరిణాహరూప**'' - అను దానిని ఒకే సమానముగా అనగా ఒకే సంబోధనాంతపదముగా అన్వయింపవచ్చును. అపుడు వాత్సల్య గుణముయొక్క, పరిపూర్ణ కారుణ్యముయొక్క విస్తృతిని రూపముగా కల్గిన వారని భావము. ఆళ్వార్ల కారుణ్యగుణము వారి ప్రబంధములలోని పరోపదేశ దశకములలో పలుచోట్ల కానవచ్చును.

(**సౌశీల్యసాగరం**) - సౌశీల్యగుణమునకు సముద్రమువంటి వారని భావము. సౌశీల్యమనగా - ''**మహతః మందైః సహ నీరంధ్రేణ సంశ్లేషః**'' అనగా గొప్పవ్యక్తి తనకంటె

తక్కువవారితో మనస్సున ఎట్టి సంకోచమును లేక కలియు గుణము. అట్టి గుణమును కలిగిన సముద్రమును ఇచట ఉపమానముగా పేర్కొనుట మిక్కిలితగినది.

(**అనంతగుణాకరం**) - అసంఖ్యాకములైన గుణములను రత్నములకు గని అర్థము. **"ఖనిః స్త్రియా మాకరః"** అనునిఘంటువు వచనమును బట్టి ఆకర శబ్దమునకు గని అని అర్థము. దీనివలనగనులలో లభించు రత్నములతో గుణములకు సామ్యము ధ్వనించుచున్నది. గుణములను రత్నములతో పోల్చుటకవి పరిపాటి.

(**సంసారతాపహరణం**) ఈ విశేషణమును విధేయ విశేషణముగా అన్వయించుటలో స్వారస్యముకలదు. బాహ్యతాపమును తీర్చునట్టి సరస్సు చందనము, కర్పూరము, చంద్రుని వెన్నెల, వృక్షచ్ఛాయల కంటె ఆళ్వార్లకు కలవైశిష్ట్యము (సామ్యముతో పాటు) ఇచట ధ్వనించు చున్నది. ఇట్టి ఆళ్వార్లను రక్షకునిగా ఆశ్రయించుచున్నాను అని తాత్పర్యము.

ఈ శ్లోకమున "**శ్రీమన్**" అనుసంబోధనద్వారా స్వామిత్వము, **"పరాంకుశ"** అనుటవలన పరాభిభవనరూపమైన తేజస్సు, ఐశ్వర్యము, శక్తి మొదలగు గుణములు, **"నిరంకుశ తత్త్వబోధ"** అనుటచే జ్ఞానము మొదలగు ఆశ్రయణసౌకర్యాపాదకములగు గుణములు సూచింపబడినవి. అట్లే **"వాత్సల్యపూర్ణ, కరుణాపరిణాహరూప"** అనుటచే వాత్సల్యము, కృప, **"సౌశీల్యసాగరం"** అనుటవలన సౌశీల్యము, దానిని బట్టి సౌలభ్యము, మార్దవము మొదలగు ఆశ్రితకార్యానుకూల గుణములును తెలుపబడినవి. మఱియు, **'పరాంకుశ'**, **'నిరంకుశ'** అనునామములు పురుషకారనిరపేక్షతను తెలుపును. ఇట్లు ఈ శ్లోకమున ఆళ్వార్ల శరణ్యత్వపూర్తి తెలుపబడినది. "**శక్తత్వే సతి దయావత్త్వం**" - రక్షించు శక్తియు, రక్షింపవలెనను దయయు కల్గియుండుటయే కదా శరణత్వము. కావున "**శరణం వృణే**" అనుట అర్థవంతము. "**త్వాం**" "**అహం**" అను సర్వనామ శబ్దములు అద్వితీయమైన శరణ్యత్వమును, మహావిశ్వాసమును కల్గియుండుట తెలుపును. "**అనన్యసాధ్యే స్వాభీష్టే మహావిశ్వాసపూర్వకమ్, తదేవోపాయతా యాచ్ఞా ప్రపత్తిః శరణాగతిః**" అని చెప్పబడు శరణాగతి స్వరూపము ఈశ్లోకమున సూక్ష్మముగా సూచింపబడినదనియు చెప్పవచ్చును.

ఈ శ్లోకములోని విశేషణములన్నియు ఆళ్వార్లకు, భగవానునకును తగియుండుట గమనింపతగినది. "**శ్రీమన్, పరాంకుశ, నిరంకుశ, వాత్సల్యపూర్ణ, కరుణాపరిణాహరూప, సౌశీల్యసాగర, అనంతగుణాకర**" అనువిశేషణములు ఇరువురకును సమానములే. ఆళ్వార్లు భగవదంశవలన ఆవిర్భవించిరను వికల్పమునకు అనుగుణముగా కవి అయిదవశ్లోకమున "**ఆసీత్ పురాణపురుషః శఠవైరియోగీ**" అనుచు పల్కుట ఇచట స్మరణీయము. "**శ్రీమన్, పరాంకుశ**" అనుసంబోధనలు భట్టర్‌చే రచింపబడిన "**భూతంసరశ్చ**" అను తనియన్ శ్లోకములోని "**శ్రీమత్పరాంకుశం**" అను ప్రయోగమును తలపింపచేయు చున్నది.

ఈ స్తుతిలోని మొదటి రెండు శ్లోకములు పరాంకుశద్వయమనదగి యున్నవి. వానిలో మొదటిదగు ఈశ్లోకమున ఆళ్వార్ల సమాశ్రయణము తెలుపబడినది. ఈస్తోత్రములోని శ్లోకములన్నియు వసంతతిలకవృత్తమున రచింపబడినవి. వసంతర్తువున అవతరించిన ఆళ్వార్లను వసంతతిలక వృత్తమున స్తుతించుట ఉచితమైనది. ఈస్తోత్రములోని భావములకు యతిరాజవింశతిలోని భావములకు పలుసామ్యములు కలవు. అట్లే, యతిరాజవింశతి కూడ వసంతతిలకవృత్తమున రచింపబడుట గమనింపతగినది.

2 **కాసారసంయమిముఖాః కమలాసహాయ-**
**భక్తాః ప్రపత్తిపదవీనియతా మహాంతః।**
**యస్యాభవ న్నవయవా నిజపారతంత్ర్యాత్**
**తస్మై నమో వకుళభూషణదేశికాయ ॥**

ప్ర.అ - యస్య = ఏ ఆళ్వార్లకు (పరాంకుశులకు), కమలాసహాయ భక్తాః = శ్రియఃపతి యొక్క భక్తులు, ప్రపత్తిపదవీ = శరణాగతి అను మార్గమునందు (ఉపాయమునందు) నియతాః = స్థిరముగా కలవారు, కావుననే, మహాంతః = మహాత్ములును అగు, కాసారసంయమిముఖాః = కాసారయోగి (పొయ్కై ఆళ్వార్లు) మొదలగు వారు, నిజపారతంత్ర్యాత్ = తమయొక్క భాగవతపారతంత్ర్యము వలన, అవయవాః = అంగభూతులై, అభవన్ = అయినారో, అట్టి, వకుళభూషణ దేశికాయ = నమ్మాళ్వార్లు అను ఆచార్యశ్రేష్ఠులకు, నమః = నమస్కారము.

**వ్యాఖ్య** :- ముందుశ్లోకమున ఆళ్వార్లను శరణాగతిచేసిన కవి ఇందు కైంకర్య ప్రార్థనను చేయుచున్నారు. కావున మొదటి రెండుశ్లోకములు పరాంకుశద్వయమనదగును.

శ్రియఃపతి అగు భగవానుని యందు గొప్పభక్తిని కలవారు, ప్రపత్తినిష్ఠాగరిష్ఠులును అగు కాసారయోగి మొదలగు తొమ్మిదిమంది ఆళ్వార్లు ఏ నమ్మాళ్వార్లకు అవయవభూతులుగా చెప్పబడుచున్నారో అట్టి, వకుళభూషణులను పేరు కల్గిన నమ్మాళ్వార్లకు నమస్కారము అని భావము. ఆళ్వార్ల పదిమందిలో కాసారయోగి మొదటి వారగుటచే **'కాసారసంయమిముఖాః''** అనుట సమంజసము.

(కమలాసహాయభక్తాః) - కమలా సహాయపదము సాభిప్రాయకము. **''కమలాయాః సహాయః''** - కమలకు సహాయమైనవాడు **''కమలా సహాయా యస్య సః''** - కమలను సహాయముగా కలవాడు అని రెండు విధములుగా ఈ విశేషణమునకు అర్థమును చెప్పవీలున్నది **''అనన్యా రాఘవేణాహం భాస్కరేణ ప్రభా యథా''** అని, **''అనన్యా హి మయా సీతా భాస్కరేణ ప్రభా యథా''** అని చెప్పబడినట్లు లక్ష్మి, లక్ష్మీనాథుల సంబంధము అనపాయము అయినను ఇచట పురుష కారమును సూచించు రెండవ వివరణము మిక్కిలి అర్థవంతము. లక్ష్మీపురుషకార

పురస్సరముగా చేయు సమాశ్రయణమే ఫలవంత మగును. మఱియు సలక్ష్మీకుడగు భగవానుడే సేవ్యుడు. కావుననే ద్వయములోని రెండుచోట్ల శ్రీమత్పదము సార్థకమని అభిజ్ఞులగు ఆచార్యుల వివరణము.

**(ప్రపత్తిపదవీనియతాః)** :- **''ప్రపత్తిరూపా పదవీ మార్గః అర్థాత్ ఉపాయః, నియతః యేషాంతే'', ''ప్రపత్తి పదవ్యాం నియతాః''** అను రెండువిధములుగా వివరింపవచ్చును. అర్థములో భేదములేదు. ప్రపత్తి అనగా సాధ్యభక్తియే. ఈ ప్రపత్తిని సాధనముగా గొని ఆళ్వార్లు అందఱు భగవదాశ్రయణమును చేసిరి, తరించిరి. ''**ప్రపత్తి బలతారితవిష్ణుమాయామద్వంశ్యా**'' అని భట్టరు శ్రీరంగరాజస్తవమున పల్కిరికదా!

**(యస్యా భవ న్నవయవాః)** - నమ్మాళ్వార్లు ఆళ్వార్లు అందఱికిని అంగి అని, మిగిలిన ఆళ్వార్లు వారికి అవయవభూతులనియు ఆచార్యులు అభిప్రాయపడిరి. ఆఱాయిరప్పడి గురుపరంపరా ప్రభావమున నమ్మాళ్వార్ల వైభవప్రారంభమునగల ''**ఆళ్వార్ కళెల్లారైయుమ్ అవయవ భూతరాకవుడైయ నమ్మాళ్వార్**'' అనుసూక్తి అనుసంధేయము. భట్టరు ''**భూతం సరశ్చ**'' అను ప్రార్థనాశ్లోకమున అవయవభూతులగు ఆళ్వార్లను కీర్తించిన పిదప ''శ్రీమత్పరాంకుశమునిం'' అని చివరగా అంగి అగు నమ్మాళ్వార్లను స్తుతించిరి. ఈసందర్భమున పిళ్లైలోకంజీయర్ వ్యాఖ్యానమునగల **''కీళ్ సొన్నవర్కళెల్లారుమ్ ఒరు తట్టుమ్, శ్రీ మత్పరాంకుశమునిం ఎన్గైయాలే ఆళ్వార్ ఒరువరుమ్ ఒరు తట్టు మెన్నుమదు తోన్ఱ్ఱుకిఱదు. ఎల్లారైయుమ్ అవయవభూతరా యుడైయరాయితే యాళ్వార్ తామిరుప్పదు''** అను వివరణము స్మరణీయము. నమ్మాళ్వార్లకు పూదత్తాళ్వార్లు శిరస్సు, పొయ్గై ఆళ్వార్లు, పేయాళ్వార్లు నేత్రములు, పెరియాళ్వార్లు ముఖము, తిరుమళిశైయాళ్వార్లు కంఠము, కులశేఖరులు, తిరుప్పాణాళ్వార్లును హస్తములు, తిరుమఙ్గైయాళ్వార్లు నాభి, మధురకవులు పాదములు, శ్రీరామానుజులు పాదుకలు అని ఆచార్యుల అభిప్రాయము. కావుననే ఆళ్వార్లకు ప్రపన్నజన కూటస్థులను పేరు సార్థకము.

అంగి అగు ఆళ్వార్లను ఆశ్రయించుటద్వారా కవి అంగభూతులగు మిగిలిన ఆళ్వార్లను అందఱిని ఆశ్రయించినట్లయినది. అట్లే ఆళ్వార్ల కైంకర్యమును ప్రార్థించుట ద్వారా మిగిలిన ఆళ్వార్ల కైంకర్యమును ప్రార్థించినట్లయినది. ఆళ్వార్లు అందరిలో నమ్మాళ్వార్లు ముఖ్యులైనట్లే, దివ్యప్రబంధములన్నిటిలో నమ్మాళ్వార్లు రచించిన నాల్గు ప్రబంధములు ప్రధానములని, మిగిలిన ప్రబంధములు వానిని వివరించుచున్నవని ఆచార్యుల అభిప్రాయము. వకుళభూషణులనగా వకుళపుష్పములను ఆభరణముగా కలవారని అర్థము. వకుళమనుటకు తెనుగున పొగడపూవు అని పేరు.

**దిశతి – ఉపదిశతి ఇతి దేశికః** - ఇచ్చువాడు, ఉపదేశించువాడు అను అర్థమిచ్చు దేశిక శబ్దమునిచట ప్రయోగించుట తగినది. ఆశ్రితులకు ఆత్మలాభమును కల్గించువారు,

కర్ణామృతములనదగిన ప్రబంధములను లోకోజ్జీవనార్థము అనుగ్రహించినవారు, ప్రపత్తిమార్గమును తాము అనుష్ఠించి, లోకమునకు ఉపదేశించిన వారు కదా ఆళ్వార్లు. ఈ శ్లోకము తిరువాయ్ మొళ్ళి లోని 2-9-4వ పాశురము ఈడు వ్యాఖ్యానమునకు గల జీయర్ అరుమ్పదములో ఉదహరింపబడుట ఈ స్తోత్రముయొక్క శిష్టపరిగ్రహత్వమును తెలియజేయుచున్నది. కాని అచట ఆకరము తెలుపబడలేదు.

3) **శ్రీరంగరాజపదపంకజసంగశీలం**
**శ్రేయఃపదం మధురపూర్వకవే రపూర్వమ్ ।**
**నాథార్యయామునయతీశ్వరభాగధేయం**
**నాథం కులస్య మమ నౌమి పరాంకుశార్యమ్ ॥**

ప్ర.అ - శ్రీరంగరాజ = శ్రీ రంగనాథునియొక్క, పదపంకజ = పద్మములవంటి పాదములయొక్క, సంగ = సంబంధమునే, శీలం = స్వభావముగా కల్గినవారు, మధురపూర్వకవేః = మధురకవులయొక్క, అపూర్వం = గొప్పదైన, శ్రేయఃపదం = శ్రేయస్సునకు స్థానము, నాథ + ఆర్య = శ్రీనాథమునులు, యామున = శ్రీయామునాచార్యులు, యతి+ ఈశ్వర = శ్రీరామానుజులు అనువీరియొక్క, భాగధేయమ్ = భాగ్యమును, మమ = నా యొక్క, కులస్య = కులముయొక్క, నాథం = ప్రభువును అగు, పరాంకుశ+ ఆర్యం = నమ్మాళ్వార్లను, నౌమి = స్తుతించుచున్నాను.

**వ్యాఖ్య** :- శ్రీరంగనాథుని పాద సంబంధమును కల్గియుండుటయే స్వభావముగా కల్గినవారు, మధురకవి ఆళ్వార్ల యొక్క గొప్పదైన శ్రేయస్సుకు మూలము, నాథమునులు, యామునాచార్యులు, భగవద్రామానుజులను వీరికి గొప్పభాగ్యమును, నాకులమునకు ప్రభువు అగు పరాంకుశులను స్తుతించుచున్నాను.

**(శ్రీరంగరాజపదపంకజసంగశీలం)** - ''**శ్రీమాధవాంఘ్రిజలజద్వయనిత్యసేవాప్రేమావిలాశయ**'' అనునట్లు ఆళ్వార్లు ఎల్లప్పుడును శ్రీరంగనాథుని పాదములతో నిత్యసంబంధమును కల్గినవారు. నమ్మాళ్వార్లు పాయించిన తిరువాయ్మొళ్ళి దివ్యప్రబంధమున శ్రీరంగనాథుని గూర్చియేనని ''**వాన్ తికళుమ్ శోలైమదిళరఙ్గర్ వణ్పుకళ్ మేల్ ఆన్తతమిళ్ మత్తైకళాయిరముమ్**'' అని భట్టరు పల్కిరికదా! **(మధురపూర్వకవేః అపూర్వం శ్రేయఃపదం)** మధురపదమును పూర్వమును కల్గిన కవి అనగామధురకవి అని అర్థము. మధురకవులు నమ్మాళ్వార్ల శిష్యులు. సమకాలీనులు. ద్రవిడదేశములోని ''**తిరుక్కోళూర్**'' అను దివ్యక్షేత్రమున బ్రాహ్మణకులమున జన్మించిరి. మధురకవులు ఉత్తర భారతములోని దివ్యక్షేత్రములను దర్శించుచు క్రమముగా అయోధ్యను చేరిరి. వారికి ఒకనాటి రాత్రి అచటికి దక్షిణదిక్కులో ఒక గొప్ప దివ్యతేజస్సు కనుపించెను. ఆ తేజస్సును గూర్చి తెలిసికొనవలయునను కోరికతో

మధురకవులు ప్రయాణము చేయుచు చివరికి దక్షిణదేశములోని ఆళ్వార్ తిరునగరి అనుచోటికి చేరిరి. అచట ఆ తేజస్సు అదృశ్యమయ్యెను. దాని కొఱకు వెదకిచూచిన మధుర కవులకు చింతచెట్టుమూలమున యోగనిష్ఠులై యున్న నమ్మాళ్వార్లు కనుపించిరి. తాము చూచిన దివ్యతేజము ఆళ్వార్లదేనని గ్రహించిన మధురకవులు, వారికి సమీపమున చాల కాలము నిరీక్షించిరి ఎంతసేపటికిని ఆళ్వార్లుకన్నులు తెఱువకపోవుటచే మధుర కవులు ఒకపెద్దరాతిని ఎత్తిపడవేసిరి. అపుడు ఆళ్వార్లు కనులను తెఱచిచూచిరి. అపుడు మధురకవులు ఆళ్వార్లకు నమస్కరించి, వారిమహిమను తెలిసికొనగోరి ''స్వామీ! ప్రకృతిగర్భమున జీవుడు పుట్టినచో దేనిని తిని, ఎచట ఉండును?'' అని భావ గర్భితముగ ప్రశ్నించిరి. అందులకు నమ్మాళ్వార్లు'' దానినే తిని, అచటనే ఉండును'' అని బదులు పల్కిరి. ఆ సమాధానములోని ఆంతర్యమును గ్రహించి మధురకవులు ఆళ్వార్ల గొప్పతన మును గుర్తించి, వారిని ఆశ్రయించి, సేవచేయుచుండిరి. భగవదనుగ్రహమును పొందిన ఆళ్వార్లు తమ అనుభవ పరీవాహరూపములుగా తిరువిరుత్తము, తిరువాశిరియము, పెరియతిరువన్దాది, తిరువాయ్‌మొళ్ళి అను నాల్గు ప్రబంధములను మధురకవులకు అనుగ్రహించిరి. (నమ్మాళ్వార్లకు) పిమ్మట మధురకవులు ఆళ్వార్లవైభవమును కీర్తించుచు ''**కణ్ణినుణ్ శిఱుత్తాম్బు**'' అనుచిన్న ప్రబంధమును రచించుటయేగాక, ఆళ్వార్ల అర్చావతార విగ్రహమును చేయించి, ఆళ్వార్ తిరునగరిలో ప్రతిష్ఠించి, నిత్యోత్సవ, విశేషోత్సవాదులను నిర్వహించిరి. ఇట్లు నమ్మాళ్వార్లు మధురకవులకు గొప్ప శ్రేయఃపదము. **(నాథార్యయామునయతీశ్వర భాగధేయమ్)** - మధురకవులకు పిమ్మట కొంత కాలమునకు దివ్య ప్రబంధములు అదృశ్యము లయ్యెను. నాథమునులను ఆచార్యులు కణ్ణినుణ్ శిఱుత్తాম్బు దివ్యప్రబంధమును భక్తితో లక్షమార్లు జపింపగా, నమ్మాళ్వార్లు ప్రత్యక్షమై, నాలాయిర దివ్య ప్రబంధమును అనుగ్రహించిరి. ఈ అంశము ''**నాద నుక్కు నాలాయిర ముఱైత్తాన్ వాళ్ళియే**'' అను ఆళ్వార్ల మంగళాశాసనము వలన తెలియుచున్నది. కావున నాథమునులకు నమ్మాళ్వార్లు ఆచార్యులగుటచే గొప్ప భాగ్య మనదగినవారు. యామునులు నాథమునులకు పౌత్రులు. ఆళ్వార్లను తమ కులపతిగా, కులధనముగా తలచిరి. ''**ఆద్యస్య నః కులపతేః**'' అని, ''**విభూతిః సర్వం యదేవ నియమేన మదన్వయానామ్**'' అని స్తోత్రరత్నమున యామునులు పల్కుట ఇచట స్మరణీయము. యామునులకు పిమ్మట దర్శకనిర్వాహమును చేసిన భగవద్రామానుజులను ''**మాఱన్ అడి పణిన్దుయ్‌న్దవన్**'' అని అముదనార్ పల్కిరి. మణవాళమహామునులు యతిరాజవింశతిలో ''**పరాంకుశపాదభక్తం**'' అని వచించిరి. రామానుజులు నమ్మాళ్వార్ల పాదుకాస్థానీయులని పెద్దల నిర్వాహము. ఇట్లు ఆళ్వార్లు భగవద్రామానుజులకు పరోక్షముగా ఆచార్యులగుటచే గొప్పభాగధేయ మనదగినవారు.

ప్రసన్నజనకూటస్థులుగా వేరుపొందిన ఆళ్వార్లను ''**మమ కులస్య నాథం**'' అనుట తగినది.

4) పాపక్రియాసు నిరతాః శ్రుణుతాస్మదుక్తిం
తాపత్రయేణ భవినః పరితప్యమానాః ।
ఆపద్ధనం మధురిపో ర్భవతా మవిద్యా -
స్వాపప్రహాణనిపుణః శరణం శఠారిః ॥

**ప్ర.అ.** - పాప = పాపములగు, క్రియాసు = కర్మలయందు, నిరతాః = మిక్కిలి ఆసక్తినికల ఓ జనులారా!, తాపత్రయేణ = ఆధిభౌతిక, ఆధిదైవిక, ఆధ్యాత్మికములనబడు మూడు విధములైన తాపములచే, పరితప్యమానాః = బాధింపబడునట్టి, భవినః = సంసారులారా! అస్మదుక్తిం = మామాటను, శ్రుణుత = ఆలకింపుడు, మధురిపోః = భగవానునియొక్క, ఆపద్ధనం = ఆపద్ధనమును, అవిద్యా = అజ్ఞానము అను, స్వాప = నిద్రను, ప్రహాణ = పోగొట్టుటలో, నిపుణః= సమర్థుడు అగు, శఠారిః = శఠకోపులు (నమ్మాళ్వార్లు), భవతాం = మీకు, శరణం = రక్షకులు.

**వ్యాఖ్య :-** మొదట నమ్మాళ్వార్లను ఆశ్రయించిన పిమ్మట కవి ఈ శ్లోకమున ఆళ్వార్ల ఆశ్రయణమువలన తాము పొందిన లాభమును సంసారులకు తెలియజేయుచు, వారినందఱను ఆళ్వార్లను ఆశ్రయింపుడని ఉద్బోధించుచున్నారు. ఇట్ల కవి పరోపదేశమునుచేయుట ఆళ్వార్లను అనుసరించుటయే అని చెప్పవచ్చును. తిరువాయ్ మొళి దివ్య ప్రబంధమున . నమ్మాళ్వార్లు మొదటి దశకములో (ఉయర్వర) భగవానుని ఆశ్రయించిన పిమ్మట, ''వీడుమిన్'' అను రెండవదశకమున లోకుల నుద్దేశించి, భగవదాశ్రయణమును చేయుడని ఉద్బోధించిరికదా!

ఎల్లప్పుడును పాపరూపములగు కార్యములలో నిమగ్నులైన సంసారులారా! మా మాటను వినుడు. మీకు స్వరూపజ్ఞానములేని కారణముచే ఇట్లు తాపత్రయములచే బాధింపబడుచున్నారు. అవిద్య మీకు మైకమును కల్గించుచున్నది. ఆళ్వార్లు ఆ అవిద్యను పోగొట్టి, స్వరూప జ్ఞానమును కల్గింపకల్గినవారు. భగవానునకు సైతము ఆపద్ధనము వంటివారు. కావున వారే మీకు రక్షకులు.

ఆధ్యాత్మిక, అధిదైవిక, ఆధిభౌతికములని తాపములు మూడువిధములు. తాను అపేక్షించినది లభింపనపుడు కల్గు దుఃఖము, జ్వరము మొదలగు వ్యాధులవలన కల్గుబాధయు ఆధ్యాత్మికమనబడును. తన ప్రయత్నము వలనకాక, దైవమువలన ఏర్పడు అశనిపాతాదిబాధలు ఆధిదైవికములనబడును. సర్పములు, తేళ్లు మొదలగు భూతములవలన కల్గు తాపము ఆధిభౌతికము.

**(మధురిపో రాపద్ధనం)** - ఆపద్ధనమనగా ఆపదను నివారించుటకు తగిన ధనము. అందఱిని ఆపదల నుండి రక్షించు భగవానునకు కల్గిన ఆపద ఏమన తన ఆశకు తగినట్లు ప్రాణులందఱిని

ఉజ్జీవింప చేయలేక పోవుటయే. అట్టి ఆపదలో ఆళ్వార్లు భగవానునకు ధనమువంటి వారనగా- భగవానునకు కూడ సాధ్యముకాని సర్వలోకోజ్జీవనము ఆళ్వార్ల వలన సంభవించుటచే వారు భగవానునకు ధనము. ''ధినోతి – ప్రీణయతి – ఇతి ధనం – ధిను – (ప్రీణనే) అను ధనశబ్దవ్యుత్పత్తి ఇచట స్మరణీయము. గీతలో భగవానుడు స్వయముగా ''ప్రియో హి జ్ఞానినోఽత్యర్థం అహం స చ మమ ప్రియః'' అని పల్కుట గమనింపతగినది. మహనీయులగు ఆళ్వార్లు, ఆచార్యులును భగవానునకు ఆపద్ధనము వంటివారని పెద్దల అభిప్రాయము. భగవద్రామానుజుల అభిషేకగద్యలో (తిరుమజ్జన కట్టియమ్) ''సర్వేశ్వరాపద్ధనమో!'' అని యుండుట కూడ స్మరణీయము.

(అవిద్యా స్వాప ప్రహాణనిపుణః) – నిద్ర శరీరమునకు మైకమును కల్గించునట్లే అవిద్య మనస్సునకు మైకమును కల్గించును. కావున అవిద్య నిద్రతో పోల్చబడినది. శఠారి పదప్రయోగ మిచట మిక్కిలి అర్థవంతము. అజ్ఞానమూలకమగు శఠమను వాయువును నిర్జించిన వారగుటచే ఆళ్వార్లకు శఠారి అనిపేరు కల్గినది. అట్టి ఆళ్వార్లు అజ్ఞానమూలకమగు అవిద్యను తొలగించి, రక్షింతు రనుటలో ఆశ్చర్యమేమున్నది?

శ్లోకములోని ''అస్మదుక్తిం'' అను బహువచన ప్రయోగమును కవి ఆళ్వార్ల సంబంధము వలన కల్గిన సాత్త్వికాహంకారముచేగాని, తమవలె ఆళ్వార్లను ఆశ్రయించినపలువురు మహనీయులతో కూడియుండుటచేగాని చేసిరని చెప్పనగును. భగవత్కైంకర్యమువలె భాగవత కైంకర్యమును ఒంటరిగాకాక పలువురు భక్తులతో కలసి చేయుట శిష్టాచారముకదా! ''ఉక్తిం'' అను ఏకవచనమువలన వ్యక్తులు అనేకులైనను, వారి ఐకకంఠ్యము ధ్వనించుచున్నది.

5) నిత్యోఽథ ముక్త ఉత తద్గుణకో ముముక్షుః
వ్యాసాదివత్ భగవతా కి మనుప్రవిష్టః।
అత్ర్యాదిసూను రివ వర్ణయుగక్రమాత్ కి-
మాసీత్ పురాణపురుషః శఠవైరియోగీ॥

ప్ర.అ. - శఠవైరియోగీ - నమ్మాళ్వార్లు, నిత్యః కిం = నిత్యులా ఏమి? అథ = లేక, ముక్తః కిం = ముక్తులలో ఒకరా ఏమి? ఉత = లేక, తద్గుణకః = నిత్యుల, ముక్తుల యొక్క గుణమును కల్గిన, ముముక్షుః కిం = ముముక్షువులలో ఒకరా! లేక, వ్యాసాదివత్ = వ్యాస భగవానులు మొదలగు వారివలె, భగవతా = భగవానునిచే, అనుప్రవిష్టః కిం = ఆవేశింపబడినవారా ఏమి?, అత్రి+ ఆది సూనుః+ ఇవ = అత్రిమహర్షి మొదలగు వారియొక్క కుమారుడువలె (దత్తాత్రేయుడు వలె), వర్ణయుగ క్రమాత్ = బ్రాహ్మణ క్షత్రియాది వర్ణము యొక్క, కృతయుగాది యుగముల యొక్క క్రమమును అనుసరించి, పురాణపురుషః = భగవానుడు, (శఠవైరియోగీ) ఆసీత్ కిం = నమ్మాళ్వార్లుగా అవతరించెనా ఏమి?

వ్యాఖ్య :- ఇందు కవి నమ్మాళ్వార్ల అవతారమును గూర్చి పలువిధములైన సంభావనలను చేయుట ముఖ్యవిషయము. ఈ శ్లోకమునకు, ఆచార్యహృదయములోని రెండవప్రకరణములో గల ''**అత్రి జమదగ్ని పంక్తిరథ వసునందసూనువానవనుడైయ యుగవర్ణ క్రమావతారమో? వ్యాసాదివత్ ఆవేశావతారమో? మూదువర్ కరై కణ్డోర్ శీరియరిలే ఒరువరో? మున్నమ్ నోఱ్ఱ అన్దన్మేల్ పుణ్ణియజ్గళ్ పలిత్తవరో? ఎన్ను శజ్కిప్పర్ కళ్**''. అను (92) సూత్రము మూలము.

నమ్మాళ్వార్లు సామాన్యులు కాదు కావున వారెవ్వరైయుందురు! వారి అవతారమునకు మూలమేమి? అనుశంక అందరికిని కలుగవచ్చును. కాని, ఆశంకకు సమాధానమును నిశ్చయముగా చెప్పగల్గిన వారు జ్ఞానాధికులలో సైతము ఎవ్వరును లేరు. పలువురు పలువిధములుగా సంభావించిరి. ఆ భావనలలో కొన్ని ఈశ్లోకమున తెలుపబడినవి.

నమ్మాళ్వార్లు నిత్యులలో ఒకరా? లేక ముక్తులలో ఒకరా? లేక ముముక్షువులలో ఒక రా? లేక వ్యాసభగవానుని వలె భగవానుని ఆవేశావతారములలో ఒకరా? లేక అత్రి మహర్షికి జన్మించిన దత్తాత్రేయులవలె ఆయా వర్ణముల, యుగముల క్రమానుసారముగా సర్వేశ్వరుని అవతారమా ఏమి? అని భావము.

(**నిత్యో ఽథ.....ముముక్షుః**) ఆళ్వార్లు నిత్యులను సంభావనకు అనుగుణముగా ''**తతః కలియుగ స్యాదౌ వైశాఖ్యాం విశ్వభావనః, విష్ణుభక్తి ప్రతిష్ఠార్థం సేనేశోఽవతరిష్యతి**'' (కలియుగ ప్రారంభమున వైశాఖమాసపూర్ణిమ యందు లోకరక్షకుడగు విష్వక్సేనులు విష్ణుభక్తిని సుస్థిరము చేయుటకై అవతరింప గలడు), ''**శఠారిం సైన్యపం భజే**'' అను ప్రమాణములు అనుసంధేయములు. ఈ భావము పూర్వోదాహృత సూత్రమున ''**మూదువర్**'' అను పదముచే సూచితము. వేదమును''**యత్ర పూర్వే సాధ్యా స్సంతి**'' అనుచు నిత్యులను పూర్వశబ్దముతో నిర్దేశించినది. అట్లే ''**కరైకణ్డోర్**'' అను పదము ముక్తులలో ఒకరను భావమును తెలుపుచున్నది. ''విపన్యవః జాగృవాంసః సమింధతే''- అనుశ్రుతి వాక్యము, ''**శూళ్న్దిరున్దేత్తువర్ పల్లాణ్డే**'' అను ఆళ్వార్ల సూక్తియు నమః శబ్దానుసంధానమే ముక్తుల లక్షణమని తెలియుచున్నది. ''**ముక్తానాం లక్షణం హ్యేతత్ శ్వేతద్వీపనివాసినామ్, బద్ధాంజలి (నిత్యాంజలి) పుటాః హృష్టా నమ ఇత్యేవ వాదినః**'' అను ప్రమాణమును బట్టి ఎల్లప్పుడు ''**నమో నమః**'' అనుచు భగవత్కైంకర్యమును చేయుట శ్వేత ద్వీప నివాసుల లక్షణమని తెలియు చున్నది. అట్టి ముముక్షువులలో ఒకరు నమ్మాళ్వార్లుగా అవతరించిరా అనుటకు ''**అన్దితొళ్లుమ్ శొల్లపెఱ్ఱోన్**'' అను తిరువాయ్ మొళ్ళి సూక్తి అనుసంధేయము. ఇచట నమ్బిళ్ళై ఈడులోని ''నమః శబ్దార్థరూపమైన తిరువాయ్ మొళ్ళిని పాడగల్గితిని'' అను వివరణము స్మరణీయము. కావున ఆళ్వార్లు అనుగ్రహించి తిరువాయ్మొళ్ళి దివ్యప్రబంధము నమశ్శబ్దార్థమగుటచే, అట్లు నమశ్శబ్దమును అనుసంధించుట ముముక్షువుల లక్షణమగుటచే, ఆళ్వార్లు ముక్త ముముక్షువులలో ఒకరై యుందురను సంభావన అర్థవంతము. ఆచార్య హృదయ సూత్రములోని ''**శీరియర్**'' అను పదము ముముక్షువును

తెలుపుచున్నది. ఇందులకు అనుగుణముగా భగవద్విషయము ఈడు ప్రారంభములోని **''మాఱి మాఱిప్పల పిఱప్పుమ్పిఱన్దు'' ఎన్గిఉపడియే జన్మపరంపరైకళిలే తోళ్మాఱి నిత్యసంసారి యాయ్ పోన్ద విషై''** అను వాక్యము స్మరింపనగును. కావున ఆళ్వార్లు సంసారులలో ఒకరను అభిప్రాయము ఆచార్యులలో కలదని తెలియుచున్నది. ఇట్టి యోజనలోని తాత్పర్యము భగవానుని కటాక్షవైలక్షణ్యమును తెలుపుట కొఱకేనని అరుమ్బదమున వివరింపబడినది.

**(వ్యాసాదివత్ భగవతా కి మనుప్రవిష్టః) - ''కృష్ణద్వైపాయనం వ్యాసం విద్ధి నారాయణం ప్రభుమ్''** (కృష్ణద్వైపాయనుని సాక్షాత్తు నారాయణునిగా తెలిసికొనుము), **''వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే''** (విష్ణురూపుడగు వ్యాసునకు, వ్యాసరూపుడగు విష్ణువునకు) మొదలగు పలు ప్రమాణముల వలన వేదవిభాగమును చేయుట, అష్టాదశపురాణములను, మహాభారతమును రచించుట మొదలగు మహత్కార్యములను చేసిన వ్యాసభగవానులు, సాక్షాత్తు నారాయణావతారమేనని తెలియుచున్నది. అనగా భగవానుడు వ్యాసమహర్షియందు ఆవేశించి వారిచే అట్టి మహత్కార్యములను చేయించెనని భావము. కావున వ్యాస మహర్షి భగవదావేశావతారములలో ఒకటిగా పరిగణింపబడుచున్నారు. అట్లే, నమ్మాళ్వార్లు అట్టి అవతారములలో ఒకటియా? ఏమి? అని ఇచటి సంభావన.

ఇంతేకాక, వ్యాసభగవానులకు నమ్మాళ్వార్లకును పలు విధముల సామ్యములు కలవు. వ్యాసులు బ్రహ్మర్షి అయినట్లే ఆళ్వార్లును **''ఋషిం జుషామహే''** అనునట్లు ద్రావిడ బ్రహ్మ సంహితను దర్శించిన ఋషి. వ్యాసుల అవతారము ద్వాపరయుగాంతమున. ఆళ్వార్లఅవతారము కలియుగ ప్రారంభమున. కావున వీరి మధ్యగల వ్యత్యాసము చాల తక్కువ. వ్యాసులు వేదసారమును పంచమవేదముగా ప్రసిద్ధిచెందిన మహాభారతమును, అష్టాదశపురాణములను రచించుట ద్వారా వివరించిరి. అట్లే, ఆళ్వార్లు **'వేదమ్ తమిళ్ శెయ్దమాఱన్''** అని చెప్పబడినట్లు వేదసారమును తమప్రబంధములద్వారా ప్రకాశింపచేసిరి. మహాభారతము ఇతిహాసమేకాక, గొప్ప ప్రబంధము కూడ. పలువురి మహనీయుల చరిత్రలెన్నియో అందు చక్కని పద్ధతిలో నిబంధింపబడినవి. అట్లే ఆళ్వార్ల రచనలు దివ్యప్రబంధములుగా ప్రసిద్ధిచెందినవి. ఆళ్వార్ల విషయము ప్రబంధశబ్దమునకు వేరొక అర్థముకూడ చెప్పవీలు కలదు. ప్రబంధమనగా ప్రకృష్టమైన బంధము అని అర్థము. ప్రకృష్టమైన బంధమేమనగా భావబంధమే. ఆళ్వార్లు తమ ప్రబంధములో పలు తావుల నాయికాభావనతో భగవానునిపై గల భావబంధమును ప్రకటించిరి. ఇట్టి భావబంధము భక్తికి పరాకాష్ఠ. **''భక్తిః శృంగార వృత్త్యా పరిణమతి భావబంధ ప్రథిమ్నా''** అని వేదాంతదేశికులు నుడివిరికదా! కావున ఈ విధముగా కూడ ఆళ్వార్ల రచనలు ప్రబంధములనదగి యున్నవి. భారతమున భగవానుని చరిత్రతోపాటు, పలువురిని గూర్చిన వివరములు తెలుపబడగా, ఆళ్వార్ల ప్రబంధములలో కేవలము భగవానుని మహిమయే విషయమగుట విశేషము. అట్లే, భారతము ఇతిహాసమగుటచే సుహృత్సమ్మితత్త్వమును మాత్రము కల్గియుండగా, ఆళ్వార్ల

ప్రబంధములలోని ''వీడుమిన్... వణ్ పుకళ్ నారణన్ తిణ్ కళ్ళల్ శేరే'' వంటి సూక్తులు ప్రవృత్తినివృత్తి రూపములగుటచే ప్రభుసమ్మితత్వమును, ''శొన్నాల్ విరోదమిదు, ఆకిలుమ్ శొల్లువన్ కేణ్మినో'' వంటి వచనములు ఉపదేశాత్మకములగుటచే సుహృత్సమ్మితత్త్వమును, నాయికాభావనతో పల్కిన సూక్తులు వ్యంగ్యగర్భములగుటచే కాంతాసమ్మితత్వమును కల్గియున్నవి. ఇట్లు వ్యాసభగవానులకు, ఆళ్వార్లకును పోలిక బహుముఖముగా నున్నది. **''మకాపారతత్తైయుమ్ పణిత్తానుమ్ నిన్హవార్తై కురుకైప్పిరానుమ్ అమ్మత్తైప్పొరుళ్ కణ్ణాన్''** అను శఠకోపర్ అన్దాది సూక్తియు అనుసంధేయము.

(**అత్ర్యాదిసూను రివ వర్ణయుగ క్రమాత్ పురాణ పురుషః ఆసీత్ కిమ్**) - కృత యుగమున సర్వేశ్వరుడు అత్రిమహామునికి దత్తాత్రేయుల రూపమున కుమారునిగా జన్మించెను. అట్లే, త్రేతాయుగమున ఉత్తమక్షత్రియ వంశమున జన్మించిన దశరథునకు ''**పితరం రోచయామాస**'' అనునట్లు శ్రీరాముని రూపమున కుమారుడయ్యెను. మూడవ యుగము ద్వాపరమున యయాతి శాపమువలన క్షత్రియ వంశములలో తక్కువవంశము, వైశ్యకులముతో సమానమగు యదువంశమున జన్మించిన వసుదేవునకు, సాక్షాత్తు వైశ్యులనదగిన నందునకు కుమారుడయ్యెను. ఇట్లు కృత, త్రేతా, ద్వాపర యుగములలో క్రమముగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య కులములలో జన్మించిన భగవానుడు లోకకల్యాణార్థమై ''**ఆత్మానం సృజామ్యహం**'' అనునట్లు చతుర్థయుగము కలియుగమున చతుర్థవర్ణమున నమ్మాళ్వార్లుగా అవతరించెనా ఏమి? అని తాత్పర్యము, కలియుగమున భగవానుడు భక్తులరూపమున అవతరించు ననుటకు ''**కలౌ పునః పావరతాభిభూతే స ఉద్భభూవా శ్రితవత్సలత్వాత్, భక్తాత్మనా సర్వజనాన్ సుగోప్తుం విశ్వాధికో విశ్వమయో హి విష్ణుః**'' అను మొదలగు ప్రమాణములు ఉదాహార్యములు. ''**పురాణపురుషః**'' అను ప్రయోగము **''యః పూర్వ్యాయ వేధసే''** అను శ్రుతివాక్యమును స్ఫురణకు తెచ్చును. **''నావకత్తాఱ్కావి యాయిరమ్ పాడి నడిత్తనిత్తకోవకత్తాఱ్కన్ని''** అను శఠకోపర్ అన్దాది సూక్తి, **''నారాయణా అడియేన్ నాడుమ్ తమి ళ్వేద పారాయణా శడకోపా''** అను పిళ్లై ప్పెరుమాళ్ అయ్యంగార్ సూక్తియు ఇచట స్మరణీయములు.

పూర్వము ఉదాహరింపబడిన ఆచార్యహృదయచూర్ణికలోని క్రమము ప్రస్తుతశ్లోకమున వ్యత్యస్తముగా కనుపించుటలో గల కారణమేమన, ఆళ్వార్లు భగవదవతారమేనను నిశ్చయమును సూచించుట కొఱకని చెప్పవచ్చును. నిశ్చయానుకూలమైన సంభావనయే కదా! ఉత్ప్రేక్ష. చూర్ణికలోని క్రమము భగవత్కృపా వైలక్షణ్యమును సూచింపగా, ప్రస్తుతక్రమము ఆళ్వార్లమహిమను తెలియజేయుచున్నది. ప్రస్తుత సందర్భములోని విషయము. ఆళ్వార్లమహిమ కావున ఇట్లు క్రమము వ్యత్యస్తమగుట తగినదే.

పైన చూప బడిన సంభావనలను వివరించుచు విశదవాక్ శిఖామణి అగు మణవాళ మహామునులు తమవ్యాఖ్యలో నమ్మాళ్వార్లను దర్శింప (పరకాలనాయకిని) ''**పిన్నై కొల్ నిలమామ**

కళ్ కొల్ తిరుమకళ్ కొల్ పిఱన్దిట్టాళ్'' అని సంభావింప తగియున్నదను రస్యముగా వివరించుట ఇచట ప్రస్తుతింపతగినది.

6) కర్మేతి కేచి దపరే మతిరిత్యథాన్యే
భక్తిం పరే ప్రపదనం ప్రవదం త్యుపాయమ్ ।
ఆమ్నాయసారచతురా స్త్వమితానుభావం
త్వామేవ యాంతి శరణం శఠజిన్మునీంద్ర ॥

వ్యాఖ్య:- శఠజిత్+ ముని+ ఇంద్ర= ఓ! శఠకోపమునీంద్రా, కేచిత్= కొందఱు, కర్మ = కర్మయోగమే, ఉపాయం = ఉపాయము, ఇతి = అని, అపరే= మఱికొందఱు, మతిః = జ్ఞానయోగము ఉపాయము, ఇతి = అని, అన్యే = మఱికొందఱు, భక్తిం = భక్తి యోగమును ఉపాయము అని, పరే= ఇతరులు, ప్రపదనం = ప్రపత్తిని ఉపాయము అని, ప్రవదంతి = పల్కుచున్నారు. తు = కాని, ఆమ్నాయ సారచతురాః = వేదసారమునందు నిపుణులగు ఆచార్యులు అమిత+ అనుభావం = గొప్పమహిమను కల్గిన, త్వాం+ ఏవ = నిన్నే, శరణం = శరణముగా, యాంతి = పొందుచున్నారు.

వ్యాఖ్య:- భగవానుని ఆశ్రయించుటకు శాస్త్రములలో పలు ఉపాయములు చెప్పబడినవి. ఆ ఉపాయములన్నిటిలో భాగవతసమాశ్రయణమను ఉపాయము యొక్క వైశిష్ట్యమును స్తుతికర్త ఈ శ్లోకమున తెలుపుచున్నారు.

ఓ శఠకోపమునీంద్రా! భగవానుని చేరుటకు తగిన ఉపాయము కర్మ అని కొందఱు, జ్ఞానము అని కొందఱు, భక్తి అని కొందఱు, ప్రపత్తి అని ఇంకొందఱు పల్కుచున్నారు. కాని, వేదముల సారమును గ్రహించిన చతురులగు పెద్దలు గొప్పవైభవములను కల్గిన నిన్నే ఉపాయముగా పొందుచున్నారు అని భావము.

**(కర్మేతి కేచిత్)** - ''కర్మణైవ హి సంసిద్ధిం ఆస్థితా జనకాదయః'' అనిగీతలో భగవానుడు పల్కినట్లు జనకమహర్షి మొదలగువారు కర్మయోగము ద్వారా సిద్ధిని పొందిరి.

**(అపరే)** - ''ఇమం వివస్వతే యోగం ప్రోక్తవా నహ మవ్యయం, వివస్వాన్ మనవే ప్రాహ, మను రిక్ష్వాకవేఽబ్రవీత్'' అనువిధముగా వైవస్వతమనువు, ఇక్ష్వాకువు మొదలగువారు జ్ఞానయోగమును ఉపాయముగా తలచి అనుష్ఠించిరి.

**(భక్తింపరే)** - ''ప్రహ్లాదనారద పరాశరపుండరీక'' అనునట్లు ప్రహ్లాద, నారదాదులు భక్తి యోగమును ఉపాయముగా తలచి, ఆచరించిరి.

(పరే ప్రపదనం) శాస్త్రవిహితములైన కర్మలను ఫలకర్తృత్వసంగములేకుండ భగవత్కైంకర్య రూపముగ అనుష్ఠించుట కర్మయోగము. ఇట్టి కర్మాచరణమును జీవితాంతము చేయవలెను. మధ్యలో ఎట్టి అహంకారమమకారములు కల్గినను ఆ ఉపాయము ఫలింపదు. గురుమూలముగ

వేదశాస్త్రాధ్యయనమును చేసి, అర్థపంచక జ్ఞానమును కల్గి, భగవానుని ఆరాధించుట జ్ఞానయోగ మనబడును. ఈ ఉపాయముకూడ జీవించి యున్నంత కాలముచేయవలసినదే. మధ్యలో ఎట్టి ఆటంకము కల్గినను ఫలవంతము కానేరదు. తైలధారవలె నిరంతరము భగవానుని ప్రీతితో మనస్సున ధ్యానించుటయే భక్తి యోగము. ఈ ధ్యానము అవిచ్ఛిన్నము గాకున్న మోక్షప్రాప్తి కలుగదు. ఈ మూడు ఉపాయములు శ్రమసాధ్యములు, ప్రమాద భరితములును. ఇట్టి ప్రమాదములు లేని ఉపాయము ప్రపత్తి. ''సర్వధర్మాన్ పరిత్యజ్య మా మేకం శరణం వ్రజ'' అని గీతాచార్యుడు పల్కిన విధముగా మిగిలిన ఉపాయములన్నిటిని విడచి, భగవానుని శరణముగా ఆశ్రయించుట ప్రపత్తి అనబడును. ఈ ఉపాయము మిగిలిన వాని కంటె గొప్పది ''**తస్మాత్ న్యాస మేషాం తపసా మతిరిక్త మాహుః**'' అనుచు శ్రుతి ఈ అంశమును సూచించినది. భగవానుడు మనలగు తప్పక రక్షించునను మహావిశ్వాస మొక్కటి యున్న ప్రపత్తి ఫలవంతమగును.

(**ఆమ్నాయసారచతురాః.... శరణం యాంతి**) - భగవానుని పట్ల చేయు ప్రపత్తి ఆచార్యముఖముగా చేయవలెనని శాస్త్రములు తెలుపు చున్నవి. భగవానుడు సర్వ స్వతంత్రుడు. నిరంకుశుడు. మనము నిత్యముచేయు దుష్కర్మలవలన కరుణామయుడగు భగవానునకును ఒక్కొక్క సమయమున కోపము కలుగవచ్చును. అట్లు భగవానుడు కోపించినచో మనముచేయు ప్రపదనము ఫలవంతము కాదు. కావున పురుషాకారాపేక్ష కలదు. భగవద్భక్తులగు ఆచార్యులను పురస్కరించుకొని భగవానుని ఆశ్రయించిన, భగవానుడు తప్పక అనుగ్రహించును. అనగా ఆచార్యసన్నిధిలో మనము మన ఆత్మ సమర్పణ చేసిన, ఆ ఆచార్యులు భగవత్సన్నిధిలో మనలను గూర్చి నివేదింతురు. స్వామియు ఆచార్యుల పట్ల తనకుగల అభిమానముచే అకించనులమగు మనలనుకూడ తప్పక అనుగ్రహించును. కావున ఆచార్య సమాశ్రయణము ముఖ్య కర్తవ్యము. ఈ అంశమే ఇచట ప్రస్తుతింపబడినది. కర్మ, జ్ఞాన, భక్తి యోగముల కంటె ప్రపత్తి సులభమైన ఉపాయముకాగా, ఆ భగవత్ప్రపత్తికంటె ఆచార్య సమాశ్రయణము మరింత నిరపాయమైన ఉపాయము, కావుననే ఆళ్వార్లు సైతము '**వేదమ్ వల్లార్ కళైక్కొణ్డు నిణ్ణోర్ పెరుమాన్ తిరువ్వాదమ్ పణిన్దు**'' అని నుడివిరి. తిరుమఙ్గైయాళ్వార్లును ''**నిన్ తిరువెట్టెళుత్తుమ్ కఱ్ఱు ఉఱ్ఱది ఉన్నడి యార్క్కడిమై**'' (స్వామీ! నీ అష్టాక్షరిని అభ్యసించిన నేను తెలిసి కొన్నది భాగవత శేషత్వమును) అనుచు అష్టాక్షరీ- మహామంత్రసారము భాగవత శేషత్వమేనని పల్కిరి ''**ఋచో యజూంషి సామాని తథైవాథర్వణాని చ, సర్వ మష్టాక్షరాంతస్థం యచ్చాన్యదపి వాఙ్మయమ్**'' అనునట్లు సమస్త వేదములయొక్క, మిగిలిన వాఙ్మయముయొక్క పరమార్థము అష్టాక్షరి యందు కలదు. ఆ అష్టాక్షరీ సారము భాగవత శేషత్వ, పారతంత్ర్యములు. కావున వేదము, శాస్త్రముల తాత్పర్యము భాగవత శేషత్వ, పారతంత్ర్యములని ఏర్పడు చున్నది కదా! ఈ రహస్యమును గుర్తించిన అభిజ్ఞులగు ఆళ్వార్లు, ఆచార్యులును, శేషత్వ భాగవతపారతంత్ర్యములను చరమపర్వమునకు ప్రాధాన్యము నిచ్చిరి. ''సిద్ధి ర్భవతి వా నేతి సంశయో౽చ్యుతసేవినాం, న సంశయో౽స్తి

తద్భక్తపరిచర్యారతాత్మనామ్'' వంటి ప్రమాణములు ఇచట స్మరణీయములు. శ్రీవచన భూషణమను రహస్య గ్రంథములో నాల్గవ ప్రకరణమునందు చరమ పర్వనిష్ఠను గూర్చి, ఆచార్యాభిమానవైభవమును గూర్చి వివరింప బడుట, ఆ సూక్తులు విశదవాక్ శిఖామణి అగు మణవాళమహాముని లచే వ్యాఖ్యానింపబడుట ఇచట ప్రస్తుతింపతగినని. ప్రపన్నజనకూటస్థులుగా, పరమాచార్యులుగా కీర్తింపబడు ఆళ్వార్లను శరణాగతి చేయుట నిరపాయమైన ఉపాయమనుటలో సందేహము లేదుకదా!

ఇట్లు మొదటి రెండు శ్లోకములలో వివరింపబడిన శఠకోపద్వయముయొక్క గొప్పతనమును స్తుతికర్త-ఈ శ్లోకమున మరల తెలిపిరని చెప్పనగును.

7) భక్త్యాద్యుపాయరహితః పతితో భవాబ్ధౌ
త్వత్పాదసేవనరసేఽపి చ దుర్బలోఽహమ్ ।
ఇత్థం సతీహ శఠకోప దయైకమూర్తే
కృత్యం కిమస్తి మమ సంసృతిమోచనాయ ॥

ప్ర.అ. - దయా+ ఏకమూర్తే = దయయే మూర్తీభవించిన, శఠకోప = శఠకోపమునీంద్రా!, అహం = నేను, భక్తి+ ఆది+ ఉపాయరహితః = భక్తియోగము మొదలగు ఉపాయములను లేనివాడను, భవ+ అబ్ధౌ = సంసారమను సముద్రమున, పతితః = పడినవాడను, త్వత్పాదసేవనరసే + అపి = నీపాదసేవ అను రసాయనమునందును, దుర్బలః = బలహీనుడను, ఇత్థం సతి = (నాస్థితి) ఇట్లుండగా, ఇహ = ఈ సందర్భమున, మమ = నా యొక్క, సంసృతిమోచనాయ = సంసారవిముక్తి కొఱకు, కృత్యం= చేయతగినపని, కిం అస్తి = ఏమి కలదు?

వ్యాఖ్య:- భగవానుని ఆశ్రయించు సందర్భమున ఆకించన్యమును, నైచ్యమునుఅను సంధానము చేయుట అచార్యు లందఱు అనుసరించిన సత్సంప్రదాయము. శ్రీయామునులు స్తోత్రరత్నమున ''త్వత్పాదమూలం శరణం ప్రపద్యే'' అని శరణాగతిని చేసిన పిదప, ''న నిందితం కర్మ తదస్తి లోకే'' అని నైచ్యమును, ''న ధర్మనిష్ఠోఽస్మి'' అనుచు సర్వవిధోపాయరాహిత్యరూపమగు ఆకించన్యమును అనుసంధించిరి. భట్టరును ఉత్తర శతకమున ''త్వాం శ్రీరంగేశయ శరణ మవ్యాజ మభజమ్'' (87) అని భగవదాశ్రయణమును చేసి, పిమ్మట ''జ్ఞానక్రియాభజనసంపద కించనోఽహం'' అనుచు ఆకించన్యమును, ''అతి క్రామన్నాజ్ఞాం తవ విధినిషేధేషు'' (91) అని నైచ్యమును, దోషభూయిష్ఠతను తెలిపిరి. భగవద్రామానుజులు శరణాగతి గద్యలో ''అనన్యశరణః త్వత్పాదారవిందయుగళం శరణ మహం ప్రపద్యే'' అనిశరణగతిని చేసి, పిమ్మట ''మనోవాక్కాయై రనాదికాలప్రవృత్తానన్తాకృత్యకరణ..'' ఇత్యాదిగా ఆకించన్య, నైచ్యములను ప్రకటించిరి. ఈ క్రమమును అనుసరించుచు స్తోత్రకర్త-ఈ శ్లోకమునుండి ఎనిమిది శ్లోకములలో

తమ నైచ్యమును, ఆకించన్యమును, దోషభూయిష్ఠతను తెలుపుచున్నారు. ప్రస్తుతశ్లోకమున ఆకించన్యమును గూర్చిపల్కుచున్నారు.

దయమూర్తీభవించినట్లున్న ఓశఠకోపమునీంద్రా! నేను (కర్మయోగ, జ్ఞానయోగ) భక్తి యోగాద్యుపాయములను అనుష్ఠింపనివాడను. సంసార సముద్రమున పడియున్నవాడను. చరమోపాయముగా చెప్పబడు నీ పాదసమాశ్రయణమునుకూడ చేయలేని దుర్బలుడను. ఇట్టి నాకు ఇక సంసారమునుండి విముక్తుడ నగుటకు చేయ తగిన కృత్యమేమి ఉన్నది? - ఏమియు లేదు కదా! నేనిట్లు బాధపడవలసినదేనా!

(**''భక్త్యాద్యుపాయరహితః''**) - ''**సత్కర్మ నైవ కిల కించన సంచినోమి.... కించ త్వదంచిత పదాంబుజభక్తిహీనః పాత్రం భవామి భగవన్ భవతో దయాయాః**'' అని కూరేశులు శ్రీవైకుంఠస్తవమున పల్కిరి. ''**కఱవైకళ్ పిన్‌శెన్ఱు కానమ్ శేర్‌న్దు ఉణ్బోమ్, అఱి వొన్ఱు మిల్లాద ఆయ్‌క్కులత్తిల్**'' అనుచు గోదాదేవి కర్మజ్ఞానభక్తియోగాద్యుపాయరాహిత్యమును కల్గియుండుటయే యోగ్యత కావున ''**ఇఱైవా నీ తారాయ్ పఱై**'' అనుచు అనుగ్రహింపుమని శ్రీకృష్ణ భగవానుని ప్రార్థించెను. అట్లే ఇచటను కవి తమ ఉపాయరాహిత్యము తమయొక్క రక్ష్యత్వపూర్తికి లక్షణము అనుచున్నారు.

(**త్వత్పాద సేవనరసేఽపి చ దుర్బలః మమ కృత్యం కిమస్తి ?**) - లోకమున దుర్బలులు బలమును పొందుటకై రసాయనమును సేవింతురు. అట్టి ఔషధమును కూడా సేవింపలేని వారికి (జీర్ణముకు చేసికొనలేని వారికి) వేరు ఔషధము ఉండదు. అట్లే, ఏ ఉపాయములేని అకించనులగువారికి నీపాదసేవ రక్షకము. ఆ సేవను కూడ చేయలేని నాకు ఇక సంసారము నుండి విముక్తుడనగుటకు తగిన కృత్యమేమియు లేదుకదా! అని తాత్పర్యము.

(**దయైక మూర్తే**) - అను సంబోధన సాభిప్రాయకము. అకించనుడను, అశక్తుడను అగు నన్ను నీ దయతో కాపాడుము. దయయేకదా నీస్వరూపము అని తాత్పర్యము.

జీవుడు అనుష్ఠించు ఉపాయము లేమియు నిజమునకు ఉపాయములు కావు. అవి కేవలము భగవన్ముఖోల్లాసము కొఱకే. భగవానుని నిర్హేతుక కృపయే రక్షకము అనునది వైదిక సిద్ధాంతము. అట్లే ఇచట స్తుతికర్త తనవద్ద ఏ ఉపాయములేకున్నను, ఆళ్వార్లు దయామూర్తు లగుటచే వారి నిర్వ్యాజమైన కృపయే తనకు రక్షకము. కావున సంసారము నుండి విముక్తుడగుటకు తానేమియు ఉపాయమను భావనతో అనుష్ఠింపవలసిన అవసరము లేదను భావము ''**కిం అస్తి**'' అనునపుడు కాకుస్వరముచే ధ్వనించును. ఇట్లు ఇచట ''**యమేవైష వృణుతే తేన లభ్యః**'' అను శ్రుత్యర్థము ఆళ్వార్ల విషయమున అనుసంధింపబడినదనవచ్చును.

**8)** **త్వద్దివ్యసూక్తిపరిశీలనమాత్రమేవ**
**నిశ్శ్రేయసాధిగమనే నిరపేక్షహేతుః ।**

**తచ్చాస్తి మే న, శఠవైరిగురో మహాత్మన్**
**ఉజ్జీవనం కథమహో మమ జాఘటీతు ॥**

ప్ర.అ. - మహాత్మన్ = మహాత్మా!, శఠవైరిగురో = ఓశఠకోపమునీంద్రా! త్వత్ = నీ యొక్క, దివ్య= గొప్పవైన, సూక్తి = సూక్తులయొక్క, పరిశీలన మాత్రం + ఏవ = పరిశీలించుటయే, నిః+ శ్రేయస = మోక్షమును, అధిగమనే = పొందుటలో, నిరపేక్షహేతుః = వేరు ఉపాయమును దానిని అపేక్షింపని స్వతంత్ర హేతువు, తత్+చ = అదికూడ, మే = నాకు, న + అస్తి = లేదు, మమ= నాయొక్క, ఉజ్జీవనం = విముక్తి, కథం = ఎట్లు, జాఘటీతు = ఘటించును? అహో! = అయ్యో!

వ్యాఖ్య :- ముందు శ్లోకమున స్తోత్రకర్త ఆళ్వార్ల పాదములను సేవించుట అను చరమోపాయమును అనుష్ఠింపని దుర్బలుడనుచు తమను పేర్కొనగా, అందులకు ఆళ్వార్లు '' ఓయీ! నీవు నన్ను సేవింపకున్నను, నా ప్రబంధములను పరిశీలించినచాలును. అంతమాత్రముచేతనే నీవు ఉజ్జీవింపగలవు. ఈ విషయమును నేనేస్వయముగా ''**పాడి యాడ వల్లార్ వైకున్ద మేఉవరే**'' అని, ''**కూఉువర్ వల్లా రుళరేల్ కూడువర్ వైకున్దమే**'' అని ఇత్యాదిగా తెలిపితినికదా! కావున నీవునా ప్రబంధమగు తిరువాయ్ మొళ్ళిని అనుసంధించిన చాలును'' అనగా అందులకు సమాధానముగా తానట్టి కార్యమును కూడ చేయుటలేదనుచున్నారు.

ఓ మహాత్మా! శఠకోపమునీంద్రా! నీ దివ్యప్రబంధములను అనుసంధించినంత మాత్రముననే మోక్షము సిద్ధించును. ఆ ఉపాయమునకు వేరొక ఉపాయముయొక్క సహాయము అవసరము లేదు. అట్టి సులభతమమైన పనిని కూడ నేను చేయలేదు. ఇక నా ఉజ్జీవన మెట్లు సంభవించును! అయ్యో! - అని భావము.

(**త్వద్దివ్యసూక్తి ..... నిరపేక్షహేతుః**)- ''**మాఱన్ పేశిన శొల్ పేశ మాల్ పాఱ్ ఱాళ్ నజ్ఞెన్ని పారుమ్**'', ''**కారిమాఱన్ శొల్లై ఓదిడవే ఉయ్యు ములకు**'' అనుచు మణవాళ మహామునుల తిరువాయ్ మొళ్ళి నూఱ్ఱన్దాదిలోని సూక్తియు, ''**ఆళ్వార్ అరుళిచ్చెయ్‌ద దివ్యసూక్తియై కేవలమ్ వాక్కాలేవచిక్క**'' అను పిళ్లైలోకం జీయర్ వ్యాఖ్యాన శ్రీసూక్తియు ఇచట స్మరణీయములు. ఆళ్వార్లు నిరవధికమైన ప్రేమతో పల్కిన పల్కులను అహృదయముగా, కేవలము వాక్కుతో అనువదించినను అది ఉజ్జీవన హేతువగును. అహృదయోక్తినికూడ భగవానుడు భక్తిపూర్వముగా పల్కినట్లు భావించునుటకు ''**తిరుమాలిరు శ్శోలైమలై ఎన్రేనెన్న**'' ఇత్యాది ఆళ్వార్ల సూక్తులు తెలుపుచున్నవి. ''**మిత్ర భావేన సంప్రాప్తం**'' అను శ్రీరామాయణశ్లోకమున '**భావ**' శబ్దమును వ్యాఖ్యానించుచు పూర్వాచార్యులు మిత్రునివలెనటించినను అను స్వారస్యమును తెలుపుట ఇచట స్మరణీయము. అట్లే ఇచటకూడ ఆళ్వార్ల సూక్తుల అనుసంధానము ఆదరముతో కాక అహృదయముగా గాని, లౌకిక ప్రయోజనాపేక్షతో గాని చేసినను అది ఉజ్జీవనహేతువగునని తాత్పర్యము.

''వాచ్యమ్ పోలన్షు వాచక ప్రభావమ్'' అని శ్రీపిళ్లైలోకాచార్యులవారు ముముక్షుప్పడిలో పల్కిరి. అనగా వాచ్యమగు భగవానుని కంటె వాచకమగు ఆ భగవానుని తెలుపు అష్టాక్షరీమంత్ర మయొక్క ప్రభావము గొప్పదని భావము. అట్లే ఆళ్వార్ల సూక్తులన్నియు భగవద్వైభవ వాచకములగుటచే నిరపేక్షహేతువులు. సాక్షాత్ మోక్ష ప్రదాయకములు.

శ్లోకములోని 'మహాత్మన్' అనుసంబోధన ఆళ్వార్ల విషయమున మిక్కిలి తగినది. ''వాసుదేవః సర్వ మితి స మహాత్మా సుదుర్లభః'' అని భగవానుడు మహాత్ములుగా నిర్దేశించినది ఆళ్వార్ల వంటి వారినే. ఎందుకనగా ''ఉణ్ణుమ్ శోరు పరుకుమ్ నీర్ తిణ్ణుమ్ వెత్తిలైయుమ్ ఎల్లామ్ కణ్ణన్'' అనుచు ధారక పోషక భోగ్యములన్నియు భగవానుడే నని తలచినవారు ఆళ్వార్లు కదా!

9) త్వన్నామకీర్తన మకృత్రిమ మాతనోతి
యః స్తస్య సంసరణనిస్తరణం ఘటేత ।
దుర్వాసనాకలుషితస్య నమేఽస్తి బుద్ధిః
తత్రాపి, కేసరవిభూష కి మాత్మనీనమ్ ॥

ప్ర. అ. - కేసరవిభూష = వకుళాభరణా!, యః = ఎవడు, త్వత్ = నీయొక్క, కీర్తనం = కీర్తనమును, అకృత్రిమం = సహజముగా (మనఃపూర్వకముగా), ఆతనోతి = చేయునో, తస్య = అతనికి, సంసరణ = సంసారముయొక్క, నిస్తరణం = దాటుట, ఘటేత = సంభవించును గాక!, దుర్వాసనా కలుషితస్య = దుష్ట సంస్కారములచే మలినపఱుపబడినట్టి, మే = నాకు, తత్ర+ అపి = అట్టి కీర్తన యందును, బుద్ధిః = ఆలోచన, న అస్తి = లేదు, ఆత్మనీనం = నాది అనునది, (నేను చేసిన మంచి అనునది నాకు హితమును కల్గించునది) కిం = ఏమి ఉన్నది ?

వ్యాఖ్య :- ఆళ్వార్లు అనుగ్రహించిన ప్రబంధముల పరిశీలనము సంసారమోక్షదాయకమని, అట్టి సులభమైన కార్యము కూడ తాను చేయుట లేదని ముందుశ్లోకమున పల్కిన స్తుతికర్త ఇందు తమ ఆకించన్యము ప్రకారాంతరమున తెలుపుచున్నారు.

ఓ వకుళాభరణా! హృదయపూర్వకముగా నీ నామమును కీర్తించిన మాత్రముననే సంసారమునుండి విముక్తి కల్గును. జన్మాంతరములలో చేసిన పాపముల ప్రభావముచే దూషితుడనగు నాకు అట్టి బుద్ధి కల్గుట లేదు. ఇక నాది అనునది (నేను చేసిన మంచి అనునది, నాకుమంచిని కల్గించునది) ఏమి ఉన్నది? లేదు కదా!

పూర్వజన్మలో చేసిన పుణ్యపాపకర్మలఫలితముగా ఈ జన్మలో కల్గుకార్యాభిని వేశమునకు వాసన అనిపేరు. పాపమువలన దుర్వాసన, పుణ్యమువలన సద్వాసనయు కల్గును. ఇవి రెండును మరల పాప, పుణ్యములను చేయవలెనను బుద్ధికి కారణమగును. కావుననే ''బుద్ధిః

**కర్మానుసారిణీ''** అను సూక్తి ఏర్పడినది. పూర్వజన్మలో చేసిన పాపఫలితముగా నాకు సంసారతారకమగు నీ నామసంకీర్తనమును చేయవలెనను బుద్ధి ఈ జన్మలో కల్గుటలేదు. ఇట్లు ముందు జన్మలలో సంపాదించిన పుణ్యములేదు. ఈ జన్మలోనైన నీ నామమును కీర్తింపవలెనను ఆలోచనయు లేదు. ఇక నన్ను తరింపచేయుటకు నేను చేసిన పుణ్య మనునది ఏమున్నది? అని తాత్పర్యము.

కేసరమనగా పొగడపూవు. పొగడపూలమాలను ఆభరణముగా కల్గిన వారు నమ్మాళ్వార్లు. కావున కేసరవిభూషులు.

**10) శాస్త్రేణ యద్విహిత మాచరణీయ మేతత్**
**సర్వైః, నిషిద్ధ మిహ యత్త దుపేక్షణీయమ్ ।**
**ఇత్యాదికం శఠరిపో సదసి బ్రవీమి**
**హై సంతనోమి రహసి స్వవచోవిరుద్ధమ్ ॥**

**ప్ర.అ.** - శఠరిపో = ఓ శఠకోపమునీంద్రా! ఇహ = ఈ లోకమున, యత్ = ఏవిషయము, శాస్త్రేణ= వేదరూపమైన శాస్త్రముచే, విహితం = విధింపబడినచో, ఏతత్ = ఇది, సర్వైః = అందరిచే, ఆచరణీయం = ఆచరింపతగినది, యత్ = ఏ విషయము, నిషిద్ధం = నిషేధింప బడినదో, తత్ = అది, ఉపేక్షణీయమ్ = ఉపేక్షింపతగినది, ఇతి+ ఆదికం = అనుమొదలుగా గల వచనములను, సదసి = సభలో, బ్రవీమి = పల్కుచున్నాను, కాని, రహసి = ఏకాంతమున, స్వవచోవిరుద్ధం = నామాటలకు విరుద్ధముగా, సంతనోమి = చేయుచున్నాను. హై = ఆశ్చర్యము! (అయ్యో!)

వ్యాఖ్య:- ముందు శ్లోకమువరకు తమ ఆకించన్యమును గూర్చి పల్కిన కవి ఈ శ్లోకమునుండి తమ దోషభూయిష్ఠతను గూర్చి తెలుపు చున్నారు. ఇందు శ్రుతిస్మృత్యాది విరుద్ధాచరణమును గూర్చి తెలుపుట విషయము.

ఓ శఠకోపమునీంద్రా! వేదాది శాస్త్రములలో విధింపబడిన కర్మలుచేయ తగినవని, అందు నిషేధింపబడినవి చేయరానివని సభలో పల్కుచున్ననేను ఏకాంతమున తద్విరుద్ధముగా నడచుచున్నాను అయ్యో!

**''శ్రుతిః స్మృతి ర్మమై వాజ్ఞా య స్తా ముల్లంఘ్య వర్తతే, ఆజ్ఞాద్రోహీ మమ ద్వేషీ''** అనుచు భగవానుడు స్వయముగా వేదాదివిరుద్ధాచరణమును చేయువాడు తన ఆజ్ఞను మీరిన వాడు, తనను ద్వేషించినవాడును అగునని పల్కెను. అట్టి దోషిని తాను క్షమింపననియు తెలిపెను. నల్గురిముందు ధర్మసన్నములను వర్ణించుచు, రహస్యమున తద్విరుద్ధముగా ప్రవర్తించుచున్నానని పల్కుటచే దైవవంచననే కాక, లోకవంచనను కూడ చేయు చున్నానని భావము.

ఈ సందర్భమున శ్రీరంగరాజస్తవోత్తరశతకములోని **''జన మఖిల మహంయుః వం చయామి . . . . . దేశికస్సన్''** అను భట్టర్ సూక్తిని, **''వంచనపరః''** అను యామునుల సూక్తిని

స్మరింపనగును. ''వృత్త్యా పశుః నరవపు స్త్వహ మీదృశోఽపి శ్రుత్యాదిసిద్ధనిఖిలాత్మ గుణాశ్రయోఽయమ్, ఇత్యాదరేణ కృతినోఽపి మిథః ప్రవక్తుం అద్యాపి వంచనపరోఽత్ర యతీంద్ర వర్తే'' అను యతిరాజవింశతి శ్లోక భావము ఇచట అనుసంధేయము.

11) ప్రచ్ఛన్నపాతకశతావృతచేతసో మే
సంప్రీణితాః ప్రణతిభూమికయా కయాచిత్ ।
సత్కార మాదరభరేణ పరావరజ్ఞాః
కుర్వంతి హంత శఠవైరిమునే హతోఽస్మి ॥

ప్ర.అ. - శఠవైరిమునే = ఓ శఠకోపమునీంద్రా!, ప్రచ్ఛన్న = మాటుగా చేసిన, పాతకశత = వందల కొలది పాపములచే, ఆవృత = ఆవరింపబడిన, చేతసః = మనస్సును కల్గిన, మే = నా యొక్క, కయాచిత్ = అనుద్దేశ్యపూర్వకమైన (లోకవంచనార్థమైన) ఒకానొక, ప్రణతిభూమికయా = నమస్కారమను వేషముచే, సంప్రీణితాః = మిక్కిలి సంతోషమును పొందిన, పరావరజ్ఞాః = బ్రహ్మవేత్తలు, ఆదరభరేణ = నిండు ఆదరముతో, సత్కారం - గౌరవమును, కుర్వంతి = చేయుచున్నారు, హంత = అయ్యో!, హతః+ అస్మి = నశించినవాడనై యుంటిని.

వ్యాఖ్య :- పూర్వశ్లోకమున దైవవంచనను, లోకవంచనను గూర్చి పల్కిన కవి ఇందు మహనీయులగు బ్రహ్మవేత్తలను సైతము తాను వంచించు చున్నానని తెలుపుచున్నారు.

శఠకోపమునీంద్రా! రహస్యమున అనేకములగు తీవ్ర పాపకృత్యమును చేయు నేను బహిరంగమున అహృదయముగా చేయు నమస్కారమును నిజమైనదిగా, మనఃపూర్వకముగా చేసినదిగా భ్రమించిన బ్రహ్మవేత్తలు నన్ను ఆదరముతో గౌరవించుచున్నారు. ఇట్లు నేను బ్రహ్మవేత్తలను కూడ వంచించుచున్నాను కదా! నేను నిజముగా నశించితిని.

''పరావరజ్ఞాః'' అనగా పరావరుడగు బ్రహ్మను తెలిసిన పెద్దలు. ''తస్మిన్ దృష్టే పరావరే'' అను మొదలగు చోట్ల పరావరశబ్దముచే భగవానుడు తెలుపబడుచున్నాడు. ఈ శ్లోకములోని భావమునకు అనుగుణముగా సంకల్పసూర్యోదయములోని ''స్వాధీన సంసరణ నాట్యనిరూఢవృత్తేః, సంతోషితః ప్రణతిభూమికయాఽ స్య పుంసః'' అను సూక్తి ని స్మరింపనగును.

12) పద్మ్యం శపే తవ శఠారిమునీంద్రయోఽభూత్
ఉద్దామదోషగణనాంతిమకోటినిష్ఠః ।
సోఽపి ప్రకృష్టవిభవో యదపేక్షయా స్యాత్
తస్మాచ్చ పాపభరితోఽహ మితో న పాపః।

ప్ర.అ. - శఠారిమునీంద్ర = ఓశఠకోపమునీంద్రా! తవ = నీ, పద్భ్యాం = పాదములతో, శపే = ప్రతిజ్ఞచేయుచున్నాను, యః = ఎవడు, ఉద్దామ = గొప్ప వైన, దోషగణనా = దోషములయొక్క లెక్కయందు, అంతిమకోటినిష్ఠః = చివరి వరుసలో నున్నవాడు, అభూత్ = అయ్యెనో, సః+ అపి = అతడును, యదపేక్షయా = ఎవనికంటె, ప్రకృష్టవిభవః = గొప్పవై భవమును కల్గినవాడు, స్యాత్ = అగునో, తస్మాత్+చ = అతనికంటెను కూడ, అహం = నేను, పాపభరితః = పాపములతో నిండినవాడను, ఇతః = ఇంతకంటె (నాకంటె) పాపః = పాపిష్ఠివాడు, న (అస్తి) = లేడు.

**వ్యాఖ్య** :- దోషములను కల్గినవారిలో తమ ఆధిక్యమును తెలుపుటద్వారా స్తోత్రకర్త తమ అధమత్వమును ప్రకటించుచున్నారు. దేశికులు దయాశతకమున "**అహ మస్మ్య పరాధ చక్రవర్తీ**" అని, క్షమాషోడశిలో వేదవ్యాసభట్టర్ "**పాపానాం ప్రథమ్యోస్మ్యహం**" అని, "**కుత్రాఽపి తుల్యో మయా నాన్య స్సిద్ధ్యతి పాపకృత్**" అనియు పల్కుట ఇచట స్మరణీయములు.

ఓ శఠకోపమునీంద్రా! నీ పాదముల సాక్షిగా ప్రమాణమును చేయుచున్నాను. అపరాధములను చేసినవారిలో నాకంటె అధికుడు వేరొకడు లేడు. లోకమున గొప్ప దోషములను కల్గినవారిని లెక్కించునపుడు ఏవ్యక్తి లెక్కలో చివరివాడుగా లెక్కింపబడుచున్నాడో, అతని కంటె మిక్కిలి దోషములను కలవాడెవడో, అతనికంటెను నేను ఎక్కువ దోషములను కల్గిన వాడను అని భావము. మొదటిశ్లోకమున, 16 వశ్లోకమున కవి ఆళ్వార్ల వాత్సల్య గుణమును పొగడిరి. ఈ వాత్సల్యగుణము ప్రకాశించుట దోషములున్ననేగాని సంభవింపదు. ఆళ్వార్ల వాత్సల్యగుణము ఎంత గొప్పదో - అంత గొప్పదోష ప్రాచుర్యమును తనకు కలదని కవి ఇచట పరోక్షముగా తెలిసినట్లయినది. లోకమున తల్లిదండ్రులు తమ సంతానములో ఎవరు ఎక్కువ దోషమును కల్గియుందురో వారి పట్లనే ఎక్కువ ప్రేమను ప్రదర్శింతురు. కావున "**మాతా పితా**" అని ప్రస్తుతింపబడు ఆళ్వార్లముందు స్తుతి కర్తతమ దోషభూయస్త్వమును తెలిపిరి అని చెప్పనగును.

**13)** **త్వత్కింకరత్వరసికా స్తవ దాసదాస-**
**దాస్యైకరస్యముదితా శ్చ భజంతి ముక్తిమ్ ।**
**తత్రాప్యహం శకవాన్ న శఠారియోగిన్**
**అత్యాహితం కథ మపైతు భవోత్థితం మే ॥**

ప్ర.అ. - శఠారియోగిన్ = శఠకోపమునీంద్రా!, త్వత్కింకరత్వరసికాః = నీకైంకర్యమను అమృతమును ఆస్వాదించువారు, తవ = నీ యొక్క, దాసదాస = దాసులదాసులయొక్క, దాస్య+ ఐకరస్య = దాస్యము నందలి ఐకమత్యముచే, ముదితాః+చ = ఆనందించినవారును, ముక్తిం = ముక్తిని, భజంతి= పొందుచున్నారు, తత్ర+ అపి = ఆ విషయమున కూడ, అహం = నేను న శకవాన్ = సమర్థుడనుకాను, మే = నాకు, భవ + ఉత్థితం = సంసారము వలన కల్గిన, అతి+ ఆహితం = గొప్ప భయము, కథం= ఎట్లు, అపైతు = తొలగును గాక!

వ్యాఖ్య :- చరమపర్వనిష్ఠ అగు ఆచార్య కైంకర్యమును, భాగవతకైంకర్యమును చేయువారికి సంసారవిముక్తి సిద్ధించును. అట్టి ప్రయత్నమున కూడ తమకు శక్తి లేదనుచు కవి తమ ఆకించన్యమును, అశక్తిని ఇందు తెలియజేయుచున్నారు.

ఓ శఠకోపమునీంద్రా! నీకైంకర్యము అను రసమును ఆస్వాదించువారు, నీ దాసులకు దాసులగు వారికి దాస్యము చేయుటలో ఏకీ భావమును కలవారును ముక్తిని పొందుచున్నారు. కాని, నాకు అట్టి సులభమైన ఉపాయమును ఆచరించుటలో కూడ శక్తి లేదు. ఇకసంసారమువలన నాకు కలిగిన మహాభయము ఎట్లు తీరును ?

నమ్మాళ్వార్లు ''పయిలుమ్ శుడరొళి'' అను (3-7) తిరువాయ్ మొళి దశకమున భగవద్భక్తుల ప్రభావమును, ఆ భక్తులకు కైంకర్యమును చేయువారి ప్రభావమును వర్ణించిరి. **''పయిలుమ్ తిరువుడైయార్... ఎమ్మై యాళుమ్ పరమరే''** అని, **''అప్పనై పెరుమై పిదఱ్ఱ వల్లారై పిదఱ్ఱుమవర్... నమ్మై యళిక్కుమ్ పిరాక్కళే''** ఇత్యాది సూక్తు లిందులకు ప్రమాణములు. స్తుతికర్త ఇచట అట్టి క్రమమును అనుసరించిరని చెప్పనగును. **''ధ్వని సుధాంబు రసాఖ్యధాతుష్విష్టోరసః''** అను నానార్థరత్నమాల ప్రమాణమును బట్టి రసశబ్దమునకు అమృతమను అర్థమును చెప్పిన, అమృతమును ఆస్వాదించిన వారికి సంసారమువలన కల్గు భయము ఉండదని ధ్వనించును. **''అత్యాహితం మహాభీతిః''** అని అమరకోశవచనము. కూరేశులు వరద రాజస్తవమున **''భోగా ఇమే విధిశివాదిపదం చ ... సర్వం తదూషజలజోష మహం జుషేయ... తవ దాస్యమహారసజ్ఞః''** అనుచు భగవత్కైంకర్యరసజ్ఞులగు తాము బ్రహ్మాదిపదము సైతము తుచ్ఛముగా పరిగణింతు మనిరి. కులశేఖరులు ముకుందమాలలో **''తద్భృత్యభృత్య భృత్య ఇతి మాం స్మర''** అనుచు తమను చరమపర్వనిష్ఠునిగా తలచి, భగవద్దాస్య, భాగవత దాస్యములను అనుగ్రహింపుమని భగవానుని ప్రార్థించిరి. ఈ రెండిటిలో ఆచార్యు లందఱును భాగవతదాస్యమునకు ప్రాధాన్యమిచ్చిరి. ప్రస్తుతశ్లోకమున ఆవిషయము సూచింపబడినది. శ్రీవచనభూషణ మను రహస్య గ్రంథమున **''ప్రాప్యత్తుక్కు ప్రథమపర్వమ్ ఆచార్య కైంకర్యమ్, ..... చరమపర్వమ్ భాగవతకైంకర్యమ్''** (411 సూ) అను సూత్రములో నిర్దేశింపబడిన ఆచార్యకైంకర్యమను ప్రథమపర్వమును స్తుతికర్త ప్రస్తుతశ్లోకమున **''త్వత్కింకరత్వరసికాః''** అనుచు, భాగవతకైంకర్యమను చరమపర్వమును **''తవ దాసదాసదాస్యైక రస్యముదితాః''** అనుచు తెలిపిరని చెప్పనగును. స్తుతికర్తకు నమ్మాళ్వార్లు సాక్షాత్ ఆచార్యులు కాకున్నను, పరమాచార్యులుగా, ప్రపన్నజనకూటస్థులుగా పేరుపొందిన నమ్మాళ్వార్లకు పరంపరయా ఆచార్యత్వము ఉన్నందున కవి వారిని ఆచార్యులుగా పల్కుటలో విప్రతిపత్తి లేదు.

**14) త్వద్విగ్రహేక్షణ మహో తవ సంస్మృతి శ్చ**
**ముక్త్యై భవే దితి వదంతి పరాంకుశార్య ।**

**నిద్రాప్రమాదమలినీకృతమానసస్య**
**తత్రాపి శక్తి రిహ మే న, కథం భవేయమ్ ॥**

**ప్ర.అ.** - పరాంకుశ+ ఆర్య = శఠకోపమునీంద్రా! త్వత్+ విగ్రహ = నీ దివ్య మంగళవిగ్రహమును, ఈక్షణం = దర్శించుట, తవ = నీయొక్క, సంస్మృతిః+చ = స్మరణమును (నామమును, రూపమును స్మరించుట) ముక్త్యై = ముక్తి కొఱకు, భవేత్= అగును గాక! ఇతి = అని, వదంతి = (పెద్దలు) పల్కుచున్నారు. నిద్రా = నిద్రచే, ప్రమాద = అలసతచే, మలినీకృత = కలుషితము చేయబడిన, మానసస్య = మనస్సునుకల్గిన, మే = నాకు, ఇహ = ఇపుడు, శక్తిః న = శక్తి లేదు, కథం = ఎట్లు, భవేయమ్ = ఉజ్జీవింతును. అహో = అయ్యో!

**వ్యాఖ్య :-** శ్రీవచనభూషణమున ప్రసన్నదినచర్యాప్రకరణమున పిళ్లైలోకాచార్యులవారు "**ఆచార్యనై క్కణ్డాల్ పశియున్ శోగ్గ్ గ్గ క్కణ్డాప్పోలే యుమ్**" అనుచు ఆచార్యుల దివ్యమంగళ విగ్రహవిషయమున ప్రపన్నునకు ఉండతగిన ఆదరమును గూర్చి తెలిపిరి. ప్రస్తుత శ్లోకమున ఆ విషయము ప్రస్తుతింపబడుచున్నది.

**వ్యాఖ్య :-** ఓ పరాంకుశమునీంద్రా! నీ దివ్యరూపదర్శనము, నీస్మరణమును ముక్తిని ప్రసాదింతువని పెద్దలు పల్కుదురు. నిద్రచే, అలసటచే మలినమగు మనస్సును కల్గిన నాకు నిన్ను దర్శించుటయందో లేక, దర్శించినను ఆమూర్తిని నామనస్సున నిలుపుకొని, స్మరించుటయందో శక్తిలేదు. ఇక నేనెట్లు ఉజ్జీవింపగలను?

భగవానుని దివ్యమంగళవిగ్రహదర్శనమువలెనే ఆచార్యుని దివ్యరూపదర్శనమును ప్రపన్నుని కర్తవ్యము. "**ఆచార్యన్ శిష్యనుడైయ స్వరూపత్తై పేణక్కడవన్, శిష్య నాచార్యనుడైయ దేహత్తై పేణక్కడవన్**" అను శ్రీవచనభూషణసూక్తి, దానిని అనుసరించి మణవాళమహామునులు ఉపదేశరత్తినమాలైలో "**ఆశారియన్ శిచ్చనారుయిరై పేణుమవన్, తేశారుమ్ శిచ్చ నవన్శీర్ వడివై**" అని పాయించుటయు స్మరణీయములు. ఈ ప్రమాణములు ఆచార్యుల విభవ రూపములను గూర్చినదే అయినను, స్తుతికర్త కాలమునకు, ఆళ్వార్లకాలమునకు. కాలమున గల అంతరమును బట్టి, ప్రస్తుతమున ఆళ్వార్ల అర్చామూర్తి విషయమున అన్వయించుకొనుటలో ఎట్టి విప్రతిపత్తి లేదు. భగవదర్చామూర్తి విషయములోవలె ఆళ్వార్ల అర్చావిషయముననను దివ్యత్వభావనను, భక్తిని కల్గియుండుట తగినది. "**భూ- సత్తాయాం**" అను ధాతువునుండి పుట్టిన "**భవేయం**" అను క్రియకు ఇచట సత్తను పొందినవాడనగుదును అను అర్థమును చెప్పుటలో స్వారస్యముకలదు.

**15)** **ఏవం కదాచి దపి కుత్రచి దస్త్యుపాయో**
**నైవాఘనాశనవిధౌ మమ తావకస్య ।**

**ఆకస్మికీం తవ కృపా ముపహాయ మాయా-**
**కోలాహలప్రశమనీం కురుకాపురీశ ॥**

**ప్ర. అ.** - కురుకాపురీ+ ఈశ = కురుకాపురమునకు (ఆళ్వార్ తిరునగరికి) ప్రభువగు శఠకోపమునీంద్రా!, తావకస్య = నీకు సంబంధించినవాడనగు, మమ = నాయొక్క, అఘనాశవిధౌ = పాపములను పోగొట్టు విధమున, ఆకస్మికం = నిర్హేతుకమైనదియు, మాయాకోలాహల = భగవన్మాయ చేయు కోలాహలమును, ప్రశమనీం = పోగొట్టునది అగు, తవ = నీయొక్క, కృపాం = కరుణ తప్ప, ఉపాయః = (వేరొక) ఉపాయము, ఏవం = ఇట్లు, కదాచిత్+ అపి = ఏసమయములోను, కుత్రచిత్ = ఎక్కడను, న అస్తి = లేదు.

**వ్యాఖ్య :-** ఇంతవఱకు స్తుతికర్త తన రక్షణకొఱకు తాను చేసిన సుకృత మేదియు ఎచటను లేదని పల్కిరి. ఇందు తాము ఆళ్వార్ల సొత్తు అనియు, తమను రక్షించు ఉపాయము ఆ ఆళ్వార్ల ఆకస్మిక కృప తప్పవేరొకటి లేదని పల్కుచున్నారు.

ఓ శఠకోపమునీంద్రా! నీ వాడనగు నాపాపములను పోగొట్టుటలో సమర్థమైన. ఉపాయ మేదియు లేదు. అవ్యాజమైనదియు, భగవన్మాయను సైతము పోగొట్టగల్గినదియు అగునీ కరుణ ఒక్కటియే అందులకు సమర్థమైనది.

''**దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా**'' అనుచు భగవానుడు గీతలో త్రిగుణాత్మకమైన తనమాయ ఎవరికైనను దాట రానిదని పల్కి, ''**మా మేవ యే ప్రపద్యంతే మాయా మేతాం తరంతి తే**'' అని తనను ఆశ్రయించినవారు మాత్రమే ఆ మాయను దాటగలరని తెలిపెను. ''**ఒరు కురువి పిణైత్త పిణై ఒరువరాల్ అవిళ్క్క ప్పోకిఱదిల్లై. సర్వశక్తి కర్మాను గుణమాక ప్పిణైత్తప్పిణైయై అవనైయే కాల్‌కట్టి అవిళ్‌త్తుక్కొళ్ళ మిత్తనై కాణ్**' అను పిళ్లైతిరునఱైయూరరైయర్ సూక్తిఇచట స్మరణీయము. ఇట్లుండగా భగవన్మాయను ఆళ్వార్ల కృప పోగొట్టుననుటలోని తాత్పర్య మేమనగా- ''**జ్ఞానీత్వాత్మైవ మే మతమ్**'' అని స్తుతింపబడు జ్ఞానాధికులలో అగ్రేసరులగు ఆళ్వార్లు భగవానునకు ఆత్మస్థానీయులు. కావున, ఆళ్వార్లవలన భగవన్మాయ నశించుననుటలో సందేహము లేదు. నదిలోమునిగి యున్నవానిని రక్షింపవలెనన్న నదిలో ఈదగల్గిన వానికే సాధ్యపడును. అట్లే, భగవన్మాయను ఆళ్వార్లుదాటి యున్న కదా ఇతరులను దాటింపగల్గుట? అనినచో- అందులకు ''**మడిత్తేన్ మనైవాళ్క్కైయై నిఱ్పదోర్ మాయైయై**'' అనుచు ఆళ్వార్లు తాము భగవన్మాయను దాటినట్లు స్వయముగా పల్కిరి కదా! ఏ హేతువు వలనను పుట్టినది కాక, అవ్యాజమైనదను అర్థమిచ్చు '**ఆకస్మికీం**' అను విశేషణ మిచట తగినది.

**16)** **అవ్యాజబంధు మవిశేష మశేషజంతోః**
**ఉద్వేలవత్సలతయా కృపయా చ పూర్ణమ్ ।**

**త్వా మామనంతి శఠవైరిమునే తత స్తే**
**హాతుం న యుక్త మపరాధిన మప్యహో మామ్ ॥**

ప్ర.అ. - శఠవైరిమునే = ఓ శఠకోపమునీంద్రా! అశేషజంతోః = సమస్త ప్రాణులకు, అవిశేషం = (సకల విధములైన) నిర్విశేషమైన, అవ్యాజబంధుం = నిరుపాధికబంధువుగా, ఉద్వేల = పొంగి పొఱలుచున్న, వత్సలతయా = వాత్సల్యముచే, చ = మఱియు, కృపయా = దయచే, పూర్ణమ్ = నిండినవానినిగా, త్వాం = నిన్ను, ఆమనంతి = (పెద్దలు) పలుకుచున్నారు, తతః = అందువలన, అపరాధినం+ అపి = అపరాధములను చేసినవాడనైనను, మాం = నన్ను, హాతుం = విడచుట, తే = నీకు, న యుక్తం = తగినది కాదు, అహో = అయ్యో!

**వ్యాఖ్య :** - పూర్వశ్లోకమున ఆళ్వార్ల అవ్యాజమైన కరుణయే తమను రక్షమని పల్కిన కవి ఇందు ఆ ఆళ్వార్లయొక్క సర్వవిధబంధుత్వమును, నిరవధికవాత్సల్యమును, కారుణ్యమును ప్రస్తుతించుచు, రక్షింపుమని వేడుచున్నారు.

ఓ శఠకోపమునీంద్రా! నీవు సమస్త ప్రాణులకు నిరుపాధికమైన, సకలవిధమైన బంధువవు. అపారమైన వాత్సల్యమును, కారుణ్యమును కల్గిన వాడవు. కావున నేను ఎంత అపరాధిని అయినను నన్నువిడచుట నీకు నాకు మధ్యకల బంధుత్వమును బట్టిగాని, నీస్వభావమును బట్టిగాని తగదు.

(**అవ్యాజబంధు మవిశేష మశేషజంతోః**) - భట్టరు నమ్మాళ్వార్లను స్తుతించుచు ''**మాతా పితా యువతయ స్తనయా విభూతిః సర్వం యదేవ**'' అనుచు ప్రపన్నకులమునకు సమస్త విధబంధువుగాస్తుతించిరి. అట్లే ఇచట కవి పల్కుచున్నారు. లోకములోని బంధుత్వము సకారణము, పరిమితమును. తండ్రి తల్లికాలేదు. తల్లి తండ్రి కాలేడు. స్నేహితుడు తల్లి తండ్రుల కంటె వేరు. ఈ జన్మలోని తండ్రియే మరు జన్మలోకూడ తండ్రి అగుననుటకు వీలులేదు. ఇట్లు లోకములోని బాంధవ్యము అన్నివిధముల పరిమితము, సోపాధికమును కాని, భగవానునితో ఆత్మలకు కల బంధుత్వము నిరుపాధికము, నిర్విశేషమును. అట్టి బంధుత్వమే ఆళ్వార్లకు ప్రపన్నులకు కలదనుటను కవి ఇచట తెలిపినట్లు యినది. అవిశేష బంధుత్వమనునపుడు ''**పితా చ రక్షకః శేషీ భర్తా జ్ఞేయో రమాపతిః, స్వామ్యాధారో నియంతా చ భోక్తా చాద్యమనూదితః**'' అను శ్లోకమున తెలుపబడిన నవవిధ సంబంధము ఇచట స్మరణీయము.

ఉద్వేలవాత్సల్యము, కృపాపూర్ణత్వమును మాతృత్వప్రయుక్తమగు లక్షణములు. కావుననే భట్టరును ''**మాతా**'' అనుచు మాతృత్వమును ప్రస్తుతించిరి. దోషభోగ్యత్వరూప వాత్సల్యము, తత్కార్యమైన కృపయు ఇచట ప్రత్యేకముగా సూచించుటలోని తాత్పర్యమేమనగా ఆశ్రిత రక్షణమున వాని ప్రాధాన్యమును సూచించుటకొఱకు. భగవద్రామానుజులును శరణాగతి గద్యలో ''ఆశ్రితవాత్సల్యైక జలధే'' అనుచు వాత్సల్య గుణమును ప్రత్యేకముగా కొనియాడిరి. తతః అపరాధిన మపి మాం హాతుం న యుక్తం - అనుటచే వాత్సల్యము, కారుణ్యమే స్వరూపముగా కల్గిన నీవు

అపరాధిఅగు నన్ను విడచుట నీకు కొఱతయే సుమా! అని చమత్కరించినట్లయినది. దోషములున్నచోటనే కదా పైరెండు గుణములును ప్రకాశించును. ఈ సందర్భమున యామునుల స్తోత్రరత్నములోని "త్వదగ్రే శరణాగతానాం పరాభవో నాథ న తేఽనురూపః" అను సూక్తి, "తదధునా లబ్ధం తు నోపేక్షతాం" అను క్షమాషోడశీ సూక్తియు స్మరణీయములు.

**17)** **యావచ్చ య చ్చ దురితం సకలస్య జంతోః**
**తావచ్చ తత్త దధికం చ మమాస్తి నిత్యమ్ ।**
**ఏతద్వచః కథ మభూత్ సతతానృతోక్తి-**
**శీలస్య మే శఠరిపో తదిదం విచిత్రమ్ ॥**

**ప్ర. అ.** - శఠరిపో = శఠకోపమునీంద్రా!, సకలస్యజంతోః = సమస్తప్రాణులయొక్క, యావత్+ చ = ఎంత, యత్+ చ = ఏయే విధమైన, దురితం = పాపము కలదో, తావత్+చ = అంత, తత్ = ఆవిధమైన, చ = మఱియు, తత్+ అధికం = అంతకంటె ఎక్కువైన పాపము, మమ = నాకు, నిత్యం = ఎల్లప్పుడు, అస్తి = కలదు. కాని, సతత+ అనృత+ ఉక్తిశీలస్య = ఎల్లప్పుడు అసత్యములు పల్కుటయే స్వభావముగా కల, మే = నాకు, ఏతత్ + వచః = ఈ మాట (నిన్ను శరణాగతి చేయుచున్నాను అను మాట.) కథం = ఎట్లు, అభూత్ = సంభవించినది? తత్ = అందుచే, ఇదం = ఇట్లు స్తుతించుట, విచిత్రం = ఆశ్చర్యకరము.

**వ్యాఖ్య :-** ఇందుకవి తమ పాపబాహుళ్యమును గూర్చి పల్కుచు, తాము శరణాగతి వచనమును పల్కుటయు ఆశ్చర్యమును గొల్పుచున్నదనుచున్నారు.

శఠకోపమునీంద్రా! లోకములో గల ప్రాణులందఱు చేయు పాపములెన్నియో, ఏ విధములైనవో, అన్ని అంతటి పాపములను, అంతకంటె ఎక్కువ పాపములను నేను చేసితిని. ఎల్లప్పుడును అసత్యమును పల్కుటయే స్వభావముగా కల్గిననేను ఈ స్తుతి వచనమును పల్కుట మిక్కిలి ఆశ్చర్యమును కల్గించుచున్నది.

జీవుడు చేయగల్గిన పాపములను గూర్చి కూరేశులు వైకుంఠస్తవమున "**యద్బ్రహ్మ కల్పనియుతానుభవేఽప్యనాశ్యం తత్కిల్బిషం సృజతి జంతు రిహ క్షణార్ధే**" అనుచు కోట్లాను కోట్ల సంవత్సరముల పాటు అనుభవించినను తీరని పాపసంచయమును అఱక్షణమున జీవుడు చేయకలడనిరి. అసంఖ్యాకములైన జీవులు చేయు ఇట్టి పాపములను గూర్చి చెప్పవలసినదేమున్నది? అంతకంటె తన పాపసంచయము ఎక్కువ అనికవి పల్కుట ఉక్తిచమత్కృతి. ఇందులకు క్షమాషోడశిలోని '**పర్యాప్తం న సమస్తచేతనకృతం పాపం తతో మామకమ్**'' అను సూక్తి స్మరణీయము.

**18)** **పూర్వైః స్వనైచ్య మనుసంహిత మార్యవర్యైః**
**మా మేవ వీక్ష్య మహతాం న తదస్తి తేషామ్ ।**

నైచ్యం త్విదం శఠరిపో మమ సత్య మేవ
మత్తః పరో న మలినో యత ఆవిరస్తి ॥

**ప్ర. అ.** - శఠరిపో = శఠకోపమునీంద్రా! పూర్వైః = పూర్వులగు, ఆర్యవర్యైః = ఆచార్యులచే, మాం+ ఏవ = నన్నే, వీక్ష్య = చూచి, స్వనైచ్యం = తమయొక్క నైచ్యానుసంధానము, అనుసంహితమ్ = అనుసంధింపబడినది, మహతాం = గొప్పవారగు, తేషాం = ఆ ఆచార్యులకు, తత్ = ఆనైచ్యము, న+ అస్తి = నిజమునకు లేదు, యతః = ఏ కారణమువలన, మత్తః = నా కంటె, మలినః = దోషముకల వాడు, పరః = వేరొకడు, న ఆవిరస్తి = పుట్టలేదో, అందువలన, ఇదం = ఈ, నైచ్యం = నీచత్వము, మమ = నాకు, సత్యం+ ఏవ = నిజమే.

**వ్యాఖ్య** :- కవి ఈశ్లోకమున పూర్వాచార్యులు అనుసంధించిన నైచ్యానుసంధానము తనను గూర్చియేనని, వారినైచ్యానుసంధానము ఆరోపితమని, తన విషయమున సత్యమని తెలుపుచున్నారు.

శఠకోపమునీంద్రా! పూర్వులగు ఆచార్యవర్యు లందఱు చేసిన నైచ్యానుసంధానము అంతయు నన్ను దృష్టిలో నుంచుకొనియే చేసిరి. మహాత్ములగు వారికి నైచ్య మెక్కడిది? వారు పల్కిన నైచ్యము నావిషయమున అర్థవంతము. ఎందులకనగా, లోకమున నా కంటె పాపములు చేసిన వాడు వేరొకడు పుట్టలేదు కదా!

యామునులు స్తోత్రరత్నమున ''అమర్యాదః క్షుద్రః చలమతిః'' ఇత్యాదిగా, కూరేశులు **''విద్వేషమానమదరాగ విలోభమోహాది ఆజానభూమి రహం''** అని, మణవాళమహామునులును **''కందర్పవశ్యహృదయ స్సతతం భవామి''** అని నైచ్యానుసంధానమును చేసిరి. మహాత్ములగు వారు చేయు నైచ్యానుసంధానము లోకసంగ్రహము కొఱకేగాని, వారిలో నైచ్యము ఉన్న కారణము చే కాదు. వారట్లు నైచ్యానుసంధానము చేయుట వలన లోకులువారి మార్గమును అనుసరింతురు. తద్ద్వారా భగవదను గ్రహమును పొందుదురు. కావున కవి ప్రాచీనులగు ఆచార్యులు చేసిన నైచ్యానుసంధానము తనను గూర్చియేనని పల్కుట అర్థవంతము.

ప్రస్తుతశ్లోకము యతిరాజవింశతిలో మణవాళమహామునులు **''వాచామగోచరమహా గుణదేశికాగ్ర్యకూరాధినాథ కథితాఖిలనైచ్య పాత్రమ్, ఏషోఽహ మేవ''** అని, **''శుద్ధాత్మయామున గురూత్తమ కూరనాథ భట్టాఖ్యదేశికవరోక్త సమస్తనైచ్యం, అద్యాప్య సంకుచితమేవ మయి''** అని పల్కుటను స్మరింపచేయుచున్నది.

ఆవిర్భవించెను అని అర్థమిచ్చు **''ఆవిరస్తి''** అను క్రియ ఇచట విపరీతలక్షణ యందు ప్రయోగింపబడినది.

19) ఉక్త్వా స్వదోషవిషయం వచనం త్వదగ్రే
సంసారభీరు రివ తేన చ వంచకోఽహమ్ ।
సామర్థ్య మేవ శఠకోప విభావయామి
సంవీక్ష్య కం గుణ మిహా సి మయి ప్రసన్నః ॥

ప్ర.అ. - శఠకోప = శఠ కోపమునీంద్రా!, స్వదోషవిషయం = నాదోషములను విషయముగా కల్గిన, వచనం = మాటను, త్వదగ్రే= నీ ముందు, సంసారభీరుః + ఇవ= సంసారమునకు భయపడు వానివలె, ఉక్త్వా = పలికి, తేన = ఆమాటతో, అహం = నేను, వంచకః చ= నిన్ను మోసగించిన వాడను కూడ, సామర్థ్యం ఏవ = (ఇట్టి వంచనలో నాకుగల) సామర్థ్యమును మాత్రమే విభావయామి= తలచుచున్నాను, మయి = నాయందు, కం గుణం = ఏ గుణమును, సంవీక్ష్య = చూచి, ప్రసన్నః = ప్రసన్నుడవైతివి.

వ్యాఖ్య :- ఏ మాత్రము గుణము లేకుండుటయేకాక, అసహ్యమగు ఆచార్యవంచనను చేసిన తనను ఎట్లు అనుగ్రహించితి వనుచు ఇందు కవి ఆళ్వార్లను ప్రశ్నించుచున్నారు.

ఓ శఠకోపమునీంద్రా! సంసారమునకు భయపడు వానివలె నటించుచు, నీముందు లేని భయమును ప్రకటించి, నిన్ను మోసగించితిని. అట్లు నిన్ను మోసగింపగల్గితిని కదా అని వంచనలో నాకు గల సామర్థ్యమును గూర్చి భావించుచుంటినే గాని, నేను చేసిన అపరాధమును గూర్చి తలంపకుంటిని. ఇట్టి నాయందు నీవు ఏ గుణమును చూచి ప్రసన్నుడవైతివి? నీ అవ్యాజమైన కృపయే కదా అందులకు కారణము.

20) కిం తు క్రియాసమభిహారకృతాపరాధో
హంతానుతప్య పున రప్యపరాధకారీ।
పద్మాసఖస్య పరిహాసరసోచితోఽహ
మేత ద్విలోక్య శఠకోపమునే ప్రసీద ॥

ప్ర.అ. - శఠకోప = శఠకోపమునీంద్రా! కిం తు = కాని, క్రియాసమభిహార = క్రియల కూడికచే, కృత = చేయబడిన, అపరాధః = పలు అపరాధములను కల్గిన నేను, అనుతప్య = పరితాపమును పొంది, హంత = అయ్యో! పునః = మరల, అపరాధకారీ = అపరాధములను చేయువాడనైన, అహం = నేను, పద్మాసఖస్య = శ్రియఃపతి యొక్క, పరిహాసరస = హాస్య రసమునకు, ఉచితః = తగినవాడను. ఏతత్= ఈ విషయమును, విలోక్య = చూచి, మయి = నాయందు, ప్రసీద = అనుగ్రహింపుము.

వ్యాఖ్య :- తాను చూపు పశ్చాత్తాపము నిజమైనది కాదు, కావున మరల మరల అపరాధములను చేయు చుంటినని, అట్లు చేయుట భగవానుని పరిహాసమునకు కారణమగు చున్నదని పల్కుచు కవి దయ జూపుమని ఆళ్వార్లను వేడుచున్నారు.

శఠకోపమునీంద్రా! పలువిధములైన అకార్యములను చేయు నేను తాత్కాలికమైన పశ్చాత్తాపమును చెందినను, మరల మరల ఆ అపరాధములనే చేయుచు భగవానుని పరిహాసమునకు విషయమగుచున్నాను. ఇక నన్ను నీవే అనుగ్రహింపవలెను.

మణవాళమహామునులు యతిరాజవింశతిలో ''**పాపే కృతే యది భవంతి భయాను తాప లజ్జాః పునఃకరణ మస్య కథం ఘటేత**'' అని పల్కిరి. కావున పాపమును చేసినపుడు నిజమైన భయము, పశ్చాత్తాపము, సిగ్గును కల్గిన మరల ఆపాపమును చేయుట సంభవింపదు. కాని, కవి ఇచట మరల మరల అపరాధములను చేయుచున్నట్లు చెప్పబడినది. ఇట్లు తప్పులు చేయుట, పశ్చాత్తాపపడుట, దానిని మఱచి మరల ఆ అపరాధములనే చేయుట- ఇది అంతయు భగవానునకు నవ్వును కల్గించుచున్నదని తాత్పర్యము. ఇట్లు భగవానుని పరిహాసమునకు కారణమైన తమను రక్షింపుమని ఆళ్వార్లను కవి ప్రార్థించుచున్నారు.

**21)** **కామప్రమోహమదమత్సరమన్యులోభైః**
**పారంపరీత ఉదితైః పరిపీడ్యమానమ్ ।**
**దైవాత్ త్వదీక్షణపథం దయయా శఠారే**
**పాహి ప్రపన్న మిమ మున్నమదాగసం మామ్ ॥**

**ప్ర.అ.** - శఠారే = శఠకోపమునీంద్రా!, పారంపరీతః = పరంపరగా, ఉదితైః = పుట్టిన, కామ = కామము, ప్రమోహ = గొప్పమోహము, మద = గర్వము, మత్సర = అసూయ, మన్యు = కోపము, లోభైః = లోభము అను వీనిచే, పరిపీడ్యమానం = పీడింపబడువాడను, ఉన్నమత్+ ఆగసం= వృద్ధి చెందు పాపములను కల్గిన వాడను, దైవాత్= దైవమువలన, త్వత్+ ఈక్షణ పథం (గతం) = నీ దృష్టిపథమును పొందిన వాడను, ప్రపన్నం = శరణాగతుడను అగు, మాం = నన్ను, దయయా = నీ దయతో, పాహి = రక్షింపుము.

**వ్యాఖ్య** :- అరిషడ్వర్గముచే బాధింపబడు తమను ఆళ్వార్లు దయతో రక్షింపవలసినదిగా కవి ఇందు ప్రార్థించుచున్నారు.

శఠకోపమునీంద్రా! పరంపరగాకల్గు కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములను అరిషడ్వర్గము నన్ను మిక్కిలి పీడించుచున్నది. నేను చేయు పాపములు క్షణక్షణము వృద్ధిచెందుచున్నవి. దైవానుగ్రహము వలననేను నీ దృష్టిపథమున పడితిని. నిన్ను శరణు జొచ్చితిని. నీవు దయతో నన్ను కాపాడుము.

భగవానుడు గీతలో ''**సంగాత్ సంజాయతే కామః, కామాత్ క్రోధోఽభిజాయతే, క్రోధాత్ భవతి సమ్మోహః, సమ్మోహాత్ స్మృతి విభ్రమః**'' - అనుచు కామక్రోధాదుల కార్యకారణ భావమును తెలిపెను. కావున ఇచట కవి వానిని ''**పారంపరీత ఉదితైః**'' అని పల్కెను.

పరాంకుశులగు ఆళ్వార్లు అరిషడ్వర్గమును జయించినవారగుటచే తమను వాని నుండి కాపాడుమని కవి ప్రార్థించుట తగును.

22) కార్యా కృపా సుమతిభిః ఖలు దుఃఖితేషు
దుఃఖీ మయా న సదృశో భృశదుఃఖభాజా ।
తస్మాత్ తవాఖిలజనేషు చ యాఽనుకంపా
మయ్యేవ తాం శఠరిపో నిభృతం విధేహి ॥

ప్ర.అ. - శఠరిపో = శఠకోపమునీంద్రా!, సుమతిభిః = సద్బుద్ధిని కల్గినవారిచే, దుఃఖితేషు = బాధను పొందిన వారియందు, కృపా = కరుణ, కార్యా = చేయతగినది (చూపతగినది), ఖలు = కదా!, భృశదుఃఖభాజా = గొప్ప దుఃఖమునుకల్గిన, మయా = నాతో, దుఃఖీ = దుఃఖమును కల్గిన వాడెవ్వడును, న సదృశః = సమానుడు కాడు, తస్మాత్ = అందుచే, తవ = నీకు, అఖిలజనేషు = సమస్తజనమునందు, యా = ఏ, అనుకంపా = దయ కలదో, తాం = (అంత) ఆదయను, మయి+ ఏవ = నాయందే, నిభృతం = తప్పక, విధేహి = ఉంచుము. (చేయుము)

వ్యాఖ్య :- 17 శ్లోకమున కవి లోకములోని ప్రాణులందరి పాపముల కంటె తన పాపమే ఎక్కువని పల్కిరి. ఇందు తన దుఃఖము మిగిలినవారి దుఃఖము కంటె ఎక్కువ అనుచు, లోకములో అందరిపట్ల చూపునట్టి దయను తమయందు చూపుడని ఆళ్వార్లను ప్రార్థించుచున్నారు.

శఠకోపమునీంద్రా! దుఃఖితుల పట్ల మహాత్ములు దయను చూపవలెను కదా! ఆదయ దుఃఖమునకు అనుగుణముగా నుండవలెను. లోకమున నా కంటె దుఃఖితులు వేరొకరు లేరు. లోకములోని జనులు అందరు చేసిన పాపము లన్నిటిని కలిపినను నేను చేసిన పాపములతో అవిసరిపోవు. కావున నీవు అందరి దుఃఖితులపట్ల చూపు దయ నంతయు నాయందే చూపుము. అపుడు నేను అనుభవించు దుఃఖమునకు, నీవు చూపు దయకు సరిపోవును.

భట్టరు నమ్మాళ్వార్లను స్తుతించుచు ''కృష్ణ తృష్ణాతత్త్వ మివోదితమ్'' అని పల్కిరి. అనగా (లోకములోని కృష్ణప్రేమ అంతయు ఆళ్వార్లుగా మూర్తీభవించినదని, లోక సంరక్షణను చేయవలెనను భగవానుని తృష్ణయే ఆళ్వార్లుగా అవతరించెనని భావము.) కావున దుఃఖితుల నందరను రక్షించుటలో ఆళ్వార్లు చూపుదయ అంతయు తనపైనే చూపుమని కవి ప్రార్థించుట తగును. ఎందుకనగా లోకములోని అందరి దుఃఖము కంటె తమ దుఃఖము అధికము కావున.

23) విశ్వోపకారక మఘార్ణవతారకం త్వా
మప్రాప్య హే శఠరిపో హత ఏవ పూర్వమ్ ।
అద్య త్వదీయకృపయా ప్రతిలబ్ధసత్తః
త్వత్సేవనామృతరసేన సుఖీ భవాని ॥

ప్ర.అ. - హేశఠరిపో = శఠకోపమునీంద్రా!, విశ్వ+ ఉపకారకం = లోకమునకు ఉపకారమును చేయువాడవు, అఘ+ అర్ణవతారకం = పాపసముద్ర మునుండి (జనులను) దాటించువాడవు అగు, త్వాం = నిన్ను పూర్వం = ఇంతకుముందు, అప్రాప్య = పొందక, హతః+ ఏవ = నశించిన వాడనే అయితిని. అద్య = ఇపుడు (ఈనాడు) త్వదీయకృపయా = నీకృప చే, ప్రతిలబ్ధ = పొందిన, సత్తః (సన్) = అస్తిత్వమును, కలవాడనై, త్వత్సేవన = నీసేవ అను, అమృతరసేన = అమృతరస(పానము)ముచే, సుఖీ = సుఖమును కల్గిన వాడను, భవాని = కాగలను.

వ్యాఖ్య :- ఆళ్వార్లను ఆశ్రయించుటకు ముందు తనకు అస్తిత్వము లేదనియు, ఆళ్వార్ల కృప వలన వారిని ఆశ్రయించిన పిమ్మట సత్తను పొంది, ఉజ్జీవించితిననియు కవి ఇందు పల్కుచున్నారు.

ఓ శఠకోపమునీంద్రా! నీవు ''తొణ్డర్క్కము దెన్న శొల్మాలైకళ్ శొన్నేన్'' అనునట్లు భగవద్భక్తులకు అమృతము అన తగిన పాశురమాలలను అనుగ్రహించి, వారికి గొప్ప ఉపకారమును చేసినవాడవు. కావున వారిని పాపసముద్రమునుండి దాటించితిని. అట్టి నిన్ను నేను పూర్వము ఆశ్రయింపక నిజముగా నశించితిని. ఈ నాడు నిన్ను నేను ఆశ్రయింపగల్గుట నీ అవ్యాజమైన కృపవలననే. ఇక, నీసేవ అను అమృతరసమును పానముచేయుచు. సుఖముగానుందును.

ఈ శ్లోకమున ''**త్వదీయకృపయా ప్రతిలబ్ధసత్తః**'' అనుటచే అనిష్టనివృత్తి, ''**త్వత్సేవనామృతరసేన సుఖీ**'' అనుటచే ఇష్టప్రాప్తియు సూచింపబడినవి. తిరుమళిశై యాళ్వార్లు ''**అన్రునాన్ పిఱన్దిలేన్ పిఱన్దపిన్ మఱన్దిలేన్**'' అనుచు భగవచ్ఛేషత్వమును స్వరూపజ్ఞానములేని నాడు తాను జన్మించిన వాడనే కాదని, స్వరూప జ్ఞానమును పొందిన పిదప, దానిని ఏనాడు మఱువలేదని పల్కిరి. ఈ భావనను కవి ఆళ్వార్లవిషయమున ''**భవాని**'' అనుచు ఇచట అనుసంధించిరి. భగవద్రామానుజులు ''**యత్పదాంభోరుహధ్యాన విధ్వస్తాశేషకల్మషః, వస్తుతాముపయాతోఽహం**'' అనుచు యామునుల విషయమున పల్కిన సూక్తి ఇచట స్మరణీయము. ''**రసగ్ం హ్యేవాయం లబ్ధ్వా నందీ భవతి**'' అనుచు వేదము రసస్వరూపుడగు భగవానుని ముక్తపురుషుడు పొంది, ఆనందమును కల్గిన వాడగునని తెలిపెను. అట్లే కవి ఇచట ఆళ్వార్లను పొంది తాము అమృతరసపానమును చేయుదునని అనుచున్నారు.

**24)** అత్రాప్యముత్ర కరణత్రితయప్రవృత్త్యా
త్వత్పాదపంకజజుషాం విదుషాం ప్రసాదమ్।
నిత్యం లభేమహి నచాన్య దపేక్షితం నః
ప్రత్యగ్రకేసరపరిష్కృత కారిసూనో॥

ప్ర.అ. - ప్రత్యగ్రకేసరపరిష్కృత = నూతనములగు కేసరపుష్పములతో (వకుళపుష్పములతో) అలంకరింప బడిన, కారిసూనో = 'కారి' అను ఆమెకు జన్మించిన శఠకోపమునీంద్రా!, అత్ర =

(ఈలోకమున) ఇచట, అముత్ర = అచట (వేరొకలోకమున) కరణత్రితయ ప్రవృత్త్యా = వాక్, మనస్సు, క్రియలను అను మూడు కరణముల (సాధనముల) ప్రయత్నముచే (త్రికరణశుద్ధిగా), త్వత్పాదపంకజజుషాం = నీ పాదపద్మములను ప్రీతితో సేవించు, విదుషాం = విజ్ఞుల యొక్క, ప్రసాదం = అనుగ్రహమును, నిత్యం = ఎల్లప్పుడు, లభేమహి = పొందెదము గాక/ చ = మఱియు, నః = మాకు, అపేక్షితం = అభిలషించినది, అన్యత్ = వేరొకటి, న = లేదు.

వ్యాఖ్య :- ఇంతవరకు ఆళ్వార్ల అవ్యాజమైన కరుణయే తమకు రక్షకమనుచు ప్రాపక నిష్కర్షను చేసిన స్తుతికర్త ఇందు ప్రాప్యనిష్కర్షను చేయుచున్నారు.

నూతనవకుళపుష్పాభరణా! శఠకోపమునీంద్రా! ఈలోకముననే కాక, పరలోకమున కూడ మాకు త్రికరణశుద్ధిగా నీ పాదసేవను చేయు మహాత్ముల అనుగ్రహమే ఎల్లప్పుడు కావలయును. అదియే మాకు పరమప్రాప్యము. అంతకంటె వేరొక ఫలమును కోరము.

(అత్రాప్యముత్ర) - భట్టరు శ్రీరంగరాజస్తవమున **''తత ఇతః పశ్యేమ లక్ష్మీసఖమ్''** ఇచటనే కాక, పరమపదమున కూడ శ్రీరంగనాథునే దర్శింతుము గాక అనిరి. యామునులు స్తోత్ర రత్నమున **''అత్ర పరత్ర చాపి నిత్యం యదీయచరణౌ శరణం మదీయమ్''** అనుచు తమకు ఆచార్యులగు నాథమునుల పాదపద్మములే ఇహలోకమున, పరలోకమున ప్రాప్యమని అనుచు ఆచార్య విషయమున ఆభావమును అనుసంధించిరి. ప్రస్తుతశ్లోకమున కవి అదే భావమును భాగవతుల విషయమున అనుసంధించు చున్నారు.

**''జుషీ- ప్రీతిసేవనయోః''** అనుధాతువు నుండి పుట్టిన **''జుషాం''** అను పదము ఇచట సాభిప్రాయకముగా ప్రయోగింపబడినది. ధాతువునకు కల రెండర్థములు ఇచట వివక్షితములే. **''త్వత్పాద పంకజజుషాం అత ఏవ విదుషాం''** అని అన్వయించుటవలన నమ్మాళ్వార్ల పాద పద్మములను ప్రీతితో సేవించుటయే నిజమైన జ్ఞానమని, అట్టి జ్ఞానమును కల్గిన వారే పండితులని ధ్వనించుచున్నది. **''వేత్తి సర్వం ఇతి విద్వాన్''** అను విద్వచ్ఛబ్దమిచట మిక్కిలి అర్థవంతము. **''విదుః కృష్ణం బ్రాహ్మణా స్తత్త్వతో యే తేషాం రాజన్ సర్వయజ్ఞాః సమాప్తాః''** అను ప్రమాణమువలన భగవానుడగు శ్రీ కృష్ణుని ప్రాప్య ప్రాపకముగా తలచిన వారు కృతకృత్యులని తెలియుచున్నది. **''ఒణ్ తామరైయాళ్ కేళ్వన్ ఒరువనైయే నోక్కుముణర్వు''** అని పొయ్‌కై ఆళ్వార్లును భగవానుని ప్రాప్యప్రాపకముగా నెంచుటయే నిజమైన జ్ఞానమనిరి. స్తుతికర్త ఇచట ఆభావమును భాగవతవిషయమున అనుసంధించిరి.

**''నిత్యం త్వత్పాద పంకజజుషాం విదుషాం ప్రసాదం లభేమహి, నః అన్యత్ అపేక్షితం న''** అను వచనము తిరుప్పావైలోని **''ఉన్దన్నోడుఱ్ఱోమే యావోమ్, ఉనక్కే నామ్ ఆట్చెయ్‌వోమ్, మఱ్ఱైనమ్ కామఙ్గళ్ మాఱ్ఱు''** అను సూక్తిని తలపింప చేయుచున్నది. **''అన్యదపేక్షితం నః''** అనునపుడు **''మఱ్ఱొన్ఱినై క్కాణావే''** అను తిరుప్పాణ్ సూక్తియు స్మరణీయము.

తిరుప్పాణాళ్వార్లు శ్రీరంగనాథుని పట్ల తలచిన భావమును స్తుతికర్త భాగవతప్రావణ్యవిషయమున అన్వయించుటయే ఇచటి భేదము. ప్రస్తుతశ్లోకమునకు యతిరాజ వింశతిలోని **"శ్రీమన్ యతీంద్ర తవ దివ్యపదాబ్జసేవాం . . . అన్వహం వివర్ధయ, కామం విరుద్ధ మఖిలం చ నివర్తయ"** అను శ్లోకమునకు గల భావ సాదృశ్యము మిగుల రమణీయము. **"త్వత్పాద పంకజ జుషాం విదుషాం"** అనుటకు **"మాఱన్ అడిపణిన్దుయ్ న్దవన్"** అని **"పరాంకుశపాద భక్తం"** అని చెప్పబడు భగవద్రామానుజులని చెప్పిన, రామానుజుల అనుగ్రహమే అపేక్షితమను భావము ధ్వనించును. లేక నీపాదస్థానీయులగు భగవద్రామానుజులనే సర్వస్వముగా తలచి సేవించి, యతీంద్రప్రవణులని పేరుపొందిన శ్రీమణవాళ మహామునులనియు ఇచట వివరింప వచ్చును. స్తుతికర్త మణవాళమహామునుల శిష్యులే కదా!

**25)** **వాధూలవేంకటపతిం వరదార్యసూనుమ్**
**అస్మద్గురుం తవ పదప్రవణం సమీక్ష్య ।**
**అజ్ఞం కృతాగస మనాథ మకించనం మాం**
**త్వత్కింకరం శఠరిపో సతతం కురుష్వ ॥**

ప్ర.అ. - శఠరిపో = శఠకోపమునీంద్రా!, తవ = నీయొక్క, పద- ప్రవణం = పాదములయందు భక్తిని కలవారు, వరదార్యసూనుం = వరదాచార్యుల కుమారులును, అస్మద్గురుం = నాకు గురువులును అగు, వాధూలవేంకటపతిం = వాధూలవేంకటాచార్యులను, సమీక్ష్య = చక్కగా చూచి, అజ్ఞం = జ్ఞానశూన్యుడను, కృతాగసం = అపరాధములను చేసిన వాడను, అనాథం = దిక్కు లేని వాడను, అకించనం = ఏమియులేని వాడను. అయినను, మాం = నన్ను, త్వత్ కింకరం = నీ సేవకునిగా, సతతం = ఎల్లప్పుడు, కురుష్వ = చేసికొనుము.

వ్యాఖ్య :- ఈ శ్లోకముతో **'పరాంకుశపంచవింశతి'** అను ప్రస్తుత స్తోత్రము పూర్తి అగును. ఇందు కవి తమ ఆకించన్యమును, అనన్యగతిత్వమును, పాపభూయిష్ఠతను తెలుపుచు, తమ ఆచార్యసంబంధమును చూచి అనుగ్రహింప వలసినదిగా ఆళ్వార్లను ప్రార్థించుచున్నారు.

ఓ శఠకోపమునీంద్రా! నీ పాదములయందు గొప్ప భక్తిని కలవారు, వరదాచార్యుల కుమారులు, నాకు ఆచార్యులును అగు వాధూల వేంకటాచార్యులవారిని చూచి, జ్ఞానహీనుడను, అపరాధిని, దిక్కులేని వాడను, అకించనుడను అయినను, వారి పాదసంబంధమును కల్గియున్నవాడను అగు నన్ను నీ సేవకునిగా ఎల్లప్పుడు అంగీకరింపుము.

శ్రీయామునులు స్తోత్రరత్నము చివర "**అకృత్రిమత్వచ్చరణారవింద ప్రేమప్రకర్షావధి మాత్మవంతం పితామహం నాథమునిం విలోక్య ప్రసీద మద్వృత్తమ చింతయిత్వా**" అనుచు తమ ప్రవర్తను చూచి ఆగ్రహింపక, సహజమైన నిరుపాధికమైన, భగవద్భక్తిని కల్గినవారు, తాతగారునుఅగు నాథమునులను చూచి అనుగ్రహింపుమని భగవానుని వేడిరి. కూరేశులు వరదరాజస్తవము చివర

''రామానుజాంఘ్రిశరణోఽస్మి... దాసస్తవేతి వరదాస్మి తవేక్షణీయః'' అని భగవద్రామానుజుల పాద సంబంధమును చూచి తమను అనుగ్రహింపుమనిరి. ఇట్టి భావమును కవి ప్రస్తుతశ్లోకమున ఆళ్వార్ల విషయమున అనుసంధించిరి. ''దత్తే రంగీ నిజమపి పదం దేశికాదేశ కాంక్షీ'' అని దేశికులు పల్కినట్లు ఆచార్యసంబంధమును కలిగియున్నపుడే భగవానుడు అనుగ్రహించును. అట్లే ఆళ్వార్లును తమను అనుగ్రహించుటకు అవసరమైన సదాచార్యపాద సంబంధమును తాము కల్గియుండుటను కవి ఇందు తెలిపినట్లయినది. గడచిన పలుశ్లోకములలో తమ అజ్ఞతను, అపరాధిత్వమును, అనన్యగతిత్వమును, ఆకించన్యమును కవి వివరించిరి. సదాచార్యసంబంధమును కల్గియున్నవాడు ఎట్టివాడైనను అనుగ్రహింపతగినవాడని తెలియుచున్నది. **''ఆచార్యవాన్ పురుషో వేద''** అని చెప్పబడు చున్నది కదా! దీనినిబట్టి నిరంకుశులుగా చెప్పబడిన ఆళ్వార్లు సైతము కాదనుటకు వీలులేనిది సదాచార్యసంబంధమని తెలియుచున్నది. పూర్వము ఉదాహరింపబడిన స్తోత్రరత్నశ్లోకమును వ్యాఖ్యానించుచు దేశికులు **''సర్వేభ్యః సమధికం నిరంకుశస్వాతంత్ర్యేణ సర్వేశ్వరేణాపి అనతిలంఘనీయ- స్వాసాధారణ- స్వాంగీకారహేతు మాహ''** అనిపల్కుట ఇచటస్మరణీయము. అట్లే స్తోత్రరత్నశ్లోకములోని 'ప్రసీద' అను పదమును దేశికులు **''అనాద్యనంతమదపరాధజనితకాలుష్యం విహాయ మామైకాంతి కాత్యంతిక కైంకర్య సామ్రాజ్యధన్యం కురుష్వేత్యభిప్రాయః''** అని వ్యాఖ్యానించిరి. ఈ భావమును కవి ప్రస్తుతశ్లోకమున ద్వితీయార్థమున అనుసంధించుట గమనింపవచ్చును. ఈ విధముగా ప్రస్తుతశ్లోకము పూర్వోదాహృతస్తోత్రరత్నశ్లోకమునకు అనుకరణమని చెప్పనగును.

పూర్వశ్లోకమున తిరుప్పావైలోని **''శిత్తమ్ శిఱుకాలే''** పాశురార్థము అనుసంధింపబడినట్లే, ప్రస్తుతశ్లోకమునకు**ఱైవొన్ఱుమిల్లాద కుఱైవొన్ఱుమిల్లాద''** అను భావమును **''అకించనం''**, **''అజ్ఞం''** అనుపదములతో, **''ఇత్తైప్పఱై కొళ్వాన్ అన్ఱు కాణ్''** అనుభావము **''మాం త్వత్కింకరం కురుష్వ''** అనుటద్వారా అనుసంధింపబడినవి. గోదాదేవి ప్రాప్య ప్రాపకములను రెండిటిని భగవానుని ద్వారా అపేక్షింపగా, కవి వానిని ఆళ్వార్ల ద్వారా అభిలషించుట విశేషము. ''కురుష్వ'' అను ఆత్మనేపదప్రయోగము వలన కైంకర్యఫలము ఆళ్వార్లదేననియు ధ్వనించుచున్నది.

**ఇతి వకుళధరం మునిం వచోభిః**
**శ్రుతిసుఖదై రధికం ప్రమోదయంతమ్ ।**
**వరదగురువరం విచిన్త్య చేతో**
**మమ సముపైతి మహత్తరం ప్రమోదమ్ ॥**

**ప్ర.అ.** - ఇతి = ఈ విధముగా, శ్రుతిసుఖదైః = చెవులకు సుఖమును కల్గించు, వచోభిః = మాటలతో, వకుళధరం మునిం = శఠకోపమునిని, అధికం = మిక్కిలి, ప్రమోదయంతం =

సంతోషింపచేయు, వరదగురువరం = వాధూల వరదాచార్యులను ఆచార్య శ్రేష్ఠులను, విచింత్య= తలచి, మమ = నా, చేతః = మనస్సు, మహత్తరం = గొప్పదగు, ప్రమోదం = ఆనందమును, సముపైతి = పొందుచున్నది.

వ్యాఖ్య :- ఈ శ్లోకము, తరువాతి శ్లోకమును 'పరాంకుశపంచవింశతి' అను ప్రస్తుతస్తోత్రమును రచించిన శ్రీ వాధూలవరదాచార్యుల వారి శిష్యులలో ఒకరు రచించిరని చెప్పనగును. ప్రస్తుతస్తోత్ర రచన ద్వారా నమ్మాళ్వార్లను సంతోషపెట్టిన వరదాచార్యులను తలచిన నా మనస్సు మిక్కిలి సంతోషపడుచున్నదనుట సారాంశము.

ఈ విధముగా వకుళాభరణులగు నమ్మాళ్వార్లను చెవులకింపగు మాటలతో స్తుతించి, సంతోషపెట్టిన శ్రీవాధూల వరదాచార్యులను ఆచార్య శ్రేష్ఠులను తలచిన నామనస్సు మిక్కిలి ఆనందమును పొందుచున్నది అని భావము.

శ్రీ యామునులు స్తోత్రరత్నమున ''**భవంత మేవ – ప్రహర్షయిష్యామి సనాథజీవితః**'' అనుచు కైంకర్యమును చేయుట ద్వారా భగవానునకు ఆనందము కల్గించుటయే ఆత్మకు పరమప్రాప్యమనిరి. పరమ పదములోని నిత్యసూరులును, ముక్తులును ''**విపన్యవః జాగ్రువాంసః సమింధతే**'' అనునట్లు భగవానుని స్తుతించుటవలన మిక్కిలి ప్రకాశింతురు. ఈ కైంకర్యమును కవి ఆళ్వార్ల విషయమున చేయుట విశేషము. భాగవతకైంకర్యము భగవత్కైంకర్యములోనికే చేరును కదా! ఇట్లు స్తుతికర్త ఆళ్వార్ల విషయమునచేసిన వాగ్రూపకైంకర్యము వారి శిష్యులమగు మాకు నిరవధికమైన ఆనందమును కల్గించుచున్నదని తాత్పర్యము.

'**యతిరాజవింశతి**' అను భగవద్రామానుజస్తుతిపరమైన స్తోత్రమునకు, ప్రస్తుతస్తోత్రమునకు గల అర్థసాదృశ్యము పలు సందర్భములలో వివరింపబడినది. ఆ స్తోత్రము చివర స్తోత్రకర్త అగు మణవాళమహామునులను కీర్తించు ''**ఇతి యతికులధుర్య మేధమానైః**'' అను శ్లోకమునకు ప్రస్తుతశ్లోకమునకు గల భావసాదృశ్యము గమనింప తగినది. ''**వరవరముని మేవ చింతయన్తీ మతి రియ మేతు నిరత్యయం ప్రసాదం**'' అనుటకు, ''**వరదగురువరం విచిన్త్య చేతో మమ సముపైతి నిరత్యయం(మహత్తరం) ప్రమోదం**'' అనుసూక్తి మిక్కిలి సదృశము కదా! అట్లే, ఈ రెండు శ్లోకములును పుష్పితాగ్ర అను సమవృత్తమున రచింపబడుట విశేషము. ఈ శ్లోకము కొన్ని ప్రతులలో కన్పించుటలేదు.

**ఇత్యాదరం వకుళమాలికయేవ మోదం**
**స్తుత్యా పరాంకుశమునేః వరదో గురు ర్నః ।**
**వాధూలవేంకటపతేః తనయోఽంతరంగైః**
**రంగేశ దీవ్యతు సమాః శత మున్నతశ్రీః ॥**

**ప్ర.అ.** - రంగ + ఈశ = శ్రీ రంగనాథా! ఇతి = ఈ విధముగా, పరాంకుశమునేః = నమ్మాళ్వార్లకు, వకుళమాలికయా = వకుళమాలికచే, మోదం = సంతోషమును (సువాసనను) ఇవ = వలె, స్తుత్యా = పరాంకుశపంచవింశతి అనుస్తుతిచే, ఆదరం = ప్రీతిని, (కురుతః = కల్గించుచు,గౌరవమును, భక్తిని ప్రకటించునట్టి), వాధూలవేంకటపతేః = వాధూల వేంకటాచార్యులయొక్క, తనయః = కుమారులు, నః = మా యొక్క, గురుః = ఆచార్యులును అగు, వరదః = వరదాచార్యులు, అంతరంగైః = అంతరంగ శిష్యులతో పాటు, శతం సమాః = నూరు సంవత్సరములు, సమున్నతశ్రీః = గొప్ప సంపదను కల్గిన వారై, దీవ్యతు = ప్రకాశింతురు గాక!

**వ్యాఖ్య :-** ముందు శ్లోకము వలె ఈ శ్లోకము కూడ స్తుతికర్త శిష్యులలో ఒకరిచే రచింపబడినది. ఆచార్య విషయమున శిష్యుడు చేయు మంగళాశాసనము ఇందవి ముఖ్యాంశము.

శ్రీరంగనాథా ! వాధూలవేంకటపతి కుమారులును, మాకు ఆచార్యులును, నమ్మాళ్వార్లకు, వకుళమాలికవలె మిక్కిలి ఆనందమును కల్గించు "**పరాంకుశపంచవింశతి**" అను స్తోత్రమును రచించుట ద్వారా తమ ఆదరమును తెలిపిన వారును అగు వరదాచార్యులు అంత రంగశిష్యులతో పాటు మిక్కిలి వైభవముతో నూరు సంవత్సరములు ప్రకాశింతురు గాక!

భగవానుని మంగళా శాసనము వలె, ఆచార్యులకు చేయు మంగళాశాసనము కూడ ప్రపన్నుని స్వరూపములోనికి చేరును. కావున ఈ స్తుతికర్త విషయమున వారి శిష్యులు మంగళా శాసనము చేయుట తగినదే అగును. "**సమున్నతశ్రీః**" అనునపుడు శ్రీశబ్దముచే భగవద్భాగవతకైంకర్య మను సంపద తెలుపబడుచున్నది. అదియేకదా ప్రపన్నునకు సంపద. "**వకుళమాలికయా మోద మివ**" అనుటచే స్తుతికర్త నమ్మాళ్వార్లకు వకుళమాలికా కైంకర్యమును చేసిరని ధ్వనించుచున్నది. ఇందువలన "**పాడిక్కొడుత్తాళ్ నఱ్పామాలై, పూమాలై చ్చూడిక్కొడుత్తాళ్**" అను గోదాదేవివలె స్తుతికర్తయు పూమాలను, పామాలను సమర్పించిరని ఏర్పడు చున్నది. కాని విశేషమేమనగా. గోదాదేవి భగవానునకు సమర్పింపగా, స్తుతికర్త ఆళ్వార్లకు సమర్పించిరి. గోదాదేవి పాయించిన తిరుప్పావై ప్రబంధమువలె ఈ స్తోత్రము కూడ చరమపర్వనిష్ఠాప్రాశస్త్యమును వివరించుట గమనింపతగినది. ఈ శ్లోకముకూడ కొన్ని ప్రతులలో కానవచ్చుటలేదు.

❀ ❀ ❀

శ్రీమతే శఠకోపాయ నమః

# శ్రీ శఠకోపప్రపత్తి

శ్రీశఠకోపప్రపత్తి, శ్రీశఠకోప మంగళాశాసన మను ఈరెండు స్తోత్రములను రచించినవారు ఎవరు? అనునది స్పష్టముగా ఏర్పడుటలేదు. ప్రపత్తిస్తోత్రములో చివర ''సౌమ్యోపయంతృ మునినా మమ దర్శితౌ'' అని మంగళాశాసనమున ''శ్రీమత్సుందర జామాతృముని మానసవాసినే'' అనియు ఉన్నందున శ్రీమణవాళమహామునుల శిష్యులలో ఒకరు వీనిని రచించిరని ఊహింపవీలున్నది. వీని తాళపత్ర ప్రతులు, వ్రాతప్రతులు మద్రాస్ప్రాచ్యలిఖిత గ్రంథభాండాగారములో, అడైయార్ గ్రంథాలయములో, మైసూర్లో, ఇంకను పలుచోట్ల కలవు. మంగళాశాసనములోని కొన్ని శ్లోకములు భగవద్విషయ వ్యాఖ్యానమునకు గల అరుంబదములో ఉట్టంకింపబడుటచే ఆస్తోత్రముయొక్క ప్రాచుర్యము వ్యక్తమగుచున్నది. శబ్దమాధుర్యముతో అర్థగాంభీర్యముతో విలసిల్లు వీనిని యథామతి దాసుడు తెలుగున రచించిన వ్యాఖ్యతో ప్రపన్నలోకమునకు సమర్పించుచున్నాడు. గుణగ్రాహులైన సహృదయులు స్వీకరింతురు గాక!

1) శ్రీ శ్రీశపుష్కలకృపావిషయైః యతీంద్ర-
పూర్ణార్యయామునముఖైః పరమార్థవిద్భిః ।
పూర్వైః ప్రసూనసదృశౌ విధృతౌ శిరోభిః
భవ్యౌ శఠారిచరణౌ శరణం ప్రపద్యే ॥

ప్ర. అ. - శ్రీ = లక్ష్మీ దేవియొక్క, శ్రీశ = శ్రియః పతి అగు భగవానునియొక్క, కృపా = నిర్హేతుక కృపకు, విషయైః = లక్ష్యభూతులగు, యతీంద్ర = భగవద్రామానుజులు, పూర్ణ+ ఆర్య = పెరియనంబి అనబడు పూర్ణార్యులు, యామున = శ్రీయామునాచార్యులు, ముఖైః = మొదలగు, పరమ+ అర్థవిద్భిః = శ్రేష్ఠమైన తత్త్వ జ్ఞానమును తెలిసిన, పూర్వైః = పూర్వాచార్యులచే, శిరోభిః = తమ తలలతో, విధృతౌ = ధరింపబడినవి, ప్రసూనసదృశౌ = పుష్పములతో సమానమైనవి, భవ్యౌ = మంగళకరమైనవగు, శఠారిచరణౌ = నమ్మాళ్వార్ల శ్రీపాదములను, శరణం = ఉపాయముగా, ప్రపద్యే = పొందు చున్నాను (ఆశ్రయించుచున్నాను.)

**భావము :-** లక్ష్మీదేవియొక్క, భగవానునియొక్క పరిపూర్ణకృపకు పాత్రులు, పరమార్థవిదులును అగు భగవద్రామానుజులు, మహాపూర్ణులు, యామునులు మొదలగు పూర్వాచార్యులచే తమ శిరస్సులతో దాల్చబడినవి, పూవువలె సుకుమారమైనవి, మంగళకరములైనవగు శఠకోపసూరి పాదములను శరణముగా ఆశ్రయించుచున్నాను.

దివ్యదేశములు, అందలి అర్చామూర్తులును ఆచార్య పరిగ్రహీతములగుటచే అవి మనకు పరమ ప్రాప్యములని పెద్దలందురు. ఏ విషయమైనను ఆచార్యపరిగ్రహీతమైనప్పుడే

ప్రాప్యమగును. "సౌమ్యోపయంతృమునినా మమ దర్శితౌ తౌ శ్రీ వేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే" అనుచు ఈ విషయమును అణ్ణన్ స్వామి తెలిపిరి కదా! ఆళ్వార్ల శ్రీపాదములు భగవద్రామానుజుల వంటి పూర్వాచార్యులచే శిరస్సుతో ధరింపబడినవి కావున మనకు ప్రాప్యములను భావము ప్రస్తుతశ్లోకపూర్వార్థమున సూచింపబడినది. 'పరమార్థ విద్భిః' అనుటకు భగవచ్ఛేషత్వము భాగవతశేషత్వ పర్యంతము అనుష్ఠింపవలెనను పరమార్థమును తెలిసినవారని చెప్పనగును. ఈ అర్థము చాల అరుదైనదని "**విషయ ప్రవణనుక్కు అత్తై విట్టు భగవద్విషయత్తిలే వరుకై క్కుళ్ళు వరుమై పోలన్ఱు, ప్రథమపర్వత్తై విట్టు చరమపర్వత్తిలే వరుకైక్కుళ్ళ వరుమై**" అను శ్రీవచన భూషణమున (415) సూత్రమున పిళ్లైలోకాచార్యులవారు సూచించిరి. "ప్రసూన సదృశౌ" అనుటచే భోగ్యత్వము, "**భవ్యౌ**" అనుటచే (మంగళార్థకమగుటచే) ఇష్టప్రాపకత్వమును సూచింపబడినవి. శ్లోక ప్రారంభమున శ్రీ శబ్ద ప్రయోగముచే మంగళాచరణము చేసినట్లయినది.

2) సంచింతనే ప్రశమితాశ్రితసర్వతాపౌ  
ప్రత్యేకముక్తిఫలదాయిపరాగగర్భౌ ।  
సర్వప్రపన్నజనమానసరాజహంసౌ  
భవ్యౌ శఠారిచరణౌ శరణం ప్రపద్యే ॥

ప్ర.అ. - సంచింతనే(కృతే) = చింతించినపుడు, ప్రశమిత = పూర్తిగా నశింప చేయబడిన, ఆశ్రిత = ఆశ్రయించినవారియొక్క, సర్వతాపౌ = సమస్త దుఃఖములను కల్గినవి, ప్రత్యేక = ప్రతి ఒక్కరికిని, ముక్తిఫలదాయి = ముక్తిరూపమైన ఫలమును ఇచ్చు, పరాగ = పుప్పొడిని, గర్భౌ = గర్భమందుకల్గినవి, సర్వ = అందఱు, ప్రపన్న జన = ఆశ్రితులయొక్క, మానస = మనస్సులలో విహరించు, రాజ హంసౌ = రాజహంసలును, భవ్యౌ = మంగళకరములును అగు, శఠారిచరణౌ = శఠకోపసూరి పాదములను, శరణం = శరణముగా, ప్రపద్యే = పొందుచున్నాను.

**భావము :-** భావించినంతనే ఆశ్రితుల సమస్త తాపములను పోగొట్టునవి, ప్రతి ఒక్కరికిని ముక్తి రూపఫలమును ఇచ్చు పరాగమును మధ్యను కల్గినవి, సమస్త ప్రపన్నజనుల మనస్సులు అను సరోవరములయందు క్రీడించు రాజహంసలవంటివి, మంగళకరములగు శఠకోపసూరి పాదములను శరణు పొందుచున్నాను.

నమ్మాళ్వార్లు పెరియతిరువన్దాదిదివ్యప్రబంధమున "తడమ్ కడలై మేయార్ **తమక్కునిళ్ళలుమ్...... ఆనోమ్**" అనుచు భగవానుని పాదచ్ఛాయగా తమను తెలుపుకొనిరి. ఛాయకు తాప హరత్వము సహజలక్షణము. అట్టి ఆళ్వార్ల శ్రీపాదములను ఆశ్రిత తాపములను తీర్చునవి గా పల్కుట మిక్కిలి అర్థవంతము. పూవులోని పరాగమే ఫలమునకు మూలము. ఆళ్వార్ల పాదవములను పూర్వ శ్లోకమున "ప్రసూనసదృశౌ" అని కవిపల్కిరి.

అందులకనుగుణముగా ఆ పూవులలోని పరాగమువలన సిద్ధించు ఫలమే దనుటకు ముక్తి రూప ఫలమును ఇచ్చునని సమాధానమును ఇచ్చుట తెలిపినట్లయినది. ప్రపన్నజనుల మనస్సు **''రమణీయం ప్రసన్నాంబు''** అని వాల్మీకి భగవానుడు పల్కినట్లు స్వచ్ఛమైన, చల్లని నీరు కల్గిన సరస్సు వంటిది. **''ప్రసన్నశీతాశయ''** అని భట్టరును ఈ విషయమును పల్కిరి. కావున అవి మానస సరస్సువంటివి. కావున సత్పురుషుల మనస్సులను మానవసరస్సుతో పోల్చుట కవి సమయము. రాజహంసలు మానససరస్సులో క్రీడించును కావున ఆళ్వార్ల పాదములను రాజహంసలతో పోల్చుట తగినది. అనగా ప్రపన్నమనో ధ్యేయములని తాత్పర్యము.

**3) యత్క్షాళనోదకపవిత్రితతామ్రపర్ణ్యా**
**నీచోచ్చవీచితరళః సజలా(డా) శయోఽపి ।**
**ముక్తామయత్వ మయతే నతపారిజాతౌ**
**తాదృక్ శఠారిచరణౌ శరణం ప్రపద్యే ॥**

ప్ర.అ. - యత్ = ఏ నమ్మాళ్వార్ల పాదములను, క్షాళన = కడుగుట కొఱకైన, ఉదక = నీటిచే, పవిత్రిత = పావనము చేయబడిన, తామ్రపర్ణ్యా = తామ్ర పర్ణీనదిచే, నీచ = క్రిందకు, ఉచ్చ = పైకి కదలు, వీచి = కెరటములచే, తరళః = చంచలమైన, సః = ఆ, జల+ ఆశయః+ అపి = సముద్రమును (జడమైన మనస్సును కలవాడును) ముక్తామయత్వం (ముక్త+ ఆమయత్వం) = ముత్యములతో నిండిన స్థితిని (తొలగిన వ్యాధిని కల్గిన స్థితిని), అయతే = పొందుచున్నదో, నతపారిజాతౌ = ఆశ్రితులకు పారిజాతములవంటివగు, తాదృక్ = అట్టి, శఠారి = నమ్మాళ్వార్ల, చరణౌ = పాదయుగ్మమును, శరణం = ఉపాయముగా, ప్రపద్యే = పొందుచున్నాను.

**భావము :-** శ్లేషాలంకారనిర్వహణద్వారా నమ్మాళ్వార్ల పాదముల వైభవమును స్తుతించుట ప్రస్తుత శ్లోకములోని విశేషము.

నమ్మాళ్వార్లు అవతరించిన తిరునగరి తామ్రపర్ణీనదీ తీరమున కలదు. ఆ తామ్రపర్ణీ నదీజలములు ఆళ్వార్ల పాదములను కడుగుటకు ఉపయోగపడునవి అగుటచే పరమ పవిత్రములైనవి. అట్టి తామ్రపర్ణీనది ముత్యములకు ప్రసిద్ధి చెందినది. **''నదీనాం సాగరోగతిః''** అనునట్లు నదులన్నియు సాగరములోనికి చేరును. కావున పవిత్రములైన తామ్రపర్ణీ నదీ జలములలో కొట్టుకొనివచ్చు ముత్యములు సముద్రమును చేరును. ఇట్లు పైపైకి లేచి పడు కెరటములను కల్గియుండుటచే నిత్యము చంచలమైన సముద్రముకూడ పావనమై, ముత్యములతో నిండినదగును. ఆళ్వార్ల పాదజలముల సంబంధముచే ఇట్టి ప్రభావమును కల్గినది, ఆశ్రితులకు పారిజాతముల వంటివి, అగు నమ్మాళ్వార్ల పాదయుగ్మమును శరణు వేడుచున్నాను.

ఈ శ్లోకమున **''నీచోచ్చవీచి తరళః''**, **''జలా(డా) శయః''**, **''ముక్తామయత్వం''** అను మూడు పదములు శ్లిష్టములు, **''నీచోచ్చవీచితరళః''** అనుటకు సముద్రపక్షమున పడిలేచు

కెరటములచే చంచలమైనదని భావము. నీచములైన, ఉన్నతములైన భావ పరంపరలచే చంచలుడను వేరొక అర్థము కూడ ఈ పదమువలన స్ఫురించుచున్నది. 'వీచి' అను పదముచే కెరటమనియేకాక, కెరటములతోకల సాదృశ్యముచే భావపరంపరయు లక్షింపబడుచున్నది. కావున పైభావము వ్యక్తమగుటకు అవకాశముకలదు, అట్లే, జలాశయ మనుటకు సముద్ర పక్షమున జలమునకు స్థానమని అర్థము. సంస్కృతభాషలోని "లడయో రభేదః" అను న్యాయమును బట్టి ఈ పదమును జడాశయమని గ్రహించినచో, జడమైన జ్ఞానహీనమైన ఆశయమును అనగా మనస్సును కలవాడను అర్థాంతరము ఇచట ఏర్పడుచున్నది. "ముక్తామయత్వ" మను పదమునకు సముద్రపక్షమున ముత్యములతో నిండి యుండుట అని అర్థము. "మయట్" ప్రత్యయమున కిచట ప్రాచుర్యార్థమును గ్రహింపనగును. అట్లే "ముక్త+ఆమయత్వం" అని ఈ సమాసపదమును గ్రహించిన, తొలగిన రోగమును కల్గియుండుట, అనగా వ్యాధి నయమైనస్థితి అని తాత్పర్యము. ఇట్లు ఈ శ్లోకమున ఆలోచనలలోని హెచ్చు తగ్గులచే చంచలమైన మనస్సును కల్గిన, వివేకహీనమైన మనస్సును కల్గినవాడు కూడ ఆళ్వార్ల పాదసంబంధమువలన పరమపావనములైన తామ్రపర్ణీ నదీజలముల ప్రభావముచే స్వరూపజ్ఞానమును పొందును, అతని మనోవ్యాధి తీరును; అట్టి వైభవమును నమ్మాళ్వార్ల శ్రీపాదములు కల్గియున్నవి- అను వేరొక భావమును ప్రతీత మగుచున్నది. ఈ వృత్తాంతము ఆళ్వార్ల పాదసంబంధవైశిష్ట్యమును తెలుపుచుండుటచే ప్రకృతార్థముగా గ్రహింపనగును. కావున, ఇందు శ్లేషాలంకారము కలదని చెప్పనగును.

తామ్రపర్ణీనది ముత్యములకు ప్రసిద్ధి చెందిన దనుటకు గరుడవాహనపండితులచే రచింపబడిన దివ్యసూరిచరితములోని "**తామ్రపర్ణీనదీ స్వస్యా స్తరలోర్మికరోద్ధృతైః, ముక్తాఫలై ర్వితనుతే ముదా పుష్పాంజలి శ్రియమ్**" అనుశ్లోకమును "**పూఙ్గి యర్కోన్ తెన్నాడు ముత్తుడైత్తు తెణ్ణీర్ మణ్ణి డై నన్నాడు శాన్ఱోరుడైత్తు**" అను ఔవైయార్ పాడల్ను స్మరింపనగును. "నీచోచ్చవీచి" అనుటకు పరత్వవిషయమనగల పలువిధములైన వితర్కములనియు తాత్పర్యము. అనగా బ్రహ్మయే పరతత్త్వమని, రుద్రుడే పరతత్త్వమని, ముగ్గురు త్రిమూర్తులు తుల్యులని, ఈముగ్గురికన్న పరతత్త్వమునే రొకటి కలదని - ఇట్లు పలువురు పలువిధములుగా చేయువాదములని అర్థము. ఈ సందర్భమున "**ముదలామ్ తిరువురువుమ్ మూన్ఱెన్బర్**" అనుపెరియ తిరునన్దాది పాశురము, శ్రీరంగ రాజస్తవ పూర్వశతకములోని "త్రయో దేవా స్తు ల్యాః" అను శ్లోకార్థము స్మరణీయము.

**4)** పద్మాసహాయచరణస్మరణప్రమోద-
సంపత్తృణీకృతవిరించిశివాదిభోగైః ।
శ్రీ వైష్ణవై స్సతతభోగ్యతయానుభూతౌ
ప్రాప్యౌ శఠారిచరణౌ శరణం ప్రపద్యే ॥

ప్ర.అ. - పద్మాసహాయ = శ్రియఃపతి అగు భగవానునియొక్క, చరణ = పాదములయొక్క, స్మరణ = చింతన వలన కల్గిన, ప్రమోద = గొప్ప ఆనందము అను, సంపత్ = సంపద కారణముచే, తృణీకృత = తృణప్రాయముగా చేయబడిన (తలచబడిన), విరించి = బ్రహ్మయొక్క, శివ = మహేశ్వరునియొక్క, భోగైః = భోగములను కల్గిన, శ్రీవైష్ణవైః = మహాత్ములగు విష్ణు భక్తులచే, సతత = ఎల్లప్పుడు, భోగ్యతయా = అనుభవింపతగినవిగా, అనుభూతౌ = సేవింపబడినవి, (కావుననే) ప్రాప్యౌ = నాకు పరమప్రాప్యములును అగు, శఠారిచరణౌ = నమ్మాళ్వార్ల పాదములను, శరణం = ఉపాయముగా, ప్రపద్యే = పొందుచున్నాను.

**భావము** :- భగవానుని పాదములను స్మరించుటవలన ఏర్పడిన ఆనందము అను సంపదను కల్గియుండుటచే భగవద్భక్తులు బ్రహ్మశివాది పదముల ఐశ్వర్యమును సైతము తృణప్రాయములుగా తలతురు. అట్టి శ్రీవైష్ణవులు సైతము ఆళ్వార్ల పాదములను నిత్యభోగ్యములుగా తలచి, ఆశ్రయింతురు. కావున అవి నాకు పరమప్రాప్యములు, ఆ పాదములను ఉపాయముగా పొందుచున్నాను.

భగవద్రామానుజులను స్తుతించుచు కూరేశులు ''**అచ్యుత పదాంబుజయుగ్మరుక్మ వ్యామోహత స్తదితరాణి తృణాయ మేనే**'' అనుచు భగవానుని పాదపద్మములను స్వర్ణము పైగల వ్యామోహముచే, మిగిలిన నన్నిటిని తృణసమానములుగా తలచిరి అనిరి. అట్టి శ్రీరామానుజుల పాద సంబంధమును కల్గిన వారిని స్తుతించుచు ''**తృణీకృతవిరించాదినిరంకుశవిభూతయః, రామానుజపదాంభోజసమాశ్రయణశాలినః**'' అని మహనీయులగు పూర్వాచార్యులొకరు పల్కిరి. ''**భోగా ఇమే విధిశివాది పదం కిం చ స్వాత్మానుభూతి రితి యా కిల ముక్తి రుక్తా, సర్వం తదూషజలజోష మహం జుషేయ**'' అని కూరేశులు వరదరాజస్తమున సాయించిరి. ఇట్టి భావములు ఇచట అనుసంధింపబడెనని చెప్పనగును.

'**పద్మాసహాయ**' అనుటకు ''**పద్మాయాః సహాయః**'' అని, ''**పద్మా సహాయా యస్య సః**'' అని రెండు విధములుగా వివరింపవచ్చును. ఈ రెండు వివరణములవలన దివ్యదంపతుల నిత్యయోగము తెలుపబడుచున్నది. ఆశ్రయణమునందును, కైంకర్యసమయమునను లక్ష్మీ సంబంధము అపేక్షితమను విషయమును ద్వయములోని పూర్వార్థ, ఉత్తరార్థములలోని శ్రీమత్పదము తెలుపుచున్నది అని కదా సంప్రదాయము. కావున ఇచట పద్మాసహాయ శబ్దము అట్టి నిత్యసంశ్లేషమును, పురుషకారపూర్తిని, కైంకర్య ప్రతిసంబంధిత్వమును సూచించుచున్నది. ''**పద్మాసహాయచరణ**'' అనుటకు భగవానుని- పాదములనియే కాక, భగవానునిపాదములుగా చెప్పబడు భగవద్రామానుజులు అనియు చెప్పవచ్చును. ''**విష్ణుః శేషీ**'' అనుశ్లోకమున రామానుజులను''**రామానుజార్యః పదకమలయుగం భాతి రమ్యం తదీయమ్**'' అని చెప్పబడినది కదా!

43761



భగవానుని పాదస్మరణమువలన కల్గిన సంపదచే శివాదిభోగములను సైతము త్యజించిన శ్రీవైష్ణవులు నమ్మాళ్వార్ల పాదములను పరమ భోగ్యములుగా సేవింతురనుటచే భగవానుని స్మరణవలన కల్గిన ఆనందముకంటె ఆళ్వార్లపాదములను ఆశ్రయించుటవలన కల్గు ఆనందము యొక్క అతిశయము ధ్వనించుచున్నది. భగవానుని స్మరణము సంపదవంటి దనుటకు ''పాఱ్కడల్ శేర్న్ద పరమనై పయిలుమ్ తిరువుడైయార్'' వంటి పలు సూక్తులు స్మరణీయములు.

**5) ప్రత్యూషపూషచరణోన్మిషదంబుజాభౌ**
**తత్తత్పుమర్థపరసర్వజనాభివంద్యౌ ।**
**దుర్లంఘ్యభీమభవవారిధితారపోతౌ**
**ప్రాప్యౌ శఠారిచరణౌ శరణం ప్రపద్యే ॥**

**ప్ర. అ** - ప్రత్యూష = ఉదయకాలమునందలి, పూష = సూర్యునియొక్క, చరణ = కిరణములచే, ఉత్+ మిషత్ = వికసించు, అంబుజ = పద్మములయొక్క, ఆభౌ = కాంతిని కల్గినవి, తత్+ తత్ = ఆయా, పుమర్థపర = పురుషార్థములను ప్రధానముగా కల్గిన, సర్వజన = అందఱు జనులచే, అభివంద్యౌ = నమస్కరింపతగినది, దుర్లంఘ్య = దాటుటకు సాధ్యముకాని, భీమ = భయంకరమైన, భవ = సంసారమును, వారిధి = సముద్రము యొక్క, తార = తరణమునందు, పోతౌ = తెప్పలవంటివి, ప్రాప్యౌ = పొందతగినవి అగు, శఠారిచరణౌ = శఠకోపసూరి చరణములను, శరణం= శరణముగా, ప్రపద్యే =పొందు చున్నాను.

**భావము** :- ఉదయకాలపు సూర్య కిరణములచే వికసించిన తామరలవంటి శోభను కల్గినవి, జనులకు వారు కోరిన ఆయా పురుషార్థములను ఇచ్చునవి, కావున, వారిచే నమస్కరింపబడునవి, సంసారులకు దాటరాని సంసారసముద్రమును దాటుటకు సమర్థములైన సాధనములుఅను పడవల వంటివి, ప్రాప్యమైనవగు శఠకోపసూరి పాదములను శరణు పొందుచున్నాను.

నమ్మాళ్వార్లు రచించిన ప్రబంధములు కేవలము ముక్తి దాయకములు మాత్రమేకాదు. ధర్మ- అర్థ - కామములను త్రివర్గమును కూడ ఇచ్చునవి. దివ్య ప్రబంధములను నేర్చుకొని, వాని సహాయముతో జీవనము గడపు వారెందరో ఈనాటికిని కలరు. అట్టి ప్రబంధములను అనుగ్రహించిన ఆళ్వార్లపాదములను త్రివర్గములను అపేక్షించువారు సైతము ఆరాధించుటలో ఆశ్చర్యములేదు కదా!

**6) అన్నాదిధారక మశేషశరీరభాజాం**
**సంపోషణం దధిపయఃప్రభృతిప్రశస్తమ్ ।**
**శబ్దాదిభోగ్య మపి యస్య స కృష్ణ ఏవ**
**తాదృక్శఠారిచరణౌ శరణం ప్రపద్యే ॥**

ప్ర.అ. - అశేష = సమస్త, శరీరభాజాం = మానవులకు, అన్నాదిధారకం = అన్నము మొదలగు ధారకపదార్థములు, దధి = పెరుగు, పయః = పాలు, ప్రభృతి = మొదలగు, ప్రశస్తం = గొప్పదైన, సంపోషణం = పోషకములు, శబ్ద+ ఆది = శబ్దరసగంధస్పర్శాదులగు, భోగ్యం = భోగ్యవస్తులు, అపి = కూడ, యస్య = ఏ శఠకోపసూరికి, కృష్ణః + ఏవ = భగవానుడగు శ్రీకృష్ణుడే అయ్యెనో, తాదృక్= అట్టి, శఠారి = శఠకోపసూరియొక్క, చరణౌ = పాదములను, శరణం = ఉపాయముగా, ప్రపద్యే = పొందుచున్నాను.

**భావము :-** లోకమున మానవులు అనుభవించు పదార్థములు మూడు విధములు. వానిలో అన్నము మొదలగు పదార్థములు ధారకములు. జీవనాధారములని అర్థము. పాలు, పెరుగు, వెన్న, మొదలగు రుచ్యపదార్థములన్నియు పోషకములు. అట్లే, తాంబూలము, చందనము, కర్పూరము మొదలగునవి భోగ్యములు. ఇవి అన్నియు వేర్వేరు. ధారకము భోగ్యము కానేరదు. భోగ్యము పోషకము కానేరదు. కాని ''**ఉణ్ణుమ్ శోరు పరుకుమ్ నీర్, తిణ్ణుమ్ వెత్త్రి లై యుమ్ ఎల్లామ్ కణ్ణన్**'' అని ఆళ్వార్లు పల్కిన విధముగా, వారికి సమస్తము భగవానుడగు కృష్ణుడే. ''వాసుదేవః సర్వ మితి స మహాత్మా'' అని గీతలో భగవానుడు ఈ విషయమును సూచించెను. అట్టి ఆళ్వార్ల శ్రీపాదములను శరణముగా పొందుచున్నాను అని భావము.

ప్రస్తుతశ్లోకము పైన ఉదహరింపబడిన తిరువాయ్మొళి పాశురములోని భావనలను, గీతాశ్లోకార్థములను అనుసరించి రచింపబడినదనుట స్పష్టము.

7) **భూలోకపూర్వతనపుణ్యచయైః మహాత్మా**
**యః కారినామకమహాపురుషాత్మజో ఽభూత్ ।**
**కృష్ణో యథైవ వసుదేవసుతః ప్రసూతః**
**తాదృక్ శఠారిచరణౌ శరణం ప్రపద్యే॥**

ప్ర.అ - భూలోక = భూలోకమునందలి జనులయొక్క, పూర్వతన = ప్రాచీన, పుణ్యచయైః = పుణ్యసమూహములచే, మహాత్మా = మహాత్ముడగు, కృష్ణః = శ్రీ కృష్ణుడు, యథా+ ఏవ = ఏవిధముగా, వసుదేవసుతః = వసుదేవుని కుమారుడుగా, ప్రసూతః = జన్మించెనో అట్లే, యః = ఏ నమ్మాళ్వార్లు, కారినామక = 'కారి' అనుపేరునుకల్గిన, మహాపురుష = మహాత్మునకు, ఆత్మజః = కుమారునిగా, అభూత్ = అయ్యెనో, తాదృక్ = అట్టి, శఠారి = శఠకోపసూరియొక్క, చరణౌ = చరణద్వంద్వమును, శరణం = ఉపాయముగా, ప్రపద్యే = పొందుచున్నాను.

**భావము :-** భూలోకవాసుల పుణ్యఫలరూపముగా మహాత్ముడగు శఠకోపసూరి కారి అను మహాపురుషునకు, కృష్ణుడు వసుదేవునకువలె, కుమారుడుగా అవతరించెను. అట్టి నమ్మాళ్వార్ల శ్రీపాదములను శరణముగా పొందుచున్నాను.

ఆచార్యహృదయమను రహస్య గ్రంథమున ఆళ్వార్ల అవతారమును గూర్చి పలు సంభావనలు చేయబడినవి. అందు ''మున్నమ్ నోఱ్ఱ అనన్తన్మేల్ పుణ్ణియజ్గళ్ ఫలిత్తవరో? ఎన్ను శజ్కిప్పర్ కళ్'' అను సంభావనావిశేష మిచట స్మరణీయము. అనగా, నిత్యసంసారులలో ఒకరు తాము చేసిన సుకృతఫలముగా ఆళ్వార్లుగా అవతరించిరా? లేక, నిత్యసంసారిని నిత్య సూరిగా చేయగల్గిన అనంతశాయి అగు సనాతనపుణ్యమే పూర్ణముగా ఫలించి, ఇట్లు మారిరా? అని భావము. ప్రస్తుత శ్లోకములోని భూలోకవాసులు పూర్వము చేసిన పుణ్యముల ఫలితముగా మహాత్ములగు ఆళ్వార్లు అవతరించిరా? అను సంభావనయు అట్టిదే. 'మహాత్మా' అనునపుడు. ''స మహాత్మా సుదుర్లభః'' అను గీతావాక్యము, ''ఉణ్ణుమ్ శోరు పరుకుమ్ నీర్ తిణ్ణుమ్ వెఱ్ఱిలైయుమ్ ఎల్లామ్ కణ్ణన్'' అను తిరువాయ్మొழి సూక్తి స్మరణీయములు. భట్టరు 'కృష్ణతృష్ణాతత్వం ఇవోదితం' అనుచు లోకములోని జనుల కృష్ణ ప్రేమ ఆళ్వార్లుగా అవతరించెననగా, ఇచట కవి లోకములోని పుణ్యము ఆళ్వార్లుగా అవతరించిరని పల్కిరి. ఈ శ్లోకమున ఆళ్వార్లకు, కృష్ణావతారమునకు మధ్యగల సామ్యము ధ్వనించుచున్నది. నమ్మాళ్వార్ల ప్రబంధమగు తిరువాయ్మొழి శ్రీకృష్ణ ప్రోక్తమగు గీతను వివరించునని ఆచార్యుల అభిప్రాయము.

**8)** **సర్వాధికార ఇతి వైభవసంభవాయ**
**వేదాః అనాదినిధనా ద్రవిడోక్తిరూపాః ।**
**దివ్యప్రబంధవపుషో యత ఆవిరాసన్**
**తాదృక్ శఠారిచరణౌ శరణం ప్రపద్యే ॥**

**ప్ర.అ.** - అనాదినిధనాః = అదియు అంతములేని, వేదాః = వేదములు, సర్వాధికార = అందఱకు అధికరింప తగినవి, ఇతి = అను, వైభవసంభవాయ = గొప్పతనము కలుగుటకు, యతః = ఏ శఠకోపసూరి వలన, ద్రవిడ+ ఉక్తిరూపాః = ద్రావిడ భాషామయములగు, దివ్యప్రబంధవపుషః = దివ్య ప్రబంధముల రూపమును, కల్గినవై, ఆవిరాసన్= ఆవిర్భవించెనో, తాదృన్= అట్టి శఠారి = శఠకోపసూరియొక్క, చరణౌ = పాదద్వంద్వమును, శరణం = ఉపాయముగా, ప్రపద్యే = పొందుచున్నాను.

**భావము :-** అనాది, అనంతములు అగు వేదములు అందరిచే అభ్యసింప తగినవను ప్రశస్తిని పొందుటకై ద్రావిడభాషలో దివ్య ప్రబంధముల రూపమున ఆళ్వార్ల ద్వారా లోకమున ఆవిర్భవించినవి. అట్టి ఆళ్వార్ల శ్రీపాదములను శరణుపొందుచున్నాను.

ఆచార్యహృదయమను రహస్యగ్రంథములో '**మేఘమ్ పరుకిన సముద్రామ్బు పోలే నూల్కడల్ శొల్ ఇవర్ వాయన వాయ్ తిరున్దిన వాజే సర్వదా సర్వోపజీవ్యమామే**'', ''**మృద్ఘటమ్ పోలన్రే పొఱ్కుడమ్**'' అను సూత్రములును, *(72,73)* ఆ సూత్రములను వ్యాఖ్యానించుచు

శ్రీమణవాళ మహామునులు సాయించిన "అధ్యయనకాలనియతియైయుమ్, త్రైవర్ణికాధి కారికతయా అధికారినియతైయు ముడైత్తాయిరున్దుళ్ళ "నూఱ్కడల్" ఎన్గిఱవేద విద్యాసముద్రత్తిల్ వచనమ్ "ఇవళ్ వాయనకళ్ తిరున్దన" ఎన్గిఱపడియే ఇవరుడైయ వాగ్గతమాయ్ కాలనియమాధికారి నియమనిరపేక్షమాన ఆకారత్తై యడైన్దు, కట్టళైప్పట్టవాఱే "అధ్యేతవ్యం ద్విజశ్రేష్ఠైః వేదరూప మిదం కృతమ్, స్త్రీభిః శూద్రాదిభి శ్చైవ తేషాం ముక్తిః కరే స్థితా" ఎన్గిఱపడియే ఒరుకాలనియమ మిన్ఱిక్కే సర్వకాలముమ్ సర్వర్క్కుమ్ ఉపజీవ్యమామిఱే ఎన్దై" అని, "ఇత్తాల్ కారణమాన వేదమ్ అధికృతాధికారమా యిరున్దాలుమ్ తత్కార్యమాన వితు సంస్కారవిశేషత్తాలే సర్వాధికారమాక క్కడవైయిల్లై యెన్దదాయిఱ్ఱు. దృష్టాన్తత్తిలే తోఱ్ఱు కిఱ కారణతా శ్లాఘ్యాతాదికళ్ దార్ ష్టాంతికత్తిలుమ్ వివక్షితమ్." అను సూక్తులును ఇచట స్మరణీయములు. కావున నమ్మాళ్వార్ల ముఖమున ద్రావిడభాషలో అవతరించిన వేదము సర్వాధికార మయ్యెనని ఏర్పడుచున్నది.

9) శ్రీతింత్రిణీ సవిధగాయ జనాయ సర్వ-
మిష్టం దదాతి యదధిష్ఠితమూలదేశా ।
యద్దర్శనప్రణయనిత్యనివృత్తనిద్రా
తాదృక్ శఠారిచరణౌ శరణం ప్రపద్యే ॥

ప్ర. అ. - యత్ = ఏ నమ్మాళ్వార్లచే, అధిష్ఠిత = అధివసింపబడిన, మూలదేశా = మూలస్థానమును కల్గినది, యత్ = ఏనమ్మాళ్వార్లయొక్క, దర్శన = సందర్శనముచే, కల్గిన, ప్రణయ = అనురాగమువలన, నిత్య = నిత్యము, నివృత్త = తీరిన, నిద్రా = నిద్రను కల్గినది అగు, శ్రీతింత్రిణీ = మంగళకరమగు చింతచెట్టు, సవిధగాయ = తన కద్దకువచ్చు), జనాయ = జనులకు, ఇష్టం = వారి కోరికను, సర్వం = సమస్తమును, దదాతి = ఇచ్చుచున్నదో, తాదృక్ = అట్టి, శఠారి = నమ్మాళ్వార్ల, చరణౌ = పాదయుగ్మమును, శరణం = ఉపాయముగా, ప్రపద్యే = పొందుచున్నాను.

**భావము :-** నమ్మాళ్వార్లకు ఆశ్రయమైన తింత్రిణీ వృక్షమును స్తుతించుట ద్వారా శ్రీ ఆళ్వార్ల వైభవమును నిరూపించుట ప్రస్తుతశ్లోకములోని అంశము.

నమ్మాళ్వార్లు అధిష్ఠించిన మూలదేశమును కల్గినది, ఆ ఆళ్వార్లను దర్శించుటచే కల్గిన అనురాగము వలన (భక్తివలన) నిత్యము నిద్ర లేకుండ ఉన్నది అగు తింత్రిణీ వృక్షము సైతము (చింతచెట్టు) తనను సమీపించు వారి అభీష్టముల నన్నిటిని ప్రసాదించును. అట్టి వైభవమును కల్గిన నమ్మాళ్వార్లయొక్క పాదములను ఉపాయముగా పొందుచున్నాను.

నమ్మాళ్వార్లు అవతరించుటకు ముందు భగవానుడు ఆదిశేషులను పిలిచి, తిరునగరిలో చింతచెట్టుగా ఆవిర్భవించి, ఆళ్వార్లకు ఆశ్రయముగా కావలసినదని ఆజ్ఞాపించెను. ఆదిశేషుడును అట్లే చేసెను. కావున ఆళ్వార్ తిరునగరిలోని చింతచెట్టు ఆదిశేషుల అవతారముగా

చెప్పబడుచున్నది. ఈ వృత్తాంతమును గరుడవాహనపండితులు దివ్యసూరిచరితమున'' **అసౌష్ట తనయం యస్మిన్ ముహూర్తే నాథనాయికా, నిర్నిద్రతింత్రిణీరూపః శేషస్తన్నగరేஉ భవత్**'' అని అనుసంధించిరి. నమ్బూరికేశవాచార్యులును ఆచార్యసూక్తిముక్తావళిలో'' **అమ్మహాత్మునకు వర్షాతప వారణార్థంబుగా నతని యవతారంబునకు ముందట ననంతుండు తింత్రిణీ తరుస్వరూప ధరుండై వర్ధిల్లుచుండె**'' నని పల్కెను. ఈ చింతచెట్టు'' **ఉఱజ్గాప్పుళి**'' నిద్రింపని చింతచెట్టుగా ప్రసిద్ధి చెందినది. పరమపదమున భగవానుని ఆదిశేషుడు''**అజ్గారవార మదుకేట్టు అழలుమిழుమ్ పూజ్గారరైవణైయాన్**'' అనునట్లు నిత్యము జాగరూకతతో రక్షించునట్లే, ఇచట తింత్రిణీ వృక్షరూపమున ఆழ్వార్లను రక్షించుటచే నిర్నిద్ర తింత్రిణి అయ్యెను ఆழ్వార్ల తిరుక్కుఱుఙ్గుడి స్వామి వరఫలమేకదా!'' **యద్దర్శనప్రణయనిత్యనివృత్త**'' అనునపుడు ఆழ్వార్ల దర్శనమునందు అనగా ద్రావిడ బ్రహ్మసంహిత అందలి అనురాగముచే తింత్రిణీ వృక్షమునకు నిద్రతొలగినదను భావము కూడ ధ్వనించుచున్నది. నమ్మాழ్వార్లు తిరువాయ్మొழిలో''**పరన్ శెన్ఱుశేర్ తిరువేఙ్గడ మామలై ఒన్ఱుమేతొழనమ్ వినై మోయుమే**'' అనుచు భగవానుడు నివసించియున్న వేంకటాచలమునకు నమస్కరించిన తమ కర్మలనన్నియు నశించుననిరి. ఆభావమును ఇచట కవి ఆழ్వార్లు నివసించు తింత్రిణీవృక్షమున అనుసంధించిరి.

**10)** **సత్వోత్తరైః సతతసేవ్యపదాంబుజేన**
**సంసారతారకదయార్ద్రదృగంచలేన ।**
**సౌమ్యోపయంతృమునినా మమ దర్శితౌ తౌ**
**శ్రీ మచ్ఛఠారిచరణౌ శరణం ప్రపద్యే ॥**

**ప్ర.అ** - సత్వ+ ఉత్తరైః = సత్వగుణముతో నిండినవారిచే, సతత = ఎల్లప్పుడు, సేవ్య = సేవింపతగిన, పద+ అంబుజేన = పాదపద్మములను కల్గినవారు, సంసార = సంసారమునుండి, తారక = రక్షించు, దయా+ ఆర్ద్ర = దయచే తడసిన, దృక్+ అంచలేన = కటాక్షములను కల్గినవారగు, సౌమ్య + ఉపయం తృమునినా = శ్రీరమ్యజామాతృమునిచే, మమ = నాకు, దర్శితౌ= చూపబడినవి అగు, తౌ = ఆ, శ్రీమత్ = అందమైన, శఠారి = శఠకోపసూరియొక్క, చరణౌ = పాదద్వంద్వమును, శరణం = ఉపాయముగా, ప్రపద్యే = పొందుచున్నాను.

**భావము** :- సత్వగుణమును నిండిన వారగు మహనీయులచే ఎల్లప్పుడు సేవింపతగిన పాదపద్మములను కల్గినవారు, సంసారమునుండి ఆశ్రితులను రక్షించు కటాక్షములను కల్గినవారును అగు శ్రీమణవాళమహామునులచే ప్రాప్యములుగా నాకు చూపబడిన ఆశఠకోపసూరి పాదపద్మములను శరణముగా పొందుచున్నాను.

**(సత్వోత్తరైః)** - శ్రీమణవాళమహామునుల భక్తులు సత్వగుణపూర్ణులు. రజస్తమోగుణముల సంబంధము ఏమాత్రము వారికి లేదు. ''**అపగతమద మానై**

రంతిమోపాయనిష్ఠైః, అధిగతపరమార్థై రర్థకామానపేక్షైః, నిఖిలజనసుహృద్భిః నిర్జితక్రోధలోభైః వరవరమునిభృత్యైః'' అనుచు ఎఱుమ్బియప్పాఅను మణవాళమహామునుల శిష్యులు ఉత్తరదినచర్యాస్తోత్రమున పల్కుట ఇచట స్మరణీయము. ''అపగతమదమానైః, నిర్జితక్రోధలోభైః, అర్థకామానపేక్షైః'' అనువిశేషణములు రజస్తమోగుణరాహిత్యమును, ''అంతిమోపాయనిష్ఠైః, అధిగతపరమార్థైః, నిఖిలజనసుహృద్భిః'' అను విశేషణములు సత్వగుణపూర్ణతను తెలియజేయును.

(దయార్ద్రదృగంచలేన) - మణవాళమహామునుల వాழி త్తిరునామములో ''కరుణై పొజ్ఞియ కణ్ణిణైవాழிయే'' అని (కరుణపొంగి పొఱలు నేత్రద్వయమునకు మంగళము) యుండుట గమనింపతగినది.

(సౌమ్యోపయంతృమునినా) - 'సౌమ్యోపయంతా' అను నామము ''అழగియమణవాళన్'' అను తమిళనామమునకు రూపాంతరము. ఈ పేరు శ్రీరంగనాథునకు సుప్రసిద్ధము. ఈ నామము శ్రీమణవాళమహామునులు అవతరించినపుడు వారికి పితృపాదులచే పెట్టబడినది. పిమ్మట మణవాళ మహామునులు సన్న్యసించిన పుడు శ్రీరంగనాథుడు అర్చక ముఖమున '' ఇకపైమీరు నాపేరగు పూర్వపునామముతోనే వ్యవహరింపబడుదురుగాక!'' అని అనుగ్రహించుటచే వారికి ''సౌమ్యోయంతృముని'' అను పేరు కల్గినది 'ముని' శబ్ద మిచట సన్న్యాసాశ్రమ దశను తెలుపును.

(మమ దర్శితౌ తౌ) అకించనుడను, గతి లేనివాడను అగు నాకు మణవాళమహామునులచే పరమ ప్రాప్యములుగా నమ్మాழ்వార్లపాదములు చూపబడినవి అనుటచే ఆచార్యరుచి పరిగృహీతమైన వగుటచే ఆழ்వార్లపాదములను శరణముగా తలచుచున్నానని ధ్వనించుచున్నది. ఇట్టి భావము మొదటి శ్లోకములో కూడ కలదనుట ఇంతకు ముందే వివరింపబడినది. అందు భగవద్రామానుజ, పూర్ణార్య, యామునాది పూర్వాచార్య రుచిపరిగృహీతత్వము తెలుపబడగా, ఇందు శ్రీమణవాళమహామునుల రుచిపరిగృహీతత్వము తెలుపబడుట విశేషము. 'తౌ' అను సర్వనామము అనిర్వచనీయ ప్రాప్యతను, భోగ్యతను తెలుపును.

ఈ శ్లోకములోని మొదటిమూడు పాదములు ప్రతివాదిభయంకరం అణ్ణన్‌సాయించిన శ్రీ వేంకటేశప్రపత్తిలోని 15వ శ్లోకములో గల మూడుపాదములతో సమానముగానుండుట స్పష్టముగా కన్పించుచున్నది. కావున ఈ ప్రపత్తి అణ్ణన్ స్వామిచేగాని, వారి వంశస్థులచే గాని రచింపబడియుండునని ఊహింప వీలున్నది.

శ్రీమచ్ఛబ్దమును శఠారిపదమునకు విశేషణముగా కాని, చరణపదమునకు విశేషణముగాకాని అన్వయింపవచ్చును. శఠకోపసూరికి విశేషణమైనపుడు జ్ఞాన, భక్తి, కైంకర్యలక్ష్మిని, కల్గినవారని అర్థము. పాదములను విశేషణమైనచో శుభమును కల్గిన, మంగళకరమైన అని భావము.

శ్రీమతే శఠకోపాయ నమః

# శ్రీశఠకోపమంగళమ్

1) శ్రియః కాంతస్య కృపయా నిర్నిబంధప్రవృత్తయా।
గర్భే ఽభిషిక్తో య స్తస్మై శఠకోపాయ మంగళమ్॥

ప్ర.అ - నిర్నిబంధప్రవృత్తయా= ఏ హేతువులేకుండగనే ప్రవృత్తమయిన (సహజమైన), శ్రియః కాంతస్య = శ్రియఃపతియొక్క, కృపయా = కరుణచే, యః = ఏ శఠకోపసూరి, గర్భే = గర్భమునందున్నప్పుడే, అభిషిక్తః = అభిషేకింపబడిరో, తస్మై = ఆ, శఠకోపాయ = శఠకోపసూరికి, మంగళమ్ = శుభము (అగుగాక!)

**భావము.** - నిర్హేతుకమైన భగవానుని కరుణచే గర్భస్థస్థితిలోనే అభిషేకింపబడిన నమ్మాళ్వార్లకు మంగళమగుగాక!

భగవానుడు, ఆళ్వార్లు, ఆచార్యులును తమను రక్షించువారని తలచుదశ భక్తిదశ. ఈ భక్తి దశ మరింత పరిపక్వ మయినచో, ప్రేమదశగా మారును అట్టిప్రేమదశలో అస్థానే భయశంక కల్గును. అనగా వారికి ఏమయిన ప్రమాదము జరుగునేమో! అను భయము కారణము లేకుండగనే కల్గును. అపుడు వారికే విధమైన అపాయము కలుగకుండవలెనని వారి క్షేమమును భక్తుడు ఆశాసించును. దీనికే మంగళాశాసనమనిపేరు. కావున భగవానునకు, ఆళ్వార్లకు, ఆచార్యులకు మంగళాశాసనమును చేయుట ప్రపన్నుని స్వరూపమునకు పూర్ణతను కల్గించునే తప్ప, లోటును కల్గింపదని పూర్వాచార్య లందఱు నిష్కర్షించిరి. అట్టి క్రమములోనే కవి నమ్మాళ్వార్ల మంగళాశాసనమును చేసిరని చెప్పనగును. లేనిచో, ప్రపన్నజన కూటస్థులుగా, పరమాచార్యులుగా చెప్పబడు ఆళ్వార్లకు మంగళాశాసనమును చేయుట అసంగతముగా తోచును కదా!

స్తోత్రప్రారంభమున 'శ్రీ' శబ్దము ప్రయోగింపబడుటచే మంగళమును ఆచరించినట్లయినది. ''నిర్నిబంధ ప్రవృత్తయా'' అనునపుడు''**నిర్హేతుకకటాక్షేణ మదీయేన మహామతే, ఆచార్యవిషయీకారో అప్నువంతి పరాం గతిమ్**', ''**కేవలం స్వేచ్ఛ యైవాహం ప్రేక్షే కంచిత్ కదాచన**'' అను భగవానుని వచనములును, ''**నాయ మాత్మా ప్రవచనేన లభ్యో న మేధయా న బహునా శ్రుతేన, ..... యమే వైష వృణతే తేన లభ్యః**'' అను శ్రుతియు స్మరింపతగినవి. ''**వెఱిదే అరుళ్ శెయ్‌వర్**' అను ఆళ్వార్ల శ్రీసూక్తి ఈ అర్థములను ద్రఢీకరించుచున్నది. ''**శ్రియఃకాంతస్య**'' అనుప్రయోగము సలక్ష్మీకుడైన భగవానుడుతప్పక అనుగ్రహించునని తెలుపుచున్నది. (**గర్భే ఽభిషిక్తః**) - తల్లిగర్భమునందున్నపుడే భగవానుని కటాక్షవీచికలు వారిని తడపినవి. ''**జాయమానం హి పురుషం యం పశ్యేత్ మధుసూదనః, సాత్త్వికః స తు విజ్ఞేయః స వై మోక్షార్థచింతకః**'' అనుసూక్తిచే ఏ పురుషుని అతడు జన్మించినపుడు భగవానుడు కటాక్షించునో

అతడు సాత్త్వికుడు, మోక్షమును గూర్చి ఆలోచించువాడును అగునని తెలుపబడినది. ఇందు ఆళ్వార్లు గర్భమునందుండగానే భగవత్కటాక్షమునకు పాత్రులైరనట్లు పల్కుటచే అంతకంటె గొప్పతనము సూచింపబడినది. సింహాసనమున రాజు పవిత్రనదీజలములచే రాజ్యాభిషిక్తుడైనట్లు, ఆళ్వార్లు తల్లిగర్భములో నుండగానే భగవానుని కటాక్షములచే ప్రపన్నజనకూటస్థులుగా, పరమాచార్యులుగా పట్టాభిషిక్తులయ్యిరి అనుస్వారస్యము ఇచట ధ్వనించుచున్నది. ఆచార్యహృదయములోని **''అళ్పార్క్కి అవన్........ పక్కనోక్క అ ప్పణ్ణిన విశేషకటాక్షమ్''** *(94)*-అను సూక్తిస్మరణీయము. శఠకోప నామమునకు అజ్ఞానమును కల్గించు శఠమను వాయువును నిరోధించిన వారని భావము. **''గూఢవిప్రియకృత్ శఠః''** అను ప్రమాణమును బట్టి గూఢముగా అప్రియమును చేయువాడు శఠుడు. కామక్రోధలోభమోహ మదమాత్సర్యములను అరిషడ్వర్గములు మనలోనే గూఢముగా ఉండి, మనకు తీరని అపకారమును చేయును. ఆ అరిషడ్వర్గమును నిగ్రహించిన వారనియు చెప్పనగును. లేక, నాస్తికవాదముతో, మాయావాదముతో వేదమునకు, భగవానునకు, భగవద్భక్తులకు అప్రియమును చేయు శఠులను భగవానుని స్వరూప రూపగుణవిభూతులను విస్తరముగా ప్రతిపాదించు దివ్యప్రబంధములను అనుగ్రహించుట ద్వారా నిగ్రహించిరనియు చెప్పనగును.

ఇట్టి ఆళ్వార్లకు మంగళమగు గాక! అని తాత్పర్యము. ఈ శ్లోకము, **''అజన్మనః''** అను *3* వ శ్లోకము ఈడు ముదల్ శ్రియః పతి అరుమ్బదవ్యాఖ్యలో ఉట్టంకింపబడినవి.

**2)  అసూత యం కారిదేవీ పూర్వసంధ్యేవ భాస్కరమ్ ।**
**తస్మై దివ్యావతారాయ శఠకోపాయ మంగళమ్ ॥**

**ప్ర.అ.** - యం = ఏ శఠకోపసూరిని, కారిదేవీ = 'కారి' అను మహాత్ములయొక్క పత్ని, భాస్కరం= సూర్యుని, పూర్వసంధ్యా = ఉదయసంధ్య, ఇవ = వలె, అసూత = ప్రసవించెనో, దివ్య+ అవతారాయ= గొప్ప అవతారమగు, తస్మై = ఆ, శఠకోపాయ = శఠకోపసూరికి, మంగళమ్= శుభము. ( *అగును గాక!* )

**భావము** :- 'కారి' అనుమహాత్మునియొక్క భార్యఅగు ఉడైయనఙ్గై (నాథనాయకి) ఏశఠకోపసూరిని, ఉదయసంధ్య సూర్యుని వలె, ప్రసవించెనో, అట్టి గొప్ప అవతారమగు నమ్మాళ్వార్లకు మంగళమగుగాక!

నమ్మాళ్వార్లు **'కురుకాపురి'** అనబడు ఆళ్వార్ తిరునగరి అనుదివ్య దేశమున 'కారి' అనుమహనీయులకు, వారి ధర్మపత్ని అగు ఉడైయనఙ్గై దేవికిని పుత్రులుగా జన్మించిరి. ఆవృత్తాంతము ప్రస్తుతశ్లోకమున ప్రస్తావింపబడినది. భాగవతమున శ్రీకృష్ణావతార ఘట్టమున వ్యాసభగవానులు **''తతోఖిలజగత్పద్మబోధాయాచ్యుతభానునా, దేవకీపూర్వసంధ్యాయామావిర్భూతం మహాత్మనా''** అనుచు సమస్తలోకములను పద్మములను సంతోషింపచేయు దేవకి అనుపూర్వ సంధ్యయందు జన్మించిన అచ్యుతభానునిగా శ్రీకృష్ణుని అవతారమును స్తుతించిరి. ఆభావము ప్రస్తుతమున గైకొనబడినది. కావున శఠకోపసూరికి సూర్యునితో, శ్రీకృష్ణునితో

సామ్యము ధ్వనించుచున్నది. ''యద్గోసహస్ర మపహంతి..... తస్మై నమో వకుళ భూషణ భాస్కరాయ'' అను పరాంకుశాష్టక శ్లోకమున ఆళ్వార్లు భాస్కరునిగా రూపింపబడిరి. (అజ్ఞానాంధకార) తమో నివర్తనముచే, భగవానునకునివాసస్థానమగుటచే, సమస్తవైదికజనులకు వంద్యులగుటచే సూర్యునకు, ఆళ్వార్లకు పలువిధముల పోలికలు కలవు. సూర్యునిచే సాధ్యము కాని అజ్ఞాన నిరోధము ఆళ్వార్లచే సాధ్యమైనదను ఆధిక్యమును కలదు. అట్లే, ఆళ్వార్లకు శ్రీకృష్ణునకు పలువిధముల సామ్యములు కలవు. ''కృష్ణతృష్ణాతత్వం'' అనుభట్టరు శ్రీసూక్తికి కృష్ణునకు లోకోద్ధరణయందు గల తృష్ణయే ఆళ్వార్లుగా అవతరించెను అర్థము చెప్పవీలగుటచే. ఒక విధముగా కృష్ణుని అవతారమే ఆళ్వార్లు అని చెప్పనగును. నమ్మాళ్వార్ల తిరువాయ్ మొళ్ళి కి, భగవానుని గీతకును కల పదునెనిమిది విధములైన సామ్యములను ఆచార్య హృదయ గ్రంథకారులు నిరూపించిరి. ఆగ్రంథములోనే శ్రీకృష్ణావతారముకన్న ఆళ్వార్ల అవతారమునకుగల అతిశయమును వివరింపబడినది. కావున ''తస్మై దివ్యావ తారాయ'' అనుట అర్థవంతము. ''అస్తు దివ్యావతారాయ మంగళం శ్రీశఠారయే'' అను పాఠాంతరము కలదు.

**3) ఆజన్మనః షోడశాబ్దాత్ స్తన్యాద్యనభిలాషిణే ।**
**శ్రీశానుభవపుష్టాయ మంగళం శ్రీశఠారయే ॥**

**ప్ర.అ.** - ఆజన్మనః = జన్మమొదలు, షోడశ+ అబ్దాత్ = 16 సంవత్సరముల వఱకు, స్తన్య+ ఆది+ అనభిలాషిణే = స్తన్యపానము (మొదలగు ధారకపోషక భోగ్యములను) కోరనివారు, (అయినను), శ్రీశ = భగవానుని యొక్క స్వరూపరూప గుణవిభూతుల, అనుభవ = అనుభవముచే, పుష్టాయ = పుష్టిని కల్గినవారును అగు, శ్రీ శఠారయే = శ్రీశఠకోపసూరికి, మంగళమ్ = మంగళము.

**భావము :-** జన్మించినదిమొదలు 16 సంవత్సరములవరకు శఠకోపసూరి లోకములో బిడ్డలు అన్నపానాదులను అభిలషించునట్లు వ్యవహరింపక, యోగసమాధిలోనుండి, భగవదనుభవమును పొందిరి; భగవానుని స్వరూపరూప కళ్యాణగుణాద్యనుభవమే ధారకపోషకాది సమస్తముగా కల్గినవారై, వృద్ధిచెందిరి. అట్టి అప్రాకృతరూపులగు ఆళ్వార్లకు మంగళమగు గాక!

''ఉణ్ణుమ్ శోరు పరుకుమ్ నీర్ తిణ్ణుమ్ వె ఱ్ఱిలైయుమ్ ఎల్లామ్ కణ్ణన్'' అని ఆళ్వార్లు స్వయముగా ధారకపోషక భోగ్యరూపపదార్థములన్నియు తనకు భగవానుడగు శ్రీకృష్ణుడే అనిరి. అట్టి మహనీయులను తన అవతారసమయమున చూడలేక పోవుచున్నాను కదా! అని శ్రీకృష్ణుడు ''వాసుదేవస్సర్వ మితి స మహాత్మాసుదుర్లభః'' అనుచు వాపోయెను కదా! లోకములో గల బాలురకంటె విపరీతమైన ప్రవర్తనను కల్గియుండుటచే ఆళ్వార్లకు'' మాఱన్'' అనుపేరు కల్గెను. ఈ అంశము ప్రస్తుతశ్లోకమున పరోక్షముగా తెలుపబడినది. రెండవపాదము చివర ''అనభిభాషిణే'' అని, నాల్గవపాదమున''శఠకోపాయ మంగళం'' అనియు పాఠాంతరములు కన్పించుచున్నవి.

4) శ్రీనగర్యాం మహాపుర్యాం తామ్రపర్ణ్యుత్తరే తటే।
శ్రీతింత్రిణీమూలధామ్నే శఠకోపాయ మంగళమ్ ॥

ప్ర. అ. - తామ్రపర్ణీ = తామ్ర పర్ణీనదియొక్క, ఉత్తరే = ఉత్తరదిక్కునగల, తటే = తీరమునఉన్న, మహాపుర్యాం = గొప్పనగరమగు, శ్రీనగర్యాం = తిరునగరియందు, శ్రీతింత్రిణీ = చింతచెట్టు యొక్క, మూల = మొదలు, ధామ్నే = నివాసముగా కల్గిన, శఠకోపాయ = శఠకోపసూరికి, మంగళమ్ = శుభము.

**భావము** :- తామ్రపర్ణీనదికి ఉత్తరతటమునగల **'కురుకాపురి'** ( ఆళ్వార్ తిరునగరి) అనుమహానగరమున శ్రీతింత్రిణీ వృక్షమూలమును నివాసముగా కల్గిన శఠకోపసూరికి మంగళము.

'శ్రీనగరీ' అనునామము ''తిరునగరి'' అను ద్రావిడ నామమునకు సంస్కృతీకరణము. ఆనగరమునకు మహత్త్వము ఆళ్వార్లు అవతరించుటచే వచ్చినది. లేక **''నల్లార్ నవిల్ కురుకూర్''** అని ఆళ్వార్లు పల్కినట్లు సత్పురుషులు నిత్యవాసము చేయుటచే, వారి గౌరవమునకు పాత్రమగుటచే ఆనగరమునకు మహత్త్వము కల్గినది అనియు చెప్పవచ్చును. **''శ్రీతింత్రిణీమూలధామ్నే''** అనునపుడు (**''ధామన్''** శబ్దమునకునివాసమనియే కాక, తేజస్సు అనియు అర్థముచెప్పవీలున్నందున) తింత్రిణీ వృక్షమూలమున గల గొప్పతేజస్సు అనియు చెప్పవచ్చును. మధురకవులు ఉత్తరదేశమున తీర్థ యాత్రలు చేయు చుండగా, మధురవద్ద వారికి కనుపించిన జ్యోతి ఆళ్వార్ తిరునగరియందు చింత చెట్టుసమీపమున అదృశ్యమగుటచే, నమ్మాళ్వార్లే ఆజ్యోతి అని వారు తలచిన వృత్తాంత మిచట స్మరణీయము. ఈశ్లోకము నిత్యము ప్రపన్నులు అనుసంధించు మంగళాశాసన శ్లోకముల లో ఒకటి. **''మూలధామ్ని''** అను వేరొకపాఠమును కలదు. దానిప్రకారము **''స్థితాయ''** అను పదము అధ్యాహారముచేసికొనవలెను. ఈశ్లోకము నిత్యము ప్రపన్నులు అనుసంధించుకొను శ్లోకములలో ఒకటి.

5) పరేషాం బాహ్యకుదృశా మంకుశాయితసూక్తయే ।
పరాంకుశాభిధానాయ శఠకోపాయ మంగళమ్ ॥

ప్ర.అ - బాహ్యకుదృశాం = నాస్తికులు, మాయావాదులు అను, పరేషాం = శత్రువులకు, అంకుశాయిత = అంకుశము వంటి, సూక్తయే = సూక్తులను మల్కినవారగుటచే, పర+ అంకుశ+ అభిధానాయ = పరాంకుశులను పేరు కల్గిన, శఠకోపాయ = శఠకోపసూరికి, మంగళమ్ = శుభము.
**భావము** :- వైదికమతమునకు శత్రువులన దగిన బాహ్యకుదృష్టులను అనగా నాస్తికవాదులను, మాయావాదులను అణచునట్టి, వారివాదములను నిర్వీర్యము చేయునట్టి సూక్తులను దివ్యప్రబంధముల రూపమున అనుగ్రహించుటద్వారా పరాంకుశులను పేరును పొందినవారగు శఠకోపసూరికి మంగళమగుగాక!

ఆచార్యహృదయములోని (93వసూ) **''నాట్టియుల్వోళ్ళిన్ను శఠరై యోట్టి మదావలిప్తర్క్కు అంకుశ మిట్టు''** అను సూక్త్యర్థ మిచట స్మరణీయము. తిరువాయ్ మొళ్ళి

లోని మొట్టమొదటి పాశురములోని మొదటి పాదమునగల ''నలముడైయవన్'' అను విశేషణమును వ్యాఖ్యానించుచు నమ్పిళ్లై ఈడులో ''ఆళ్వాన్ పిళ్లై పిళ్లై యై ప్పార్త్తు నిర్గుణమెన్బార్ మిడర్ పిడిత్తాప్పోలే ఆళ్వార్ నలముడైయవన్ ఎన్ఱపడి కణ్డాయే... ఎన్ఱు పణిత్తాన్.'' అని పల్కుటలు, ఆపాశురవ్యాఖ్యానమున చివరలో ''గుణమిల్లై, విగ్రహమిల్లై, విభూతియిల్లై ఎన్ఱు శొల్లుకిఱవర్ కళ్ ఎల్లారుమ్ నిరస్తరిప్పాట్టాలే'' అని పల్కుటయు ఇచట అనుసంధేయములు. ''అంకుశాయిత మూర్తయే'' అను వేరొకపాఠము కలదు.

6) స్వవంశచిహ్నవకుళప్రసవానాం ధృతే (దృశే) సదా।
వకుళాభరణాఖ్యాయ శఠకోపాయ మంగళమ్ ॥

ప్ర.అ. సదా = ఎల్లప్పుడు, స్వవంశ = తమవంశముయొక్క, చిహ్న = గుర్తుఅగు, వకుళప్రసవానా= వకుళపుష్పములయొక్క, ధృతే = ధరించునట్టి, (అందుచే), వకుళ + ఆభరణ + ఆఖ్యాయ = వకుళాభరణులను పేరును కల్గిన, శఠకోపాయ = నమ్మాళ్వార్లకు, మంగళమ్= మంగళము.

**భావము :-** ఎల్లప్పుడు వకుళమాలికలను ధరించువారు, ఆకారణముచే వకుళాభరణులను సార్థకమైన పేరును కల్గినవారు అగు నమ్మాళ్వార్లకు మంగళము.

నమ్మాళ్వార్లు చేసినస్తుతికి సంతోషించిన కురుకాపురిలోని స్వామి ఆళ్వార్లకు తాను ధరించిన వకుళమాలను బహుమతిగా ప్రసాదించెను అప్పటినుండి నమ్మాళ్వార్లు వకుళాభరణు లయ్యిరి. ఈ వృత్తాంతమును గరుడవాహన పండితులు '' **వకుళాకలితాం మాలా మాద్యః ప్రీతో హరి ర్దదౌ, ఇతి తం స్మ శఠారాతిం వకుళాభరణం విదుః**'' అని వర్ణించిరి. ''నాట్కమళ్ మకిళ్మాలై మార్బినన్'' అని ఆళ్వార్లు తమకు నిరూపకముగా వకుళమాలికను నిర్దేశించుకొనిరికదా!

7) శ్రీ పతిః నిత్యసూరి ర్వా శఠకోప ఇహోదితః।
ఇతి సర్వైః వితర్క్యాయ శఠకోపాయ మంగళమ్ ॥

ప్ర.అ. - శ్రీపతిః = శ్రియఃపతియా, వా = లేక, నిత్యసూరిః = నిత్యసూరియా? ఇహ = ఈలోకమున, శఠకోపః = శఠకోపసూరిగా, ఉదితః = అవతరించెను, ఇతి = అని, సర్వైః = అందఱిచే వితర్క్యాయ = ఉత్ప్రేక్షింపతగిన వైభవమును కల, శఠకోపాయ = శఠకోపసూరికి, మంగళమ్ = మంగళము.

**భావము :-** సాక్షాత్తు భగవానుడేనా! లేక నిత్యసూరులలో ఒకరా? అని అందఱు తలంపతగిన గొప్పతనమును కల్గిన నమ్మాళ్వార్లకు మంగళము అగుగాక!

ఆచార్యహృదయములోని (92సూ) ''**అత్రిజమదగ్నిపంక్తిరథవసునన్దసూను వానవనుడైయ యుగవర్ణ క్రమావతారమో?... మూదువర్ కరైకణ్డోర్ శీరియరిలే ఒరువరో ''... ఎన్ఱు శఙ్కిప్పర్ కళ్**'' అను సూక్తియొక్క భావమిచట ప్రస్తుతము. శ్రీమణవాళమహామునులుతమ

వ్యాఖ్యలో "ఇప్పడి కృతాది యుగక్రమత్తాలే బ్రాహ్మణాది వర్ణ క్రమేణ అవతరిత్తువన్ద సర్వేశ్వరన్ చతుర్థమాన కలియుగత్తిలే చతుర్థవర్ణత్తిలే వన్దవ తరిత్తుపడియో ఎన్ఱై" అని "విణ్ణాట్టవర్ మూతువర్" ఎన్ఱు పరమపదత్తుక్కు నిలత్తాళికళాన నిత్యసూరికళిలే ఇవ్విభూతియై తిరుత్తుకైక్కాక ఈశ్వరనియోగత్తాలే అవతారిత్తా రొరువరో "అనియు పల్కిరి. " ఇతి స్మృతః", " ఇతి శ్రుతః" అను పాఠాంతరములును కలవు.

**8)** **విభూతిద్వయవృత్తాంతవ్యాపివిజ్ఞానసంపదే ।**
**విశుద్ధశుద్ధవపుషే శఠకోపాయ మంగళమ్ ॥**

ప్ర.అ. - విభూతిద్వయ = నిత్యవిభూతి, లీలావిభూతులనబడు రెండు విభూతులలోని, వృత్తాంత = వృత్తాంతమునందు, వ్యాపి = వ్యాపించియున్న, విజ్ఞానసంపదే = విజ్ఞానమను సంపదను కల్గిన, విశుద్ధ = పరిశుద్ధమైన, పవిత్రమైన, (సాత్వికమైన), శుద్ధ = తెల్లని, వపుషే = శరీరమును కల్గిన, శఠకోపాయ = శఠకోపసూరికి, మంగళం = శుభమగు గాక.

**భావము** :- ఉభయవిభూతులయందు అంతట వ్యాపించిన విజ్ఞానసంపదను కల్గినవారు, పవిత్రమైన, తెల్లని శరీరమును కల్గిన శఠకోపసూరికి మంగళము.

ఈశ్లోకము తిరువాయ్‌మొళ్ళిలోని చివరి శతకములోని చివరి దశకములోగల **"శూళ్న్దు"** అను పదవపాశురమును అనుసరించి రచింపబడినది. ఆచార్యహృదయములోని **"ముదలళవు తుర్క్కళాలే పెఱావాణైయల్ల వాక్కిన పేరవా కుళప్పడి యామ్బడి"** (228సూ) అనుసూక్తి, అచటి మణవాళ మహామునివ్యాఖ్యలోని **"త్తత్వత్రయత్తైయుమ్ విళాక్కులై క్కొణ్డు అవై కుళప్పడియామ్బడి పెరితాన తమ్ముడైయ పరమభక్తి"** అను వివరణమును ఇచట వివక్షితము. శ్లోకములోని విజ్ఞాన శబ్దమునకు భక్తి రూపాపన్న జ్ఞానముగా అర్థము చెప్పకొననగును. సత్వరూపుడగు భగవానునకు ఆశ్రయమగు ఆళ్వార్ల దివ్యదేహమును **"విశుద్ధశుద్ధవపువు"**గా వర్ణించుట తగినది కదా!

**9)** **స్వాన్యాపదేశవిశ్లేషసంశ్లేషప్రముఖాః దశాః ।**
**ప్రాప్య తత్సూచిసూక్తాయ శఠకోపాయ మంగళమ్ ॥**

ప్ర.అ - స్వ+ అన్య+ అపదేశ = స్వాపదేశము, అన్యాపదేశము, విశ్లేష = భగవానునితో విరహము, సంశ్లేష = కలయిక, ప్రముఖాః = మొదలగు భేదములతో ప్రసిద్ధములయిన, దశాః = (దశలను) స్థితులను, ప్రాప్య = పొంది, తత్ = ఆదశను, సూచి = సూచించునట్టి, సూక్తాయ = వాక్కులను కల్గిన, శఠకోపాయ = నమ్మాళ్వార్లకు, మంగళం = మంగళము అగు గాక!

**భావము** :- స్వాపదేశము, అన్యాపదేశము, విరహదశ, సంశ్లేషదశ మొదలగు స్థితులను పొంది, ఆళ్వార్లు ఆదశలకు తగిన సూక్తులను అనుగ్రహించిరి. అట్టి శఠకోపసూరికి మంగళమగుగాక!

నమ్మాళ్వార్లు అనుగ్రహించిన ప్రబంధములలోని సూక్తులు పలురీతులలో కన్పించుచున్నవి. ఆళ్వార్లు స్వయముగా పల్కిన పలుకులవలన ఏర్పడు ధ్వన్యర్థములకు స్వాపదేశార్థములని పేరు. అనగా స్వస్య = తన యొక్క, అపదేశేన = నెపముతో చెప్పబడిన, అర్థాః= ధ్వన్యర్థాః. ఈ ధ్వన్యర్థములు స్వాపదేశార్థములు. అట్లుకాక, తమ భక్త్యతిశయముచే నాయికాదిభావమును పొంది ఆళ్వార్లు పల్కుటకు అన్యాపదేశమని పేరు. అన్యస్య = ఇతరుల యొక్క, అపదేశేన = మిషతో ఉపదేశింపబడిన, అర్థాః = ధ్వన్యర్థాః, ధ్వన్యర్థములు అన్యాపదేశములు, సంగ్రహముగా చెప్పవలెనన్న ''తన్ పేచ్చు'' తో పల్కిన సూక్తులలోని ధ్వన్యర్థములు స్వాపదేశములు, ''పెణ్ పేచ్చు'' తో పల్కిన సూక్తులలోని వ్యంగ్యార్థములు అన్యాపదేశములు.

ఇట్టి స్వాపదేశ, అన్యాపదేశములను ఆళ్వార్లు సంశ్లేషము, విశ్లేషము అను రెండు దశలలో తెలియజేసిరి. భగవానుడు ఇట్లు తనయొక్క సంశ్లేష, విశ్లేషములను ఆళ్వార్లకు కల్గించుట ద్వారా, వారికి తన స్వరూపరూప గుణవిభూతుల జ్ఞానమును పూర్ణముగా అనుగ్రహించెను. ఈ అనుభవముయొక్క తీవ్రత చేలోకోజ్జీవనముకలుగవలెనుదయతో ఆళ్వార్లు తమ ఆనందమును ప్రకటించుచు దివ్య ప్రబంధములను అనుగ్రహించిరి. భగవానునితోటి సంశ్లేషమనగా ప్రత్యక్షసమానాకారమైన మానసానుభవము. విశ్లేషమనగా బాహ్యానుభవాపేక్ష సిద్ధింపనందున కల్గు మనః శైథిల్యము.

విశ్లేషదశలో శఠకోపసూరి నాయికావస్థను, సఖి అవస్థను, (నాయిక) తల్లిదశను పొంది, పల్కుట కనపడుచున్నది. ఆ మూడుదశలయొక్క తాత్పర్యమును ఆచార్యహృదయకారులు **''సంబంధోపాయ ఫలఙ్గళిల్ ఉణర్త్తి తుణివుపద మాకిఱ ప్రజ్ఞావస్థైకళుక్కు త్తో ఴి తాయార్ మకళెన్ఱుపేర్''** అను సూత్రమున వివరించిరి. సంబంధజ్ఞానము సఖిగాను, అనన్యార్హశేషత్వాది ఉపాయాధ్యవసాయజ్ఞానము తల్లిగాను, ప్రావ్యత్వర నాయికగాను చెప్పబడినవని తాత్పర్యము. తిరువాయ్‌మొఴిలోని **''తీర్ప్పారైయామిని''**, **''తువళిల్ మామణిమాడమ్''**, **''కరుమాణిక్కమలై''** అను మూడు దశకములను తోఴి (సఖి) దశలో, **''ఆడియాడి''**, **''పాలనా యేఴులకు''**, **''మణ్ణైయిరున్దుఴావి''**, **''కడల్ఞాలమ్''**, **''మాలుక్కు''**, **''ఉణ్ణుమ్‌శోఱు''**, **''కఙ్గులుమ్ పకలుమ్''** అను ఏడుదశకములను మాతృదశలో, **''అఞ్జిఱైయమడనారాయ్''**, **''వైకల్‌పూఙ్కఴివాయ్''**, **''పొన్నులకాళీరో''**, **''ఎఙ్గానలకమ్''**, **''వాయుమ్‌తిరైయుకళుమ్''**, **''ఏఴాళుమ్''**, **''మాశఱుశోది''**, **''ఊరెల్లామ్‌తుఞ్జి''**, **''ఎఙ్గనేయో''**, **''మానేయ్‌నోక్కి''**, **''మిన్నిడైమడైవార్''**, **''వెళ్ళైచ్చురిశఙ్గ''**, **''ఏఴైయరావి''**, **''నఙ్గళ్‌వరివళై''**, **''ఇన్నుయిర్‌చ్చేవల్''**, **''మల్లిగైకమఴ్''**, **''వేయ్‌మరుతోళిణై''** అను 17 దశకములను నాయికా దశలో ఆళ్వార్లు పల్కిరి. ఇట్లే, తిరువిరుత్త ప్రబంధములో కూడ మూడు విధములైన దశలను కాననగును.

పైన నిర్దేశింపబడిన స్త్రీభావనతో ఆళ్వార్లు పల్కిన దశకములన్నియు తత్త్వస్వరూపమును తెలియజేయునవి అగుటచే పరమప్రాప్యములు. ''ప్రముఖాం దశాం'' అను వేరొక పాఠము కలదు.

**10.** **అభ్యస్యతాం స్వప్రబంధం భుక్తి ముక్తీ కరే స్థితే ।**
**దదతే సత్యవచసే శఠకోపాయ మంగళమ్ ॥**

ప్ర. అ. : స్వ ప్రబంధం = తమ ప్రబంధమును, అభ్యస్యతాం = అభ్యసించు వారికి, భుక్తిముక్తీ = భుక్తి, ముక్తి, కరే = చేతియందు, స్థితే = ఉన్నవిగా (యథా భవతః తథా), దదతే = ఇచ్చునట్టి, సత్యవచసే = సత్యవాక్కు-ను కల్గిన, శఠకోపాయ = శఠకోపసూరికి, మంగళం = శుభమగుగాక.

**భావము :-** తమ ప్రబంధములను అభ్యసించు వారికి భుక్తియు, ముక్తియు హస్తగతమగునని అనుగ్రహించు సత్యవాక్కు-లగు శఠకోపసూరికి మంగళమగుగాక!

**'దదతే'** అనుటకు బదులు **''వదతే''** అను పాఠాంతరము కనుపించుచున్నది. **'పల్కు-నట్టి'** అని అర్థము. అపుడు **'ఇతి'** అను పదమును అధ్యాహారము చేసికొనవలెను. తిరువాయ్మొళ్ళి దివ్యప్రబంధమును అనుసంధించిన కల్గు ఫలితములను గూర్చి **''ఇవైయుమ్ పత్తుమ్ వల్లార్కళ్ నల్లపదత్తాల్ మనైవాళ్ళ్వర్ కొణ్డపెణ్డీర్మక్కళే''** ఇత్యాదిగా లౌకిక భోగసమృద్ధి, **''పిడిత్తార్ పిడిత్తార్ వీఱ్ఱిరున్దు పెరియవానుళ్ నిలావునరే''** అనుచు పరమపదప్రాప్తియుకల్గునని ఆళ్వార్లు పల్కు-ట ఇచట స్మరింపతగినది. **''ఋషయః సత్యవచసః''** అను అమరకోశవచనమును బట్టి, **''ఋషిం జుషామహే''** అను భట్టరు సూక్తిని బట్టి **''సత్యవచసే''** అను విశేషణము ఆళ్వార్ల మహర్షిత్వమును సూచించును. **''కరస్థితే''** అని, **''వదతే''** అనియు పాఠాంతరములు కలవు.

**11)** **శ్రీమత్సుందరజామాతృమునిమానసవాసినే ।**
**శ్రీతింత్రిణీమూలధామ్నే శఠకోపాయ మంగళమ్ ॥**

ప్ర. అ. :- శ్రీమత్సుందరజామాతృముని = శ్రీమణవాళమహామునులయొక్క-, మానస = మనస్సును, వాసినే = నివాసముగా కల్గినవారు, శ్రీతింత్రిణీ = శుభకరమగు చింతచెట్టుయొక్క-, మూల = మూల ప్రదేశమునగల, ధామ్నే = జ్యోతిస్స్వరూపులగు, శఠకోపాయ = శఠకోపసూరికి, మంగళం = మంగళము.

**భావము :-** శ్రీమణవాళమహామునుల మనస్సును స్థిరనివాసముగా కల్గినవారు, తింత్రిణీ వృక్షమూలమున ప్రకాశించు జ్యోతిఃస్వరూపులు అగు శఠకోప సూరికి మంగళము అగుగాక!

**'ధామన్'** శబ్దమునకు జ్యోతిస్సు అనియేకాక, నివాసస్థలమని కూడా అర్థము కలదు. **''గృహదేహ త్విట్ప్రభావా ధామాని''** అని అమరము. **'వాసినే'** అనునపుడు **'ఇన్'** ప్రత్యయము ప్రశంసార్థకమగుటచే మణవాళ మహామునుల మనస్సును ప్రశస్తమైన నివాసముగా కల్గినవారను విశేషము ధ్వనించును. మూడవ పాదమున **''ప్రపన్నజనహృద్యాయ''** అను పాఠాంతరములు కలదు.

శ్రీమతే శఠకోపాయ నమః

శ్రీ యామునులచే స్తోత్రరత్నమున నమ్మాళ్వార్ల విషయముగా రచింపబడిన

# ముక్తకశ్లోక రత్నము

(ఆళ్వార్ల నిత్యతనియన్)

మాతా పితా యువతయ స్తనయా విభూతిః
సర్వం యదేవ నియమేన మదన్వయానామ్ ।
ఆద్యస్య నః కులపతే ర్వకుళాభిరామమ్
శ్రీమత్తదంఘ్రియుగళం ప్రణమామి మూర్ధ్నా ॥

**ప్ర. అ.** - మత్+ అన్వయానాం = నా వంశమున జన్మించిన వారికి, మాతా = తల్లి, పితా = తండ్రి, యువతయః = భార్యలు, తనయా = సంతానము, విభూతిః = సంపద, సర్వం = సమస్తమును, నియమేన = నియమముగా ఎల్లప్పుడు, యత్ + ఏవ = ఏ నమ్మాళ్వార్ల శ్రీపాదమో, అట్టి, నః= మాకు, ఆద్యస్య = మొదటివాడును, కులపతేః = కులమునకు ప్రభువు అగు నమ్మాళ్వార్ల యొక్క, వకుళ+ అభిరామం = వకుళపుష్పములచే అందమయిన, శ్రీమత్ = సంపదను కల్గియున్న, తత్ = ఆ, అంఘ్రియుగళం = పాదపద్మమును, మూర్ధ్నా = తలతో, ప్రణమామి = నమస్కరించు చున్నాను.

**వ్యాఖ్య.** - ఈ శ్లోకము నమ్మాళ్వార్ల నిత్య నియన్ శ్లోకము. శ్రీవైష్ణవ సంప్రదాయమున నిత్యము పఠింపతగిన ప్రార్థనాశ్లోకములలో ఒకటిగా పరిగణింపబడుచున్నది స్తోత్రరత్నములోని పూర్వశ్లోకమున యామునులు చిదచదీశ్వర తత్త్వమును గూర్చి, స్వర్గాది భోగములను గూర్చి, అపవర్గమనబడు బ్రహ్మానుభవమునుగూర్చి, అందులకు తగిన ఉపాయములనుగూర్చి, సుస్పష్టముగా తెలియజేయు విష్ణుపురాణమును అనుగ్రహించిన పరాశరమహర్షిని స్తుతించిరి. పిమ్మట పరాశరమహర్షి అనుగ్రహించిన విష్ణుపురాణము కంటె మిక్కిలి విశదముగా వేదాంత రహస్యములను తెలియజేయు అతిశయమును కల్గినవి, సర్వోపజీవ్యములైనవి అగు దివ్యప్రబంధములను అనుగ్రహించుటచే, మధురకవి ఆళ్వార్లమొదలు ప్రపత్తి సంప్రదాయమును ప్రవర్తింప చేయుటయే కాక, ఆచార్యులలో మొదటి వారుగా లెక్కింపబడు నాథమునులకును నాలాయిర దివ్యప్రబంధములను అనుగ్రహించుట ద్వారా ఉపకారకులు అగుటచే, వారిద్దరిమధ్య కాలభేదము ఉన్నను శుకమహర్షి గౌడపాదులకు ఆచార్యులైనట్లు, ఆ నాథమునులకు ఆచార్యులు అగుటచే భక్తిపూర్వకముగా నమ్మాళ్వార్లను ఈశ్లోకమున స్తుతించుచున్నారు పరాశరమహర్షి అనుగ్రహించిన జ్ఞానసంపద కొందఱికే మాత్రమే అందునది. కాని, ఆళ్వార్లు సాయించిన దివ్య

ప్రబంధములు అందరికి అందుబాటులోనుండునవి. ఆళ్వార్లు ద్రావిడ బ్రహ్మసంహిత అనబడు తమ దివ్యప్రబంధములలో అందించిన జ్ఞానము కేవలము జ్ఞానము కాదు. **''మయర్వఱ మదినలమ్''** అనునట్లు భక్తి రూపమును పొందిన జ్ఞానము. అది శాస్త్రపద్ధతిలో ఉపదేశింప బడలేదు. కావ్య పద్ధతిలో అనగా కాంతాసమ్మిత ప్రక్రియలో తెలుపబడినది. ఆళ్వార్లు తమ ప్రబంధములను **''మరజ్ఞళుమ్ ఇరఙ్గుమ్ వకై''** (స్థావరములును దయచూపు విధమున) అని మనస్సును ద్రవీకరింప చేయు సూక్తులతో అనుగ్రహించుటచే, తమ ఆచార్యులగు నాథములకును ఆళ్వార్లు ఆచార్యులగుటచే యామునులు వారి పాదములందు శరణు జొచ్చు చున్నారు. అంతేకాక నాథమునులవలె, శ్రీపరాశరమహర్షివలె ఆళ్వార్లు శ్రీకృష్ణావతారమున **''ఉరలినోడు ఇణైన్దిరున్దేఙ్గియ వెళి ఎత్తిఱమ్''** అని, **''ఎల్లామ్ కణ్ణన్''** అని మిక్కిలి అభినివేశమును కల్గియుండుటకూడ శరణాగతిని చేయుటకు కారణము. అట్లు శరణాగతిని యామునులు **''మాతాపితాభ్రాతా''** అను సుబాలోపనిషత్ ప్రక్రియలో, **''వాసుదేవస్సర్వ మితి''** అనుగీతాచార్యోక్త ప్రక్రియలో, **''అవన్ ముఱ్ఱ్ లడఙ్గే''** అను ఆళ్వార్లు చూపిన పద్ధతిలో చేయుచున్నారు. పైప్రమాణములు భగవానుని విషయమున చేయు శరణాగతికి సంబంధించినవికాగా, వానిని యామునులు ఆళ్వార్ల విషయమున అనుసరించిరి.

నా వంశమున జన్మించిన వారికి ఎల్లప్పుడు తల్లి, తండ్రి, భార్యలు, సంతానము, సంపద అంతయు నమ్మాళ్వార్ల శ్రీపాదములే. మా కులమునకు మొట్టమొదటి వారు, వకుళమాలికలచే శోభిల్లు వారును అగు ఆళ్వార్ల పాదయుగళమునందు శిరస్సుతో నమస్కరించుచున్నాను - అని భావము.

**(మాతా)** - శ్రీయామునులు శ్రీపరాశరమహర్షికి పిమ్మట ఆళ్వార్లను శరణాగతి చేయుటకు కారణము- పరాశరమహర్షి విష్ణుపురాణమున అనుగ్రహించిన విషయములను ఆళ్వార్లు తమ ప్రబంధములో వివరించుటచే అనిచెప్ప వచ్చును.

అందఱికంటె ముందుగా **'మాతా'** అని తల్లిని నిర్దేశించుటకు అనుగుణముగా **''పితుః శతగుణం మాతా గౌరవేణాతిరిచ్యతే'', ''మాతా పుత్రస్య భూయాంసి కర్మాణ్యారభతే యతః, తస్యాం తు శుశ్రూషా నిత్యా పతితా యా మపి''** అను ప్రమాణములు స్మరణీయములు. **''మాతృదేవో భవ''** అని మొదటగా తల్లినే వేదము నిర్దేశించినది. బిడ్డ జన్మకు ముందు పలు వ్రతములు చేసి శ్రమించి, వరమును పొంది, పదిమాసములు గర్భధారణ చేయుట, ప్రసవమున అమితమైన వేదనను అనుభవించుట, బిడ్డ జన్మించిన పిమ్మట పలువిధములైన మాలిన్యములను చూచి అసహ్యించుకొనక, ఆదరించి పెంచుట, ఎదిగిన పిమ్మట అతడు కోపావేశములతో పల్కు పరుషసంభాషణలను సహించి, ఎట్టి సమయమునందు అయినను బిడ్డను వదలి ఉండక, ఎల్లప్పుడు ప్రియమున ఆచరించుట తల్లి ప్రకృతి. ఇట్టి తల్లి వలె భగవానుడు జీవులకు ఉపకారకుడు. ఆవిధముగానే ఆళ్వార్లు ప్రసన్నులకు ఉపకారకులగుటచే తల్లిగా నిర్దేశింపబడిరి.

**(పితా)** తల్లి కి పిమ్మట వేదము "**పితృదేవో భవ**" అని పల్కినది. "**మాతా భస్త్రా పితుః పుత్రో యస్మాజ్జాత స ఏవ సః**", "**గరీయాన్ బ్రహ్మదః పితా**" అను ప్రమాణములు స్మరణీయములు. తల్లి కేవలము పాత్ర మాత్రమే అనునట్లు, బిడ్డ ఉత్పత్తికి కారణమై ఎల్లప్పుడు హితమునే కోరువాడు తండ్రి. అట్టి ప్రకృతి ఆళ్వార్ల యందును కలదు. కావున '**పితా**' అని నిర్దేశము చేయబడినది.

**(యువతయః)** - "**యత్రానుకూల్యం దంపత్యోః త్రివర్గః తత్ర వర్తతే**" అనునట్లు భార్యానుకూల్యము త్రివర్గసాధకము. యౌవనదశలో తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు ప్రీతిని కల్గించు వారగుటచే ఇట్లు పేర్కొన బడిరి.

**(తనయాః)** - భార్యల యౌవనమును పోగొట్టి, జన్మించినవారై, బాల్యమున సందర్శనసంభాషణాదులతో ఆహ్లాదమును కల్గించి, వార్ధకమున రక్షకులై, '**పుత్**' అనునరకము నుండి రక్షించువారు తనయులు. అట్టి ఉపకారమును చేయువారగుటచే ఆళ్వార్లను కవి ఈ పదముతో నిర్దేశించిరి. "**అపి స్యాత్ స కులే౽స్మాకం సర్వభావేన యో హరిమ్; ప్రయాయా చ్ఛరణం విష్ణుం దేవేశం మధుసూధనమ్**", అను మహాభారతవచనము, "**ఆస్ఫోటయంతి పితరః ప్రనృత్యంతి పితామహాః, వైష్ణవో నః కులే జాతః స నః సంతార యిష్యతి**" అను వరాహపురాణములోని ప్రమాణమును ఇచట స్మరణీయములు. ఇందువలన పుత్రులు తమ సుగుణములతో పితృదేవతలను సైతము తరింప చేయుదురు. అని తెలియుచున్నది. "**తనయాః**" అను బహువచన నిర్దేశము పలువురు పుత్రులవలన కల్గు ఆనందము ఆళ్వార్ల ఒక్కరి వలన కల్గునని సూచించుచున్నది. ఇట్టి వివరణమును "**యువతయః**" అనునపుడును వివక్షితమే.

**(విభూతిః)** - దాసుల, భృత్యుల, ధన ధాన్యరత్నాదుల రూపమున శేషమైనది, నియమింపతగినది అగు సంపద అని భావము. సంపద పలువిధములైనది. ధారక, పోషక, భోగ్యరూపమగు సంపద లేనిచో పైన పేర్కొనిన వన్నియు లేనట్లే. సంపదను కల్గి యున్నప్పుడే వానివలన పరిపూర్ణ సుఖము కల్గును. కావున సంపద మిక్కిలి ఉద్దేశ్యమయినట్లే, ఆళ్వార్లును మిగుల ఉద్దేశ్యభూతులు కావున "**విభూతి**" శబ్దముతో నిర్దేశింప బడిరి.

**(సర్వమ్)** - ఇంతవఱకు చెప్పబడని సకలవిధములైన ఐహికములు, ఆముష్మికములైన పురుషార్థములు, వాని సాధనములును సర్వశబ్దముచే చెప్పబడినవి. మఱియు ఈ శబ్దముచే మోక్షోపాయము, ముక్తప్రాప్యమును తెలుప బడినవి.

**(యదేవ)** - "**శేలేయ్ కణ్ణియరుమ్ పెరుమ్ శెల్వముమ్ నన్మక్కళుమ్ మేలాత్తాయ్ తన్దైయుమ్ అవరే**" అని ఆళ్వార్లు భగవానుని విషయమున తలచినట్లు యామునులు ఆళ్వార్ల పాదముల విషయమున అను సంధించు చున్నారు. అనగా ఆళ్వార్ల కంటెవారి శ్రీపాదములే అన్నియు అని తలచుచున్నారని 'ఏవ' అను అవధారణము వలన ధ్వనించును. మఱియు దృష్టాదృష్టమైన ఉపజీవ్యము సర్వము ఆళ్వార్ల శ్రీపాదములగుటచే, ఇట్టి అపేక్షణీయమైనది

వేరొకటి లేదని భావము. ఇంతవరకు తెలుపబడిన మాతాపిత్రాది శబ్దములచే చెప్పబడు ప్రియపరత్వ -హితపరత్వాది భావములు ఆళ్వార్ల పాదములయందు లక్షింపబడుచున్నవి.

**(నియమేన)** - ఎల్లప్పుడు ఇచటనే పరమపదమునకూడ ఆళ్వార్ల పాదములే తమకు శరణమని భావము. ఆళ్వార్ల పాదముల కంటె వేరొకరిని అనగా భగవానుడు మొదలగు వారిని తాము తలచుట జరిగినచో, అది ఆళ్వార్లకు ప్రియకరమను భావముతో తప్ప, తమకు ప్రియమగుటచే మాత్రము కాదు. పొరపాటున కూడ అట్టి భావము మనస్సున తమకు లేదని భావము.

ఇచట **'ఏవ, నియమేన'** అను పదములచే భగవానుని కంటె ఆళ్వార్లకు గల (ఆధిక్యము) అతిశయము ధ్వనించు టచే ఆళ్వార్ల యొక్క బహుమంతవ్యత్వము తెలుపబడినది. భగవానుని కృప అనాది అయినను, ఆచార్యకృపాసాపేక్షము, లీలారసమిశ్రితము. కాని, ఆచార్యకృప భగవానుని నిగ్రహమును సైతము శమింపచేయును. అనుగ్రహమేతప్ప నిగ్రహమెరుగనిది. భగవానుడు ఒక్కొక్క సమయమున జీవుడు చేయు అపరాధములకు కోపించి, అధోగతిని పొందించును. ఆచార్యుడు మాత్రము ఎల్లప్పుడును ఆశ్రితుని ఉద్ధరింపగోరును. భగవానునకు సాధుకర్మకారయితృత్వముతో పాటు అసాధుకర్మ కారయితృత్వమును కలదు. ఆచార్యులు మాత్రము ఎల్లప్పుడు ప్రపన్నులను ఉద్ధరించుటకే యత్నించును. కావున సాధుకర్మలనే చేయించును. **"ఆచినోతి హి శాస్త్రార్థాన్ ఆచారే స్థాపయత్యపి"** అను కదా ప్రమాణము. భగవానుడు బుద్ధావతారమున దైత్యులకు విపరీతమైన (నాస్తిక) ఉపదేశమును చేసెను. కాని, ఆచార్యులు అధికులగుటచే పరమాచార్యులగు ఆళ్వార్లకు సర్వేశ్వరుని కన్న ఆధిక్యము స్ఫుటము.

**(మదన్వయానాం)** **"విద్యయా జన్మనా వా"** అనునట్లు జన్మ సంబంధమును బట్టి, విద్యాబంధమును బట్టి ఉభయకులముల వారికిని తనకు పిమ్మట, పూర్వము జన్మించిన వారి కందఱకు అని భావము.

**(ఆద్యస్య నః)** శ్రీవైష్ణవ కులమునకు మొదటివారు. యామునుల కంటె ముందు పుట్టిన వారి జ్ఞానవైరాగ్యాదులకును కారణ లగుటచే-ఈవిశేషణము సార్థకము. **"నః"** అనుటకు నాథముని సంప్రదాయమును అనుసరించు మనలకు అని అర్థము.

**(కులపతేః)** - వివాహిత స్త్రీకి భర్తకులమే తన కులమగునట్లు ప్రపన్నులకందఱకు నమ్మాళ్వార్ల కులమే. లోకమున ఒక్కొక్క గోత్రమునకు ఒక్కొక్క ఋషి ప్రధానుడు. ప్రపన్నకులమునకు నమ్మాళ్వార్లే గోత్రఋషి. ఈసందర్భమున **"విప్రర్కు గోత్రచరణ సూత్రకూటస్థర్ పరాశర పారాశర్య బోధాయనాది కళ్; ప్రపన్న జన కూటస్థర్ పరాంకుశపరకాల యతివరాది కళ్"** *(1-36)* అను ఆచార్య హృదయసూక్తి, అచటి శ్రీమణవాళ మహామునుల వ్యాఖ్యయు అను సంధేయములు. **"ఋషింజుషామహే"** అని భట్టరు శ్రీరంగ రాజస్తవమున స్తుతించిరి కదా! భగవానుడు ప్రథమాచార్యుడైనను అందఱికిని సాధారణుడు. **"నారాయణం**

**పద్మభువం వసిష్ఠం'', ''వ్యాసం శుకగౌడపదం మహాంతం శ్రీశంకరాచార్య మదాద్యశిష్యమ్ ''** అనునట్లు అద్వైతసంప్రదాయమునకును భగవానుడే కదా ప్రథమాచార్యుడుగా పరిగణింపబడుచున్నాడు. నమ్మాళ్వార్లు అట్లుకాక శ్రీవైష్ణవసంప్రదాయస్థులకు ఆచార్యులగుటచే వారి ఆచార్యత్వము అసాధారణము. 'పతి' శబ్దప్రయోగము వలన ఆశబ్దము యొక్క యౌగికమగు రక్షకుడను అర్థము, ఉపాధివలన ఏర్పడు శేషి అను అర్థమును రెండును భాసించుచున్నవి.

**(వకుళాభిరామం)** - వకుళపుష్పములచే అందమైనది అనుటచే ఆళ్వార్ల శ్రీపాదములకు పరిమళము వలన ఏర్పడిన భోగ్యత తెలుపబడినది. అంతియే కాక, తులసీ మాలచే అలంకరింపబడిన భగవత్పాదారవిందముల కంటె ఆళ్వార్ల పాదములకు గల విశేషము సూచింపబడినది.

**(శ్రీమత్)** - శ్రీవైష్ణవలక్ష్మిని నిత్యము కల్గియున్నది. ఇచట శ్రీవైష్ణవలక్ష్మి అనగా **''అంతరిక్షగతః శ్రీమాన్'', ''స తు నాగవరః శ్రీమాన్''** అనునట్లు నిరంతర భగవదభినివేశము, సేవాభిలాషయును. **''వకుళాభిరామం, శ్రీమత్''** అను పదములచే ఆళ్వార్ల పాదముల స్వరూపముయొక్క సౌమ్యత్వము, స్వభావము యొక్క మంగళకరత్వమును తెలుపబడినవి. శ్రీవైష్ణవత్వ సామ్రాజ్య చిహ్నములను కల్గియుండుటచే, ఆశ్రితులకు శ్రీవైష్ణవ సామ్రాజ్యసంపత్తును ఇచ్చు యోగత్యను కల్గియుండుటచే కూడ ఆళ్వార్లపాదములు **''శ్రీమత్''** అయినవి. ఆళ్వార్ల ప్రబంధములు భగవానుని తత్త్వమును ప్రతిపాదించునవి అగుటచే అవిచిరకాలము పరిమళించును అని తెలుపుటకై, ఆళ్వార్ల కాలములోని సాత్వికజనులు(సజ్జనులు) వారి పాదములయందు చిరకాలము సువాసనను కల్గి యుండు వకుళపుష్పములను సమర్పించిరి. అట్టి పుష్పములచే ఆళ్వార్ల పాదములు మనోహరములు అను భావమును **''వకుళాభిరామం''** అనుటచే ధ్వనించును. వకుళపుష్పములు చిరకాలము వాడవు. సువాసనను కోల్పోవు.

**(తత్)** - ఈసర్వనామపదముచే ఆళ్వార్ల శ్రీపాదములు పూర్వము తెలుపబడిన నిరవధికమైన భోగ్యత, నిరపాయమైన శరణము అగుటచే ఏర్పడిన ప్రసిద్ధిని కల్గియుండుట సూచింపబడినది. ఇంతవరకు వర్ణించిన వైభము శతాంశము మాత్రమే. నిజమునకు ఆళ్వార్ల పాదములు వాచామగోచరమైన వైభవమును కల్గియున్నవను భావమును ఇచట ధ్వనించును.

**(అంఘ్రియుగళమ్)** - ఏ ఉపమానము లేకుండుటచే ఆళ్వార్ల పాదములకు సామ్యముగా ఏమియు చెప్పబడలేదు. **''కట్టురైక్కిల్ తామరై నిన్ కణ్ పాదమ్ కై యొవ్వా''** అని ఆళ్వార్లు భగవానుని విషయమున పల్కిన భావమును కవి ఆళ్వార్ల విషయమున పల్కుచున్నారు. యుగళశబ్దముచే రెండిటియొక్క అత్యంత సామ్యము వలన, చేరికవలన కల్గిన శోభ తెలుపబడినది, భగవానుని పాదద్వంద్వమువలె, దివ్యదంపతులవలె ఆళ్వార్ల పాదములు రెండును పరమోద్దేశ్యములగుటయు వీనిచే తెలుప బడినది.

(ప్రణమామి మూర్ధ్నా) - ఇట్టి ఆళ్వార్ల శ్రీపాదములను తలచిన వెంటనే స్వరూపాను రూపమగు "నమః" అను ఉక్తిని పలుకక ఉండలేరు కదా! కావున భక్తి ప్రకర్షను కల్గినవాడనై వినయపూర్వకముగా భజించుచున్నానని భావము. "మనః పూర్వో వాగుత్తరః" అను ప్రమాణము చొప్పున 'ప్రణమామి' అనుటచే మనః పూర్వకమైన, వాగ్రూపమైన సమాశ్రయణము, 'మూర్ధ్నా' అనుటచే కాయికమైన సమాశ్రయణమును సూచింపబడుటచే "శిన్దైయాలుమ్ శొల్లాలుమ్ శెయ్‌కైయినాలుమ్" అనుచు సర్వేశ్వరుని విషయమున ఆళ్వార్లు ఆచరించిన త్రికరణాత్మకమైన శరణాగతిని ఆళ్వార్ల పాదములయందు యామునులు ఆచరించిరని ఏర్పడుచున్నది. వర్తమానకాలిక క్రియా ప్రయోగమువలన నమస్కారముయొక్క నిత్యానువర్తి అనగా ఎల్లప్పుడుచేయుట ధ్వనించును. ఇట్లుచేయుట సాధనబుద్ధితోకాక, కైంకర్యబుద్ధితో అని తెలియనగును. శిరసా అభివందనము నాల్గువిధములుగా కలదు.

1) పంచాంగమను నమస్కారము వైఖానసశాస్త్రమున ఇట్లు తెలుపబడినది. **"పాదాంగులిభ్యాం జానుభ్యాం శిరసా చావనిం స్పృశన్, బద్ధాంజలిః నమస్కుర్యాత్ స పంచాంగ ఉదీర్యతే"** పాదాంగుళులతో, మోకాళ్లతో, తలతో భూమిని స్పృశించుచు, చేతులను జోడించినవాడై, చేయు నమస్కారమునకు పంచాంగమని పేరు.

2) షడంగమను నమస్కారము **"పాదౌ హస్తౌ ప్రసార్య వా"** అని వైఖానసశాస్త్రమునచెప్పబడినది.

3) అష్టాంగమను నమస్కారము శ్రీసాత్వత సంహితలో **"మనోబుద్ధ్యభిమానేన సహ న్యస్య ధరాతలే, కూర్మవత్ చతురః పాదాన్ శిరస్తత్రైవ పంచమమ్, ప్రదక్షిణ సమేతేన త్వేవం రూపేణ సర్వదా, అష్టాంగేన నమస్కృత్య హ్యు పవిశ్యాగ్రతో విభోః"** అని తెలుప బడినది. అనగా మనస్సు, బుద్ధి, అభిమానములతోపాటు చేతులు కాళ్లు నాల్గు, శిరస్సులను భూమిపై నుంచి, చేయు నమస్కారము అష్టాంగము.

4) ద్వాదశాంగ నమస్కారము. సంకర్షణ సంహితయందు **"లలాటోదర జాన్వంఘ్రియుగా న్యూర్ధ్వ గతౌ కరౌ, భూమౌ సంధాయ మనసా వాసుదేవ మనుస్మరన్"** అనుచు లలాటము, ఉదరము, జానువులు, పాదములు, పైకెత్తబడిన చేతులు, శిరస్సు అను వీనిని మనస్సు, బుద్ధి, అభిమానములతోపాటు భూమిని తాకుచు చేయునమస్కారముగా తెలుపబడినవి.

భగవానుని విషయమున విధింప బడిన పైవిధములైన నమస్కారములన్నియు పరతత్త్వ జ్ఞానమును అనుగ్రహించు ఆచార్యులయందు భక్తి ప్రకర్షచే చేయుట తగినదే. **"ద్రవిడోపనిషద్ ద్రష్టు రస్య యాథాత్మ్య మద్భుతమ్, సమ్యక్ శ్రుతవతాం నాత్ర శంకనీయ ఉపప్లవః,"** అను ఆళ్వార్ల వైభవమును తెలుపుశ్లోకము స్మరణీయము.

"ఆదస్య నః కులపతేః" అనుటకు **"లక్ష్మీనాథ సమారంభాం"** అని ప్రథమాచార్యుడుగా చెప్పబడు భగవానుడని అర్థమును చెప్పువీలున్నందున, **"తదంఘ్రియుగళం"** అనుటకు ఆభగవానుని పాదములుగా కీర్తింపబడు నమ్మాళ్వార్లు అనియు కొందఱు

వ్యాఖ్యానించిరి. ఈఅన్వయమున "వకుళాభిరామం" అను విశేషణమును సరిపోవును. కాని, విశేషణములన్నిటిని నమ్మాళ్వార్ల విషయమున అన్వయించుటయే సందర్భోచితము, స్వరసమును అని శ్రీ ప్ర.భ అణ్ణాస్వామి వ్యాఖ్యానించిరి.

యస్య సారస్వతం స్రోతో వకుళామోద వాసితమ్ ।
శ్రుతీనాం విశ్రమాయాలం శఠారిం త ముపాస్మహే ॥

**ప్ర.అ.** - యస్య = ఏ ఆళ్వార్ల యొక్క, వకుళ = వకుళ పుష్పముల యొక్క, ఆమోద = సుగంధముచే, వాసితం = పరిమళింప చేయబడిన, స్రోతః - ప్రవాహము, శ్రుతీనాం = వేదములయొక్క, విశ్రమాయ = విశ్రాంతి కొఱకు, అలం = చాలినట్టిదో, తం = ఆ, శఠారిం = నమ్మాళ్వార్లను, ఉపాస్మహే = ఉపాసింతుము.

**వ్యాఖ్య** :- గురుపరంపరలో విష్వక్సేనులకు పిమ్మట నమ్మాళ్వార్లు నమస్కరింపబడుటచే, కవి ఈ శ్లోకమున వారిని స్తుతించుచున్నారు.

ఏ నమ్మాళ్వార్ల వకుళపుష్పముల సుగంధముచే వాసిత మగు వాఙ్మయప్రవాహము వేదములకు విశ్రాంతినిచ్చుటలో సమర్థమైనదో, అట్టి నమ్మాళ్వార్లను ఉపాసింతుము - అని భావము.

ఆళ్వార్లలో మొదట జన్మించిన వారు నమ్మాళ్వార్లు కాకున్నను, వారు అనుగ్రహించిన ప్రబంధముల వైశిష్ట్యమును బట్టి ఆళ్వార్లు అందరిలోను ప్రథమ గణ్యులుగా చెప్పబడుచున్నందున, వారిని కీర్తించినచో మిగిలిన ఆళ్వార్లు అందఱిని స్తుతించినట్లగుటచే, కవి ఇందు నమ్మాళ్వార్లను స్తుతించుట ద్వారా, మిగిలిన ఆళ్వార్లను అందఱిని స్తుతించిరని చెప్ప వచ్చును. ఈశ్లోకము దేశికులకు నమ్మాళ్వార్ల విషయమునగల భక్త్యతిశయమును ప్రస్ఫుటము చేయుచున్నది. మొదటి మూడుశ్లోకములలో **"వందే"** అను ఏకవచన క్రియారూపమును ప్రయోగించిన కవి ఇందు **"ఉపాస్మహే"** అను బహువచనక్రియా రూపమును ప్రయోగించుట గమనింపతగినది. ఇచట బహువచనస్వారస్యముచే కవి ఆళ్వార్లను ఉపాసంచుట ఒక్కరుగాక, తమశిష్య ప్రశిష్యులతో కలసి చేసినట్లు భాసించుచున్నది లేక, నమ్మాళ్వార్ల ఆశ్రయణము అను విశిష్టసంబంధము వలన కల్గిన సాత్త్వికాహంకారముచే కవి తమను బహువచనములో నిర్దేశించుకొనిరనియు చెప్పవచ్చును. **"అభిమాన తుఙ్గన్ శెల్వనైప్పోల"** అను పెరియాళ్వార్లు స్వాత్త్వికాహంకారము ఆదరణీయమేనని పల్కిరి కదా! ఇచట (ప్రపత్తి చేయుట అనుఅర్థమునకు) **"ఉపాస్మహే"** అను క్రియ సార్థకము.

నమ్మాళ్వార్లకు వకుళభూషణుడు, వకుళాభరణుడను పేర్లు కలవు. వకుళ పుష్పములను అలంకారముగా కలవాడని భావము. వకుళపుష్పము ఆకారమున చిన్నదైనను గొప్ప సువాసనను కల్గినది. ఎంతగా ఎండిపోయినను సువాసనను కోల్పోదు. దీనినే సంస్కృతమున

కేసరమనియు అందురు. తమిళభాషలో **''మకిళ్**పూ'' అనిపేరు. నమ్మాళ్వార్లు స్వయముగా తిరువాయ్ మొళ్ళిలో ''నాట్కమళ్ మకిళ్ మాలై మార్బినన్'' అనుచు తమకు నిరూపకముగా వకుళ పుష్పమును పేర్కొనిరి. భగవానునకు తులసి ఎంత ప్రియకరమో, ఆళ్వార్లకు వకుళపుష్పము అంతప్రియకరము. **''వకుళాభిరామమ్''** అని ఆళ్వార్లు స్తుతింప బడుచున్నారు కదా! సంకల్ప సూర్యోదయ నాటకమున దేశికులు నమ్మాళ్వార్లను గూర్చి **''స్వలక్షణ సరస్వతీ సురభికేసరశ్లాఘిన్''** అని పల్కిరి. నమ్మాళ్వార్ల సారస్వతము వకుళపుష్పములచే సువాసితమగుట ఏమి? అనినచో - ఆళ్వార్ల ప్రబంధములోని భావములన్నియు వారి హృదయమునుండి వెల్లువికినవి. ఆ హృదయము ఎల్లప్పుడు వకుళమాలాభూషితము. కావున వారు వెలయించిన వాఙ్మయ మంతయు వకుళామోద వాసితమగుటలో ఆశ్చర్యము లేదు కదా!

**''సారస్వతం స్రోతః''** అను ప్రయోగము సాభిప్రాయకము. భగవానుని స్వరూప రూపగుణవిభూతుల అనుభవ పరీవాహ రూపముగా ఆళ్వార్ల ప్రబంధములు ఆవిర్భవించినవి. కావున వానిని స్రోతస్సులనుట తగినది. ఆళ్వార్ల దివ్యప్రబంధములు వేదములకు ప్రతిరూపములు. **''వేదమ్ తమిళ్ శెయ్ దమాఅన్''** అని ప్రసిద్ధి నొందిన నమ్మాళ్వార్లు వేదముల హృదయమును అందఱకు తెలియునట్లు ప్రబంధములను అనుగ్రహించిరి. **''వేదత్తి నుట్పొరుళ్ నిఱ్కప్పాడి''** అని, **''ద్రావిడ వేదసాగరం''** అని, **''సహస్రశాఖోపనిషత్ సమాగమం''** అని మధురకవులు పల్కిరి కదా! **''బిభేత్య ల్పశ్రుతాత్ వేదో మా మయం ప్రతరిష్యతి''** అనునట్లు అల్పజ్ఞుడు చెప్పు అపార్థములకు వేదము భయపడును. నమ్మాళ్వార్ల ప్రబంధములు అవతరించిన పిమ్మట అట్టి భయముతీరినది. విశ్రాంతి కల్గినది. మఱియు, భగవానుని స్వరూపగుణవిభూతులనుగూర్చివర్ణింపదలచిన వేదము మిక్కిలి శ్రమ పడినది. అయినను సాఫల్యము నొందలేదు. భగవానుని ఒక్క ఆనంద గుణమును లెక్కింప తలపెట్టిన వేదము భంగపడి, **''యతో వాచో నివర్తంతే''** అనునట్లు వెనుకకు తిరిగినది. ఈ అవస్థ భగవానుని అన్ని విషయములలోను సాధారణము. కాని, నమ్మాళ్వార్లు తమ ప్రబంధములలో సర్వేశ్వరుని స్వరూప రూప గుణ విభూతులను గూర్చి సుస్పష్టముగా తెలుపుటచే, వేదములకు శ్రమతీరినది. విశ్రాంతికల్గినది. **''యత్తత్ కృత్యం శ్రుతీనాం''** అను ద్రవిడోపనిషత్ తాత్పర్య రత్నావళీ శ్లోకార్థ మిచట అనుసంధేయము. **''ఒణ్ తామరై యాళ్ కేళ్వన్ ఒరువనైయే నోక్కు ముణర్వు''** అనునట్లు శ్రీమన్నారాయణుడే ప్రాప్యప్రాపకములను జ్ఞానమే నిజమైన జ్ఞానము, వేదములు బోధించు తాత్పర్యమిదియే. ఈసందేశమును ఆళ్వార్లు తమ ప్రబంధములలో సర్వజనగ్రాహ్య మగునట్లు అనుగ్రహించుటవలన, వేదములకు ఇకపై దానిని బోధింపవలసిన అక్కఱ లేకపోయినది, వానికి విశ్రాంతి సమకూరినదను తాత్పర్యము **''శ్రుతీనాం విశ్రమాయాలం''** అను ప్రయోగము వలన ఏర్పడుచున్నది.

**'శ్రుతి'** శబ్దమునకు వేదము అను అర్థమునే కాక, చెవి అను అర్థమును చెప్పినచో,

నమ్మాళ్వార్ల ప్రబంధములు చెవులకు విశ్రాంతిని, తద్వారా సుఖమును చేకూర్చుటలో సమర్థములను అర్థమును చెప్పవచ్చును. నమ్మాళ్వార్ల ప్రబంధములు శబ్దసౌందర్యముచే, అర్థపుష్టిచే చెవులకు ఇంపయినవి. ''శెవిక్కినియ శెఞ్జొల్'' అని వారే స్వయముగా పల్కిరి. శ్రీదేశికులు దయాశతకములోని మూడవ శ్లోకమున ఆళ్వార్ల దివ్యప్రబంధరూపమును పొందిన వేదములు అందఱికిని అందుబాటులోనికి వచ్చినవి. కావున తిరువాయ్ మొழிకి ''సర్వీయ శాఖాశ్రుతి'' అని పేరు వచ్చినదని తెలిపిరి. వేదములలో తమకేర్పడిన సందేహములు ద్రావిడవేదముల అర్థమును గ్రహించుటవలన తీరిన వనుచు వారే గురుపరంపరాసార మను రహస్య గ్రంథమున ''శెయ్యతమిழ் మాలైకళ్ నామ్ తెళియ ఓది త్తెళియాద మఱై నిలఙ్గళ్ తెళికిన్ఱోమే'' అని పల్కిరి కదా!

''శఠారి'' అనగా శఠవాయువును అరికట్టిన వారని భావము. జన్మించుశిశువును ''శఠ'' మను వాయువు ఆవరించుటచే పూర్వజన్మలకు సంబంధించిన జ్ఞానమును, స్వరూపజ్ఞానమును ఆ శిశువు మఱచి, అజ్ఞానమును పొందునని చెప్పబడుచున్నది. నమ్మాళ్వార్లు అట్టి శఠవాయువును నిరోధించుటచే ''శఠారి'' అయ్యిరి. కావున వారి స్వరూప జ్ఞానము శఠవాయువుచే తిరోధానము కాలేదు. శఠు లనుటకు కపటవాదములను చేయువారు అనియు చెప్పవచ్చును. భగవానునకు రూపములేదు, గుణములు లేవు అని వాదించు శఠులకు వీరు శత్రువు. తమ ప్రబంధములలో వారి వాదములను పూర్తిగా నిరసించిరి. కావున వారికి 'శఠారి' అను పేరుకల్గినదనియు చెప్పవచ్చును. శ్లోకములోని ''తం'' అను సర్వనామ శబ్దము దయాశతకములోని ''తం గిరిం'' అను మొదటి శ్లోకములోవలె ప్రసిద్ధిద్యోతకము.

ఇచట సరస్వతీశబ్దమునుండి పుట్టిన సారస్వతశబ్దముయొక్క ప్రయోగము గమనార్హము. సరస్వతి అనగా సరస్సు(ల)ను కల్గినది అని అర్థము. భగవానుడు ''శీత మివ హ్రాదమ్'', ''వాశత్తడమ్'', ''మరతకమణి త్తడమ్'' అను నట్లు ఒకగొప్ప సరస్సు. అట్టి భగవానుడు ఆళ్వార్ల హృదయమున స్థావరప్రతిష్ఠగా నిలచియుండెనని వారే పల్కిరి. కావున ఆళ్వార్ల హృదయము ఒక సరస్వతి. ఆ సరస్వతినుండి ఉద్భవించిన, అనుభవ పరీవాహరూపములైన ప్రబంధములను సారస్వత స్రోతస్సులనుట కడు రమణీయమే కాక సమంజసము కూడ. మఱియు, స్రోతస్సు అనగా సహజముగా ప్రవహించు ప్రవాహము అని అర్థము. ఆళ్వార్ల ప్రబంధములన్నియు సహజములు. అతిశయోక్తులు కావు. ''పొయ్యిల్ పాడల్'' అని వారే పల్కిరి కదా! కావున వానిని స్రోతస్సు లనుటయు తగినదే.

**పద్మాసనోపవిష్టం పరపదయుగళే నివిష్టచైతన్యమ్ ।**
**పరతత్త్వబోధముద్రం పరమాచార్యం పరాంకుశం వందే ॥**

ప్ర.అ. - పద్మ+ ఆసన+ ఉపవిష్టం = పద్మాసనమున కూర్చునియున్నవారు, పర = పరమాత్మ యొక్క, పదయుగళే= పదములజంటయందు, నివిష్ట = నిలిపిన, చైతన్యం= ప్రాణములను కల్గిన

వారు, పరతత్త్వ = భగవానుని తత్త్వమును, బోధ = బోధించునట్టి, ముద్రం = జ్ఞానముద్రను కల్గినవారు, పరమ+ ఆచార్యం = ఆచార్యులలో శ్రేష్ఠులును అగు, పర+ అంకుశం = పరాంకుశులను పేరును కల్గిన నమ్మాళ్వార్లను, వందే = నమస్కరించుచున్నాను.

**భావము:-** ఆఱాయిరప్పడిగురుపరంపరా ప్రభావమున (పిళ్ళలోకియ పెరుమాళ్ జీయర్ కృతి) నమ్మాళ్వార్ వైభవమున ప్రస్తుత శ్లోకము కలదు. ఇది అజ్ఞాతకర్తృకము. మధురకవులు ఆళ్వార్ తిరునగరిలో మొట్టమొదటగా తింత్రిణీవృక్షము (చింతచెట్టు) క్రింద నమ్మాళ్వార్లను సేవించిన సందర్భములో ప్రస్తుతశ్లోకము ఉదాహరింపబడినది.

పద్మాసనమున కూర్చున్నవారు, తమ ప్రాణములను భగవానునిపైననే నిలిపినవారు, భగవత్తత్త్వమును బోధించు జ్ఞానముద్రను కల్గిన వారు, ప్రపన్నజనకూటస్థులుగా పేరుపొందిన వారు, పరాంకుశులు అనబడు నమ్మాళ్వార్లను నమస్కరించుచున్నాను.

ఆళ్వార్లు **''ఉణ్ణుమ్ శోరు పరుకుమ్ నీర్ తిణ్ణుమ్ వెత్తిలైయుమ్ ఎల్లామ్ కణ్ణన్''** అని వారు పల్కిన విధముగా, సర్వము భగవానుడే అని తలచియుండిరి. అంతియేకాక, ఆభగవానుని పాదపద్మముల యందు తమసర్వస్వమును అర్పించినవారు. **''ఎన్నుడై యావియే''** అనుచు భగవానుని తమ ప్రాణముగా తలచినవారు. కావున **''పరపదయుగళే .... చైతన్యం''** అను విశేషణము ఆళ్వార్ల విషయమున అన్వర్థము. **''మనస్ఫటిక దర్పణ ప్రతిఫలత్ పరబ్రహ్మణః ప్రదర్శన మివాచరన్ ప్రథితబోధముద్రాంకితః''** అని జీయర్ నాయనార్ (అభిరామవరులు) నక్షత్రమాలికలో జ్ఞానముద్రను కల్గిన ఆళ్వార్ల హస్తమును గూర్చి పల్కిరి. కావున ఆళ్వార్ల జ్ఞానముద్ర వారిహృదయమున ప్రతిఫలించు భగవత్తత్త్వమును నిర్దేశించి చూపుటచే **''పరత్త్వ..ముద్రం''** అనువిశేషణము తగినది. **''యుగళీనివిష్టచైతన్యం''** అను పాఠాంతరము కలదు.

**వకుళధవళమాలావక్షసం వేదబాహ్య-**
**ప్రబలసమయవాదచ్ఛేదనం పూజనీయమ్ ।**
**విపులకురుకనాథం కారిసూనుం కవీశం**
**శరణ ముపగతోఽహం చక్రహస్తేభచక్రమ్ ॥**

**ప్ర.అ.** - వకుళధవళమాలావక్షసం = వకుళపుష్పములతో కూర్చబడిన, తెల్లని మాలను వక్షః ప్రదేశమున కల్గినవారు, వేదబాహ్య = వేదబాహ్యులగు బౌద్ధులు, జైనులు మొదలగు వారియొక్క, ప్రబల = మిక్కిలి ప్రబలమైన, సమయ = సిద్ధాంతములయొక్క, వాద = వాదములను, ఛేదనం = ఛేదించువారును, పూజనీయమ్ = పూజింపతగినవారును, విపులకురుకనాథం = విశాలమైన కురుకాపురికినాథులును, కవి+ ఈశం = కవులలో గొప్పవారును, చక్రహస్త+ ఇభ = చక్రధారియు,

గజమువంటి వాడగు భగవానుని, చక్రం = వశముచేసికొన్నవాడును అగు, కారిసూనుం = 'కారి' అనుమహాత్ముల పుత్రులగు నమ్మాళ్వార్లను, శరణం = రక్షకులుగా ( ఉపాయముగా) ఉపగతః= పొందిన వాడనై, అహం = నేను ఉన్నాను.

**భావము** :- ''**భూతం సరశ్చ..**'' అను తనియన్ శ్లోకమును వ్యాఖ్యానించుచు ఈ శ్లోకమును పిళ్లైలోకం జీయర్ ఉదాహరించిరి, అచట ''**చక్రహస్తేభచక్రం**'' అను భాగముమాత్రమే ప్రమాణముగా గైకొనబడినది. అట్లే, పిళ్లైలోకం జీయర్ కృతముగా చెప్పబడుచున్న '**శెయ్య తామరై**'' అను మణవాళమహామునుల మంగళాశాసనపాశురవ్యాఖ్యలో ''**వకుళధవళమాలా వక్షసం, వేదబాహ్యప్రబలసమయ వాదచ్ఛేదనం**'' అను భాగముమాత్రము కొంత పాఠ భేదముతో ఉట్టంకింపబడినది. ఆఱాయిరప్పడిగురుపరంపరాప్రభావము గ్రంథమున భగవద్రామానుజులు ఆళ్వార్ తిరునగరికి చేరి, అచట ఆళ్వార్లను సేవించుచు, ఈశ్లోకమును అనుగ్రహించినట్లు కలదు.

తెల్లని వకుళమాలికలను కల్గిన వక్షస్థలముచే శోభిల్లువారు, వేదబాహ్యులగు బౌద్ధజైన మతానుయాయులుచేయు ప్రబలములైన వాదములను తమ దివ్యప్రబంధములతో నిర్వీర్యము చేసినవారు, పరమపూజ్యులు, కురుకాపురికి ( ఆళ్వార్ తిరునగరికి) ప్రభువులు, కవీశ్వరులు, భగవానుని సైతము వశముచేసి కొనినవారగు కారిసూనులను (నమ్మాళ్వార్లను) శరణముగా పొందినవాడ నైతిని.

శ్లోకములోని విశేషణములు ఆళ్వార్ల రూపవైభవమును, జ్ఞానవైభవమును తెలియజేయచున్నవి. వకుళపుష్పములు తెల్లగానుండుటచే ఆపూలచే కూర్పబడిన మాలెలను కల్గిన ఆళ్వార్ల వక్షము గొప్పగా ప్రకాశించుచున్నది. తిరువాయ్ మొழி మొదలగు ప్రబంధములలో నమ్మాళ్వార్లు వేదబాహ్యులగు బౌద్ధులు , జైనులుమొదలగు వారు చేయు వాదములను అన్నిటిని ఖండించు గొప్ప పాశురములను అనుగ్రహించిరి. తిరువాయ్ మొழி మొదటి శతకములోని ప్రథమ దశకము ( ఉయర్వఱ) బ్రహ్మసూత్రములలోని మొదటి రెండు అధ్యాయములను, రెండవ దశకము (వీడుమిన్) చివరిరెండు అధ్యాయములను సంగ్రహముగా తెలుపు చున్నదని అభిజ్ఞులగు (1-2) పూర్వాచార్యుల అభిప్రాయము. నమ్పిళ్లై ఈడులో ''**వీడుమిన్**'' అనుదశకప్రారంభమున ''**తత్త్వపరమాయుమ్, ఉపాసనపరమాయుమితే శాస్త్రమ్‌తా నిరుప్పదు. అతిల్ తత్త్వపరమాక చ్చొల్లవేణ్డువన్ఱ్ఱెల్లామ్ శొల్లి కీழ్ తిరువాయ్ మొழியిలే. ఉపాసనపరమాకచ్చొల్లవేణ్డువ న్ఱ్ఱక్కెల్లామ్ సంగ్రహమా యిరుక్కిఱదిత్తి రు వాయ్ మొழி**'' అని సాయించిన సూక్తి ఈ అంశమును స్పష్టము చేయుచున్నది.

వేదబాహ్యులు రెండు తెఱగులుగా నున్నారు. ''**కపిలాగమానుమానపాశుపత శాస్త్రభ్గళుక్కు వేదబ్గళ్ అనుగ్రాహకబ్గళ్**'' అను నట్లు సాంఖ్య, వైశేషిక, పాశుపత మతస్థులు వేదమును

అప్రధానముగా నైనను అంగీకరించిరి. వీరు ఒక వర్గము. బౌద్ధులు, జైనులు మొదలగువారు వేదమును కనీసము ఉపసర్జన ప్రమాణముగా నైనను అంగీకరింపని వారు. వీరు రెండవ వర్గమునకు చెందినవారు. ఈ రెండు వర్గములలోని మొదటి వర్గమును ప్రథమ దశకములోని ''శురరటి **వణునిలై**'' అను 8వ పాశురముతో, రెండవ వర్గమును ''**ఉళనెనిలుళన్**'' అను 9 వ పాశురముతో నిరసించిరి. ఈ అంశము 'వేదాంత శాస్త్ర ద్రవిడా గమాద్యదశకైక **కంఠ్యమ్**''లో వివరింప బడినది. బ్రహ్మసూత్రములలో కూడ ముందుగా సాంఖ్యవైశేషికాదులు, పిమ్మట బౌద్ధజైనాదులు నిరసింప బడిరి.

''శురరటి వణునిలై'' అను పాశురమున బ్రహ్మాదులచే కూడ తెలియరాని స్వభావమును కల్గిన మూలప్రకృతి మొదలగు సకలజగత్తుకు ప్రధాన కారణమై, త్రిపురములను సంహరించి, వాని నన్నిటిని సంహరించిన పరాత్పరుడగు భగవానుడు రుద్రాంతర్యామియై జగత్సంహారమును చేయుచున్నాడు, చతుర్ముఖాంతర్యామియై, పరమపదమునకు ఈవలవైపు గల లోకములను సృష్టిచేసి, దేవతలకు జ్ఞానమును ప్రసాదించుచున్నాడు అను అర్థమును తెలుపుట ద్వారా ఆళ్వార్లు జగత్తు బ్రహ్మాత్మక మనియు, క్షేత్రజ్ఞులగు బ్రహ్మరుద్రులయొక్క సృష్టి, సంహారములు భగవానుని అధీనములని సూచించిరి. కావున అబ్రహ్మాత్మకమగు ప్రధానము ( ప్రకృతి) సృష్టికారణమను సాంఖ్యమతము ఖండింపబడినది. అట్లే, రుద్రపారమ్యము అనగా రుద్రుడే పరమాత్మ అని వాదించు పాశుపతమతము, పరమాణువులే జగత్కారణములను కణాదమతమును పైపాశురము ద్వారా నిరసింపబడిన వనుట స్పష్టము అదెట్లనగా- ''**శురరటి వణునిలై విణ్ముదల్ ముళువదుమ్ వరుమ్ముదలాయ్**'' అనుచు ప్రకృతి, మహత్తు, అహంకారము, మొదలగు తత్త్వములకు ను భగవానుడే కారణమని తెలుపుటచే సాంఖ్యమతములోని అబ్రహ్మాత్మకమైన ప్రధాన నిరసనము సూచితము. ప్రకృతి, మహత్తు, అహంకారాదులకును భగవానుడే వరిష్ఠకారణమని చెప్పు ఈ పాశురమువలన నిరవయవములైన పరమాణువులకు జగత్కారణత్వము కూడదు అను నైయాయిక మత దూషణము సూచితము. రుద్రుడు చేసిన త్రిపురదాహము, సృష్టిసంహారమును ''**అరనెన పుర మొరు మూన్టెరిత్తులక్కుళి త్తుళన్**'' అనుచు భగవానుడు అంతర్యామిగానుండుటచే సంభవమయ్యెనని తెలుపుటచే పాశుపతమతమునగల రుద్ర పారమ్యము ఖండితము. ఇది చతుర్ముఖ పారమ్యము ఖండింపబడుటకును ఉపలక్షణము.

రెండవవర్గమునకు చెందిన బౌద్ధులు, జైనులు ''**ఉళనెనిలుళన్**'' అను 9వ పాశురముచే నిరసింపబడిరి. ''భగవానుడు లేడనుటను సాధింపదలచిన నీవు ''**ఉళన్**'' (అస్తి) అను పదముచే నీ వాదమును సాధింప బోయినను భగవానుని అస్తిత్వమే నిరూపితమగును. నీ అభిమతము సిద్ధింపదు ''**ఉళనలన్**'' (నాస్తి) అనుచు భగవానుని అస్తిత్వాభావము నిరూపింప నెంచితి వేని - లోకమున '**నాస్తి**' అనుపదమునకు స్థూలావస్థనశించి, సూక్ష్మావస్థను పొందుట అను అర్థము.

కావున, నీ అభిప్రాయము సిద్ధింపదు. ఇట్లు 'అస్తి- నాస్తి'' అను గుణద్వయయుక్తముగా స్వపక్ష - పరపక్షపద్ధతిలో భగవానుని అస్తిత్వమేసిద్ధించును. కావున అస్తిత్వ-నాస్తిత్వ రూపమున రూపగుణ విశిష్టమైన పరబ్రహ్మ సిద్ధించినట్లే అగును. కావున నీకు అనభిమతమే సిద్ధించును కాని అభిమతము కాదు. అందుచే అనంతగుణవిభూతిని కల్గిన వానిని గాభగవానుని అంగీకరించుటయే మేలు.'' అని ఆపాశురముయొక్క తాత్పర్యము. ఇట్టి వివరణమే ఈపాశురము యొక్క ఈడు వ్యాఖ్యానమున కలదు.

జగత్తు క్షణికమని వాదించు వైభాషికుల వాదమును ''అస్తి-నాస్తి'' అను రెండు విధములైన వ్యవహారదశలలోను స్థూలసూక్ష్మరూపమైన ఉభయావస్థావిశిష్టమగు వస్తువుయొక్క స్థిరత్వము సిద్ధించునని తెలుపుట ద్వారా ఆళ్వార్లునిరసించిరి. ఇట్టి క్రమములోనే శ్రీభాష్యమున భగవద్రామానుజులు వైభాషికమతమును పరాస్తముచేయుట గమనింపతగినది. ఇట్లే, సౌత్రాంతికులు, యోగాచారులు, మాధ్యమికులు అనబడు బౌద్ధమత ప్రకారవాదులును ఈ పాశుర ముద్వారా నిరసింపబడిరి. జైనులు వాదించు జగదనైకాంతి కత్వమును ''సత్తగా కాని, లేక అసత్తగా కాని ఉండును తప్ప, జగత్తు ''సద సత్తు'' కానేరదు అను అర్థమిచ్చు ''**ఉళనెలిలుళన్ అవనురువ మివ్వురువుకళ్, ఉళనలనెనిల్ అవనరువ మవ్వురువుకళ్**'' అను సూక్తి ద్వారా నిరస్తము. విస్తరభీతిచే వివరములు పూర్తిగా ఇచట తెలుపబడలేదు. వీని వివరములను '**వేదాంత శాస్త్ర్రద్రవిడాగ మాద్యదశైకకంఠ్యము**''న చూడనగును.

''**వీడుమిన్ ముర్ఱవుమ్**'' దశకము ఈడు వ్యాఖ్యానమునను గల అడైయవళైన్దాన్ అరుమ్బదమున ''**శరరశీవఖునిలై ఎన్తు తుడఙ్గి ఇరణ్డుపాట్టిలుమ్ బాహ్యాకుదృష్టికళాల్ వరుమ్ బాధైయిల్లామై శొల్లప్పట్టదు**'' అని యుండుటయును గమనింప తగినది.

(**విపులకురుకనాథం**) - ఆళ్వార్లు పలు సందర్భములలో తాముజన్మించిన ప్రదేశమగు కురుకాపురిని తమకు నిరూపకముగా తెల్పిరి. కావున ఇచట వారిని ''**కురుకనాథం**'' అని పల్కుట తగినది. కురుకాపురి '**ఆళ్వార్ తిరునగరి**' అని సంప్రదాయమున ప్రసిద్ధము. ఈ పురికి గల వైపుల్యమేమనగా ''**నల్లార్ నవిల్ కురుకూర్**'' అని ఆళ్వార్లుపల్కినట్లు జ్ఞానవైశద్యమును కల్గిన భగవద్భక్తులు పలువురు అచట నిత్యవాసము చేయుటయే. లేక ప్రాదేశికమైన సస్యవృద్ధిని కల్గిన వైపుల్యమును చెప్పవచ్చును. ''**ఒన్ఱుమ్ తేవుమ్**'' (4-10) అను దశకమున ఆళ్వార్లేస్వయముగా కురుకాపురియొక్క ''**కున్ఱమ్ పోల్ మడిమాడనీడు**'', ''**మాడమాళిగై శూழ్న్దழకాయ**'' ''**తేశమామదిళ్ శూழ్న్దழకాయ**'' అని అచటి భవన సౌందర్యమును, ''**శెన్నెల్ శెన్నెల్ కములమోళ్గు**'', ''**మలిన్దుశెన్నెల్ కవరివీశుమ్**'' అని సస్యవృద్ధిని, ''**శిరఙ్గళాల్ అమరర్ వణఙ్గుమ్**'', ''**కూడి వానవరేత్తనిన్ఱ**'' అని నిత్యసూరులకును ప్రాప్యమగుటను తెలిపిరికదా!

(**కారిసూనుం**) - ఆళ్వార్లు ''**కారి**'' అను భగవద్భక్తుల పుత్రులు. ఆళ్వార్లవంశములోని పూర్వులందఱు భగవద్భక్తిని కల్గినవారు. కావున తమ పితృపాదులు, ఆచార్యులును అగు కారిసూ

నామమును తమకు నిరూపకముగా "**కారిమాఱన్**" అనుచు నమ్మాళ్వార్లు తిరువాయ్ మొళ్ళిలో పలుచోట్ల తెలిపిరి. ఇట్టి క్రమమును గోదాదేవి అనుసరించుచు "**విట్టుశిత్తన్ కోదై శొన్న**" అని పల్కుట ఇచట స్మరణీయము.

(**కవీశం**) ఆళ్వార్లు కేవలము కవి కాదు. కవీశులు. లోకమున ఎంతగొప్పకవిత్వమును అల్లగల్గిన వారైనను వారి కవిత్వము భగవానుని గూర్చి అయినప్పుడే సార్థకమగును. లేనిచో నిరర్థకమును, అత్యుక్తియును అగును. నమ్మాళ్వార్లు తమ ప్రబంధములన్నిటిలో భగవానుని వైభవమును గూర్చి స్తుతించుటచే వారికవిత సార్థకము. వారు కవీశులును అయ్యిరి. ఈ అన్వయమున ఈ శబ్దము ఇంద్రశబ్దము వలె శ్రేష్ఠవాచకము. తిరువాయ్ మొళ్ళిలోని "**శొన్నాల్ విరోదమిదు**" *(3-9)* అనుదశకమున ఆళ్వార్లు లోకములోని కవులను గూర్చి "**ఉళనాకవే ఎణ్ణి... ఇమ్మానిడత్తై క్కవి పాడియెన్?**", "**ఓర్ మానిడమ్ పాడలెన్నావదే**" అనుచు మానవులనుస్తుతించు కవిత్వమువలన ప్రయోజనము శూన్యమని, "**కొళ్ళక్కుఱైవిలన్ వేణ్డిఱ్ఱెల్లామ్ తరుమ్ కోదిల్, ఎన్ వళ్ళల్ మణివణ్ణన్ తన్నైక్కవి శొల్లవమ్మిన్**" అనుచు భక్తుల అభీష్టములనన్నిటిని ఇచ్చువాడు, ఎట్టి కొఱతను లేని ఉదారుడును, అగు భగవానుని గూర్చి కవిత్వమును పల్కుడని ఉద్బోధించి, వారిని శాసించిరి. కావున "**కవీనాం ఈశః**" - కవీశు లయ్యిరి.

(చక్రహస్తేభచక్రమ్) - *గత విశేషణము కవులను శాసించిన విధమును తెలుపగా, ఈ విశేషణము భగవానుని శాసించుటను తెలుపుచున్నది* చక్రహస్తుడనగా సుదర్శనచక్రమును చేతియందు కలవాడు విష్ణువు. ఆస్వామి గజసమానుడు. ఆళ్వార్లు పలువురు భగవానుని గజముగా అభివర్ణించిరి. "**కాయ్శినమాకళిఱు**", "**ఆనైయి ల్కిడన్ద**", "**కైమ్మాన మద కళిఱు**" అనుమొదలగు సూక్తులు ఇచట స్మరింపతగినవి. *గజమువలెసర్వతంత్రస్వతంత్రుడగు భగవానుని* సైతము తమ కవిత్వముతో వశీకరింప గల్గిన వారు ఆళ్వార్లు. "**వలక్కైయాళ్ ఇడక్కైచ్చఙ్గమ్ ఇవైయుడై మాల్వణ్ణనై, మలక్కునావుడైయేఱ్కు**" అని వారే ఈ విషయమునుగూర్చి పల్కిరికదా! ఆళ్వార్లకు పరాంకుశులను పేరు వచ్చుటకును ఇది ఒక హేతువను అన్వయమును కలదు. అనగా పరుడగు భగవానుడు గజసదృశుడు, ఆస్వామిని వశపఱచుకొనుటకు తగిన అంకుశమువంటి వాక్కును కల్గినవారని ఆ నామమునకు భావము. పలు దివ్య భగవానుల దేశములలోని అర్చామూర్తులు ఆళ్వార్లవద్దకు తామే వచ్చి, వారికి సేవను అనుగ్రహించి, "**నన్ను కీర్తింపుడు, నన్ను కీర్తింపుడు**" అని కోరిరి అని నమ్పిళ్ళై ఈడులో హృద్యముగా వ్యాఖ్యానించుట ఇచట స్మరణీయము. ప్రస్తుత సమాసములో చివరి (పదమగు) చక్రపదమునకు *గజబంధనము* అని భావము. "**మత్తానా మింద్రియాణాం**" *(69)* అను సుదర్శనశతకశ్లోక వ్యాఖ్యానమున చక్రనేమి *గజబంధముగా* వర్ణింప బడుట ఇచట గమనింపతగినది. కావున "**చక్రహస్తేభచక్ర**" మను ప్రస్తుత విశేషణము ఆళ్వార్ల విషయమున మిక్కిలి సార్థకము.

ఇట్టి నమ్మాళ్వార్లను శరణముగా పొందిన వాడనైతినని తాత్పర్యము. ప్రస్తుత శ్లోకము మాలినీవృత్తమున కూర్పబడినది.

శ్రీమతే శఠకోపాయ నమః

# నమ్మాళ్వార్ల తిరునక్షత్రతనియన్‌లు

(శఠకోపసూరి అవతరించిన సంవత్సర, మాస, నక్షత్రాదులను వర్ణించు శ్లోకములు)

**వృషభే తు విశాఖాయాం కురుకాపురి కారిజమ్ ।**
**పాండ్యదేశే కలే రాదౌ శఠారిం సైన్యపం భజే ॥**

ప్ర.అ. :- వృషభే = వృషభమాసమున, విశాఖాయాం = విశాఖానక్షత్రమున, పాండ్యదేశే = పాండ్యదేశములోని, కురుకాపురి = ఆళ్వార్ తిరునగరిలో, కలే + ఆదౌ = కలియుగ ప్రారంభమున, కారిజమ్ = కారి అను మహనీయులకు జన్మించిన, సైన్యపం = విష్వక్సేనులగు, శఠారిం = శఠకోప సూరిని, భజే = భజించుచున్నాను.

**భావము** :- పాండ్యదేశములోని కురుకాపురి అనబడు ఆళ్వార్ తిరునగరిలో కలియుగ ప్రారంభమున వృషభమాసములోని విశాఖా నక్షత్రమున కారిమార్లకు పుత్రులుగా జన్మించిన విష్వక్సేనులగు శఠకోపసూరిని భజింతును.

ఈ శ్లోకమున ఆళ్వార్లు అవతరించిన మాసము, నక్షత్రము, దేశము, యుగమును ప్రస్తుతింపబడినవి. మఱియు భగవానుని ఆదేశము ప్రకారము విష్వక్సేనులే నమ్మాళ్వార్లుగా అవతరించిందని చెప్పబడుచుండుటచే ఆ అంశము కూడ తెలుపబడినది. అట్లే, ఆళ్వార్లను పుత్రులుగా పొందిన మహనీయుల పేరును తెలుపబడినది.

**శ్రీవిజ్ఞానదినోత్తరేఽహని కలౌ వర్షే ప్రమాథ్యాహ్వయే**
**మాసే మాధవనామ్ని భార్గవదినే చర్‌క్షే విశాఖాభిధే ।**
**లగ్నే శుద్ధచతుర్దశీతిథియుతే శ్రీమత్కుళీరేఽపి చ**
**క్షిత్యాం ప్రాదురభూత్ పరాంకుశకవిః భాగ్యోదయా న్మాదృశామ్ ॥**

ప్ర.అ. :- కలౌ = కలియుగమున, (ర= 2, వ = 4, ఞ = 0, న = 0), శ్రీవిజ్ఞాన = 'శ్రీవిజ్ఞాన' (2400) అను అక్షరములచే సిద్ధించిన 42 సంఖ్యను కల్గిన, దిన + ఉత్తరే = దినములకు పిమ్మటగల, అహని = దినమున, ప్రమాథి + ఆహ్వయే = ప్రమాథి అను పేరును కల్గిన, వర్షే = సంవత్సరమున, మాధవనామ్ని = వైశాఖమను పేరును కల్గిన, మాసే = మాసమున, భార్గవదినే = శుక్రవారమున, విశాఖా + అభిధే = విశాఖ అను పేరును కల, ఋక్షే చ = నక్షత్రమున, శుద్ధ చతుర్దశీతిథియుతే = శుద్ధ చతుర్దశి తిథితో కూడిన, శ్రీమత్ = శుభమును కల్గిన, కుళీరే = కర్కాటకమను, లగ్నే అపి = లగ్నమునందు, క్షిత్యాం = భూమి యందు, మాదృశాం = మావంటి అకించనుల యొక్క, భాగ్య + ఉదయాత్ = అదృష్టము ఉదయించిన కారణముచే, పరాంకుశకవిః = పరాంకుశులను కవి (ఆళ్వార్లు), ప్రాదురభూత్ = ప్రాదుర్భవించెను.

**భావము** :- ఈ శ్లోకమున కూడ ఆళ్వార్ల అవతారమునకు సంబంధించిన విశేషములు కీర్తింపబడినవి.

కలియుగమున 42 దినములు గడచిన పిమ్మట 43వ దినమున ప్రమాథి అను పేరు గల సంవత్సరమున వైశాఖ శుద్ధ చతుర్దశి శుక్రవారము విశాఖా నక్షత్రమున కర్కాటక లగ్నమున ఈ భూమియందు నా వంటి అకించనుల భాగ్యవశముచే పరాంకుశకవి ఉద్భవించెను.

సంస్కృతభాషలో అక్షరముల ద్వారా సంఖ్యను నిర్దేశించు పద్ధతి కలదు. భారతమున 18 అను సంఖ్యకు పలు రీతులలో ప్రాధాన్యమున్నందున, ఆ సంఖ్యను నిర్దేశించు **''జయ''** మను పేరు భారతమునకు పెట్టబడినదని పెద్దలందురు. నమ్మాళ్వార్లు కలియుగము ప్రారంభమైన పిదప 42 దినములు గడచిన పిమ్మట అవతరించిరని సంప్రదాయచరిత్రగ్రంథములలో తెలుపబడినది. **'శ్రీవిజ్ఞాన'** అను పదము 42 అను సంఖ్యను నిర్దేశించును. **'శ్రీవిజ్ఞాన'** పదములోని రకారము రెండవ అంకెను, వకారము నాల్గవ అంకెను (యనుండి రెండవ అక్షరము రకారము, నాల్గవ అక్షరము వకారము అగుటచే) నిర్దేశించును. **''అంకానాం వామతో గతిః''** అను న్యాయమును బట్టి 24 అను క్రమమును 42గా మార్చి గ్రహింపవలెను. చివరి **'జ్ఞన'** అను రెండు అక్షరములును శూన్యాంకమును నిర్దేశించుటచే వానికి విలువ లేదు. [క నుండి ఞ పదవ అక్షరమగుటచే, ట నుండి న కారము పదవ అక్షరమగుటచే - ఈ రెండు అక్షరములు శూన్యాంకమును (0) తెలుపును] ఈ విధముగా **''శ్రీవిజ్ఞాన''** అను పదము 42 అను సంఖ్యను తెలుపుచున్నదని చెప్పవచ్చును.

**''శ్రీవిజ్ఞానదినోత్తరే''** అనుటకు వేరు విధముగా కూడ అర్థమును చెప్పవచ్చును. శుభమును, విజ్ఞానమును కల్గించు దినములలో ఆళ్వార్లు అవతరించిన దినము గొప్పది. భగవానుడు అవతరించిన దినములకంటె ఆళ్వార్లు అవతరించిన దినము గొప్పది. భగవానునకు సాధ్యము కాని లోక సంరక్షణను నమ్మాళ్వార్లు చేసిరి కదా! కావున వారు జన్మించిన దినము శుభ దినములలో, లోకమునకు విజ్ఞానమును కల్గించిన దినములలో గొప్పది.

**లాభే కలే ర్వాసర ఏవ రాధే మాసే విశాఖే మహనీయతారే ।**
**శుక్రస్య వారేఽజని విశ్వతిథ్యాం పరాంకుశో ఽయమ్ భగవాన్ కులీరే ॥**

**ప్ర.అ.** :- కలేః = కలియుగముయొక్క, లాభే వాసరే ఏవ = 'లాభ' అను పదముచే నిర్దేశింపబడిన 43వ దినముననే, రాధే మాసే = వైశాఖమాసమున, మహనీయతారే = గొప్పనక్షత్రమగు, విశాఖే = విశాఖానక్షత్రమున, శుక్రస్య వారే = శుక్రవారమున, విశ్వతిథ్యాం = చతుర్దశితిథియందు (విశ్వశబ్దము లోకమును తెలుపుటచే, లోకములు 14 అగుటచే విశ్వతిథి అనుటకు 14 అని అర్థము), కులీరే = కర్కాటక లగ్నమున, భగవాన్ = భగవానుడగు, అయం = ఈ పరాంకుశః = నమ్మాళ్వార్లు, ఽజని = జన్మించిరి.

**భావము :-** భగవానుడగు పరాంకుశకవి కలియుగమున 43వ దినమున వైశాఖ మాసము విశాఖా నక్షత్రమున శుక్రవారము చతుర్దశీ తిథియందు కర్కాటక లగ్నమున అవతరించెను.

**''లాభ''** అను పదమున మొదటగల లకారము 3వ అంకెను, భకారము 4వ అంకెను నిర్దేశించును. పూర్వమువలెనే అంకెల క్రమమును మార్చి అన్వయించిన ఆ సంఖ్య 43 అగును.

**''భగవాన్''** అను పదము జ్ఞాన బలైశ్వర్యాది గుణషట్కమును సహజముగా కల్గిన సర్వేశ్వరుని మాత్రమే బోధించునది అయినను, ఆ స్వామి అనుగ్రహమును **''తిరుమాలాల్ అరుళప్పట్ట శడగోపన్''** అనునట్లు పూర్ణముగా పొందిన వారును, తత్ఫలితముగా **''మయర్వర మదినల మరుళినన్''** అనునట్లు పరిశుద్ధమైన జ్ఞానము మొదలగు గుణషట్కమును కల్గినవారగుటచే ఆళ్వార్లను **'భగవాన్'** అని నిర్దేశించుటలో దోషము లేదు. అంతియేకాక, ఆళ్వార్లు సాక్షాత్తు **''తిరుక్కురుఙ్గుడినమ్బి''** అంశమున జన్మించిరను ప్రసిద్ధియు కలదు. కావున ఇట్లు నిర్దేశించుట అర్థవంతము. ఈశ్లోకము గురుపరంపరాప్రభావమను సంప్రదాయచరిత్ర గ్రంథములో ఆళ్వార్ల చరిత్ర వర్ణింపబడిన ఘట్టమున కలదు.

**సేనేశకరుణాలబ్ధదివ్యమంత్రద్వయం ముదా ।**
**ద్రావిడామ్నాయవక్తారం శఠకోపగురుం భజే ॥**

**ప్ర.అ. :-** సేనేశ = విష్వక్సేనులయొక్క, కరుణా = దయవలన, లబ్ధ = పొందిన, దివ్య = గొప్పవైన, మంత్రద్వయం = అష్టాక్షరి, ద్వయము అను రెండు మంత్రములను కలవారు, ద్రావిడ + ఆగమ = ద్రావిడ వేదమను పేరుకల నాలాయిర దివ్యప్రబంధములను, వక్తారం = తమ శిష్యులగు నాథమునులకు చెప్పినవారు (ఉపదేశించినవారు) అగు, శఠకోపగురుం= శఠకోపులను ఆచార్యులను, ముదా = సంతోషముతో, భజే= సేవింతును.

**భావము :-** శ్రీవిష్వక్సేనులవలన అష్టాక్షరి, ద్వయ మంత్రముల ఉపదేశమును పొందినవారు, నాలాయిర దివ్యప్రబంధములను నాథమునులకు ఉపదేశించినవారు అగు శఠకోపులను ఆచార్యులను సంతోషముతో సేవింతును.

ఆళ్వార్లు అవతరించిన పిమ్మట విష్వక్సేనులు భగవానుని ఆదేశమును అనుసరించి, వారికి పంచ సంస్కారమొనర్చి, సకల మంత్రార్థములను ఉపదేశించిరి. ఈ అంశమును పూర్వార్ధము తెలుపుచున్నది. కావున ఇచట ఆళ్వార్ల సదాచార్యాశ్రయత్వము తెలుపబడినది. ఉత్తరార్ధము సదాచార్యత్వమును తెలుపుచున్నది. **''కణ్ణినుణ్ శిఱుత్తామ్బు''** అను పేరుతో ఆళ్వార్లను స్తుతించు దివ్యప్రబంధమును వారి సాక్షాత్ శిష్యులగు మధురకవులు రచించిరి. తరువాతి కాలమున ఆళ్వార్ల అనుగ్రహమును కోరిన నాథమునులను ఆచార్యులు ఆ ప్రబంధమును లక్షమార్లు భక్తితో జపింపగా, ఆళ్వార్లు వారికి ప్రత్యక్షమై, నాలాయిర దివ్యప్రబంధమును

అనుగ్రహించిరి. ఈ అంశము ఉత్తరార్ధమున ప్రస్తుతము. ఈ విధముగా ఈ శ్లోకమున నమ్మాళ్వార్ల "ఆచినోతి హి శాస్త్రార్థాన్, ఆచారే స్థాపయత్యపి" అను ఆచార్యత్వపూర్తి సూచింపబడినది. "ముదా భజే" అనుటచే విధి అను నిర్బంధముతో కాక "సుసుఖం కర్తుం" అనునట్లు సంతోషముతో, హృదయపూర్వకముగా సేవింతునని ధ్వనించుచున్నది.

**రాధే కలిదినే లాభే వైశాఖే కావ్యవాసరే ।**
**లగ్నే కర్కాటకేఽసూత తనయం నాథనాయికా ॥**

**ప్ర.అ.** :- *లాభే = **'లాభ'** అను అక్షరములచే సూచింపబడిన, కలిదినే = కలియుగములోని 43వ దినమున, వైశాఖే = వైశాఖ మాసమున, కావ్యవాసరే = శుక్రవారమున, కర్కాటకే లగ్నే = కర్కాటక లగ్నమున, నాథనాయికా = "ఉడైయనఙ్గై" అను పేరును కల నాథనాయిక, తనయం = కుమారుని, అసూత = ప్రసవించెను.*

**భావము** :- *కలియుగమున 43వ దినమున వైశాఖమాసము శుక్రవారమున కర్కాటక లగ్నమున నాథనాయిక (ఉడైయనఙ్గై) శఠకోపసూరిని ప్రసవించెను.*

*ఈ శ్లోకము గరుడవాహనపండితుని దివ్యసూరిచరితములోని శఠకోపసూరి వైభవమున కలదు.*

**తతః కలియుగ స్యాదౌ వైశాఖ్యాం విశ్వభావనః ।**
**విష్ణుభక్తిప్రతిష్ఠార్థం సేనేశోఽవతరిష్యతి ॥**

**ప్ర.అ.** :- *తతః = పిమ్మట, కలియుగస్య + ఆదౌ = కలియుగ ప్రారంభమున, వైశాఖ్యాం = వైశాఖ మాసమున, విశ్వభావనః = లోకములను రక్షించు, సేనేశః = విష్వక్సేనులు, విష్ణుభక్తిప్రతిష్ఠార్థం = విష్ణుభక్తిని సుస్థిరము చేయుటకై, అవతరిష్యతి = అవతరింపగలడు.*

**భావము** :- *లోకసంరక్షణను చేయు విష్వక్సేనులు కలియుగ ప్రారంభమున వైశాఖమాసమున విష్ణుభక్తిని సుస్థిరముచేయుటకై శఠకోపసూరి రూపమున అవతరింతురు.*

*ఈ శ్లోకము గురుపరంపరాప్రభావమున నమ్మాళ్వార్ల వైభవమున ఉట్టంకింపబడిన అచట ఆ కరము తెలుపబడలేదు. ప్రాయశః ఆళ్వార్ల వైభవమును సూచించు పురాణములోనిది కావచ్చును. లోక రక్షణను తమ కర్తవ్యముగా కల్గిన విష్వక్సేనులు, భగవద్భక్తిని లోకమున ప్రచారము చేసి, తద్ద్వారా చేతన సంరక్షణ చేయుటకై నమ్మాళ్వార్ల రూపమున అవతరింతురని తాత్పర్యము.*

**ఆదౌ కల్వేర్థి కురుకాపురి పాండ్యదేశే**
**వైశాఖమాసి మఘువానలభేఽంశజాతమ్ ।**

సేనాపతేః పదజకారికులావతీర్ణం
శ్రీశాస్పదం శఠరిపుం శరణం ప్రపద్యే ॥

ప్ర.అ. :- కలేః ఆదౌ = కలియుగ ప్రారంభమున, పాండ్యదేశే = పాండ్యదేశమున, కురుకాపురి = ఆళ్వార్ తిరునగరిలో, వైశాఖమాసి = వైశాఖమాసమున, మఘవా + అనలభే = ఇంద్రుని, అగ్నిని అధిదేవతలుగా గల్గిన విశాఖా నక్షత్రమున, సేనాపతేః = విష్వక్సేనులయొక్క, అంశజాతమ్ః అంశమున జన్మించినవారు, పదజ = విష్ణుపాదములనుండి పుట్టిన, కారి = కారిమార్ల యొక్క, కుల = కులమున, అవతీర్ణం = అవతరించినవారు, శ్రీశ + ఆస్పదం = భగవానుని ఆశ్రయముగా కలవారు, (భగవానునకు నివాసమైనవారు) అగు, శఠరిపుం = శఠకోపులను, శరణం = ఉపాయముగా, ప్రపద్యే = పొందుచున్నాను.

**భావము** :- కలియుగప్రారంభమున పాండ్యదేశములోని కురుకాపురిలో వైశాఖమాసమున, ఇంద్రుడు, అగ్ని అధిదేవతలుగా కల విశాఖా నక్షత్రమున విష్వక్సేనాంశమున, చతుర్థ వర్ణమునకు చెందిన కారిమార్ల కులమున అవతరించినవారు, భగవానుని శరణముగాకల శఠకోపులను ఉపాయముగా పొందుచున్నాను.

విశాఖానక్షత్రము వేదమున **''తదింద్రాగ్నీ కృణుతాం తద్విశాఖే''** అని, **''ఇంద్రాగ్నిభ్యాగ్ం స్వాహా విశాఖాభ్యాగ్ం స్వాహా''** అని స్తుతింపబడుట వలన, ఆ నక్షత్రమునకు అధిదేవతలు ఇంద్రుడు, అగ్నియు అని తెలియుచున్నది. కావున **''మఘవానలభే''** అని తెలుపబడినది. **''పద్భ్యాగ్ం శూద్రో అజాయత''** అని పురుషసూక్తమున చతుర్థవర్ణము భగవానుని పాదములనుండి పుట్టినట్లు తెలుపబడుటచే, కారిమార్లు చతుర్థవర్గమున జన్మించిన వారగుటచే **'పదజకారి'** అని ప్రయోగింపబడినది. **''శ్రీశాస్పదం శఠరిపుం శరణం ప్రపద్యే''** అనుట వలన శఠకోపులు భగవానుని శరణముగా భావించినను, మేము ఆ శఠకోపులనే శరణముగా భావింతుము అని ధ్వనించుచున్నది. భాగవతశరణత్వమే కదా చరమపర్వనిష్ఠ. **''శ్రీశాస్పదం''** అనుటకు భగవానుని ఆస్పదముగా కలవారని, భగవానునకు ఆస్పదులని **(శ్రీశస్య ఆస్పదం, శ్రీశః ఏవ ఆస్పదం యస్యసః)** ఆ రెండు విధములుగా వివరింపనగును. ఈ రెండు వివరణములు నమ్మాళ్వార్ల సూక్తికి అనుగుణములే. **''పుకలొన్రిల్లా వడియేన్ ఉన్నడిక్కీళ్ అమర్న్దు పుకున్దేనే''** అని భగవానుడే తమకు ఆశ్రయముగా తలచిన వారు కదా ఆళ్వార్లు. అట్లే, **''తిరుమాలిరుఞ్జోలై మలైయే . . . ఎనదుడలే''** అని ఆళ్వార్లు స్వయముగా తనదేహమును భగవానుడు అత్యంతాదరముతో ఆశ్రయముగా స్వీకరించెననిరి. ఇందుల కనుగుణముగా శ్రీరంగరాజస్తవ పూర్వశతకములోని **'వటదళదేవకీ జఠర. . . శఠకోపవాగ్వపుషి''** అను సూక్తిని, (**''సంధాయాగ్ం సందధే బ్రహ్మణైషః నైనం జహాత్యహస్సు పూర్వేషు తస్మిన్ . . . . ఉత జీర్ణే శయానే''** అను శ్రుతిని స్మరింపనగును.

నమ్మాళ్వార్ల చరమ ప్రబంధమగు తిరువాయ్మొళి విషయమున ఆచార్యులలో మొదటివారగు శ్రీమన్నాథమునులు అనుగ్రహించిన ముక్తకరత్నము

భక్తామృతం విశ్వజనానుమోదనమ్
సర్వార్థదం శ్రీశఠకోపవాఙ్మయమ్ ।
సహస్రశాఖోపనిషత్సమాగమమ్
నమామ్యహం ద్రావిడవేదసాగరమ్ ॥

ప్ర. అ. : భక్త + అమృతం = భగవద్భక్తులకు అమృతమువంటిది, విశ్వజన + అనుమోదనమ్ = అందఱి జనులను ఆనందింపచేయునది, సర్వ + అర్థదం = సమస్త పురుషార్థములను ఇచ్చునది, సహస్రశాఖ + ఉపనిషత్ సమాగమం = వేలాది శాఖలను కల్గిన ఉపనిషత్తుల సమూహమును, శ్రీశఠకోపవాఙ్మయం = నమ్మాళ్వార్ల శ్రీసూక్తిమయమైన, ద్రావిడ వేదసాగరం = తమిళవేదమను సముద్రమును, అహం = నేను, నమామి = నమస్కరించుచున్నాను.

వ్యాఖ్య :- తిరువాయ్ మొళి దివ్యప్రబంధవైభవమును సముద్రరూపణము ద్వారా నిరూపించుట ఇందలి విశేషము. ''భక్తిప్రభావ'' అను పరాంకుశాష్టకములోని శ్లోకమున ఆళ్వార్లను సముద్రముగా నిరూపించుట ఇచట స్మరింపనగును.

భక్తులకు అమృతమువలె భోగ్యమైనది, జనుల కందఱకు సంతోషమును కల్గించునది, సమస్త పురుషార్థములనిచ్చునది, వేలాది ఉపనిషత్తుల (నుదుల) కూడలియు, నమ్మాళ్వార్ల దివ్యప్రబంధమగు ద్రావిడవేదమను సముద్రమును నేను నమస్కరించుచున్నాను. ''అశ్వత్థంసింధురాజం చ నిత్యం సేవేత'' అని కదా సూక్తి.

ఇందు తిరువాయ్మొళికి, సాగరమునకు కల సామ్యములను అయిదు విశేషణముల ద్వారా కవి నిరూపించు చున్నారు. సముద్రము కంటె తిరువాయ్మొళికి కల ఆధిక్యము కూడ ఇచట ధ్వనించుచున్నది.

(భక్తామృతమ్) - లోకమున కన్పట్టు సముద్రము ఒకానొక సమయమున ''వఙ్గక్కడల్ కడైన్ద మాదవనై'' అనునట్లు భగవానునిచే మథింపబడగా, ఆ భగవానుని శరణు కోరిన భక్తులగు దేవతలకు అమృతమును ''విణ్ణవర్ అముతుణ'' అనునట్లు ఇచ్చినది. కావున సముద్రము భక్తులగు దేవతలకు అమృతముగా నయ్యెను. తిరువాయ్మొళి అను ప్రబంధము ''తొణ్డర్క్కముదున్న చ్చొల్మాలైకళ్ శొన్నేన్'' (భక్తులకు అమృతమనదగిన సూక్తిమాలలను పల్కితిని) అని, ''పాలేయ్ తమిళ్ ఇశైకారర్ పత్తర్ పరవు మాయిరమ్'', ''పాలోడముదన్న వాయిరమ్'' అని ఆళ్వార్లే

స్వయముగా పల్కినట్లు భక్తులకు పాలవలె పరమ భోగ్యమైనది. అమృతమును కోరిన దేవతలు భగవానుని వందని అమృతమును మాత్రము ప్రాప్యముగా అపేక్షించిన వారగుటచే అన్యప్రయోజనపరులు. కాని, తిరువాయ్ మొళ్ళిని అపేక్షించు భక్తులు భగవానుని మాత్రమే ప్రాప్యముగా తలచువారగుటచే వారి యందు అట్టి దోషము లేదు. అనగా వారు అనన్యప్రయోజన పరులు. అమృతమును సేవించువారు దేవతలు. తిరువాయ్ మొళ్ళిని సేవించువారు భూదేవతలనదగిన భక్తులు.

**(విశ్వజనానుమోదనమ్)** సముద్రమును చూచి సంతోషింపని వాడెవ్వడు ఉండడు. ఎన్నిసార్లు చూచినను సముద్రము ఎప్పటికప్పుడు అపూర్వముగనే తోచును. ఎప్పటికప్పుడు క్రొత్తగా కన్పించి, అందఱిని రంజింపచేయుస్వభావము దానికి కలదు. "**అధృష్యశ్చాభిగమ్యశ్చ యాదోరత్నై రివార్ణవః**" అన కాళిదాసును వచించెను. ఇట్టి స్వభావముతిరువాయ్ మొళ్ళికిని కలదు. "**ఎన్నావిలిన్ కవి**" *(3-9-1)* *(నా నాలుక నుండి పుట్టిన తీయని కవిత్వమును)* అని, "**పాలేయ్ తమిళ్ళర్ ఇశైకారర్ పత్తర్ పరవు మాయిరమ్**" *(1-5-11)* *(పాలవలె భోగ్యమైన, తమిళమును అభ్యసించువారు, గానము చేయువారు, భక్తులు కొనియాడునట్టి వేయి పాశురములు)* అని, "**తూముదల్ పత్తర్క్కు**" *(7-9-3)* *(సంసారములోని దోషరహితులైన గొప్ప ముముక్షువులకు)* అని, "**కేట్టారార్ వానవర్కళ్ శెవిక్కినియ శెఞ్జొల్లే**" *(10-7)* *(చెవుల కింపగు, ఆర్జవగుణమును కల్గిన నా వాక్కును విని నిత్యసూరులు తృప్తి చెందనివారై, ఇంకను వినవలెనని ఆశపడుదురు)* అని, "**తెన్నావెన్ను మెన్నమ్మాన్ తిరుమాలిరుఞ్జోలైయానే**" *(తీయని నా కవిత్వమును విని తిరుమాలిరుఞ్జోలై ప్రభువు, నా స్వామి ఆనందముతో "తెన్నా" అనును)* *(10-7)*, "**పార్పర విన్ కవి**" *(7-9-5)* *(భూలోకవాసులందఱు నా తీయని కవిత్వమును మెత్తురు)* అని ఆళ్వార్లు పల్కినట్లు వారేకాక, మిగిలిన ఆళ్వార్లు, నిత్యసూరులు, సంసారులు, సర్వేశ్వరుడు, తచ్ఛేషభూతులైన వారు అందఱు ఎట్టి భేదములేక అనుభవింపతగినది తిరువాయ్మొళ్ళి ప్రబంధము. కావున "**విశ్వజనానుమోదనమ్**" అను ప్రయోగము ఆప్రబంధము విషయమున మిక్కిలి సార్థకము. విశ్వశబ్దము లోకములనే కాక, "**విశ్వం విష్ణుః**" అనునట్లు భగవానుని కూడ నిర్దేశించును. సముద్రము భగవానునకు శయనస్థానమై, ఆనందింపచేయునదియై యుండుట ఇచట స్మరణీయము.

**(సర్వార్థదమ్)** - సముద్రమునకు రత్నాకరమని పేరు. రత్నమనుటకు మణి అనియే కాకగొప్పవస్తువు అని కూడ అర్థము. అనగా సముద్రము శ్రేష్ఠమైన వస్తువులకు ఆకరము. సముద్రము తనలోనికి ప్రవేశించిన వారికి తన వద్దగల అమూల్యములైన వస్తువులను అన్నిటిని అనుగ్రహించును. అట్లే తిరువాయ్ మొళ్ళి కూడ సకలపురుషార్థములను ఇచ్చును. "**కురుకూర్చ్చడగోపన్ శొన్న పాడలో రాయిరత్తుళ్ ఇవైయుమొరుపత్తుమ్ పయిర్ఱ్రావ ల్లార్ కట్కు, అవన్ నాడునకరముమ్**

**నణ్ణుడన్ కాణ నలనిడై యూర్ తిపణ్ణి వీడుమ్ పెరుత్తి, త్తణ్ మూవులక్కుమ్ తరుమ్ ఒరునాయకమే''** అను విధముగా తిరువాయ్‌మొழி అనుగ్రహింపని పురుషార్థమేదియును లేదు. లేక, జ్ఞాతవ్యార్థములగు అర్థపంచకమును ఈ ప్రబంధము విస్తరముగా నిరూపించుచున్నదనియు భావము. **''మిక్కవిఱైనిలైయుమ్, మెయ్యా ముయిర్‌నిలైయుమ్, తక్క నెఱియుమ్, తడైయాకిత్తొక్కియలుమ్, ఊழ్వినైయుమ్ వాழ்వినైయుమ్ ఓదుమ్ కురుకైయర్‌కోన్''** అని భట్టరు తనియన్ పాశురమున ఈ అంశమును తెలిపిరి. వేదము తెలియదగిన విషయములు నన్నిటిని లోకమునకు అందించినది. అట్లే **''వేదత్తినుళ్ పొరుళ్ నిఱ్కప్పాడి''** (వేదములోని సారమగు అర్థమును నామనస్సులో స్థిరముగా నిల్చునట్లు పాడి) అని మధురకవులు పల్కిన విధముగా సమస్త వేదార్థముల సారమును తిరువాయ్‌మొழி తెలుపుచుండుటచే శఠకోపవాఙ్మయము సర్వార్థద మనియు చెప్పవచ్చును.

**(శ్రీశఠకోపవాఙ్మయమ్)** - సముద్రమును కుంభసంభవుడగు అగస్త్యముని ఆచమించి, పిమ్మట వదలిపెట్టుటచే అది అగస్త్యవాఙ్మయము అయ్యెను. తిరువాయ్ మొழி శఠకోపముని వాఙ్మయము. **''తిరువాయ్ మొழி''** అనుటకు వాగుక్తి అని అర్థము కదా! సముద్ర జలములు అగస్త్యముని ముఖస్పర్శను కల్గియుండుట, వాక్కును ముఖమునుండి ఉద్భవించుట ప్రస్తుత వివరణమునకు మూలము. కాని, అగస్త్య ముఖస్పర్శకల సముద్రము కన్న ఆழ்వార్ తిరువాయ్ మొழிకి ఆధిక్యము స్ఫుటము. మునుల కంటె ఆழ்వార్లు గొప్పవారు. వారు భగవానుని నిర్వ్యాజమైన అనుగ్రహమునకు పాత్రులగుటచే అధికులు. ఋషుల జ్ఞానము స్వప్రయత్నము వలన కల్గినది కావున పరిమితము. ఆழ்వార్ల జ్ఞానము భగవానుని నిర్హేతుక కృపామూలము. కావున నిరవధికము. **''కాయోడు నీడు కనియుణ్ణువీశు కడుఙ్కాల్ నుకర్న్దు నెడు ఙ్కాలమ్ నొన్దు తీయోడు నిన్రు తవమ్''** అనునట్లు చిఱకాలము శరీరమును కృశింపచేసి, వనవాసము చేసి, పలు నియమములనాచరించి, తపమును చేసినవారు కదా ఋషులు. ఆழ்వార్లు అట్లు కాక **''ఉణ్ణుమ్ శోఱు పరుకుమ్ నీర్ తిణ్ణుమ్ వెర్ఱిలైయుమ్ ఎల్లామ్ కణ్ణన్''** అనునట్లు భగవానుని ధారక, పోషక, భోగ్యములుగా తలచి, ఆస్వామి అనుగ్రహమును పొందినవారు. కావున ఋషులకు, ఆழ்వార్లకు మిక్కిలి వ్యత్యాసము కలదు. అట్లే వారి ముఖస్పర్శను కల్గిన సముద్రమునకు, (వేదమునకు కూడ) ద్రవిడ వేదమునకు, (అరుళిచ్చెయల్) మధ్య వ్యత్యాసము మిక్కిలి కలదు. ఈ అంశము ఆచార్య హృదయమున మొదటి ప్రకరణములో విస్తరముగా నిరూపింపబడినది.

**(సహస్ర శాఖోపనిషత్ సమాగమమ్)** - **''నదీనాం సాగరో గతిః''** అని, **''యథా నద్యః స్యందమానాః సముద్రే''** అనియు, **''తొక్కిలఙ్గి యారెల్లామ్ పరన్దోడి త్తొడుకడలే పుక్కన్ఱ పుఱమ్ నిఱ్కమాట్టాదు''** (నదులన్నియు ప్రవహించి క్రమముగా సముద్రమున చేరినగాని నిలువవు) అను విధమున నదులన్నియు సముద్రమున చేరును. అట్లు అవి సముద్రమున చేరునపుడు పలువృక్షముల శాఖలను కొని వచ్చును. కావున సముద్రము సహస్రశాఖల సమాగమమును

కల్గియుండును. లేక, వృక్షములన్నిటిలో గొప్పదైన చందనవృక్షముల యొక్క శాఖలను (అనేకములను) వేలాదిగా కల్గియుండును అనియు భావము. తిరువాయ్‌మొழி యు అట్టిదే. ఉపనిషత్తులు అనేకములు. వానిలో ఛాందోగ్యోపనిషత్తు వేయి శాఖలను కల్గినది. సామవేద సారముగా చెప్పబడుచున్నది. కావున సహస్ర శాఖోపనిషత్ అనగా ఛాందోగ్యోపనిషత్తు. దానితో సమమైన సమానమైన ఆగమము- వేదము తిరువాయ్‌మొழி. అనగా ఛాందోగ్యోపనిషత్తుతో సమానమని తాత్పర్యము. తిరువాయ్‌మొழிలో కూడ వేయి పాశురములు (ఫలశ్రుతి పాశురములు కాక) కలవు. అట్లే, ఆ ప్రబంధము సామవేదసారముగా ప్రసిద్ధిచెందినది.

ఛాందోగ్యోపనిషత్తు సారము ఉద్గీథము. అందలి ''**ఉత్**'' అను పేరులోని అక్షరములు తిరువాయ్ మొழி ప్రబంధమున ఆద్యంతమున నిబంధింపబడినవి. మొదటి పాశురమున ''**ఉయర్వఱ**'' అని ఉకారము, చిట్టచివరి పాశురము చివర ''**పిఱన్దారుయర్న్దే**'' అని ''**త**'' కారమును అనుసంధింపబడుటచే ప్రత్యాహారన్యాయము వలన తిరువాయ్‌మొழி అంతయు ఉద్గీథము, కావున అది సామవేద సారమగు ఛాందోగ్యోపనిషత్‌తో సమమని ఆచార్యుల అభిప్రాయము. ఈ అంశము ''**శన్దోగనెన్ఱు సామాన్యమాగామల్.... ఇత్తై ఛాన్దోగ్యసమమెన్బర్‌కళ్**'' (52) అను ఆచార్యహృదయమను రహస్యగ్రంథములోని సూత్రమును, అచట వ్యాఖ్యానించుచు శ్రీమణవాళ మహామునులు ''**సామ్న ఉద్గీథో రసః'' ఎన్ఱు సామత్తుక్కు రసమాక చ్చొల్లప్పడుమతాయ్, ప్రణవపూర్వకమాన గానమ్‌పణ్ణప్పడుమతా యిరుప్పదొన్ఱిఱే ఉద్గీథమ్. ఆకైయాల్, అన్ద ఉద్గీథావయవమాన ప్రణవత్తై ''ఓమిత్యేతదక్షర ముద్గీథ ముపాసీత'' ఎన్ఱు ఛాందోగ్యత్తిన్నిల్ ప్రథమత్తిలే ఎడుత్తాప్పోలే...**'' అని, ''**ఇప్పడి ఉకారమ్ ముతలాకవెడుత్తతుక్కు ప్రయోజనమ్ అన్దఛాందోగ్యరసమాన ఉద్గీథత్తుక్కు నోక్కాక ''ఉత్'' ఎన్గిఱ తిరునామమ్ ఇతుక్కు ఉళ్ళతాయైయానవై తోన్ఱ ఉకారాది యాక వెడుత్తు, ''ఉయర్న్దే'' ఎన్ఱు తకారాంతమాకముడిక్కై**''. అని వివరించుట వలన స్పష్టపడుచున్నది. ఇట్టి వివరణమే ప్రస్తుతశ్లోకమును వ్యాఖ్యానించు శ్రీపిళ్లైలోకమ్ జీయర్ కూడ ఇచ్చుట గమనింపతగినది.

అట్లే, అనేక శాఖలను కల్గిన ఉపనిషత్తులు అన్నియు కలసిన రూపమే తిరువాయ్‌మొழி అనియు చెప్పవచ్చును.

ఇంతియే కాక, గాంభీర్యము, భగవానునకు ఆశ్రయమగుట మొదలగు సామ్యములు సముద్రమునకు, తిరువాయ్‌మొழிకి మధ్య ఇచట ఊహింపతగినవి. ''**సముద్ర ఇవ గాంభీర్యే**'' అని సముద్రము లోతు తెలియరానిది. అట్లే తిరువాయ్‌మొழிయొక్క అర్థవైభవము పూర్తిగా తెలిసికొనుటకు ఎవరికిని సాధ్యము కాదు. ఎన్ని వ్యాఖ్యానములున్నను, వానికి ఎన్ని అరుమ్బదములున్నను ''**పరిచిత మివాథాపి గహానం**'' అనునట్లు, ''**తథైవ దుర్గమః**'' అనునట్లును పూర్తిగా ఆ ప్రబంధవైభవమును గ్రహించుట ఎవరితరమును కాదు. సముద్రము భగవానునుడు

పరుండుచోటు. ''తిరుమాలిరుఞ్జోలైమలైయే తిరుప్పాల్కడలే'' అని ఆళ్వార్లు పల్కిరి కదా! అట్లే తిరువాయ్మొళి కూడ భగవానునకు ఆశ్రయమే. పూర్వముదహరింపబడిన పాశురములోనే ఆళ్వార్లు ''ఎనదుడలే మనమే వాక్కే కరుమమే'' అని వచించిరి. దీనిననుసరించుచు భట్టరు శ్రీరంగరాజస్తవమున ''శఠకోపవాగ్వపుషి'' అని పల్కిరి. ఇట్లు ఇంకను అనేక విధముల తిరువాయ్ మొళికి, సముద్రమునకు గల సామ్యములను రసజ్ఞు లూహింపనగును.

(నమామ్యహం ద్రావిడవేదసాగరమ్) - ద్రావిడవేదసాగరమున అవగాహింతును అని పలుకక, నమస్కరింతును అనుట ''వందే రామాయణార్ణవమ్'' అను ప్రయోగమును బట్టి ని చెప్పనగును. తిరువాయ్మొళికిని, శ్రీరామాయణమునకును గల అర్థములలోని పలు విధములైన సంవాదములను నమ్పిళ్ళైమొదలగు ఆచార్యులు తమ వ్యాఖ్యలలో తెలియజేసిరి. ''శ్లోక జాలజలాకీర్ణం సర్గకల్లోలసంకులమ్, కాండ గ్రాహ మహామీనం వందే రామాయణార్ణవమ్'' (శ్లోక సమూహమను జలములచే నిండినది, సర్గలను కెరటములచే సంకులమైనది, కాండములను జలగ్రాహములను (మొసళ్లు), గొప్ప మత్స్యములను కల్గిన శ్రీరామాయణమను సముద్రమునకు నమస్కరింతును) అను శ్లోక మిచట స్మరింపనగును. శ్రీరామాయణమున 24 వేల శ్లోకములు కలవు. తిరువాయ్మొళిలో ''తీర్థఙ్గళాయిరమ్'' అనునట్లు ''శీర్త్తొడైయాయిరమ్'' అని వేయి పాశురములు కలవు. రామాయణమున 500 సర్గలు కలవు. తిరువాయ్మొళిలో పది శతకములు కలవు. రామాయణమున ఆరుకాండలు కలవు. తిరువాయ్మొళి ''షట్పదోఽయం'' అనబడు ద్వయమంత్రముయొక్క వివరణము. శ్రీరామాయణము, తిరువాయ్మొళి రెండును సముద్రముతో పోలినవే. రామాయణము రఘువంశచరితము, తిరువాయ్ మొళి ''ముకిల్ వణ్ణనడిమేల్ శొన్న శొల్మాలై'' అనునట్లు భగవానుని వైభవ ప్రతిపాదకము. అది శ్రీవాల్మీకి మహర్షిప్రోక్తము. తిరువాయ్మొళి ''ఋషిం జుషామహే'' అనబడు శఠకోపముని ప్రోక్తము. శ్రీరామాయణము ''మహాపాతకనాశనమ్'' అనునట్లు పాతకములను పోగొట్టును. తిరువాయ్మొళియు ''అరువినై నీఱుశెయ్యుమ్'' అను విధముగా ప్రబలపాపములను నశింపచేయును. శ్రీరామాయణము ''సంసారం స విహాయ గచ్ఛతి పుమాన్ విష్ణోః పదం శాశ్వతమ్'' (శ్రీరామాయణమును భక్తితో పఠించువాడు ఐహిక భోగములనే కాక - శాశ్వతమగు పరమపదమును పొందును) అనునట్లు మోక్షమును సిద్ధింపచేయును. అట్లే తిరువాయ్మొళియు ''వానిన్ మీదేఱ్ఱి యరుళ్శెయ్దు ముడిక్కుమ్ పిఱవి మామాయక్కూత్తినైయే'' (8-4-11) అనునట్లు జన్మను పోగొట్టి, వైకుంఠ ప్రాప్తిని కల్గించును. ఇట్లు అనేక విధముల శ్రీరామాయణముతో సామ్యమును కల్గియుండుటచే తిరువాయ్ మొళి ప్రబంధమును గూర్చి ''నమామి'' అని కవి పల్కిరి.

సముద్రమువంటి భగవానుని గుణములను, స్వరూప, రూప విభూతులను ఆళ్వార్లు అవగాహించి, తదను భవపరీవాహరూపముగా తిరువాయ్మొళ్ళి దివ్యప్రబంధమును అనుగ్రహించినను, ఆ సూక్తి సముద్రమును అవగాహింప ఎవరికిని సాధ్యముకాదను ధ్వని ఈ శ్లోకమున అర్థబలముచే ఏర్పడుచున్నది. కావుననే కవి ''అవగాహే'' అని పలుకక, ''నమామి'' అని మాత్రము పల్కిరి. ''ణమ – ప్రహ్వత్వే శబ్దే చ'' అను ధాతువునుండి పుట్టిన 'నమామి' అను క్రియాపదము త్రివిధమైన మానసికమైన, కాయికమైన, వాచికమైన ఆశ్రయణమును తెలుపుచున్నది.

సముద్రము అశరణ్యుడైన వానికి శరణము అనగా ఉపాయము. శ్రీరామచంద్రునిగా అవతరించిన భగవానుడు సైతము ''అంజలిం ప్రాఙ్ముఖః కృత్వా'' అనునట్లు సముద్రమును శరణాగతి చేసెను. ఈ విధముగానే తిరువాయ్మొళ్ళియు భగవానునకు గొప్ప ఉపాయమే. తనకు సాధ్యముకాని లోకరక్షణకై భగవానుడు ఆళ్వార్లను అవతరింపచేసి, వారిద్వారా లోకోజ్జీవన కరములగు దివ్యప్రబంధములను ప్రత్యేకించి, తిరువాయ్మొళ్ళిని ప్రవర్తింపచేసెను. భగవానునిపట్ల అలవి కాని అభినివేశమును కల్గిన ఆళ్వార్లను భగవానుడు అంతకాలము సంసారమున ఉంచుట లోకమును వారిద్వారా ఉద్ధరించుట కొఱకేనని నమ్పిళ్ళై ఈడులో పల్కిరి. కావున శరణ్యుడగు భగవానునకును తిరువాయ్మొళ్ళి శరణమయ్యెను. సముద్రమును చూచిన వారందఱు భక్తితో నమస్కరింతురు. ''యన్మండలం శ్రుతిగతం ప్రణమంతి విప్రాః'' అనునట్లు తిరువాయ్మొళ్ళి పేరు వినపడినంతనే విజ్ఞులందఱు చేతులెత్తి భక్తితో నమస్కరింతురు.

ఈ శ్లోకములోని పదములన్నియు తిరువాయ్మొళ్ళిలోని సూక్తులను బట్టి ప్రయోగింపబడినవని చెప్పనగును. ''భక్తామృతమ్'' అనుటకు ''తొణ్డర్క్కముదన్న'' అని, ''అడియార్కిన్బమారి'' అని, ''సర్వార్థదమ్'' అనునపుడు ''ఎల్లాప్పొరుళుమ్ విరిత్తానై'' అని, ''శ్రీశఠకోపవాఙ్మయమ్'' అనునపుడు ''కురుకూర్ శడగోపన్ శొల్'' అని, ''సహస్ర శాఖోపనిషత్సమాగమం'' అనుటకు ''వేదవరుమ్ పొరుళ్ నూల్కళై'', ''వణ్ తమిళ్ నూల్కనోఱ్ఱేన్'' అని, ''నమామ్యహం ద్రావిడవేదసాగరమ్'' అనుటకు ''అళవియన్దవన్దాది యాయిరత్తై'', ''పత్తర్ పరవు మాయిరమ్'' అని ఆళ్వార్లు పాయించుటను స్మరింపనగును.

# మధురకవులు అనుగ్రహించిన నమ్మాళ్వార్ల స్తుతిరూపమైన కణ్ణినుణ్‌శిఱుత్తాంబు

శ్రీశఠకోపులకు సమకాలీనులు, వారిశిష్యులును అగు శ్రీమధురకవులు అనుగ్రహించిన ఈలఘుప్రబంధము ఆచార్యవైభవ ప్రతిపాదకమై, ప్రపన్నజనులకు నిత్యము అనుసంధేయమై యున్నది. ఆళ్వార్ల స్తుతులలో ఇదియే మొదటిది. ఈప్రబంధములోని పాశురములు, వాని అర్థతాత్పర్యములు, వానితో పాటు కాంచీమహావిద్వాన్, ప్ర. భ. అణ్ణాస్వామివారి సంస్కృత శ్లోకములును ఇచట ఇవ్వబడుచున్నవి.

## తనియన్

1) అవిదితవిషయాంతర శ్శఠారే
రుపనిషదా ముపగానమాత్రభోగః ।
అపి చ గుణవశాత్తదేక శేషీ
మధురకవి ర్హృదయే మమావిరస్తు ॥

నమ్మాళ్వార్లను తప్ప వేరొకవిషయమును ఎఱుగనివారు, ఆ ఆళ్వార్లచే అనుగ్రహింప బడిన ద్రవిడోపనిషత్తుల అనుసంధానమును మాత్రమేభోగ్యముగా తలచువారు, ఆళ్వార్ల విషయమున స్వరూపకృతమైన దాస్యముతో పాటు, గుణకృతమగు దాస్యమును కూడ కలిగియున్నవారు, శఠకోపులను ఒక్కరినే తనకు శేషిగా తలచువారగు మధురకవి ఆళ్వార్లు నా హృదయమున ఆవిర్భవింతు గాక!

2) వేఱొన్ఱుం నా నఱియేన్ వేదమ్ తమిழ్ శెయ్ద
మాఱన్ శడకోపన్ వణ్‌కురుకూర్, ఏఱెజ్గళ్
వాழ్‌హ మెన్ఱే త్తుం మదురకవియార్, ఎమ్మై
ఆళ్వా రవరే యరణ్.

ఉదారులు నివసించు ఆళ్వార్ తిరునగరికి నిర్వాహకులు, సంస్కృత వేదమును ద్రవిడవేదముగ చేసిన శఠకోపులు, మాఱన్ అను పేరును కలవారు, సుందరులగు నమ్మాళ్వార్లను తప్ప వేరొక విషయమును నేను తెలియను. ఆ ఆళ్వార్లే సంసార సముద్రమునుండి మనలను రక్షించు వారు అని కొనియాడు మధురకవి యాళ్వార్లు మనలను పాలించువారు. వారే మాకు రక్షకము.

అన్యత్ కించన నైవ వేద్మ్యహ మహో సద్వావిడ్రోక్త్యా త్రయీ -
సారార్థా నుపగీతవాన్ స కురుకాధీశః శఠారి ర్మునిః ।
అస్మాకం భవినాం భవాబ్ధితరణోపాయోఽస్త్వితి స్తోత్రయన్
సూరీంద్రో మధురః కవి ర్భవతి వ స్సంరక్షక స్తం స్తుమః ॥

❁ ❁ ❁

1) కణ్ణినుణ్ శిఱుత్తామ్బినాల్
కట్టుణ్ణ పణ్ణియ పెరుమాయ -న్నెప్పనిల్,
నణ్ణిత్తెన్ కురుమూర్ నమ్బియెన్ఱక్కాల్
అణ్ణిక్కుమముదూఱుమ్ ఎన్నావుక్కే.

*ముడులను కల్గిన, సన్ననని చిన్న త్రాటితో తానుకట్టుబడునట్లు చేసికొనిన అద్భుత చేష్టితుడు, నా స్వామియు అగు సర్వేశ్వరునికంటె, ప్రీతిపూర్వకముగా ఆశ్రయించి, దక్షిణదిక్కున నుండు కురుకాపురికి (ఆళ్వార్ తిరునగరికి) నిర్వాహకులగు ఆళ్వార్ల నామమును అనుసంధించిన నా నాలుకకు రుచించును. అమృతము ఊఱును.*

సూక్ష్మగ్రంథిలదామబంధవివశం స్వాత్మాన మాధత్త యః
తం కృష్ణం చ విహాయ మాయిన మహో నారాయణం నాయకమ్ ।
స్వామిన్ శ్రీకురుకాపురాధిప మునిశ్రేష్ఠేతి సంకీర్తితే
జిహ్వాయాం మమ వర్ధతే నిరుపమం సౌవాదవం నిత్యశః ॥

2) నావినాల్ నవి ఱ్ఱిన్బమెయ్‌దినేన్
మేవినేనవన్ పొన్నడి మెయ్ మ్మైయే,
తేవు మ ఱ్ఱఱియేన్ కురుకూర్ నమ్బి
పావినిన్ని శై పాడిత్తిరివనే.

*కురుకాపురికి ప్రభువులగు శఠకోపసూరిని నా జిహ్వతో కీర్తించి, హర్షప్రకర్షమును పొందితిని. ఆ ఆళ్వార్ల దివ్యపాదారవిందములను నిజముగా ఆశ్రయించితిని. వారు తప్పవేరొక దైవమును నేనెఱుగను. ఆ మునిసార్వభౌముని దివ్యసూక్తులను పాడుచు, తిరిగెదను.*

స్తుత్వా జిహ్వకయా శఠారి మనఘం సంతుష్టచిత్తోఽభవం
తస్యైవ స్పృహణీయపాదయుగళే భక్తోఽభవం తత్త్వతః ।
తస్మాత్ శ్రీకురుకాపురీశ్వరమునేః జానే న దైవం పరం
తత్సూక్తి స్వరగానలోలుపమనా స్సన్ పర్యటేయం క్షితౌ ॥

3) తిరితన్దాకిలుమ్ తేవ పిరానుడై,
క్క_రియకోలత్తిరువురు క్కా_ణ్బన్ నాన్ ।
పెరియవణ్కురుకూర్ నగర్ నమ్బిక్కా -
ళురియ నాయడియే న్నెఱ్ఱ న్నైమయే

ఆళ్వార్ల సన్నిధినుండి ప్రథమ పర్వమువైపు మరలుకొని అయినను నిత్యసూరి నిర్వాహకుడగు భగవానుని యొక్క, నీలమేఘసుందర లక్ష్మీసహిత రూపమునసేవింతును. గొప్ప ఉదారులును, ఆళ్వార్ తిరునగరియందు అవతరించినవారగు, నమ్మాళ్వార్లకు శేషభూతుడనగు దాసుడు పొందిన భగవల్లాభము ఎంతగొప్పది ? ఆశ్చర్యము !

ఏవం సన్నపి జాతుచిత్ భగవతో దేవాధినాథస్య చ
శ్యామం కోమల విగ్రహం త మపి చ ప్రేక్షేయసోఽహం బత ।
ఔదార్యాధికకారిసూనుశఠజిత్‌దాసత్వపూర్తేః ఫలం
మంతవ్యంతదిదం ముకుందభజనం, తస్మాదవద్యం న మే ॥

4) న్నైమయాల్ మిక్క_నాన్మఱైయాళర్‌కళ్,
పున్మైయాక క్క_రుదువరాదలిల్,
అన్నైయా యత్తనాయెన్నైయాణ్డిడుమ్
తన్మైయాన్‌శడగోప నెన్నమ్బియే.

పరమధార్మికులు, చతుర్వేదములయందు వ్యాసులవలె సమర్థులు, ఆనృశంస్య ప్రధానులు అగు బ్రహ్మణోత్తములును దోషగుణ భూయిష్ఠుడనగు నన్ను తిరస్కరింతురు. కావున, శ్రీ శఠకోపసూరి తల్లియై, తండ్రియై, నన్ను పాలించు స్వభావమును కలవారై విరాజిల్లు చున్నారు.

నానాసద్గుణసంపదా సుమహితా వేదాబ్ధిపారంగతాః
దాసం దోషమయం నిరీక్ష్య కరుణాం నైవాదధీరన్నితి ।
మాతేవాథ పితేవ చ ప్రియహితం సంపాదయన్ సర్వదా
శ్రీమా నేష పరాంకుశో మునివరో జాతో మయి ప్రేమభాక్ ॥

5) నమ్బినేన్ పిఱర్ నన్పొరుళ్ తన్నైయుమ్
నమ్బినేన్ మడవారైయు మున్నెలామ్
శెమ్బొన్మాడ త్తిరుక్కు_రుకూర్ నమ్బి
క్క_న్బనా యడియేన్ శదిర్త్తే న్నిన్డ్రే

పరమాత్మకు శేషభూతమగు ఈ ఆత్మను ఇంతకు పూర్వము నాకు సొంతమని ఆశించి, నమ్మితిని. పరస్త్రీలను ఆశించితిని. కాని, బంగారుతో నిర్మింపబడిన మేడలు కల కురుకాపురిలో వేంచేసియుండు ఆళ్వార్లకు శేషభూతుడనైన నేడే మిక్కిలి చాతుర్యమును కల్గిన వాడనైతిని.

ప్రాక్కాలే పరకీయవస్తునివహేష్వాసం సముత్కంఠితః
కించాసం లలనాజనేషు బహుషు ప్రేమ్ణా భృశం మేదురః ।
స్వర్ణోదంచితవప్రశాలికురుకాసత్పత్తనాధీశితుః
సూరేః సంప్రతి దాసభావ ముపయన్ జాతోఽస్మి సంశిక్షితః.

6) ఇన్ఱుతొట్టు మెழுమైయు మెమ్బిరాన్
నిన్ఱు తన్పుకழ்ఏత్త వరుళినాన్,
కున్ఱమాడత్తిరుక్కురుకూర్ నమ్బి,
ఎన్ఱుమెన్నై యిగழ்విలన్ కాణ్మినే.

ఇప్పటినుండి ఇక జీవించియున్నంతవరకు తమకీర్తినే స్థిరముగ స్తుతించు నన్ను ఆళ్వార్లు అనుగ్రహించిరి. కొండలవలెనున్న ఎత్తైన మేడలను కల్గిన కురుకాపురిలో వేంచేసియుండు ఆళ్వార్లు ఇకపై ఎన్నడును నన్ను ఉపేక్షింపరు. దీనిని అంతయుఅందఱు తమ అనుభవముచే క్రమముగా గమనింపవచ్చును.

అద్యారభ్య సమస్తజన్మనినహో స్వామీ శఠారి ర్మునిః
కీర్తిం కీర్తయ మామికా మితి కృపాం మయ్యాతనో దద్భుతామ్ ।
భాస్వచ్ఛైలసమానసాలకురుకాక్షేత్రాధినాథస్య మాం
భూయో నైవ కదాపి నిగ్రహపదం కుర్యాదహో పశ్యత ॥

7) కణ్డుకొణ్డెన్నై క్కారిమాఱప్పిరాన్
పణ్డై వల్వినై పాற்றి యరుళినాన్,
ఎణ్డిశైయు మఱియ వియమ్బుగేన్
ఒణ్డమిழ்చ్చడగోపనరు ళైయే.

పరమోపకారకుడగు కారిమాఱులు (ఆళ్వార్లు) తమ మహిమను తెలియని నన్ను తమకటాక్షములతో కరుణించి, నన్ను స్వీకరించి, నా చిరకాల పాపసంచయములను నశింపచేసిరి. మిక్కిలి మధురములగు ద్రావిడ ప్రబంధములను అనుగ్రహించిన శ్రీశఠకోప సూరి కృపావైభవమును ఎనిమిది దిక్కులయందు అందఱుతెలిసి, ఉజ్జీవించునట్లు పల్కెదను.

యోగీ కారిసుతో మహాన్ శఠరిపుః దాసే కటాక్షం నిజం
సంధుక్ష్య ప్రబలం పురాతన మఘం నిశ్శేషదగ్ధం వ్యధాత్।
తస్యైతస్య మమాత్మనో ద్రవిడవాగీశస్య దివ్యాం కృపాం
నిత్యం సర్వదిగంతవర్తిజనతావేద్యాం కరిష్యామ్యహమ్ ॥

8) అరుళ్కొణ్డాడు మడియవరిన్బుఱ
అరుళినా నవ్వరుమఱైయి న్బొరుళ్,
అరుళ్ కొణ్డాయిర మిన్దమిழ் పాడినాన్
అరుళ్ కణ్డీ రివ్వులకినిల్ మిక్కదే.

భక్తులు ఆనందనిర్భరులై, కరుణను కీర్తించునట్లు, అద్భుతములైన వేదరహస్యార్థములను ఆళ్వార్లు కృపచేసిరి. భగవానుని కృపను ఆలంబనముగా గొని వేయిపాశురములను కల్గినదై, మిక్కిలి రసవంతమైన తిరువాయ్మొழி ప్రబంధమును పాడిరి. ఆళ్వార్ల కృపను చూడుడు. అది ఈ లోకమునందు అంతటను అతిశయించియున్నది. (భగవత్కృప కంటెను ఆళ్వార్ల కృప మిక్కిలి గొప్పది)

స్వామీ శ్రీశఠకోపసూరి రతులాం విష్ణోః కృపాం శంసతాం
భక్తానాం స్వకృపాబలం ప్రకటయన్ వేదార్థరత్నాన్యదాత్।
అత్యాశ్చర్యకృపాబలాత్ దశశతం గాథా స్స చక్రే మునిః
తస్యైతస్య కృపైవ భూతల ఇహ ప్రాబల్య మాసీదతి ॥

9) మిక్కవేదియర్ వేదత్తి నుట్పొరుళ్
నిఱ్కప్పాడి యెన్నెఞ్జుళ్ నిఱుత్తినాన్,
తక్కశీర్ శడగోపనెన్నమ్బిక్కా
ట్పుక్కకాదలడిమైప్పయనన్ఱే.

వైదికోత్తములచే అధ్యయనముచేయబడు వేదముల పరమతాత్పర్యమును నాహృదయమున స్థిరముగా నిలచుటకు శఠకోపులు తిరువాయ్మొழிని కృపచేసిరి. అట్టి గొప్పగుణపూర్తిని కల శఠకోపముని విషయమున దాస్యమును చేయవలెనను ప్రేమ వెంటనే కైంకర్యపర్యంతమై, ఫలవంతమయ్యెను.

అత్యభ్యర్హితవైదికాగ్ర్యనిగమస్తోమార్థ తత్త్వం స్వయం
సంకీర్త్య స్వసదుక్తిభిః మమ హృది స్వామీ య ఆస్థాపయత్।
తస్యైతస్య గుణాకరస్య కురుకానాథస్య దాస్యే రుచిః
యా జాతా మమ సా ఫలేగ్రహి రభూత్ కైంకర్యసామ్రాజ్యతః ॥

10) పయనన్రాగిలుమ్ పాఙ్గలరాకిలుమ్
శెయల్ నన్రాక త్తిరుత్తి ప్పణికొళ్వాన్,
కుయిల్ నిన్రార్ పొழిల్శూழ் కురుకూర్‌నమ్బి
ముయల్ కిన్రే నున్‌రన్ మొయ్‌కழల్కన్బైయే.

ఆళ్వార్లు నిష్ప్రయోజకులను, అననుకూలురను తాము పరమకృపతో అనుగ్రహించి వారిని చక్కని జ్ఞానానుష్ఠాన సంపదను కల్గియున్న వారినిగా దిద్దుబాటుచేసి, భగవద్భాగవతాచార్య కైంకర్య శీలురుగ చేయుదురు. కోకిలలు మధురముగా గానముచేయు అందమైన తోటలను కల్గిన కురుకాపురిలోని గుణపూర్ణులగు ఓ శఠకోప మునీ! మహనీయములగు తమ పాదముల యందు ప్రేమనే కోఱుచున్నాను.

త్యక్త్వా ప్రత్యుపకారలాభకుతుకం సాద్గుణ్యరిక్తా నపి
ప్రేమ్ణా సాధు వినీయ కింకరపదే నిక్షేప్తు మిచ్ఛావశాత్।
కూజత్ కోకిల వృక్షషండకురుకాక్షేత్రే నివాసోత్సుక!
స్వామిన్! తావకదివ్యపాదపరిచర్యాయై వ్యవస్యామ్యహమ్॥

11) అన్బన్‌రన్నై యడైన్దవర్ కట్కెల్లా
మన్బన్, తెన్‌కురుకూర్ నగర్ నమ్బిక్కు,
అన్బనాయ్ మదురకవి శొన్నశొల్
నమ్బువార్ పది వైకున్దమ్కాణ్మినే.

ఆశ్రితవత్సలుడగు ఈశ్వరుని ఆశ్రయించిన వారివిషయమున, మిక్కిలి ప్రేమను కల్గిన శ్రీకురుకాపురీశులగు ఆళ్వార్లపట్ల గొప్ప ప్రేమను కల్గిన మధురకవి ఆళ్వార్లు కృపతో అనుగ్రహించిన పాశురములను తమకు రక్షముగ తలచువారి నివాసస్థానము శ్రీవైకుంఠమే అని తెలిసికొనుడు. (అనగా వారున్నచోటు శ్రీవైకుంఠసదృశము)

శ్రీశం స్వాశ్రితవత్సలం శ్రితవతాం పాదేషు భక్త్యుజ్జ్వలే
యోగీంద్రే కురుకేశ్వరే భగవత శ్రీమచ్ఛఠారౌ పరమ్।
భక్తేన గ్రథితాం కృతిం మధురకవ్యాఖ్యానే యే విశ్వసం –
త్యేతే యత్ర వసంతి తత్‌స్థల మహో వైకుంఠలోకాయతే॥

ఇత్థం వాదిభయంకరవంశీయాణ్ణం గరార్యసంగ్రథితా
మధురకవిసూక్తిమాలాప్రతికృతి రేషా ధినోతు బుధహృదయమ్.

❖ ❖ ❖

## ఉపదేశరత్తినమాలైలో శ్రీమణవాళమహామునులు నమ్మాళ్వార్ల విషయమున అనుగ్రహించిన పాశురద్వయమునకు పిళ్లైలోకమ్ జీయర్ అనుగ్రహించిన వ్యాఖ్యకు అనువాదము

1) ఏరార్వైకాశి విశాకత్తినేற్றై
పారోరఱియ పకర్కిన్ఱేన్ - శీరారుమ్
వేదమ్ తమిళ్శెయ్ద మెయ్యన్ ఎழிల్కురుకై
నాదనవతరిత్తనాళ్ (ఉపదేశరత్తినమాలై-14)

ప్ర.అ. :- ఏర్ + ఆర్ = అందము నిండిన, వైకాశి = వైశాఖమాసములోని, విశాకత్తిన్ = విశాఖా నక్షత్రము యొక్క, ఏற்றై = గొప్పతనమును, పారార్ = లోకులు, అఱియ = తెలియునట్లు, పకర్కిన్ఱేన్ = పల్కుచున్నాను, శీర్ + ఆరుమ్ = సంపద నిండిన, వేదమ్ = సంస్కృతవేదమును, తమిళ్శెయ్ద = తమిళభాషలోనికి అనువదించిన, మెయ్యన్ = యథార్థవాదియగు, ఎழிల్కురుకైనాదన్ = అందమైన శ్రీకురుకాపురికినాథులగు నమ్మాళ్వార్లు, అవతరిత్త = అవతరించిన, నాళ్ = శుభదినము (కదా ఇది)

వ్యాఖ్య :- ఆళ్వార్లు అందరిలోను నమ్మాళ్వార్లు అంగి అని, మిగిలిన ఆళ్వార్లు వారికి అవయవ భూతులని (వంటివారని) పెద్దల సూక్తి. అట్లేనమ్మాళ్వార్ల ప్రబంధములు నాల్గింటిలో అంగి అగు తిరువాయ్ మొழி సమస్త వేదాంతార్థములను ప్రకాశింపచేయు చున్నది. తిరువాయ్మొழிలోని ప్రథమశతకములోని మొదటి రెండు దశకములు అనగా "ఉయర్వఱ", "వీడుమిన్ ముற்றవుమ్" అను రెండు దశకములు బ్రహ్మసూత్రముల తాత్పర్యమును తెలుపుచున్నవని ఆచార్యుల అభిప్రాయము. ఇట్టి నమ్మాళ్వార్లు సుప్రసిద్ధమైన తిరునగరి యందు అవతరించిరి. ఇందు ఆళ్వార్లు జన్మించిన మాసము, నక్షత్రము, దివ్యదేశముల వైభవమును లోకు లందఱు తెలియునట్లు స్తుతింతును అని శ్రీమణవాళ మహామునులు పల్కుచున్నారు.

అత్యంతవైభవముతో నిండినవైశాఖ మాసములోని విశాఖా నక్షత్రవైభవమును గూర్చి లోకములోని జనులందఱు గ్రహించునట్లు పల్కెదను. అది ఎట్లనగా ఆ నక్షత్రము పరతత్త్వ జ్ఞానసంపదతో నిండిన వేదమును తమిళభాషలో అనుగ్రహించిన సత్యవాది అగు నమ్మాళ్వార్లు అవతరించిన దినము అని.

శ్రీమణవాళమహామునులు "మాశిప్పునర్ పూశమ్" అను 13వ పాశురమున మాఘమాసమున పునర్వసు నక్షత్రమున అవతరించిన కులశేఖరులను గూర్చి పల్కిరి. పిమ్మట ఫాల్గుణ మాసమున ఆళ్వార్ల అవతారము లేమియు లేకుండుటచే, క్రమమునుబట్టి చైత్రమాసములోని మధురకవి, శ్రీరామానుజుల అవతారములను గూర్చి కీర్తింపవలసి యున్నది.

కాని, అట్లుకాక, వైశాఖమాసమున నమ్మాళ్వార్ల అవతరణమును గూర్చి పల్కుటలో అర్థమేమనగా - వరుసగా పదిమంది ఆళ్వార్ల అవతారములను గూర్చి తెలుపగోరుటచేనని తెలియనగును.

(ఏరార్వైకాశి) - వైశాఖమాసము సంపదతో నిండియుండుట ఏమనగా - అది మధుమాసమగుటచే, పూలసంపదను కల్గియున్నదని భావము. ఆళ్వార్ల అవతారముకూడ భగవదవతారముల వంటిదే. శ్రీరామావతారసమయమును వాల్మీకి భగవానులు కీర్తించుచు "**చైత్రః శ్రీమా నయం మాసః పుణ్యః పుష్పితకాననః**" అని పల్కిరి. అట్లే ఇచట ఆళ్వార్లు అవతరించిన దేశము కూడ, "**కొత్తలర్ పొళ్ళిల్**" అని, "**కుయిల్ నిన్ఱార్ పొళ్ళిల్**" అనునట్లు ఉద్యానవనసంపదను, పుష్పసంపదను కల్గియున్నది. "**ఏరార్**" అను విశేషణమును వైశాఖమాసముననే కాక, విశాఖా నక్షత్రమునకును అన్వయింపవచ్చును. "**పెరియ తిరునాళ్**" అని శ్రీరంగనాథుని అధ్యయనోత్సవ సమయమును కీర్తించునట్లే, "**తిరువిశాఖతిరునాళ్**" అని కీర్తింపతగిన అతిశయము ఆళ్వార్ అవతార దినమగు ఈ నక్షత్రమునకు కలదని తాత్పర్యము. ఈ వైశాఖమాసములోని విశాఖా నక్షత్రమున, అనగా నమ్మాళ్వార్ల అవతార దివసమున దివ్య దేశములన్నిటియందు పాలును, మామిడిపండును ఆరగింపు చేయుదురు. కావునపాలు, ఫలమును నైవేద్యమును చేయు అతిశయమును కల్గిన దివసమిది.

(**పారోరఱియ . . . .**) ఇట్టి అతిశయమును భూమిలోని జనులందఱు తెలిసికొనునట్లు పల్కుచున్నాను. ఈ విషయమును తెలిసికొనుటకు వేరు ఎట్టి యోగ్యత ఉండవలసిన పనిలేదు. భూలోకమున నివసించు వారైయుండిన చాలును. ఈ అతిశయమును మణవాళ మహాముునులు ఎవ్వరైనను అడిగిన చెప్పుచున్నారా ? అనినచో, ఎవ్వరును అడుగకున్నను నమ్మాళ్వార్ల అవతారదివసవైభవము వారిని ఇట్లు నలుగురకు తెలియునట్లు పలుకకుండ ఉండనీయదు కదా ! కావున ఆదివసవైభవము వారిని ప్రోత్భలము చేయుటచే ఇట్లు పల్కుచున్నారు తప్ప, వేరొకరి ప్రార్థనవలన కాదు. ఇట్టి అతిశయము ఆళ్వార్ల అవతారదివసమున కెట్లు కల్గిన దనినచో అందులకు సమాధానమును -

(**శీరారుమ్ . . . నాళ్**) అనుచు పల్కుచున్నారు. "**శీరారుమ్ వేదమ్**" అనునపుడు వేదమునకు గల సంపద ఏమనగా అపౌరుషేయత్వము మొదలగు వాని వలన కల్గిన ప్రామాణ్యమే. "**శుడర్మికు శురుది**" (మిక్కిలి ప్రకాశించు శ్రుతి) అని ఆళ్వార్లు పల్కిరి కదా ! లేక, శ్రియః పతి అగు భగవానుని స్వరూపరూపగుణములను ప్రతిపాదించు ఉత్తరభాగమును కల్గియుండుట అనియు భావము. ఆ ఉత్తర భాగమును ఆళ్వార్లు తమిళమున పల్కిరి. "**యః శ్రుతే రుత్తరం భాగం చక్రే ద్రావిడ భాషయా**" అని అభియుక్తులగు ఆచార్యులు పల్కిరి కదా !

(**వేదమ్ తమిళ్శెయ్ద**) వేదమును తమిళమున పల్కుట అనగా "**ఎయ్దఱ్కరియ మఱైకళై**

యాయిరమిన్దమిళ్ళాల్ శెయ్‌దళ్ళలకిల్ వరుమ్ శడగోపనై'' (సామాన్యులు తెలిసికొనుటకు సాధ్యము కాని సంస్కృత వేదమును వేయి పాశురములుగ తీయని ద్రావిడ భాషలో అనుగ్రహించుటకై లోకమున అవతరించిన శఠకోపులు) అనునట్లు కొందఱికి మాత్రమే అధ్యయనము చేయ వీలున్న సంస్కృతవేదములోని పరమాత్మ తత్త్వమును అందఱు తెలిసికొనుటకు వీలుకాదని తలచిన ఆళ్వార్లు దానిని అందఱికి అందునట్లు, అందఱు అనుభవించునట్లు ద్రావిడభాషలో వేయి పాశురములను కల్గిన తిరువాయ్ మొళ్ళి ప్రబంధముగా అనుగ్రహించిరి. **''వేదమ్ తమిళ్ళ్ శెయ్‌ద మాఱన్''** అని, **''అరుమఱైకళ్ అన్దాది శెయ్‌తాన్''** అనియు నమ్మాళ్వార్లు కీర్తింపబడుట స్మరింపనగును.

**(మెయ్యన్)** - ఆళ్వార్లు పల్కిన దంతయు వేదార్థము అని చెప్పతగిన సత్యవాదిత్వము వారికి కలదు. **''పొయ్యిల్ పాడలాయిరత్తుళ్''** అని వారే స్వయముగా పల్కిరి కదా! ఆళ్వార్లను గూర్చి **''మెయ్యన్''** అని **''పొయ్యిలాద మణవాళమహాముని''** పల్కుట మిక్కిలి తగినది కదా! **(ఎళ్ళిల్ కురుకైనాథన్)** ''కురుకూర్ శడగోపన్'' అని ఆళ్వార్లు పల్కినట్లు, ఆళ్వార్లకు ఈ అతిశయము వారు జన్మించిన దివ్యదేశమగు కురుకాపురివలన కల్గినదని భావము. ఆ ఊరిలో ''ఆదిప్పిరాన్'' అనుస్వామి నాయకుడైనను, ఆళ్వార్ల నాథత్వమే (పరిపాలనయే) చెల్లుచున్నదను స్వారస్యము నాథశబ్దముచే భాసించును. తిరునగరిలో ఆదినాథుడను భగవానునియొక్క, కురుకానాథులను ఆళ్వార్లయొక్క అధికారము ఉభయప్రధానముగా నున్నను, భగవానుడు భక్తపరాధీనుడగుటచే ఆళ్వార్ల అధికారమే చెల్లుబాటులో నున్నది. దానినే స్వామి నడపించుచున్నాడని భావము. **''నలనిడైయూర్ తిపణ్ణ్ వీడుమ్ పెఱుత్తి త్తన్‌మూవులక్కుమ్ తరుమ్ ఒరునాయకమే''** అని ఆళ్వార్లు స్వయముగా ఒకే నాయకత్వముండుటను గూర్చి పల్కిరి కదా! ''ఎళ్ళిల్ కురుకై'' అనగా నగరమునకు తగిన అలంకారములతో భాసించు కురుకాపురి. అనగా, **''కున్దమ్బోల్ మణిమాడనీడు''** అని, **''మాడలర్‌పొళ్ళిల్''** అని, **''శేర్‌తడఙ్గళ్''** అని, **''ఏర్‌వళమ్''** అని సౌధముల, ఉద్యానవనముల, తటాకముల సమృద్ధిని కల్గియుండుట. **''కట్టెళ్ళిల్ తెన్‌కురుకూర్''** అని నమ్మాళ్వార్లు ఈ విషయమును సంగ్రహముగా సూచించిరి. లేక, జగత్తుకు ఆభరణమగు (జగదాభరణమగు) వకుళాభరణులు (నమ్మాళ్వార్లు) అవతరించుట వలన కల్గిన శోభ అనియు **'ఎళ్ళిల్'** అనుటకు అర్థము. లేక, **'ఎళ్ళిల్'** అను విశేషణమును **''నాథ''** శబ్దమునకు అన్వయించిన, జ్ఞానభక్త్యాదులగు శ్రీవైష్ణవాలంకారములను కల్గియుండుటచే కల్గిన శోభ అనియు భావము.

**(ఎళ్ళిల్‌కురుకై నాదనవతరిత్తనాళ్)** – **''ఊరుమ్ నాడుమ్ ఉలకముమ్ తన్నైప్పోల్''** అనునట్లు తాము అవతరించిన ఊరును, దేశమును, లోకమును తనవలె భగవద్భక్తి కల్గినవారిగా చేయు ఆళ్వార్లు అవతరించిన దినము. సంసారమున ఆసంసారమునుండి జనులను రక్షించు ఆళ్వార్లు

అవతరించునట్లే, నిరర్థకముగా గడచు ఈ కాలమున ఆళ్వార్లు అవతరించిన శుభదివసము మనకు లభించినది కదా ! ఎంత అదృష్టము ! కావున ఈ పరమ రహస్యమును శ్రీమణవాళ మహామునులు పరమకృపతో లోకములోని వారందరు తెలియునట్లు వ్యక్తము చేసిరి.

ఇట్లు ఆళ్వార్లు అవతరించిన కాలము, దివ్యదేశములు ప్రస్తుతింపబడుటకు కారణమేమి అనినచో - అందులకు శ్రీ పిళ్లై లోకమ్ జీయర్ ఉపదేశరత్తినమాలైప్రబంధ వ్యాఖ్యాన ప్రారంభమున ఇట్లు సమాధాన మొసగిరి.

ఆచార్యుడు కావలెనని ఆశపడి అవతరించి, శ్రీ గీతను, అభయప్రదానమును అనుగ్రహించిన ప్రథమగురువగు భగవానుడు సంసారుల రక్షణ కొఱకు లోకములోని మానవుల వలె అవతరించిన రోహిణి, పునర్వసు, స్వాతి (శ్రీకృష్ణ-శ్రీరామ-నృసింహావతారములు) నక్షత్రములు, చైత్ర, వైశాఖ, భాద్రపదాది మాసములు, యమున, సరయు నదుల తీరములు, మధుర, అయోధ్యాది నగరములు - ఇవి అన్నియు ఇతిహాస పురాణములలో ప్రస్తుతింపబడినవి. అవి అట్లు వర్ణింపబడుటకు కారణములు జనులు వాని గొప్పతనమును తెలిసికొని, తరించుటకే. ఆ విధముగానే భగవానుడు ఉపదేశించిన రహస్యార్థములను తాము ఆచరించి, ఇతరులకు ఉపదేశించి, తరింపచేసిన మహానుభావులగు ఆళ్వార్లు అవతరించిన శ్రవణాది నక్షత్రములు, ఆశ్వయుజాది మాసములు, అయోధ్య, మధుర, కాంచి మొదలగు నగరములు, కావేరీ మొదలగు నదులును ఇవి అన్నియు ఇతిహాసాదులలో **''కలౌ ఖలు భవిష్యంతి నారాయణ పరాయణాః . . . . తామ్రపర్ణీనదీ యత్ర కృతమాలా పయస్వినీ . . .''** ఇత్యాదిగా కీర్తింపబడినవి. ఆళ్వార్లు అందఱు భగవానుని నిర్హేతుక కృపకు పాత్రులై **''మయర్వఱ మదినలమ్''** అనునట్లు నిర్దోషములైన జ్ఞాన భక్త్యాదులను పొందిన ప్రపన్నులు. పదిమంది ఆళ్వార్ల అవతారములు భగవానుని పది అవతారములవంటివి. భగవానుడే భక్తరక్షణకొఱకు తన అంశచే ఆళ్వార్లను అవతరింపచేసెనని పెద్దలచే చెప్పబడుచున్నది. భగవానుడు అత్యంత ఆదరముతో వేంచేసియుండు దివ్యదేశము లన్నిటియందు ''పదితొఱుమ్ పుక్కునిఱ్కుమ్'' అనునట్లు తామును అనురూపమైన అర్చామూర్తులను పొందిన ఆళ్వార్లు భగవానుని సేవించుచు, తమ భక్తులచే సేవింపబడుచు, తమ పాదసంబంధముచే వారిని ఉజ్జీవింపచేయుచున్నారు. వారు అవతరించిన నక్షత్ర, మాసాదులు, దివ్యదేశములును భగవానుడవతరించిన నక్షత్రాది, దేశాదులవలె అత్యంతము ఆదరణీయములు. కావున శ్రీమణవాళ మహామునులు వానిని ఇట్లు ప్రస్తుతించుట ద్వారా లోకులను అనుగ్రహించిరి.

ఈ విధముగా ఇందు ఆళ్వార్ల వైభవము ప్రతిపాదింపబడుటచే తిరుమంత్రార్థమునకు తాత్పర్యరూపమగు భాగవత శేషత్వాది ఆకారత్రయము తెలుపబడినది.

**2)** **ఉణ్డో వైకాశి విశాకత్తు క్కొప్పారునాళ్ ?**
**ఉణ్డో శడకోపర్ క్కొప్పారువర్ ? ఉణ్డో**

## తిరువాయ్‌మొழிక్కొప్పు ? తెన్‌కురుకైక్కుణ్డో ?
## ఒరుపార్ తన్నిలొక్కుమూర్. - (ఉపదేశరత్తినమాలై-15)

ప్ర.అ. - వైకాశి విశాకత్తుక్కు = వైశాఖమాసమున విశాఖా నక్షత్రమునకు, ఒప్పు = సమానమైన, ఒరునాళ్ = ఒకదినము, ఉణ్డో = ఉన్నదా ? (లేదు) శడకోపర్క్కు = నమ్మాళ్వార్లకు, ఒప్పు = సమానులు, ఒరువర్ = ఒకరు, ఉణ్డో = ఉన్నారా ? (లేరు), తిరువాయ్‌మొழிక్కు = తిరువాయ్‌మొழி దివ్యప్రబంధమునకు, ఒప్పు = సమానమైన వేరొక ప్రబంధము, ఉణ్డో = ఉన్నదా? (లేదు) పార్‌తన్నిల్ = ఈ భూమండలమునందు, తెన్‌కురుకైక్కు = శ్రీకురుకాపురికి, ఒక్కుమ్ = సరిపోవు, ఒరు ఊర్ = ఒక ఊరు, ఉణ్డో = ఉన్నదా ? (లేదు)

వ్యాఖ్య :- "ఏరార్ వైకాశి" అను ముందు పాశురమున శ్రీమణవాళమహామునులు నమ్మాళ్వార్లు అవతరించిన దేశకాలములను గూర్చి, వారు అనుగ్రహించిన దివ్య ప్రబంధముల వైభవములను గూర్చి కీర్తించిరి. ఆ విషయమునే మరల స్వగతముగా పల్కుట ప్రస్తుత పాశురములోని విశేషము.

వైశాఖమాసములోని విశాఖా నక్షత్రమునకు సరిపోవు వేరొక నక్షత్రము ఉన్నదా ? లేదు కదా ! నమ్మాళ్వార్లకు సరిపోవు వారు ఎవ్వరైనను కలరా ? లేరు. వారు అనుగ్రహించిన తిరువాయ్‌మొழி ప్రబంధమునకు సరిపోవు ప్రబంధము వేరొకటి కలదా ? లేనే లేదు. ఆళ్వార్లు అవతరించిన శ్రీకురుకాపురికి సరి అగు ఊరు ఈ భూలోకమున వేరొకటి కలదా ? లేదు.

**(ఉణ్డో వైకాశి విశాకత్తు క్కొప్పొరునాళ్)** - సర్వేశ్వరునకు, ఆ స్వామి విభూతికిని సమృద్ధి కలుగునట్లు మంగళాశాసనము చేయుటకై నమ్మాళ్వార్లు అవతరించిన వైశాఖమాసములోని విశాఖ నక్షత్రముతో పోలినది వేరొకటి లేదు. "నీ పిఱన్ద తిరునన్నాళ్" అని ప్రస్తుతింపబడు భగవానుడు అవతరించిన దినముకూడ "**కృష్ణతృష్ణాతత్వ**" ముగా కీర్తింపబడు ఆళ్వార్ల అవతార శుభదినమునకు సరిరాదు. శ్రీకృష్ణావతారమున అక్రూరాదులు నలుగురైదుగురు మాత్రమే భగవానునిచే సంస్కరింపబడిరి. కాని, "**తా నహం ద్విషతః క్రూరాన్ సంసారేషు నరాధమాన్, క్షిపామ్య జస్ర మశుభా నా సురీష్వేవ యోనిషు**" (నన్ను ద్వేషించు ఆ క్రూరులగు నరాధములను అసురుల కులమున జన్మించునట్లు క్రిందకు త్రోసివైతును) అని భగవానుడు చేయి విడచిన వారిని కూడ సంస్కరించి, "నిన్ఱు**ణ్ వే**ల్కై **ఎ**ఱి విప్పన్" అనునట్లు భగవదభినివేశము వారికి కల్గునట్లు చేసిన ఆళ్వార్లు అవతరించిన దినమిది.

**(ఉణ్డో శడకోపర్ క్కొప్పొరువర్)** భగవానుడు అవతరించిన కొంతకాలమునకు పిమ్మటనే సంసారులలో కొందఱిని మాత్రము మార్చుటకు ఆ స్వామికి వీలుకల్గెను ఆళ్వార్లు అవతరించిన సమయమునుండియే "**శఠానాం బుద్ధిదూషణం**" అనునట్లు శఠులను నిర్జించినవారై, సుజ్ఞాన ఘనపూర్ణులై యుండిరి. ఇట్టి జ్ఞానవైభవమును కల్గిన వారు వేరొకరు లోకమున కానరారు. అన్న పానాదులతో, పక్వ ఫలాదులతో జీవించు సంసారులు,

''నాట్టారోడియల్ వొళిన్దు నారణనై నణ్ణినమే'' (లోకులతో సంబంధమును వీడి, శ్రీమన్నారాయణుని ఆశ్రయించితిమి కదా) అని, **''ఎల్లామ్ కణ్ణన్ ''**(ధారక, పోషక, భోగ్యములన్నియు శ్రీకృష్ణుడే) అని తలచుచు **''విణ్ణులారిలుమ్ శీరియర్''** (ఈ సంసారమున భగవానుని సేవించువారు నిత్యసూరులకన్న గొప్పవారు) అనునట్లుండు ఆళ్వార్లతో సమానులు కాలేరు కదా !**(నిత్యసూరికళై యొళ్ళిన్దమన్నిళ్ళాయార్క్కు ఫల సాధన దేవతాంతరఙ్గళిల్ ఇవర్కళ్‌నినైవు పేచ్చిలే తోన్దుమ్బడియా యిరుక్కుమ్).**

పరమపదము ''తెళివిశుమ్బు తిరునాడు'' అనునట్లు జ్ఞానజనకము. భగవదనుభవమునకు తగిన స్థానము. కాని ఈ సంసారములోని జనులు **''విణ్ణుళార్ప్పెరుమాళ్ క్కడిమైశెయ్‌వారైయుమ్ అఱు మైమ్బుల నివై''** అనునట్లు పరమపదనాథునకు నిత్యకైంకర్యమును చేయువారినికూడ బాధించు ఇంద్రియములతో కూడినవారు. ఈ లోకము **''ఇరుళ్‌తరుమాఞాలమ్''** అను విధముగా అజ్ఞానము కల్గించును. కావున భగవానునికైంకర్యమునకు తగిన చోటు కాదు. అట్టి సంసారములో నుండియు ఆళ్వార్లు భగవదనుభవమే తమ జీవితముగా కాలమును గడపిరి. ఇట్టి మహనీయులు వీరు ఒక్కరే కదా ! కావుననే ఆళ్వార్లు స్వయముగా **''మారుళదో ఇమ్మణ్‌మిశైయే''**, ''ఇని యావర్ నికరకల్ వానత్తే'' అనుచు ఉభయ విభూతులలో తమకు సాటిలేకుండుటను గూర్చి పల్కిరి. ఇట్లు శఠగోపులు అందరికంటె అధికులు. సమస్త లోకమును తన హస్తమున నుంచుకొన్న మహాత్ములు. అట్టి వీరవతరించిన నక్షత్రమునకు సాటి అగు నక్షత్రము వేరొకటి లేదు. సరియే, వీరు అనుగ్రహించిన ప్రబంధమగు తిరువాయ్ మొళ్ళికి, అవతరించిన దివ్యదేశమునకు సాటి ఉన్నదా ? అనినచో - నిశ్చయముగా లేదనుచున్నారు. (పాశురములోని మిగిలిన భాగమున)

**(ఉణ్డో తిరువాయ్‌మొళ్ళిక్కొప్పు) ''తిరుమాలా లరుళప్పట్టశడగోపన్''** అనునట్లు భగవానుని అనుగ్రహమును పొందినవారై, **''తిరుమాలవన్‌కవి''** అనునట్లు ఆ భగవానుని కీర్తించు కవియైన ఆళ్వార్లయొక్క **''మొళ్ళిపట్టోడుమ్ శుడర్చ్చోది''** అనునట్లు భగవదనుభవపరీవాహ రూపముగ, **''అవావిలన్దాదిగళ్ ఇవైయాయిరముమ్''** అనువిధముగ భక్తియొక్క ప్రభావఫలితముగ అవతరించిన తిరువాయ్‌మొళ్ళి, దివ్యప్రబంధములన్నిటిలోను సారమైన దగుటచే దీనికి సరియగు ప్రబంధము వేరొకటిలేదు. మిగిలినవన్నియు సముద్రఘోష వలెవ్యర్థములే. కావున **''అరుళ్‌కొణ్డు ఆయిర మిన్దమిళ్ళ్ పాడినాన్''** (అనుగ్రహముతో వేయి తీయని పాశురములను పాడెను) అనునట్లు ఆళ్వార్ల దయవలన అవతరించిన తిరువాయ్‌మొళ్ళి అసదృశమైనది. **(తెన్‌కురుకైక్కుణ్డో వొరుపార్ తన్నిలొక్కుమూర్)** - ఉభయవిభూతులలో నమ్మాళ్వార్లకు సదృశముగు వారు వేరొకరులేనట్లే, తిరునగరికి సమానముగు దేశము వేరొకటి లేదు. ఒకవేళ ఉన్నచో అది **''తిరునాడు వాళ్ళి తెన్‌కురుకై వాళ్ళి''** అనునట్లు భగవానుని నివాసమగు పరమపదమే. **''తిరునగరి**

క్కొప్పారియుణ్డో ఉలకిల్'' అని ఆ దివ్యదేశము కీర్తింపబడుచున్నది కదా! ''ఆర్ఱ్ఱిల్ తుఱైయిలూరిల్లుళ్ల వైషమ్యం వాచామగోచరమ్'' *(80)* అని ఆచార్య హృదయమున శ్రీకృష్ణుడు, వ్యాసభగవానుడు అవతరించిన దేశముల కంటె ఆళ్వార్లు అవతరించిన దేశముయొక్క గొప్పతనము తెలుపబడినది.

(తెన్కురుకై) - సంసారమండలమునకు ఆభరణమైన ఊరు తిరునగరి. ''నల్లార్ పలర్ వాళుమ్ కురుకూర్'' (సజ్జనులు పలువురు నివసించు కురుకూరు) అని, ''శయప్పుకళార్ పలర్ వాళుమ్ తడఙ్కురుకూర్'' (జయకీర్తిని కల్గిన పలువురు నివసించు విశాలమైన కురుకూరు) అని చెప్పబడునట్లు తిరునగరి ''పెరియపుణ్ కురుకూర్'' (గొప్పకీర్తినికల కురుకూరు) కదా! లేక దక్షిణదిక్కులోనున్న కురుకాపురి అనియు చెప్పనగును.

ఈ విధముగా ఆళ్వార్లు, వారు అవతరించిన తిరునక్షత్రము విశాఖ, వారి ప్రబంధము అగు తిరువాయ్మొళి, దివ్యదేశమగు తిరునగరి, అను వీనికి ఉపమానము వేరొకటి లేకుండుట వలన ఏర్పడినగొప్పతనము నిరూపింపబడినది. ఈ విశాఖానక్షత్రము రాజర్షులగు ఇక్ష్వాకువంశరాజుల నక్షత్రము అని ఆ వంశప్రభావమును తెలిసిన వారిచే చెప్పబడినది. కావున ''ఋషిం జుషామహే'' అని ఋషిగా కీర్తింపబడు నమ్మాళ్వార్ల జన్మ నక్షత్రమును విశాఖ అయ్యెను కాబోలు.

## నమ్మాళ్వార్ల మంగళాశాసన పాశురములు

1) ఆన తిరువిరుత్తమ్ నూఱు మరుళినాన్ వాళియే
ఆశిరియ మేళుపాట్టళిత్త పిరాన్ వాళియే
ఈనమఱ వన్దాది యెణ్బత్తేళీన్దాన్ వాళియే
ఇలకు తిరువాయ్మొళి యాయిరత్తొరునూర్ఱ్ఱి రణ్డురైత్తాన్ వాళియే
వాననియుమ్ మామాడక్కురుకైమన్నన్ వాళియే
వైకాశివిశాకత్తిల్ వన్దుదిత్తాన్ వాళియే
శేనైయర్ నవతారమ్శెయ్‌ద వళ్లల్ వాళియే
తిరుక్కురుకై చ్చడగోపర్ తిరువడికళ్ వాళియే

ప్ర.అ. :- తిరువిరుత్తమ్ (ఆన) = తిరువిరుత్తము అను, నూఱుమ్ = నూఱుపాశురములను, అరుళినాన్ వాళి యే = అనుగ్రహించిన ఆళ్వార్లు జయింతురు గాక, ఆశిరియమ్ = తిరువాశిరియమ్ అను, ఏళుపాట్టు = ఏడుపాశురములను, అళిత్త = అనుగ్రహించిన, పిరాన్ వాళియే = ఉపకారకుడగు ఆళ్వార్లు వర్ధిల్లుదురుగాక, ఈన మఱ = లోటులేకుండునట్లు,

అన్దాది = పెరియతిరువన్దాది అను, ఎణ్బత్తుఏళ్ళుం = ఎనుబది ఏడు పాశురములను, ఈన్దాన్ వాఙ్గి యే = అనుగ్రహించిన ఆళ్వార్లు వర్ధిల్లుదురుగాక; ఇలకు = ప్రకాశించు, తిరువాయ్‌మొఙ్గి = తిరువాయ్‌మొఙ్గి అను, ఆయిరత్తు + ఒరునూఱ్ఱుం + ఇరణ్డు = 1102 పాశురములను, ఉరైత్తాన్ = కృపచేసిన ఆళ్వార్లు, వాఙ్గియే = వర్ధిల్లుదురుగాక, వాన్ అణియుమ్ = ఆకాశమును అలంకరించు, మామాడ = గొప్పమేడలను కల్గిన, కురుకై = కురుకాపురికి, మన్నన్ = ప్రభువగు ఆళ్వార్లు వాఙ్గియే = జయింతురు గాక!, వైకాశి విశాకత్తిల్ = వైశాఖమాసమున విశాఖా నక్షత్రములో, వన్దు ఉదిత్తాన్ = ఈ లోకమునకు వచ్చి, ఉదయించిన ఆళ్వార్లు, వాఙ్గియే = వర్ధిల్లుదురు గాక, శేనైయర్‌కోన్ = విష్వక్సేనులు, అవతారమ్‌శెయ్‌ద = అవతరించిన, వళ్ళల్ = ఉదారులగు ఆళ్వార్లు, వాఙ్గియే = వర్ధిల్లుదురు గాక! తిరుక్కురుకై = కురుకాపురికి చెందిన, శడగోపన్ = నమ్మాళ్వార్ల, తిరువడిగళ్ = శ్రీపాదములు, వాఙ్గియే = మంగళముగా నుండుగాక!

**భావము** :- నూఱు పాశురములను కల్గిన తిరువిరుత్తమును, ఏడు పాశురములను కల్గిన తిరువాశిరియమును, 87 పాశురములను కల పెరియ తిరువన్దాదిని, 1102 పాశురములను కల్గిన తిరువాయ్ మొఙ్గిని అనుగ్రహించిన నమ్మాళ్వార్లు వర్ధిల్లుదురుగాక! ఆకాశమునంటు ఎత్తైన మేడలను కల్గిన తిరునగరియందు అవతరించిన వారు, వైశాఖమాసమున విశాఖా నక్షత్రమున అవతరించిన వారు, సాక్షాత్తు సేనైముదలియాళ్వార్ల (విష్వక్సేనుల) అవతారమును అగు నమ్మాళ్వార్లకు శుభముగు గాక!

2) మేదినియిల్ వైయాశి విశాకత్తోన్ వాఙ్గి యే
వేతత్తై శెన్దమిఙ్గాల్ విరిత్తురైత్తాన్ వాఙ్గి యే
ఆతికురువాయ్ ప్పువియి లవతరిత్తాన్ వాఙ్గి యే
అనవరతమ్ శేనైయర్‌కోన్ అడి తొఙ్గువోన్ వాఙ్గి యే
నాదనుక్కు నాలాయిరమురైత్తాన్ వాఙ్గి యే
నన్మదురకవివణఙ్గుమ్ నావీఱన్ వాఙ్గి యే
మాదవన్పొఱ్పాదుకైయాయ్ వళర్న్దరుళ్వోన్ వాఙ్గి యే
మకిఙ్గ్ మాఱన్ శడగోపన్ వైయకత్తిల్ వాఙ్గి యే

**ప్ర.అ.** : మేదినియిల్ = భూమియందు, వైయాశివిశాకత్తోన్ = వైశాఖమాసమున విశాఖా నక్షత్రమున జన్మించిన ఆళ్వార్లు, వాఙ్గియే = వర్ధిల్లుదురుగాక, వేతత్తై = వేదమును, శెమ్ + తమిఙ్గాల్ = అందమైన తమిళభాషలో, విరిత్తురైత్తాన్ = వివరించి, పాడించిన ఆళ్వార్లు, వాఙ్గి యే = మంగళముగా నుందురుగాక! ఆతికురువాయ్ = ప్రథమాచార్యులుగా, పువియిల్ = భూమియందు, అవతరిత్తాన్ = అవతరించిన ఆళ్వార్లు, వాఙ్గియే = మంగళముగా నుందురుగాక!

అనవరతమ్ = నిరంతరము, శ్లైయర్కోన్ = విష్వక్సేనులకు నాథుడగు భగవానుని, అడి = పాదములను, తొళ్లుంవోన్ వాళ్లియే = ఆశ్రయించు ఆళ్వార్లు వర్ధిల్లుదురు గాక! నాదనుక్కు = శ్రీమన్నాథమునులకు, నాలాయిరమ్ = నాలాయిర దివ్యప్రబంధమును, ఉరైత్తాన్ = సాయించినవారగు ఆళ్వార్లు, వాళ్లియే = శుభముగానుందురుగాక! నమ్మదురకవి = మహాత్ములగు మధురకవియాళ్వార్లు, వణజ్గుమ్ = నమస్కరించునట్టి, నా వీఱన్ = వాక్పటిమనుకల ఆళ్వార్లు, వాళ్లి యే = శుభముగా నుందురుగాక, మాదవన్ = శ్రియఃపతియొక్క, పొన్ + పాదుకై = స్పృహణీయమైన (బంగారు) పాదుకలుగా, వళర్న్దు + అరుళ్వోన్ = వర్ధిల్లిన ఆళ్వార్లు, వాళ్లి యే = శుభముగా నుందురు గాక! మకిళ్మాఱన్ = వకుళమాలికను నిరూపకముగా కల్గిన, మాఱన్ అను పేరును కల్గిన, శఠగోపన్ = నమ్మాళ్వార్లు, వైయకత్తిల్ వాళ్లియే = భూమండలమున వర్ధిల్లుదురు గాక!.

**భావము :-** ఈ భూమిపై వైశాఖమాసమున విశాఖా నక్షత్రమున అవతరించినవారు, వేదమును అందమైన ద్రావిడ భాషలో అనుగ్రహించినవారు, ప్రథమాచార్యులై లోకమున జనించినవారు, నిత్యము విష్వక్సేనుల కధిపతి అగు భగవానుని ఆశ్రయించువారు, శ్రీనాథమునులకు నాలాయిర దివ్యప్రబంధమును కటాక్షించినవారు, శ్రీమధురకవులు సేవించు వాక్పటిమనుకలవారు, మాధవుడగు భగవానుని అందమైన పాదుకలుగా వర్ధిల్లువారు, వకుళమాలికను, మాఱన్ అను పేరును నిరూపకముగా కల్గినవారగు శఠకోపులు (నమ్మాళ్వార్లు) ఈ భూమియందు నిత్యము వర్ధిల్లుదురు గాక!

**3)** **తిరుక్కురుకైప్పెరుమాళ్తన్ తిరుత్తాళ్గళ్ వాళ్లియే**
**తిరువాన తిరుముకత్తు చ్చెవి యెన్నుమ్ వాళ్లియే**
**ఇరుక్కుమొళ్లి యెన్నెజ్జిల్ తేక్కినాన్ వాళ్లియే**
**ఎన్దైయెతిరాశర్ క్కిఱైయవనార్ వాళ్లియే**
**కరుక్కుళ్లియిల్ పుకావణ్ణమ్ కాత్తరుళ్వోన్ వాళ్లియే**
**కాశినియిల్ ఆరియనాయ్ కాట్టినాన్ వాళ్లియే**
**వరుత్తమఱ వన్దెన్నై వాళ్విత్తాన్ వాళ్లియే**
**మధురకవితమ్బిరాన్ వాళ్లి వాళ్లి వాళ్లియే**

ప్ర.అ. - తిరుక్కురుకైప్పెరుమాళ్తన్ = శ్రీనగరిలోని మహాత్ములగు ఆళ్వార్ల, తిరుత్తాళ్గళ్ = శ్రీపాదములు, వాళ్లియే = వర్ధిల్లుగాక, తిరువాన = అందమైన, = తిరుముకత్తు = ముఖము యొక్క, చెవి = కాంతి, ఎన్నుమ్ = ఎప్పుడును, వాళ్లియే = వర్ధిల్లును గాక!, ఇరుక్కుమొళ్లి = ఋుక్రూపమైన వేదమును, ఎన్నెజ్జిల్ = నా మనస్సున, తేక్కినాన్ = నిండించిన వారగు ఆళ్వార్లు, వాళ్లియే =

మంగళముగా నుండుగాక, ఎన్దై = తండ్రియగు, ఎతిరాశర్క్కు = శ్రీరామానుజులకు, ఇఱైయవనార్= నాథులగు ఆళ్వార్లు, వాళ్ళియే = మంగళముగా నుండుగాక, కరుక్కుళ్ళియిల్ = భయంకరమైన గర్భవాసమను గోతిలో, పుకావణ్ణమ్ = ప్రవేశింపకుండు రీతిలో (పునర్జన్మలేనట్లు) కాత్తు + అరుళ్వోన్ = రక్షించి, అనుగ్రహించిన ఆళ్వార్లు, వాళ్ళియే = మంగళముగా నుందురుగాక, కాశినియల్ = భూమియందు, ఆరియనాయ్ = ఆచార్యులై, కాట్టినాన్ = (ప్రపత్తి మార్గమును) చూపిన ఆళ్వార్లు, వాళ్ళియే = వర్థిల్లుదురు గాక, వరుత్తమ్ + అఱ = ఆర్తినశించునట్లు, వన్దు = వేంచేసి, ఎన్నై = నన్ను, వాళ్విత్తాన్ = ఉజ్జీవింపచేసిన ఆళ్వార్లు, వాళ్ళియే = వర్థిల్లుదురు గాక, మధురకవితమ్బిరాన్ = మధురకవులకు ఉపకారకులగు ఆళ్వార్లు, వాళ్ళి వాళ్ళి వాళ్ళియే = నిత్యముశుభముగా నుందురుగాక!

**భావము** :- శ్రీకురుకాపురీశులగు ఆళ్వార్ల శ్రీపాదములకు శుభము. వారి అందమైన ముఖశోభ నిత్యము వర్థిల్లవలెను. వేదమును నాకు ప్రసాదించినవారు, శ్రీరామానుజులకు నాథులు, నన్ను గర్భవాసమను గోతిలో పడకుండ రక్షించినవారు, భూమియందు ఆచార్యులై అవతరించి, సన్మార్గమును చూపినవారు, సంసారదుఃఖము తీరునట్లు, (భూమిపై) అవతరించి, నన్ను ఉజ్జీవింపచేసినవారు, శ్రీమధురకవులకు ఉపకారకులు అగు నమ్మాళ్వార్లు నిత్యము మంగళముగా నుందురుగాక!

''చెవి ఎన్దుమ్'' అనునపుడు 'చెవి' అను పదము సంస్కృత 'ఛవి' శబ్దవికారముగా చెప్పవచ్చును. యతి కుదురుటకై అకారము ఎకారముగా మారుట తమిళభాషలో అచట అచట కన్పట్టుచున్నది. తిరుమాలై ప్రబంధములో ''కేట్టిరేనమ్బిమీర్కాళ్ గెరుడవాహనునుమ్ నిర్క'' ఇత్యాదిప్రయోగములు ఇందులకు ఉదాహరణములు. లేక 'శెవ్వి' అను ద్రావిడపదమే 'చెవి' గా మారినదనియు చెప్పవచ్చును. 'శెవి' అనగా పుష్పము వికసించినపుడు కల్గియుండుశోభ. ముఖము తామరపూవుతో పోల్చుట కవి సంప్రదాయము. కావున ఇట్టి యోజనయు అర్థవంతమే.

ప్రస్తుత పాశురము యతీంద్రప్రవణప్రభావమను (సంప్రదాయ) వరవరముని చరిత్ర గ్రంథమున కలదు. శ్రీమణవాళమహాముసులు దివ్యదేశములను దర్శించుచు, ఆళ్వార్ తిరునగరికి చేరినపుడు, అచటి నమ్మాళ్వార్ల అర్చావిగ్రహమునకు పైవిధముగా మంగళమును పాడినట్లు అచటి సందర్భము వలన తెలియుచున్నది.

## కంబమహాకవిచే రచింపబడిన

# శఠకోపర్ అన్దాది

శ్రీశఠకోపుల పరమభక్తుడగు కంబమహాకవి తమిళమున వారిని స్తుతించుచు నూఱుపాశురములను కల్గిన శఠకోపర్అన్దాది అను అద్భుతమైన ప్రబంధము రచించెను. అన్దాది ప్రబంధములను రచించిన ఆళ్వార్లను అట్టి అన్దాది ప్రక్రియలోని కంబుడు స్తుతించుట విశేషము. స్థాలీపులాక న్యాయమున మచ్చునకు ఇచట అందలి నాల్గుపాశురములు మాత్రము తాత్పర్యసహితముగా చూపబడుచున్నవి.

1) **వేదత్తిన్ మున్ శెల్క, మెయ్యుణర్న్దోర్ విరిఞ్జన ముదలోర్**
**కోదఱ్ఱ ఞానక్కళ్ నిన్దిన్ మున్శెల్క, కుణఙ్కడన్ద**
**పోదక్కడలెఙ్కడెఙ్ కురుకూర్ పునితన్ కవియోర్**
**పోదత్తిన్ మున్శెల్లుమే తొల్లైమూల ప్పరఞ్జుడరే.**

ప్రాచీనమైనది, అన్నిటికిని మూలమైనది, ఉత్కృష్టమైనదగు దివ్యజ్యోతియై వెలుగొందు శ్రీమన్నారాయణుడు వేదములను (**యతో వాచో నివర్తంతే** అనునట్లు) అతిక్రమించినను అతిక్రమించవచ్చును. తత్త్వములను తెలిసినవారగు మునులయొక్క, బ్రహ్మమొదలగు దేవతలు అందరియొక్క నిర్దుష్టమైన జ్ఞానము (యొక్క నిర్ణయమును) భగవానుడు దాటినను దాటవచ్చును. పరిచ్ఛేదించుటకు సాధ్యము కాని జ్ఞానముతో నిండిన సముద్రమగు మా నమ్మాళ్వార్లు సాయించిన పాశురములోని ఒకపాదమునైనను ఆభగవానుడు దాటగలడా?

2) **ఆయిరమా మఱైక్కుమ్మలం క్కారమ్ మరున్దమిళ్క్కు -**
**ప్పాయిరనాఙ్కవిక్కుప్పడి చ్చన్దమ్ పనువఱ్కెల్లామ్;**
**తాయిరునాఱ్ఱిశైక్కు త్తనిత్తీప న్దణ్ణఙ్కురుకూర్**
**శేయిరుమామరపు ఞ్జైవ్వియాన్ శెయ్ద శెయ్యుళ్కళే**

చల్లని కురుకాపురిలో అవతరించిన ఆళ్వార్లు అనుగ్రహించిన పాశురములు వేలసంఖ్యలోనున్న వేదములకు అలంకారములు. అరుదగు తమిళభాషకు ఉపోద్ఘాతములు. నాల్గువిధములైన కవిత్వములకు ఉదాహరణములు. సర్వశాస్త్రములకు తల్లి. ఎనిమిది దిక్కులకు దీపము.

ఈ ప్రబంధములోని పాశురములు అన్నియు విశేషార్థగుంఫితములు. నమ్మాళ్వార్లు రచించిన ప్రబంధములు అన్నియు మధురకవులకు ఆశువుగా, తమ భగవదనుభవ

పరీవాహరూపములుగా అనుగ్రహించిన వగుటచే ఆళ్వార్లు ఆశుకవి. ప్రారంభమునుండి చివరివరకు "శెవిక్కినియ శెఞ్జొల్లే" అనువిధముగా మధురములైన పాశురములను రచించుటచే వారు మధురకవి. "ఉయర్వర ఉయర్ నలముడైయవన్ యవనవన్" ఇత్యాదిగా శబ్దార్థలంకార సంఘటితములగు ఆళ్వార్ల పాశురములు చిత్రకవిత్వమునకు ఉదాహరణములు. అట్లే, భగవద్విషయమని పేరుపొందిన, పదకొండు పాశురములను కల్గిన నూఱు దశకములతో కూడిన తిరువాయ్ మొళ్ఱి ప్రబంధమునందు అంతట భగవానుడే విషయము కావున శఠకోపులు విస్తారకవి. ఇట్లు ఆళ్వార్లు నాల్గువిధములైన కవిత్వ ప్రక్రియలను తమ ప్రబంధములలో ప్రదర్శించుటచే చతుష్కవి.

3) పావైత్తిరువాయ్మొళ్ఱి ప్పళ్ఱత్తెప్పశుమ్ కఱ్పకత్తిన్
పూవైప్పారు కడలోప్పదా వముదై ప్పొరుళ్ శురక్కుమ్,
కోవై ప్పణిత్త వెజ్ఞైయల్లా వెన్నెక్కుఱ్ఱఱఙ్గొణ్డె -
న్నావై పళిప్పిను నల్లరన్డే మఱ్ఱైనావలరే.

తీయని రసమును కల ఫలము వంటిది, అడిగిన వారి అభీష్టములను అన్నిటిని ఇచ్చునది అగుటచే అందఱికి శిరోధార్యమైన, పచ్చని కల్పవృక్షముయొక్క పూవువంటిది, ఎంత భుజించినను తనివితీరనదియై, గొప్పక్షీరసముద్రమునుండి ఉద్భవించిన ఆరావముదమువంటిది, సత్ఫలితములు అను పాలను స్రవించు కామధేనువు వంటిది అగు తిరువాయ్ మొళ్ఱి ప్రబంధమును అనుగ్రహించిన మా స్వామిఅగు నమ్మాళ్వార్లను కాక వేరొకరిని పొగడి కవిత్వమును చెప్పిన నన్ను చూచి, అట్టి నాదోషమును గ్రహించి, ఆ అపరాధము నకు తగిన దండనగా మిగిలిన కవులందఱు నానాలుకను త్రుంచినను వారు మంచివారే అగుదురు కదా!

4) మనైయుమ్ పెరుమ్ శెల్వము మక్కళుమ్ మఱ్ఱైవాళ్వుమ్ తన్నై
నినైయుమ్ పదమెన నిన్రపిరాన్ కురుకూర్ విమలన్,
పునైయుమ్ తమిళ్క్కవియా విరుణీక్కిపొరుళ్ విళఙ్గి
వినైయుమ్ తిరివుఱ్ఱన కుఱ్ఱమ్నీఙ్గిన వేదఙ్గళే.

భార్యయు, గొప్పసంపదయు, సంతానమును మిగిలిన జీవితము అంతయు ఆళ్వార్లే అని భక్తులందఱు ధ్యానించునట్లున్నవారు, ప్రపన్నజనకూటస్థులు, కురుకాపురిలోని నిర్మలులు అగు నమ్మాళ్వార్లు పాడిన తమిళపాశురములచే తమస్సు( అజ్ఞానము, చీకటి) తొలగి, జ్ఞానము ప్రకాశించి, ఆత్మల కర్మసమూహము లన్నియునశించినవి. వేదములును నిర్దుష్టములయ్యెను.

❀ ❀ ❀



# అనుబంధము

## శ్రీపరాఙ్కుశ సుప్రభాతమ్

1. గాథాసహస్రకిరనక్షపితాత్మగూఢ
గాఢాన్ధకార మరవిన్దవిలోచనాఙ్గమ్ ।
శ్రీవైష్ణవద్విజనిషేవితమణ్డలేశం
ప్రాప్యం భజామి వకుళాభరణాబ్జబన్ధుమ్ ॥

2. శ్రీతింత్రిణీతరువరేతి ఫణీన్ద్రభోగ
పూర్ణేతరోరుపరి భక్తి గృహోధివాసిన్ ।
హంసధ్వజ ద్రవిడవేదశిరఃప్రవక్తః
శ్రీమాన్ పరాఙ్కుశమునేతవ సుప్రభాతమ్ ॥

3. నాథార్యదేశికవరో మధురః కవిశ్చ
గాథామయీ ద్రవిడవేదశిరః పరార్థాన్ ।
శ్రీమన్త్రరత్నమనురా ట్చరమార్థసారాన్
శ్రోతుం స్థితా శ్శఠరిపో తవ సుప్రభాతమ్ ॥

4. వాణీం మర్దనసుభగాం శ్రుతిమార్గసౌఖ్యా
న్దప్రదాం నవనవాం తవ నాథవల్లీమ్ ।
ఆకర్ణితుం స్వతనయప్రణుతా నిశాన్తే
ప్రత్యాగతాద్య శఠజిత్తవ సుప్రభాతమ్ ॥

5. నన్తుం నతార్తిహర ముత్తమ మాదినాథం
నీళామహీకమలపాణిసమేత మేతమ్ ।
స్తోతుం విభూతియుగళాధిప మాత్మనాథం
శ్రీకారినన్దనగురో తవ సుప్రభాతమ్ ॥

6. ఆపాదచూడ మభివీక్షితు మాదరాత్త్వా
మానన్దపూర్ణమనసా హరిభక్తిభుక్తిమ్ ।

ఆయాత్యయం యతివర స్సహ శిష్యవర్గైః
శ్రీకారినన్దనగురో తవ సుప్రభాతమ్ ॥

7. ఉత్తారకః స్వపదసంశ్రితదేశికానాం
పూర్ణార్యపాదసరసీరుహభృఙ్గరాజః,
రామానుజ స్తవ పదామ్బుజ మత్ర నన్తుం
తిష్ఠత్యసౌ శఠరిపో తవ సుప్రభాతమ్ ॥

8. శ్రీతామ్రపర్ణ్యభినవోత్తమతీర్థపూర్ణ
సౌవర్ణకుమ్భసమలంకృతమస్తకోఽద్య,
ఆరాధనార్థ మభియాతి గజః ప్రతోళ్యాం
దేయం పరాఙ్కుశకవే తవ సుప్రభాతమ్ ॥

9. ఛిద్రోర్ధ్వపుణ్డ్రవిలసన్నిజఫాలపట్టాః
కణ్ఠావలమ్బితులసీనలినాక్షమాలాః ।
స్నానోత్సవం తవ సమీక్షితు మాగతా స్తే
శ్రీవైష్ణవా వకుళభూషణ సుప్రభాతమ్ ॥

10. గాయం త్యహో సురుచిరాం మధురేణ గాథా
మారా త్తదేవకవినా ద్విజవంశజాతాః ।
శ్రీవైష్ణవా శ్శ్రుతిపథామృతధారరూపా
మాకర్ణయస్వ శఠజి త్తవ సుప్రభాతమ్ ॥

11. శ్రీతింత్రిణీతరువరప్రణుతాతిదీర్ఘ
శాఖాశిఖానిలయగౌ ప్రతిబద్ధహర్షౌ ।
శ్రీసారసౌరభయుత స్తవ పక్షిణౌ ద్వౌ
స్తోత్రం శ్రుణుష్వ కురుకేశ్వర సుప్రభాతమ్ ॥

12. నాథాదినాథశఠకోప ధరాధినాథ
బోధా త్పురైవ సమయః కమలాధినాథః ।

బోధక్షమాగుణవతః కమలాకృత స్తే
జాగృహ్యత శ్శఠరిపో తవ సుప్రభాతమ్ ॥

13. అత్యాదరేణ భవతోదితదివ్యగాథా
తత్త్వార్థసార మధికర్తు మమీ ప్రపన్నాః ।
కాంక్షన్తి తేఽఙ్ఘ్రి సరసీరుహయుగ్మ సేవాం
దాసాః పరాఙ్కుశమునే తవ సుప్రభాతమ్ ॥

14. ఆ షోడశాబ్ద మభివీక్ష్య పరం పుమాంస
మానన్దభక్తిరసభుక్తివివర్ధమానః ।
రామానుజార్యశరణః పరభక్తియోగ
నిద్రోఽసి కిం తవ పరాఙ్కుశ సుప్రభాతమ్ ॥

15. అబ్దైశ్చ షడ్భి రనిశం దశభి స్సమస్త
కల్యాణ దివ్యగుణపూర్ణ మవర్ణవాచ్యమ్ ।
స్తుత్వాఽనుభూయ పరిమీలితదిక్ప్రబన్ధైః
నిద్రాసి కిం శఠరిపో తవ సుప్రభాతమ్ ॥

16. ఆయాత్యయం వరవరో ముని రష్టభి స్తైః
దిగ్దన్తిభిః పరివృతస్తవ పాదపద్మమ్ ।
స్తోతుం భవాన్తరవిహాస్త్వ్యసుమన్త్రరత్న
శ్రీమత్పరాఙ్కుశ గురో తవ సుప్రభాతమ్ ॥

17. శ్రీకారిమారి సముదంచయితుం ప్రవృత్తః
శ్రీవేంకటాచలపతి ర్హి తవాత్మనాఽసౌ ।
లోకా నిమాం స్తు పరిరక్షతు మాత్తకామః
తస్యాద్య తే వకుళభూషణ సుప్రభాతమ్ ॥

18. యస్తింత్రిణీవిటపకోటరమధ్యవిష్టః
వైకుంఠనాథ కరుణామృతపూరపుష్టః ।
జ్ఞానప్రదీపవిదితాఽఖిల లోకవృత్తః
తస్యాద్య తే వకుళభూషణ సుప్రభాతమ్ ॥

# శ్రీశఠకోపాష్టోత్తరశతనామావళిః - 1

1. శ్రీమాన్ పరాంకుశమునిః శఠకోపో శమోదధిః ।
వకుళాభరణో యోగిప్రవరో భక్తి భూషణః ॥

2. హుంకారమంత్రనిర్ధూతశఠవాయుపరాక్రమః ।
కలిప్రారంభసంభూతో కలి కల్మషనాశనః ॥ (10)

3. లక్ష్మీనాథదయాలబ్ధసార్వజ్ఞ్యో సాత్త్వికాగ్రణీః ।
ప్రపన్నజనకూటస్థో ప్రకృష్టజ్ఞా శేవధిః ॥

4. దేవాధిరాజపాదాబ్జసేవోన్ముఖశయాంచితః ।
నిత్యముక్తోముముక్షుర్వేత్యేసమాశంకనోచితః ॥

5. క్షుత్పిపాసాదిదూరస్థః క్షుద్రమర్త్యానవేక్షకః ।
వేదార్థమయవాగ్గాతా వేదాభ్యదికసూత్రకః ॥ (20)

6. చతుర్నిగమపర్యాయచతుర్దివ్యప్రబంధకః ।
కృష్ణతృష్ణాతత్త్వనామా నామశేషితదుర్మతః ॥

7. దుర్మతధ్వాంతమార్తాండో మార్తాండాధికభాస్వరః ।
శ్రీవైష్ణవమతోద్ధర్తా హార్దధ్వాంతనిషూదనః ॥

8. మధుసూదనపాదాబ్జభృంగో దుస్సంగదూరగః ।
భగవద్గుణదుగ్ధాబ్ధినిర్మంథనవిచక్షణః ॥ (30)

9. విచక్షణమహావిద్వద్వ్యాఖ్యాత నిజవాక్తతిః ।
పరభక్తి పరజ్ఞానపరమప్రేమసాగరః ॥

10. సాగరాభ్యధికప్రేమభూమసాక్షాత్కృతాచ్యుతః ।
అపరోక్షసమస్తార్థః సర్వార్థనిధిసూక్తికః ॥

11. పరమైకాంతిభోగ్యార్థదివ్యసూక్త్యభివర్షకః ।
సత్సంప్రదాయసారార్థో ఘనసూక్తి సహస్రదః ॥

12. భగవద్భక్త పదగో (సకలార్థప్రదో మహాన్)
పరమవ్యోమనిలయాద్భుత చేష్టితబోధకః ॥ (40)

13. క్షీరసింధుశయానంతగుణోత్కర్షప్రపంచకః ।
సర్వాంతర్యామిభగవత్సాక్షాత్కారసమర్థధీః ॥

14. తామ్రపర్ణీతటోద్భూతో తింత్రిణీమూలగోఽపి చ ।
సుదూరాయాతమధురకవిసేవితపాదుకః ॥

15. భగవత్పాదుకాభూతో భూతభవ్యార్థ దర్శనః ।
నాథయోగితపశ్చర్యాప్రసన్ననిజమానసః ॥

16. భక్తి ప్రభావసంభూతాద్భుతభావపరంపరః ।
త్రైవిద్యవృద్ధమూర్ధన్య ఊర్ధ్వన్యస్తపదాంబుజః ॥ (50)

17. లలనాభావనాభుక్తపురుషోత్తమనాయకః ।
జననీవచనస్పష్టీకృతవ్యామోహవైభవః ॥

18. సఖీవచనసువ్యక్తీకృతానన్యార్హతాగుణః ।
సాధుసాత్త్విక సద్బృందసర్వస్వాయితసూక్తిదః ॥

19. నిర్గుణబ్రహ్మవాదిభమదమర్దనకేసరీ ।
రామకృష్ణాదిసత్కీర్తికీర్తనోత్ఫుల్లమానసః ॥

20. శౌరిచింతాదరిద్రాత్మ సహవాసజుగుప్సితః ।
సంసారిచేతనోద్ధారార్థోపదేశసహస్రదః ॥

21. భగవద్విరహోత్పన్న వైవర్ణ్యాంచితవిగ్రహః । (60)
విష్ణుపారమ్యనిష్కర్షనైపుణ్యప్రథమాస్పదః ॥

22. జ్ఞానముద్రావినిర్ధూతధూర్తదుర్జనదుర్మదః ।
కృష్ణసౌలభ్య సౌశీల్యాద్యుపదేశ విశారదః ॥

23. ఐహికాముష్మికైశ్వర్యకైవల్యాదివిదూషకః ।
భగవద్దివ్యమహిషీ సాధర్మ్యాంచితవిగ్రహః ॥

24. సౌమిత్రిభరతశ్వేతప్రహ్లాదాద్యుపమాస్పదః ।
వాసుదేవ స్సు మే సర్వ మితి నిష్కర్షభాసురః ॥

25. అసందిగ్ధావిపర్యస్తదివ్యశాస్త్రార్థవర్షుకః ॥
దేవతాంతరవైముఖ్యప్రాధాన్యప్రతిపాదకః । (70)

26. సుజ్ఞానపరిపాకాత్మజ్ఞానాద్యాస్పదమానసః ॥
విలంబరోషవ్రతస్య ధిక్కృతాచ్యుత సాంత్వితః ।

27. శ్రీవైష్ణవాభివృద్ధ్యర్థమంగళాశాస్తి గాయకః ॥
మాసషట్కత్రయోదంచన్మోహశాలీతివిశ్రుతః ।

28. అర్చావతారసౌలభ్యోపపాదనవిచక్షణః ॥
శ్రీమత్సుందరబాహ్వంగ సౌందర్యానుభవోత్సుకః ।

29. వేంకటాద్రీశకైంకర్యస్పృహామేదురమానసః ॥
కురుకాపురనాథాది నాథపారమ్యబోధకః ।

30. తిరుక్కురుంగుడిక్షేత్రపూర్ణలావణ్యవిహ్వలః ॥
తోత్రాద్రినాథభగవదాహ్వానవ్యవసాయివాన్ । (80)

31. అపర్యాప్తామృతామేయభోగ్యతాకృష్టమానసః ॥
వల్లవాళక్షేత్రయాత్రేప్సామాత్ర వ్యాముగ్ధ మానసః ।

32. తిరువణ్ వణ్డుదేశేశవిశ్లేషప్రథితవ్యథః ।
తిరువిణ్ణగరాధీశాద్భుతశక్తిప్రకాశకః ॥

33. యమళక్షేత్రదేవేశపద్మాక్ష క్షేమవిక్లబః ।
తిరుక్కోళూరువిత్తేశ ప్రావణ్యాతిశయోజ్జ్వలః ॥

34. శ్రీరంగేశయసందత్తవ్యామోహాతిశయాంచితః ।
తిరుప్పేరైస్థలాధీశాభినివేశవశంవదః ॥

35. తిరువారన్విళైక్షేత్ర శ్రీశకైంకర్య హృష్టధీః ।
బృహత్పురస్థలాధీశ సక్తా శోకనిజస్థితిః ॥ (90)

36. తిరువణ్పరిశారేశ సౌకుమార్యవిభావనః ।
తిరుచ్చిత్తారు భగవత్ శౌర్యవీరప్రసన్నహృత్ ॥

37. తిరుక్కడిత్త నాథస్య సౌహార్దానుభవోన్మనాః ।
శ్రీమద్వ్యాఘ్రపురాధీశ శ్రీవైలక్షణ్యవిముగ్ధధీః ॥

38. స్వబుభుక్షోపచాపల్యమూర్తిత్రితయకింకరః ।
కాట్కరైక్షేత్రనాథస్య మహాగుణవిభావనః ॥

39. తిరుమూళిక్కళక్షేత్రనాథలావణ్యలోలుపః ।
తిరునావాయభిఖ్యాతస్థలయాత్రామనోరథః ॥

40. శ్రీకృష్ణపుర రాట్ శౌరి మోక్షదాతృత్వచింతకః ।
మోహన క్షేత్ర నాథోక్త మార్గబంధుత్వహర్షితః ॥ (100)

41. అనంతశయనక్షేత్ర సేవా హేవాకసంభృతః ।
తిరువాట్టారుభగవత్‌దర్శితప్రేమవిస్మితః ॥

42. స్వప్రాకృతవపుర్ముగ్ధ పవనాద్రీశోపదేశకృత్ ।
స్వాంగీకారావకాశేప్సుబృహత్పూరీశ హర్షితః ॥

43. అర్చిరాదిమహామార్గసౌవాదనవిబోధకః ।
అతిమాత్రస్వకీయార్తిపూర్తిహర్షితమాధవః ॥

44. స్వలాభహృష్టలక్ష్మీశ ముఖోల్లాస ప్రహర్షితః ।
ప్రపన్నజనసౌభాగ్య మూర్త్యర్చామూర్తిదర్శకః ॥

45. ఇత్థం శఠకోపస్య నామ్నా మష్టోత్తరం శతమ్ ।
అనుసందధతాం పుంసా మావిస్స్యుః సర్వసంపదః ॥

* * *

# శ్రీశఠకోపాష్టోత్తరశతనామావళిః - 2

1) శ్రీమత్పూత్రవతీ ప్రాణమిత్రరూపావతారకః ।
శ్రీశ్రీశగుణభావజ్ఞో తథాచ శ్రీపరాంకుశః ॥

2) నిష్ణదర్శనసంధాతా వివిక్తవిహితస్థితిః ।
గృహీతనాయకీభావో దాతీకక్రౌంచదంపతిః ॥

3) హంసవాహసమారూఢో గరుడోపమసామవాన్ ।
నళినీతులసీమాలీ పుండ్రైః ద్వాదశభి ర్యుతః ॥

4) శ్రీరంగరాజపాదాబ్జమకరందమధువ్రతః ।
అనంతఫణశాఖాఢ్యతింత్రిణీ మూలమందిరః ॥

5) శ్రీరామానుజసంపృక్త పాదపద్మవిరాజితః ।
కురుకూర్‌విహగశ్రేష్ఠపాణితోభయపార్శ్వకః ॥

6) శిష్యభావసమాయాత మాధుర్యకవిపాలకః ।
శ్రీమన్నాథ మునీంద్రాయ ద్రావిడామ్నాయబోధకః ॥

7) అస్పృష్ట కలిమాలిన్యో శఠకోపాఖ్యనామకః ।
వకుళామోదసమ్మృష్టనీలధమ్మిల్లరంజితః ॥

8) జీవేశ్వరాదిభావజ్ఞో జ్ఞానముద్రావిరాజితః ।
పద్మాసనే సమావిష్టో బ్రహ్మధ్యానపరాయణః ॥

9) సర్వశాస్త్రార్థతత్త్వజ్ఞో సంసారమలమోచకః ।
శేషాచలేశపదయోః సంవిష్టశరణాగతిః ॥

10) శ్రీవైష్ణవాంఘ్రిసంసేవీ శ్రీకృష్ణగుణధారకః ।
అష్టోత్తరశతస్థానవిష్ణువిగ్రహసేవితః ॥

11) ప్రపన్నజనకూటస్థో పంచమోపాయదర్శకః ।
పవిత్రీకృతభూభాగః ప్రపన్నజనతాశ్రయః ॥

12) రమాజానిగుణాభోగబుభుక్షాయత్తమానసః ।
ఆదినాథమనఃపద్మవిహరన్మధులోలుపః ॥

13) శిరోభూతవనాద్రీశో వల్మీభూత వనాద్రిపః ।
ఆత్మీభూతమహామాయా దూరీకృతమనోమలః ॥

14) అస్మత్కులధనాపన్నో శ్రీవైష్ణవశిరోమణిః ।
ప్రపత్త్యుపాయ నిష్ణాతః పంచకాలపరాయణః ॥

15) సర్వవేదార్థతత్త్వజ్ఞో సంసారార్ణవతారకః ।
నారాయణైకశరణో నారబృందవిశేషకః ॥

16) ప్రణతార్తి హరో ధీరో కారిపుత్రో జితేంద్రియః ।
తామ్రపర్ణీతటీధామో తత్త్వయాథాత్మ్య బోధకః ॥

17) ప్రథమార్యో వినీతాత్మా ద్రావిడామ్నాయసేవధిః ।
సత్సంప్రదాయశరణో శఠానాం బుద్ధిదూషకః ॥

18) ప్రపన్నానన పద్మార్కో కుమతధ్వాంతభంజకః ।
యతీశమత పాదాబ్జో యామునేయ గుహాశయః ॥

19) భవితవ్యార్థసంధాతా నిత్యశాంతియుతో దమీ ।
చరమార్థప్రదో దేవో సేనేశప్రియకృత్ మునిః ॥

20) నిశ్చలో నిర్మలజ్ఞానో విష్ణుశేషత్వబోధకః ।
విష్ణ్వధిష్ఠానతన్మనః పరమప్రాప్యసంప్రదః ॥

21) శ్రీనాథనాయకీగర్భశుక్తిసంజాతమౌక్తికః ।
కృపామాత్రప్రసన్నార్యో కుదృష్టిమతభంజకః ॥

22) పాషండమతవిచ్ఛేత్తా బౌద్ధచార్వాకభజంకః ।
ఈశార్పితేషాత్రితయో పరబోధైక తత్పరః ॥

23) శీలాదిగుణసంపన్నో వైష్ణవో విష్ణుమందిరః ।
పాశురీభూతసోపానవిష్ణుమార్గప్రదాయకః ॥

24) మందస్మితో వీతరాగో మాన్యో సూరిముఖ్యోఽగ్రణీః ।
దివ్యోపవనసంవీతో మణిప్రాకారవేష్టితః ॥

25) మోక్షాఖ్య ఫలదో శేషీమధ్యమోకురుకాధిపః ।
పరకాలముఖసూర్యగ్ర్యలసత్ గ్రైవేయరాణ్మయే ॥

26) ఆషోడశాబ్దం సమ్మూ్మకో శిష్యలాభాత్ప్రభాషణః ।
శ్రీరూప పరమాచార్యో సుందరోఽతిమనోహరః ॥

27) శ్రీశానుభవసంయుక్తో శ్రీపరాంకుశచంద్రమాః ।
ఆచార్యకూటఘటిత శ్చార్చిర్లోకాదిమార్గదః ॥

28) సర్వభూతానుకంపీ చ సర్వలోక నమస్కృతః ।

* * *

శ్రీమతే శఠకోపాయ నమః

# శఠారితిలకమ్

నమ్మాళ్వార్లను స్తుతించు 32 ఆర్యావృత్తములతో కూడిన ఈ చిన్నకృతి తిరుపతి ఓరియంటల్ రిసెర్చి ఇన్‌స్టిట్యూట్‌లో లభించినది దీని ప్రతి ఒక్కటియే దొరుకుటచే అపూర్వమైనది. స్తుతికర్తపరవస్తు శ్రీరంగలక్ష్మణార్యుడని, ఇతడు గర్గకులమునకు చెందినవాడని, శ్రీనివాస లక్ష్మణాచార్యుల శిష్యుడని మొదటి, చివరిశ్లోకమున తెలియుచున్నది. కవియొక్క కాల దేశాది విశేషములు తెలియవు. ఇతడు ఇంకను "**కనకవల్లీతిలకమ్**" వంటి ఇట్టి స్తోత్రములను మాత్రము రచించినట్లు తెలియుచున్నది

**శ్రీవాసలక్ష్మణ గురోః చరణౌ శరణం భజే ।**
**యదధీనం మమాశేష మైహికాముష్మికం ఫలమ్ ॥**

1) అశరణకదంబశరణం, వకుళాభరణం వృణీమహే శరణమ్ ।
యదనుగ్రహా దనక్షర, కుక్షి రపి శ్లాఘ్యభారతీ శరణమ్ ॥

2) వందేయ వకుళపరిమళ, వాసితయద్దివ్యసూక్తిమాధుర్యాత్ ।
న వహతి సోఽపి "రసో వై స" ఇతి శ్రౌతో రసోఽపి మాధుర్యమ్ ॥

3) పంచేంద్రియపంచానన, పంచకపంచత్వకరణచంచు మహమ్ ।
అంచామి వంచితశఠం, చించాతరుమూలవాసినం కమపి ॥

4) పాపకరికుంభపాటన, పాటవమిళితః పరాంకుశః పాయాత్ ।
ప్రణతజనపటలపావన, చటుల స్స హినః, పరాంకుశః ప్రణతాన్ ॥

5) శఠరిపుచరణసరోరుహ, యుగళం నిగళం నిరర్గళం భవతు ।
అతివిషయవిషమవిపినా, నర్గళసంచారిహృదయకలభస్య ॥

6) శరణం తచ్చరణయుగం, కరుణాశరణం దదర్శ యో మధురామ్ ।
ద్రవిడోపనిషద మంత, ర్గుంభితసకలత్రయీశిరస్సారామ్ ॥

7) వకుళధరమునివరం తం, వందే యత్సూక్తిరంజిత స్వాంతః ।
ప్రజయతి కిల స్వకాంతా, కాంతవచశ్శాంతసమ్మదోఽనంతః ॥

8) సమ్మోదయతు శఠారిః, సరసతమా యస్య సూక్తయో మహతామ్ ।
సహసా సముద్వహంతే, సద్యః పరమాత్మచిత్తరంజకతామ్ ॥

9) పరమతనికర పిశాచో, చ్చాటనపటవ స్సదా మహామంత్రాః ।
మహితవిశిష్టాద్వైత, ప్రతితంత్రాః యద్గిర స్తమీడేఽహమ్ ॥

10) జగతి జయంతి విపంచీ, తంత్రీస్పృహణీయ గానశాలిన్యః ।
కర్ణామృతవాహిన్యః, శఠరిపువాచో మనోనివాసిన్యః ॥

11) కర్ణామృతాని మన్వై, శఠరిపుసువ్యాహృతాని మహితాని ।
శర్మాణి యత్పరిచయా, దితరాణి గిరా మగోచరాణి స్యుః ॥

12) శఠరిపుకటాక్షమాలా, విమలా నివసంతు తా మయి త్వచలాః ।
యన్మాలా ఇహ విపులాః, భువి దివి జాగ్రంతి సంపద స్సకలాః ॥

13) శిరసా వహే పరాంకుశ, పాదపయోజాత పాంసుపుంజ మహమ్ ।
సద్యో యదన్వయా దిహ, సాత్వికతా మేతి రాజసోఽప్యమితామ్ ॥

14) శఠరిపువచోఽమృతం యః, పిబతి స కిం కాంక్షతేఽమృతం దివి చ ।
త్యక్త్వామృతం కరస్థం, వాంఛతి కో వేహ వారివాహస్థమ్ ॥

15) అతివితతదురవగాహ, శ్రుతిమకుటీ పారదర్శినం చేతః ।
అసతా మపి మహతా మపి, శరణం శఠకోపదేశికం శ్రయతామ్ ।

16) శఠవైరిపదసపర్యాః, మహితరసాస్వాద నైకదినచర్యాః ।
అధరితవిబుధైశ్వర్యాః, ఇహ భువి మే సంతి తే మదాచార్యాః ॥

17) మహితగుణ మన్వర్థం, మధురకవిస్వాంతసంపుటే నిహితమ్ ।
రత్నం శఠరిపు నామ, ప్రత్న మయత్నప్రకాశనం జయతు ॥

18) అఘటితఘటనాపటు రపి, విఘటితనళినాసనాది విభవోఽపి ।
శఠరిపుపదవిముఖో యది స తు కిము సంసార సాగరం తరతి ॥

19) సప్రణయో విప్రణయో, గతవినయో వా విముక్తవినయో వా ।
శఠరిపు రితి యః స్మరతి, స్వయ మిహ స హి ముక్త ఏవ విస్ఫురతి ॥

20) శుకతాతతు తత్తాతతు, భువనే శుకతాతతాతతాతతు చ ।
కోఽపి శఠవైరిగాథా, గానసుధాపానశీల ! జీవతి కిం?

21) శాపాయుధోఽపి కోఽపి, భ్రుకుటీభటసత్కళా కలాపోఽపి ।
భవతి స హి నిరవలేపో, భగవచ్ఛఠకోప సూక్తి మాత్రవతి ॥

22) మతిలేశగోష్పదీకృత, గీష్పతిమహిమ్నార్ణవోఽపి కోఽపి స్యాత్ ।
శఠరిపుగాథారసభు, జ్నికటే కిల హంత నమ్ర మకుటోఽ యమ్ ॥

23) చతురాగమచతుర్ణర్ణవ, నౌ రపి చతురాననోఽపి చతురోహా ।
వకుళధరవైభవార్ణవ, సీమ న మాతుం కదాపి శక్నోతి ॥

24) రహసి ముదా స్పృహణీయం, ద్విషతా మపి యద్వచః స్తు రమణీయమ్ ।
తద్వకుళాభరణీయం, తనుతా దనుపద్రవం చ ధరణీయమ్ ॥

25) తద్వస్త్వపి స్వతంత్రం, జగదీశం యత్కటాక్ష పరతం త్రమ్ ।
తజ్జయతు ప్రతితంత్రం, తస్య శఠారేః విధూతపరతంత్రమ్ ॥

26) జగదవనజాగరూకః, జయతు జరీఝృంభదచ్యుతాలోకః ।
స్వాధీనవిష్ణులోకః, శఠరిపు రాకుంఠితద్విషల్లోకః ॥

27) జగదుజ్జీవనహేతోః, నాథమునిభ్యః సమస్తసారార్థాన్ ।
య స్సదయ ముపదిదేశ, శ్రీశఠకోపః శృణాతు నః పాపాన్ ॥

28) లక్ష్మీ సహచరచరణ, ద్వంద్వం యదభిఖ్య మేవ నిర్ద్వంద్వమ్ ।
జయతు జగచ్ఛరణం తత్, చరణయుగం నిత్య మేవ నః శరణమ్ ॥

29) య స్తు శఠకోపనామా, విశసితశఠకోప నామధేయోఽపి ।
సహ కరుణ శ్శఠకోపం, మా మిహ తన్వీత శమితభవతాపమ్ ॥

30) సతతం కటాక్షయే దిహ, మా మపి శరణాగతం శఠారిగురుః ।
భాగవతచరణధారక, పోషకభోగ్యో యథా భవేయ మహమ్ ॥

31) వకుళధరమహర్షి రనిశం, వినతే మయి స ప్రసీదతు శ్రీమాన్ ।
సానందధుర్యథాహం సరసతదీయోక్తిసారవేదీ స్యామ్ ॥

32) పరవస్తువంశజనుషా, విదుషా శ్రీరంగలక్ష్మణేన కృతమ్ ।
వకుళధర మహర్షితిలకం, వసతాం మహతాం ముఖారవిందేషు ॥

33) శ్రీగర్గవంశ పరవస్తుకులావతీర్ణ -
శ్రీరంగలక్ష్మణ సమాహ్వయదాసవర్యమ్ ।
అంతర్విశన్న అవద దాలిఖ దేత దీశః
స్వప్రీతయేఽ హమిహక స్తదయం స జీయాత్ ॥

❀ ❀ ❀

# తిరుమఞ్జనక్కవి - 1

ఆళ్వార్ తిరునగరి అను దివ్యదేశమున ఆళ్వార్లకు అభిషేకమును చేయు సందర్భమున అణ్ణావియార్ అను అచటి ఆచార్యపురుషులు అనుసంధించు అభిషేకగద్యలివి. లభించినంతవరకు భక్తుల అనుసంధానమునకు అనువుగా ఇచట ఇవ్వబడుచున్నవి. ఇవి ఇరువదికి పైగా కలవు. వీని కర్తృత్వ వివరములు తెలియవు.

క్షీరాబ్ధేః రంగనామ్నా సహ విదితసదనం శ్రీవిమానేన గత్వా
రూపేణ స్వేన సార్ధం సుచిరమధుర మిక్ష్వాకుపుర్యా ముషిత్వా ।
మధ్యేకావేరి సుప్తం ఫణిపతిశయనే త్వత్కృతే రంగరాజం
మత్వా గాతుం శఠారే అపి శివవిధిముఖైః త్వా మిహాలంకరోషి ॥

నాయన్దే, నాయన్దే, "భక్తిప్రభావభవదద్భుతభావబంధసందుక్షితప్రణయసార రసౌఘపూర్ణః" ఎన్ఱుమ్, "ఆరాతకాతల్ కురుకూర్ శడగోపన్" ఎన్ఱుమ్ శొల్లుకిఱపడియే క్లిష్టత్రిష్ణాతత్త్వకల్పరాయ్, త్రైవిద్యవృద్ధజనత్తుక్కుమ్, సాత్వికజనత్తుక్కుమ్, అశరణ్యాజనత్తుక్కుమ్ సంపచ్ఛరణ్యమాయ్, మాతాపితృ ప్రభృతి సర్వవిధ బంధువుమాన చరణనళినయుగళత్తై యుడైయవరాన దేవరీర్, ఇప్పోదు తిరునక్షత్రోత్సవదీక్షితరాయ్, కరసరసిజధృతకౌతుక రాయ్, నిరవధికసౌందర్యాదికల్యాణనిధియాన దివ్యమంగళవిగ్రహత్తై సకలమనుజ – నయననివహ విషయమాక్కి క్కొణ్డు, పుఱప్పట్టు, ఉలావి, యరుళి, మీణ్డుమెழுన్దరుళి తిరుమఞ్జనమ్ కొణ్డరుళువ దాక మఞ్జన వేదికామధ్యత్తిలే జ్ఞానముద్రాసహితరాయ్ క్కొణ్డు ఎழுన్దరుళియిరుక్కిఱ ఇరుప్పు ఎజ్గనే ఇరానిన్ఱదు. ఎజ్గనే ఎన్నిల్–

"వైకుంఠే తు పరే లోకే" ఎన్గిఱపడియే పరమపదమాన శ్రీవైకుంఠత్తిలే శుద్ధసత్త్వమయమాయ్, స్వయంప్రకాశమాయ్, నిరవధికతేజోరూపమాన దివ్యమంగళవిగ్రహత్తోడే నిత్యముక్తరుక్కు భోగ్యనాయ్క్కొణ్డు ఎழுన్దరుళియిరుక్కిఱ విదు బద్ధచేతనజాతత్తుక్కు దేశ విప్రకృష్టమాకైయాలే, భుక్తభోగత్తిలే నెఞ్జశెల్లామల్ "ఎన్శెయ్వోమ్" ఎన్ ఊహిత్తుక్కొణ్డు వ్యూహిత్తు, "అడైయుమ్ వైకున్దముమ్ పాఱ్కడలుమ్" ఎన్గిఱపడియే పడుక్కైపఱ్ఱిన తిరుప్పాఱ్కడలిలే ఎడుత్తువిట్టు, "పాలాழி నీకిడైక్కుమ్ పణ్బైయామ్ కేట్టేయుమ్ కాలాழுమ్ నెఞ్జழிయుమ్ కణ్శుழலుమ్" ఎన్ఱు నిదానజ్ఞర్ఈడుపడుమ్బడి భవాబ్ధినిమగ్నరాన సంసారికళై ఉద్ధరిప్పిక్కైక్కాక మహోబ్ధిమధ్యే పళ్ళికొణ్డరుళిన ఇదువుమ్ అతిశయితభాగధేయరాన విధిశివసన కాదికళుక్కే లభిక్కుమదాయ్ మణ్ణిఱన్దు మణ్ణాకుమ్ మానిడర్క్కు క్కణ్ణుక్కువిషయమాక ప్పోఱామైయాలే, అన్నజలశయనత్తై విట్టు స్థలశయనత్తై విరుమ్బి, "పాలిల్ కిడన్దదువుమ్ పణ్డరఙ్గమ్ మేయదువుమ్" ఎన్గిఱపడియే, "యావరుమ్ వన్దడివణఙ్గ అరఙ్గనకర్ తుయిలువ" దాక క్కోలి

ఎழுந்దరుళియిరుక్కిన్ఱ వళవిల్ చతుర్ముఖతపఃఫలనిర్వహణార్థమాక శ్రీరంగవిమానత్తోడే స్వాసాధారణ దివ్యమంగళవిగ్రహవిశిష్టరాయ్ క్కొణ్డు బ్రహ్మలోకత్తిలే ఎழுந్దరుళియిరున్దు, పిన్బు ఇక్ష్వాకు వినుడైయ తపోవ్యాజత్తలే ఇక్ష్వాకుప్రభృతిదశరథ పర్యంతమాన రాజాక్కళాలుమ్, తయరతర్క్కుమ్ మకనాన తన్నాలుమ్ అర్చితరాయ్, రామావతార చరమత్తిలే "శ్రీమద్రంగం మహద్ధామ సత్త్వజం సపరిచ్ఛదమ్,సంప్రాప్తం రాక్షసేంద్రాయ ప్రియాయ ప్రియకారిణే" ఎన్గిఱపడియే శెల్వవిభీడణర్క్కు వేఱుక నల్లానాకైయాలే మిన్నిలఙ్గ విభీషణనవిబ్కుక్కు కోవిలాழ்వారోడే తమ్మై ఉపకరిత్తరుళ, అవరుమ్ తమ్ముడైయ వీడాన ఇలఙ్కైయై నోక్కి ఎழுந్దరుళువిత్తుక్కొణ్డు పోకానిఱ్క, గఙ్గైయిల్ పునిదమాయ్ కావిరి నడువిల్ శ్రీచంద్రపుష్కరిణీ తీరప్రదేశమాన పులినత్తిలే ఎழுந்దరుళవిత్తువైత్తు, అనన్తరమ్ అవరాలుమ్ ఎழுந்దరుళవైక్క వొణ్ణాతపడి అవ్విడత్తిలే తిరువుళ్ళమ్ పఱ్ఱి మన్నుడైయ విభీషణనై అనుగ్రహిత్తు మదిళిలఙ్గై యేఱప్పోక విట్టు "అరవరశప్పెరుమ్ శోది అనన్దనెన్నుమ్ అణివిళఙ్గుముయర్ వెళ్ళై యణైయైమేవి, పరత్వమ్ పోల ఆశ్రయిప్పార్క్కు అనన్తర పట్టిరుత్తల్, వ్యూహమ్పోలే కడల్కొణ్డు కిడత్తల్, విభవమ్ పోలే అప్రత్యక్షత్వమాతల్ శెయ్కైయన్ఱిక్కే, వడివుడైవానోర్ తలైవనే, కడలిడమ్ కొణ్డ కడల్వణ్ణా, కణ్ణా, కట్కిలీ, ఎన్నువ్బడి పరత్వాదికళుళ్ల పరత్వసౌలభ్యాదికళై ప్రకాశిప్పిత్తుక్కొణ్డు, అణ్పొడు తెన్తిశైనోక్కి పళ్ళికొణ్డరుళుకిన్ఱ ముకిల్ వణ్ణనాన పెరియపెరుమాళై అడియై యడైన్దరుళ్శూడి, ఉయ్న్దు శోల్ మాలై యాయిరముమ్ అరుళిచ్చెయ్దరుళిన దేవరీర్ ఇప్పోదు "కఙ్గులుమ్ పకలుమ్" పాడి యరుళువదాక తిరువుళ్ళమ్ పఱ్ఱి భర్తృభోగార్థమాక కుళిత్తొప్పిత్తుచ్చెల్లుమ్ భార్యైయైప్పోలే ఎన్ తిరుమకళ్శేర్ మార్బన్ ఎన్గిఱపడియే విశ్వపతియాన అழகియ మణవాళరుక్కు "తిరు" ఎన్నుమ్బడి లక్ష్మీసమరాకైయాలే అలంకృతసర్వగాత్రరాయ్ చ్చెల్లవేణుమ్ ఎన్ఱు తదర్థమాక తిరుమఞ్జనమ్ కొళ్ళ ఎழுந்దరుళియిరుక్కిఱాపోలే ఇరానిన్ఱదు, జయ విజయీ భవ.

## తిరుమఞ్జనక్కవి -2

గాతుం పూర్వస్థితేంద్రం మధురకవిముఖైః భృత్యవర్గైశ్చ సార్థం
స్తోతుం వేద్యాం నిషణ్ణ స్తదనుగుణసుమాల్యాంబర స్త్వం శఠారే।
దాతుం ముక్తిం స్వకాంత్యేచ్ఛసి కి మిహ నృణాం శాస్త్రమార్గాదికానాం
స్వాతంత్ర్యా దేవ కృష్ణః ప్రతత దిహ యదా చింతయంత్యై స్వరూపమ్॥

నాయన్దే ! నాయన్దే !

"అంధం తమ స్తిమిరనిర్మిత మేవ యత్ స్యాత్ తత్సారసాధితసుత స్త్వతివృత్తవార్తమ్" ఎన్గిఱపడియే తిమిరసారనిర్మిత మెన్నుమ్ పడి ఇరుణ్డుశురుణ్డ తిరుక్కుழఱ కణఱ్ఱైయుమ్,

అష్టమీచన్ద్రనిభమాన తిరునెఱ్ఱియుమ్, అన్ద చంద్రమధ్యత్తిలే ఒరు అమృతధారై ఎన్నలామ్బడి తిరునెఱ్ఱియిల్ అఴకు పెఱ శాత్తిన తిరునామముమ్, మన్నియశీర్ మదనన్ కరుమ్బుచ్చిలైయై యుమ్ తన్నఴకాలే వెల్లుమ్ తిరుప్పురువముమ్, అనవధికదయానురాగవాత్సల్య సూచకఙ్గళాయ్ అప్పోదలర్న్ద తామరై పూప్పోలే ఇరుక్కిఱ తిరుక్కణ్గళుమ్, కల్ప్రల తాకల్పమాన తిరుమూక్కుమ్, బింబవిద్రుమదంభహారియాన తిరువధరముమ్, శుత్త నిస్తలాలిపోల ఇరుక్కిఱ తిరుముత్తునిరైయుమ్, కర్ణికావిలసితమాన కర్ణపాశముమ్, దృష్టిచిత్తాపహారియాన చుబుక కపోలఙ్గళుమ్, క్రముకతరుణగ్రీవాకంబుప్రతిమమాన తిరుక్కఴుత్తుమ్, కనక గిరియై కడ్డైదుత్తాప్పోలే ప్రణతరక్షాదీక్షితమాన తిరుత్తోళ్కళుమ్, జ్ఞానప్రదన్ ఎన్నుమిడత్తై క్కోళ్శొల్లుకిఱ జ్ఞానముద్రాంకితమాన కరకాంతియుమ్, అఖిలజనమనోహరమాయ్, అనేక భూషణభూషితమాయ్ వకుళదామవిరాజితమాన వక్షఃస్థలముమ్, అక్షయపాపహారియాన కుక్షిప్రదేశముమ్, సౌందర్యామృతనీరపూరపరీవాహావర్తగర్తాయితమాన తిరునాభియుమ్, తిరువరైప్పూత్తాప్పోలే ఇరుక్కిఱ దివ్యాంబరశోభైయుమ్, రంభాస్తంభసహోదరమాన తిరుత్తొడైకళుమ్, కకుద్మత్కకుద్నిభమాన తిరుముఴఙ్కాళ్కళుమ్, పఙ్కజదళతుల్యఙ్గళాన జంఘైకళుమ్, ''యద్వా శరణ్య మశరణ్యజనస్య'' ఎన్గిఱపడియే అశరణ్యశరణ్యముమాయ్ తక్షణోన్మీలితసరసి జజైత్రమాన చరణయుగళముమాయ్, ఇప్పడి సర్వావయవసుందరమానదివ్యవిగ్రహత్తై యుడైయరాన దేవరీర్ ఇప్పోదు తిరువధ్యయనోత్సవ దీక్షితరాయ్ స్వశిష్య తమరాన మధురకవిప్రభృతిసజ్జనఙ్గళోడు పాలిన్దునిన్దపిరానై ప్పాడియరుళువదాక సంకల్పిత్తు, అలంకృతగాత్రరాయ్ చ్చెన్ఱు సేవిక్కవేణ్డుకైయాలే తదఙ్గమాక త్తిరుమఞ్జనమ్ శెయ్యవేణుమెన్ఱు మఞ్జనవేదికామధ్యత్తిలే జ్ఞానముద్రాసహితరాయ్ క్కొణ్డు ఎఴున్దరుళియిరుక్కిఱ ఇరుప్పు ఇఙ్గనే ఇరానిన్ఱదు – ఎఙ్గనే ఎన్నిల్ –

చింతయంతీ జగత్సూతిం పతిం కృష్ణస్వరూపిణమ్ ।
నిరుచ్ఛ్వాసతయా ముక్తిం గతాన్యాఽగోపకన్యకా ॥

ఎన్గిఱపడియే అజ్ఞాతభగవద్విషయైయాన చింతయంతిక్కు స్వవిగ్రహస్మరణహేతుక మాక తన్నుడైయ నిరంకుశస్వాతంత్ర్యత్తాలే ముక్తియైక్కొడుత్త శ్రీకృష్ణనై ప్పోలే ఇహలోకత్తిలే విషయప్రవణరాయ్ రూపాభాసమ్ కొణ్డు విషయఙ్గళిలే మేల్విఴున్దు తిరికిఱ సంసారిచేతనరుక్కు దేవరీర్ వడివఴకాలే విషయాంతరవైముఖ్యత్తై విళైవిత్తు ''నమ్బినేన్ మడవారైయుమ్ మున్నెలామ్, శెమ్బొన్ మాడత్తిరుక్కురుకూర్ నమ్బిక్కన్బనాయ్ అడియేన్ శదిర్త్తేనిన్ఱే'' ఎన్ఱు వాయ్ప్పులమ్బుమ్బడి పణ్ణి, ''మేవినేన్ అవన్ పొన్నడి మెయ్మ్మైయే, తేవు మఱ్ఱఱియేన్'' ఎన్ఱు అవిదితాన్యదైవతమాయ్ క్కొణ్డు దేవరీర్ తిరువడికళై ప్పఱ్ఱి నిన్ఱు అడిమైశెయ్కైయాకిఱ కైంకర్యానందత్తైయుమ్ కొడుత్తరుళువదాక త్తిరువుళ్ళమ్ పఱ్ఱి, తదర్థమాక త్తిరుమఞ్జనమ్ శెయ్య ఎఴున్దరుళి ఇరుక్కిఱాప్పోలే యిరానిన్ఱదు. జయ ! విజయీ భవ !

# తిరుమఞ్జనక్కవి -3

మేశం కేశాదిదేవావిదితనిజపదంవ్యూఢ మధ్యామరేంద్రం
స్వేయం స్వాచాతిరేకప్రవహితవచనాభిష్టుతం త్వద్యక్ర్త్వా।
గీతం గాత్వాఽథ గోదాకృత మిహ తమలం తర్పయిత్వా చ లబ్ధాం
గేహం తస్మాత్ కృతార్థః త్వ మిహ శఠరిపో స్నాసి నః శ్రాంతిశాంత్యై॥

నాయన్దే ! నాయన్దే !

శ్రియఃపతియాయ్, అవాప్తసమస్తకామనాయ్, సమస్తకల్యాణగుణాత్మకనాయ్, శ్రీవైకుంఠనికేతనాయ్, నిత్యసూరిపరిషన్నిరంతరసేవ్యమానచరణనళిననాయ్క్కొణ్డు, నిత్యానంద నిర్భరనాకచ్చెల్లానిఱ్కచ్చెయ్దే '' ఏకాకీ న రమేత'' ఎన్ఱు ఆదు ఉణ్డాదు ఉరుక్కాట్టాదే అచితద్విశిష్టమాన చేతనసమష్టిపక్కల్ ''అరుళ్పురిన్దశిన్దై అడియార్మేల్వైత్తు'' ఎన్గిఱపడియే పరమకారుణికనాయ్, స్వచరణకమల సమాశ్రయణానుకూలమాన కరణకళేబరఙ్గళై కొడుక్కక్కొలి ''బ్రహ్మాదిషు ప్రలీనేషు నష్టేలోకే చరాచరే, ఏకస్తిష్ఠతి విశ్వాత్మా స తు నారాయణః పరః'' ఎన్ఱుమ్, ''ఒన్ఱుమ్ తేవుమ్ ఉలకుమ్ ఉయిరుమ్, మఱ్ఱుమ్ యాదుమిల్లా వొన్ఱు - నాన్ముకన్ తన్నొడు తేవరులకోడుయర్ పడైత్తాన్'' ఎన్ఱుమ్ శొల్లుకిఱపడియే చతుర్ముఖ ప్రముఖబహుముఖ సృష్టియైప్పణ్ణి, స్పృష్టమాన చేతనరుక్కు నల్లదుమ్, తీయదుమ్ వివేక్కైక్కు, ''మనిశరువ్ మఱ్ఱుమ్ ముఱ్ఱుమాయ్ మాయప్పిఱవి పిఱన్దు '' ఎన్గిఱపడియే రామకృష్ణాదిరూపేణ అవతరిత్తరుళియుమ్, ఇప్పడిప్పణ్ణిన అవతారఙ్గళ్ తానుమ్ తత్కాలీనర్ కళుక్కే ఉజ్జీవనార్థమాక మాడమాళిగై శూழ్న్దழకాయ తిరుక్కురుకూరికే వీడిల్ శీర్పుకழాదిప్పిరానాయ్ మేవియుమ్, మలిన్దుశెన్నెల్ కవరివీశుమ్ తిరుక్కురుకూరదనిల్ పొలిన్దునిన్దపిరానాయ్ నిన్ఱుమ్, నిలైయழికిలే ''కణ్ణవాఱ్ఱాల్ తనదే ఉలకెన నిన్ఱాన్'' ఎన్ఱుమ్, ''నీయుమ్ తిరుమకళుమ్ నిన్ఱాయాల్'' ఎన్ఱుమ్, ''నిలైయార నిన్ఱాన్'' ఎన్ఱుమ్ శొల్లు కిఱపడియే సర్వస్మాత్ పరనెన్నుమ్బడియై యఱుది యిట్టు, ఈడుపట్టు అఱివుడైయారడఙ్గలుమ్ ఆశ్రయిత్తు ఉజ్జీవిక్కుమ్బడి నల్లార్ నవిల్ కురుకూరిలేనిత్యసన్నిధిపణ్ణియిరుక్కిఱ కుఱియమాణురువాకియ నీళ్ కుడక్కూత్తనై ప్పోడి, యరుళువదాక సంకల్పిత్తు ''స్తోత్రం వేదమయం కర్తుం ద్రావిడభాషయా తత్ర వేదసమస్తా శ్చ ద్రావిడత్వ ముపాగతాః'' ఎన్గిఱపడియే ఋక్- యజు - స్సామా - థర్వణఙ్గళై తిరువిరుత్తమ్ ముదలాన దివ్యప్రబంధచతుష్టయమాక్కి, మదిళరఙ్గర్ వణ్పుకழ్ మేల్ ఆన్ఱ తమిழ్మఱైయై అధికరిత్తార్క్కు '' ఉడైన్దు నోయ్ కళై ఓడువిక్కుమే'' ఎన్ఱుమ్, ''నల్లపదత్తాల్ మనైవాழ్వార్ కొణ్డపెణ్డిర్ మక్కళే'' ఎన్ఱుమ్, ''మీట్చియిన్ఱి వైకున్దమానకర్ మఱ్ఱదు కైయదువే'' ఎన్ఱుమ్ ఐహికఆముష్మికఫలప్రదానసహితమాక ''విణ్ణోర్ పెరుమాన్ తన్నై మెయ్యాశొల్లాల్ ఇశైమాలైకళ్ఱ్ఱ్

యరుళిన దేవరీర్ ఇప్పోదు సాత్త్వికజనసార్థజ్ఞాకై కృతార్థరామ్బడి దివ్యోత్సవ వ్యాజత్తాలే కోవిల్‌నిన్ఱుమ్ పుఱప్పట్టరుళి, వివిధవితాన పుంజితమాయ్ శెళ్ళియమామణికళ్‌శేరుమ్ తిరుమామణిమణ్డపమాన ఇత్తిరువోలక్కత్తిలే ఒరునాయకరత్నమ్ అంకురిత్తాఱ్పోలే మజ్జనవేదికామధ్యత్తిలే, జ్ఞానముద్రాసహితరాయ్ క్కొణ్డు ఏఱియరుళి ప్రాఙ్ముఖరాడై యరైయిల్ శాత్తి, తిరుచ్చెయ్య ముడియుమ్ ఆరముమ్, పడైయుమానదివ్యాలంకారత్తుడనే అభిషేకజలార్ద్ర గాత్రరాయ్ సాత్త్వికజన నేత్రోత్సవకరరాయ్ చిత్రవసనభూషణభూషితరాయ్ ఎళ్ళున్దరుళి యిరుక్కుమిరుప్పు ఇజ్జనే యిరానిన్ఱదు – ఎజ్జనే యెన్నిల్ –

మేశమ్ :– మా వెన్ఱు తిరునామత్తైయుడైయ పెరియపిరాట్టియారుక్కు నాయకనాయ్, ''గోజాతిదేవో విదితనిజపదం'' ఎన్ఱుమ్, ''ఈశన్'' ఎన్ఱుమ్ శొల్లుకిఱ బ్రహ్మరుద్రర్ కళ్ తొడక్కమాన సర్వదేవతైకళాలుమ్ అఱియవరిదాన శ్రీవైకుంఠత్తై ఇరుప్పిడమాక ఉడైయనాయ్, వ్యూఢమ్ :– 'వి' ఎన్ఱు పక్షివాచకమాకైయాలే త్రయీమయమాన పెరియతిరువుడైయై వాహనమాక వుడైయనాయ్,
అధ్యామరేంద్రం :– ''మున్నై యమరర్'' ఎన్గిఱపడియే ఆద్యరావ అయర్వఱు మమరర్ కళదిపతియాయ్,

స్వేశమ్ : –''ఆత్మేశ్వరం'' ఎన్గిఱపడియే తనక్కుత్తానే నియామకనాయ్, ఆక విప్పడి శ్రియః పతిత్వ, పరమపదనిలయత్వ, గరుడవాహనత్వ, సూరిభోగ్యత్వ, నిరంకుశస్వాతంత్ర్య జ్గళాలే సర్వస్మాత్ పరనాన సర్వేశ్వరనై,
స్వాచాతిరేకప్రవహిత వచనాభిష్టుతం త్వద్యకృత్వా :– ''అవావిలన్దాది'' ఎన్గిఱపడియే దేవరీరుడైయ భక్తి ప్రకర్షత్తాలే పళ్ళిన్ఱు పుఱప్పట్ట శొఱ్కళాలే వాయారప్పుకళ్ళన్దదు,
గీతం గాత్వాఽఽథ గోదాక్ళత మిహ తమలమ్ తర్పయిత్వా చ :– అవ్వళవిన్ఱిక్కే పెరియాళ్ళ్వారో ట్టైక్కుడల్ తుడక్కాలే దేవరీరుక్కు త్తిరుమకళాన ఆణ్డాళుడైయ శజ్జత్తమిళ్ మాలైయాన తిరుప్పావై ప్పాడి యరుళి, దేవరీరుడైయ దివ్య ప్రబంధశ్రవణత్తాలే ప్రీతనానవనై మికవుమ్ ప్రియప్పడుత్తి,

లబ్ధ్వా దేహం చ తస్మాత్ :– తిరువధ్యయ నోత్సవార్థమాక పత్నీపరిజనాదికళోడే దేవరీరుడైయ తిరుప్పుళిక్కిళ్ వీట్టిలే పత్తునాలు మెళ్ళున్దరుళి యిరున్దు మేవి య్యరై కోవిలిలే ఏఱియరుళువదాక ఉద్యోగిత్తరుళియ పాలిన్దునిన్ఱపిరానై రాజనీతియై యనుసరిత్తు నిన్ఱు, ఒరురసత్తై విళైవిప్పోమెన్ఱు పార్త్తు, వీడు తరవేణుమెన్ఱు అపేక్షిత్తు, శాసనమాక పెఱ్ఱు,

కృతార్థ స్త్వ మిహ శఠరిపో :– ఆక విప్పడి అత్తలైక్కుమ్ సర్వప్రకారరసావహరాకైయాలే కృతార్థరాన దేవరీర్ ఇప్పోదు,

స్నాసి నః శ్రాంతిశాంత్యై :– స్నానవ్యాజత్తాలే పడిక్కైన్ఱు మదకుకిఱ్ఱాప్పోలే ఒరుమడైక్కొళ్ళ ప్రవహిక్కిఱ

దేవరీరుడైయ తిరుమేనియుళ్ కు వెళ్లత్తిలే ముళ్ కాట్టి అడియోజ్గళుడైయ సాంసారికసకతాపజ్గళుమ్ మాఱువదాక ఎళ్ న్దరుళియిరుక్కిఱా ప్పోలే యిరానిన్దదు. జయ విజయీ భవ.

# తిరుమఞ్జనక్కవి -4

(నిత్యప్పడి తిరుమఞ్జనత్తిల్ అణ్ణావియార్ సేవిప్పదు)

సత్త్వాశ్రయం షట్పదభావయుక్తం సుహంససేవ్యం సుమనస్సమేతమ్ ।
సురేశ్వరాహ్లాదకరం విభుం త్వాం వదంతి సంతః శఠకోప ! మేరుమ్ ॥

''జాయమానం హి పురుషం యం పశ్యేత్ మధుసూదనః, సాత్త్వికః స తు విజ్ఞేయః స వై మోక్షార్థచింతకః'' ఎన్నుమ్బడి ఉత్పత్తికాలత్తిలే తన్నుడైయ విశేషకటాక్షత్తాలే సంసారిచేతనరై నిరస్తరజస్తమస్కరాయుమ్, ప్రవృద్ధసత్త్వగుణరామ్బడియుమ్ పణ్ణవల్ల సర్వేశ్వరనుడైయ నిరంతర కటాక్షపాత్రభూతరాయ్, ఉపాయోపేయజ్గళ్ ఇరుణ్డుమ్ శ్రియఃపతియాన సర్వేశ్వరనుడైయ తిరువడికళుమ్, అన్ద తిరువడికళిల్ పణ్ణుమ్ కైంకర్యముమాకవే నిష్కర్షిత్తిరుక్కుమవరాయ్, జితేంద్రియరాలే సేవిక్కప్పడుపవరాయ్, సంసారిచేతనరై ఉజ్జీవిప్పిక్కైయిలేయే నోక్కాన తిరువుళ్లత్తైయుడైయరాయ్, ఉక్తివృత్తికళాలే సర్వేశ్వరనై ఉకప్పిక్కుమ్ స్వభావరాయ్, అపరిచ్ఛేద్యమహిమరాన దేవరీరై సత్తుక్కళానవర్ కళ్ స్వభావసామ్యత్తాలే ఒరు మహామేరువాక విణ్ణప్పమ్ శెయ్యానిన్డార్కళ్. అదు ఎజ్గనే ఎన్నిల్ -

సత్త్వాశ్రయమ్ :- అన్ద మహామేరువానదు పంచాశత్కోటివిస్తీర్ణమాన భూమిక్కు ఒరు ఆణి అణిత్తాప్పోలే నిల్కైక్కు ఈడాన ఫలత్తిఱ్కు ఆశ్రయమాయిరుక్కుమ్, దేవరీర్ రజస్తమస్సుక్కళ్కలశాతపడి సత్త్వగుణమ్ ఒన్నుక్కుమే ఆశ్రయమాయ్ ఎళ్ న్దరుళి యిరుప్పీర్.

షట్పదభావయుక్తమ్ :- అన్ద మహామేరువానదు నానావిధ పుష్పరసాస్వాద మత్తభృంగాళీవిలాస చేష్టాయుతమాయిరుక్కుమ్. దేవరీర్ ఆఱువిధమాన శరణాగతి విషయమాన తిరువుళ్లత్తై యుడైయరాయిరుప్పీర్.

సుహంససేవ్యమ్ :- అన్ద మహామేరువానదు మానసాదిసరోవర్తికళాన అళ్ కియ అన్నజ్గళాలే సేవిక్కప్పడువదాయిరుక్కుమ్. దేవరీర్ నాథయామునయతివరాదికళాన పరమహంసర్ కళాలే సేవ్యమానరాయ్ ఎళ్ న్దరుళియిరుప్పీర్.

సుమనస్సమేతమ్ :- అన్ద మహామేరువానదు ఉద్యానతటాకజలజ్గళిలే ఇరుక్కిఱ నానావిధ పుష్పజ్గళోడే కూడియిరుక్కుమ్. దేవరీర్ సర్వేశ్వరన్ కైవిట్ట సంసారికళైయుమ్ తిరుత్తుకైయిలే తత్పరరాకైయాలే అళ్ కియ తిరువుళ్లత్తై యుడైయరాయ్ ఎళ్ న్దరుళియిరుప్పీర్.

సురేశ్వరాహ్లాదకరమ్ :- అన్ద మహామేరువానదు దేవర్కళుక్కు నిర్వాహకరాయిరున్నుళ్ళ బ్రహ్మాది కళుక్కు స్వవైలక్షణ్యత్తాలే ఆహ్లాదకరమాయిరుక్కుమ్. దేవరీర్ ''పక్కమ్ నోక్కియతీయాన్ ఎన్ పైన్దామరైక్కణ్ణన్'' ఎన్గిఱపడియే నిరంతరకటాక్షమ్ పణ్ణిక్కొణ్డిరుక్కుమ్బడి ''అయర్వఱుమ మరర్కళ్ అది పతిక్కుమ్'' ఆహ్లాదకరమాయ్ ఎழுన్దరుళి యిరుప్పీర్.

విభుమ్ :- అన్ద మహామేరువానదు భూమిక్కుమేలే ఎణ్బత్తినాలాయిరమ్ యోజనై ఉయర్త్తియై ఉడైయ దాకైయాలే పర్వతాంతరఙ్గళై క్కాట్టిలుమ్ ఉయర్న్దదాయిరుక్కుమ్. దేవరీర్ ''అడియార్ నిలాక్కిన్ద వైకున్దమో! వైయమో ! నమ్ వియలిడమే'' ఎన్నుమ్బడి ఉభయవిభూతియిలుమ్ అడఙ్గాద పెరుమైయుడైయరాయ్ ఎழுన్దరుళి యిరుప్పీర్.

త్వామ్ :- ఆక ఇప్పడికళాలే ఉత్కృష్టరాన దేవరీరై.
వదంతి సంతః శఠకోప మేరుమ్ :- శ్రీమధురకవిప్రభృతిసాత్త్వికసజ్జనఙ్గళ్ ఒరు మహామేరువాక విణ్ణప్పమ్ శెయ్యానిన్నార్కళ్.

# తిరుమఙ్గనక్కవి - 5

పూర్ణస్థితేః సంపరిసేవితుం చ (సేవనాయ), శ్రీవైష్ణవానందసమృద్ధయే చ।
అస్మిన్ విశాఖాహ్వయతారవర్యే, స్నాసీవ తామ్రాసలిలైః శఠారే ॥

''అన్బన్ తన్నైయడైన్దవర్ కట్కెల్లామన్బు'' నాన దేవరీరుడైయ ఇవ్వులకినిల్ మిక్కవరుళాలే సదా సన్నిధానం పణ్ణుమ్బడి ఆశాసిత్తరుళిన సద్గుణసామగ్ర్యమిరుక్కుమ్బడి ''తిరియుమ్ కలియుకమ్ నీఙ్గి ప్పెరియకితయుగమ్ పற்றి ప్పేరిన్బ వెళ్లమ్ పెరుకి'', ''మణ్ణియ్య మణ్ణులకిల్ మనిశర్ ఉయ్య'' మ్బడియుమ్ ఎఙ్గుమ్కొణ్డు నిఱ్కిన్ద నోయ్కళ్ కాలమ్ పెఱ ప్పోమ్బడియుమ్, తిరువరఙ్గమ్ ముదలాన దివ్యదేశఙ్గళ్ నిత్యనైమిత్తికోత్సవవిశేషఙ్గళాలే వాழுమ్బడియుమ్, ''తేవు మற்றఱియేన్'' ఎన్గిఱ శ్రీవైష్ణవర్ కళుడైయ తిరువుళ్ళత్తిలే ఆనన్దవెళ్లమ్ అలై యెఱియుమ్బడియాక, ''స్నాత్వా భుంజీత'' ఎన్నుమ్, ''ఆడి యముదుశెయ్'' ఎన్నుమ్ శొల్లుకిఱపడియే శ్రుతిచోదితమాన అనుష్ఠానత్తిఱ్కు అనుగుణమాక ''నీపిఱన్దతిరునన్నాళ్, ఇను నీ నీరాడ వేణ్డుమ్'' ఎన్గిఱ శ్రీభట్టర్ పిరాన్ పాడల్ పడియే దేవరీరుడైయ తిరునక్షత్రమాన తిరువిశాఖత్తిలే తామ్రపర్ణీసర్వతోముఖఙ్గళాలే నీరాడి యరుళువదాక స్నానాసనత్తిలే ఎழுన్దరుళి యిరుక్కిఱ ఇరుప్పు ఇఙ్గనే ఇరానిన్దదు - ఎఙ్గనే ఎన్నిల్ -

'' ఏనమాయ్ నిలమ్ కీణ్డ ఎన్నప్పన్'' ఎన్నుమ్, ''అప్పన్ ఊన్ఱి యిడన్దు ఎయిற்றిల్ కొణ్డనాళ్'' ఎన్నుమ్ శొల్లుకిఱపడియే సకలజగత్తుక్కుమ్ వాత్సల్యావినాభూతమాన ప్రకృతియై యుడైయరాయ్ ''ఏనత్తురువా యిడన్ద ఞానప్పిరాన్'' ఎన్ఱు శొల్లుకిఱపడియే సమ్యక్

జ్ఞానోపకారకరాయ్, ''పిழைక్కిన్తతరుళెన్ను పేదుఉవన్'' ఎన్ను పలియాదొழிవదో ? ఎన్ను భయప్పట్టవేణ్డాదపడి ''పన్నియా యన్ను పారక జ్కీణ్ణ పాழி యానాழி యానరుళే'' ఎన్ను ఞానవాన్ కళ్ విశ్వసిత్తుకైక్కొళ్ళుమ్పడియాక కృపాతిశయత్తైయు ముడైయరాయ్, ''మహావరాహః స్ఫుటపద్మలోచనః'' ఎన్నుమ్, ''పెరుమ్ కేழலార్ తమ్ పెరుమ్ కణ్మలర్పుణ్డరీకమ్'' ఎన్నుమ్ శొల్లుకిఅపడియే పశుమృగసాధారణమాన అవతారమాయిరుక్కచ్చెయ్దేయుమ్ పరత్వసూచకఙ్గళాన ''తక్కతామరైకణ్గళై'' యుడైయరాయ్,'' ఇరుమ్ కఱ్పుకమ్ శేర్ వానత్తవర్క్కుమ్ అల్లాదవర్క్కుమ్, మற்றెల్లాయవర్క్కుమ్ ఞానప్పిరానై యాల్లాలిల్లై నాన్కణ్డనల్లదువే'' ఎన్ను దేవరీరుడైయ ప్రథమ ప్రబంధత్తిలే సర్వర్క్కుమ్ ఇవరైయొழிయ రక్షకాంతరరిల్లైఎన్ను అఱుదియిట్టు చరమప్రబంధత్తిన్ ముడివిలుమ్, ''నీలవరై యిరణ్డు పిఱైకవ్వి నిమిర్న్దదొప్ప క్కోలవరాహమొన్నాయ్ నిలఙ్కోట్టిడైకొణ్డ వెన్దాయ్, నీలక్కడల్ కడైన్దాయ్ ఉన్నైప్పెற்றిని పోక్కువన్'' ఎన్ను అవతారఙ్గళెల్లామ్ కిడక్కచ్చెయ్దేయుమ్, ''కేழல్ తిరువురువై'' ప్పற்றి తేవరీర్ ''అన్దమిల్ పేరిన్బత్తై ప్పెற்ற'' డియై యరుళిచ్చెయ్దరుళిన దివ్యప్రభావోత్తరమాన ఇప్ప్రబంధమ్ ''నూఱుమ్ వల్లార్'', ''తొణ్డనాళ్వదు శూழ்పొన్ విశుమ్బే'', ''యః పాదమ్ పద మేవ స యాతి బ్రహ్మణః స్థానమ్'' ఎన్నుమదుపోలే ''తిరువిరుత్తత్తోరడి కఱ్పవర్ పిఱప్పామ్ పొల్లావరువినై అழுన్దార్ ఇప్పాయ్న్నిలత్తే'' ఎన్నతిరువిరుత్తత్తై పాలిన్దునిన్న పిరానైప్పాడియరుళువదాక త్తిరువుళ్ళమ్ పற்றి, తదర్థమా ౯ త్తిరుమఞ్జనమ్ శెయ్య ఎழுన్దరుళియిరుక్కిఅ యిరుప్పు – ఎన్నువిణ్ణప్పమ్ శెయ్యవాయిరా నిన్నదు.

AL LIBRARY
43761

# గ్రంథకర్త పరిచయం



పేరు : ఈ.ఎస్. శింగరాచార్యులు

జననము : 5-12-1950

జననీజనకులు : శ్రీమతి. ల.స. సీతమ్మగారు

ఉ.వే. శ్రీమాన్ ఈయుణ్ణి గోపాలాచార్యులు గారు

విద్యార్హతలు : 1. A విద్వాన్

2. M.A. సంస్కృతము

3. పండిట్ ట్రైనింగ్

వృత్తి : గ్రేడ్ I తెలుగు భాషా పండితుడు

జడ్.పి.హైస్కూల్, ఇనమడుగు, నెల్లూరు జిల్లా

నివాసము : బాలాజీ నగర్, నెల్లూరు.

❁ ❁ ❁